www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



# నేటితో తెర

సార్వత్రిక ఎన్నికల చివరి దశ నేడే
వారాణసీ సహా 57 కీలక స్థానాల్లో పోలింగ్
కమలనాథుల భవితవ్యానికి అగ్నిపరీక్ష
యూపీలో ఇండీ కూటమి నుంచి గట్టి పోటీ
2

## ఎగ్జిట్‌పోల్స్.. అటో.. ఇటో..!?

నేటి సాయంత్రం 6.30 గంటల తర్వాత నమూనా ఫలితాల విడుదల
మీడియా చర్చలను బహిష్కరిస్తున్నాం
4 వరకూ చర్చల్లో పాల్గొనం: కాంగ్రెస్
ఓటమిని ముందే అంగీకరించిన కాంగ్రెస్
నేటి పోలింగ్‌లో ఆ పార్టీకి ఓటు వృథా: నడ్డా

శనివారం | 1-6-2024 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 46 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, బహుళపక్షం; తిథి: నవమి ఉ. 7.25, దశమి తె. 5.04 వరకు; నక్షత్రం: ఉత్తరాభాద్ర తె. 3.16 తదుపరి రేవతి; వర్జ్యం: మ. 1.47-3.17; దుర్ముహూర్తం: ఉ. 5.43-7.27; అమృతఘడియలు: రా. 10.46-12.16; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 5.43; సూర్యాస్తమయం: 6.42 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



# విజయంతో విరమణ

**జగన్ కక్షసాధింపులకు పాల్పడినా పోలీసు యూనిఫాంలోనే ఏబీవీ రిటైర్మెంట్**

హైకోర్టు వ్యాఖ్యలతో ఎట్టకేలకు పోస్టింగ్ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం
ఉదయం సస్పెన్షన్ ఎత్తివేస్తూ సీఎస్ జవహర్‌రెడ్డి ఉత్తర్వులు
ప్రింటింగ్-స్టేషనరీ కమిషనర్‌గా నియామకం
మధ్యాహ్నం బాధ్యతల స్వీకారం.. సాయంత్రం పదవీ విరమణ
ఉద్యోగుల ఘన వీడ్కోలు.. ఆర్టీసీ ఎండీ, ఐఏఎస్ శ్రీధర్ అభినందనలు
12

సీనియర్ ఐపీఎస్ ఏబీ వెంకటేశ్వరరావు అనుకున్నది సాధించారు. యూనిఫాంలో రిటైరవ్వాలన్న ఆయన ఆకాంక్ష నెరవేరింది. హైకోర్టు చెప్పిందనో, ఉన్నతాధికారుల్లో వ్యతిరేకత వ్యక్తమవుతుందనో తెలియదు గానీ.. ఆయన పదవీవిరమణ చేయాల్సిన శుక్రవారం నాడే జగన్ ప్రభుత్వం ఆయనకు పోస్టింగ్ ఇచ్చింది.

**ఆత్మసంతృప్తితో వెళ్తున్నా: ఏబీవీ**



శుక్రవారం మధ్యాహ్నం బాధ్యతలు స్వీకరిస్తున్న ఏబీ వెంకటేశ్వరరావు | సాయంత్రం అభిమానంతో చేతుల మీద ఎత్తుకుని ఉద్యోగుల సాదర వీడ్కోలు

సాధారణంగా పరిశ్రమల స్థాపన కోసమో, ఇతర అవసరాల కోసమో ప్రభుత్వం రైతుల నుంచి భూములు సేకరిస్తుంటుంది. ఇది అందరికీ తెలిసిన విషయమే. కొత్త విషయం ఏంటంటే.. ఓ ప్రైవేటు వ్యక్తి గ్రామాలకు గ్రామాలనే తన వశం చేసుకుంటున్నాడు. అందులోనూ ఎకరా 2 కోట్లకు పైగా విలువ చేసే భూములను కారుచౌకగా 20-30 లక్షలకే బెదిరించి మరీ లాక్కొంటున్నాడు. ఆయన లీలలు రోజుకొకటి బయటపడుతున్నాయి. ఆ ప్రైవేటు వ్యక్తి... మరెవరోకాదు. 'పెద్దసారు'కు స్వయానా మేనల్లుడేనట. బాధిత రైతులే ఈ విషయం చెబుతున్నారు. ఆయన సేవలో ఓ సీనియర్ రెవెన్యూ అధికారి, విశాఖ, విజయనగరం జిల్లాలకు చెందిన ఇద్దరు అధికారులు తరించిపోయారు. ఆయన వందలాది ఎకరాలు సొంతం చేసుకునే పనిలో ఉన్నారు.



# అల్లుడి గిల్లుడు!

## భోగాపురంలో తవ్వేకొద్దీ భూదందాలు

కొత్తగా మరో 225 ఎకరాల 'వ్యవహారం' వెలుగులోకి
అందులో 45 ఎకరాలు జిరాయితీ
30 లక్షల చొప్పున రిజిస్ట్రేషన్
180 ఎకరాల అసైన్డ్ భూములకు రైతులతో అగ్రిమెంట్లు
'కడప' వ్యక్తి గుప్పిట్లో 6 గ్రామాలు
ఆయన 'పెద్దసారు'కు మేనల్లుడట
గుట్టు విప్పిన బాధిత రైతులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

భోగాపురంలో తవ్వే కొద్దీ పెద్దల భూబాగోతం బయటపడుతోంది. జగన్ ప్రభుత్వంలోని 'పెద్దసారు' సొంత మనిషి, కడప జిల్లా వ్యక్తి భూదాహం అంతా ఇంతా కాదు. విశాఖ పట్నం పక్కనే ఉన్న భోగాపురం మండలంలో ఇప్పటి వరకు 698 ఎకరాల 'లెక్క' తేలింది. ఇప్పుడు కొత్తగా మరో 225 ఎకరాల 'వ్యవహారం' వెలుగులోకి వచ్చింది. అందులో 45 ఎకరాల జిరాయితీ భూములను సొంతం చేసుకున్నారు. మార్కెట్లో ఎకరా 2 కోట్లకు పైగా విలువ చేసే భూములను 30 లక్షల చొప్పున చేజిక్కించుకున్నారు. మరో 180 ఎకరాల అసైన్డ్ భూములను దక్కించుకునేందుకు అగ్రిమెంట్లు చేసుకున్న విషయం

మిగతా 11వ పేజీలో...

**చావనైనా చస్తాం గానీ.. భూములివ్వం!**

50 ఏళ్ల క్రితమే మా పూర్వీకులకు ప్రభుత్వమిచ్చిన భూములివి
20న జవహర్‌రెడ్డి వచ్చి ఆ భూములు చూసి వెళ్లారు
30న పెద్దల సాయంతో రౌడీలు వచ్చి భూముల స్వాధీనానికి ప్రయత్నం
తూడెం గ్రామస్థుల ఆరోపణ
11

# గుడ్ బై హైదరాబాద్!

**'ఉమ్మడి రాజధాని'కి సంపూర్ణంగా సెలవు**



రాష్ట్ర విభజనకు రేపటితో పదేళ్లు
'అమరావతి'తో ఏపీకి సొంత రాజధాని
జగన్ మూడుముక్కలాటతో మళ్లీ అనిశ్చితి
ఏ రాజధానీ లేని రాష్ట్రంగా నవ్యాంధ్ర!?
ఆస్తుల పంపకంపై దృష్టి పెట్టని వైసీపీ
కేసీఆర్‌తో అవసరాలే ముఖ్యమని భావించిన వైనం
హైదరాబాద్‌లోని భవనాలన్నీ అప్పగింత

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'పదేళ్లపాటు హైదరాబాద్ ఉమ్మడి రాజధాని'...

రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న విషయమిది! ఆదివారంతో పదేళ్ల కాలం పూర్తవుతోంది. హైదరాబాద్‌తోపాటు తెలంగాణతో నవ్యాంధ్రప్రదేశ్‌కు ఉన్న రుణానుబంధం 'సాంకేతికంగా, చట్టపరంగా' పూర్తిగా తెగిపోతోంది.

హైదరాబాద్ పదేళ్లపాటు ఉమ్మడి రాజధానిగా కొనసాగుతుందని, ఈలోపు ఏపీ కొత్త రాజధాని ఏర్పాటు చేసుకోవాలని రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్నారు. అయితే... సొంత గడ్డపైనే పాలన సాగించాలనే ఉద్దేశంతో చంద్రబాబు సర్కారు 2017లోనే ప్రభుత్వ కార్యాలయాలను నవ్యాంధ్రకు తరలించింది. ఆ తర్వాత 'అమరావతి'ని నవ్యాంధ్ర రాజధానిగా ప్రకటించింది. దీనిపై నోటిఫికేషన్ కూడా వెలువడింది. అయితే... హైదరాబాద్‌తో సంబంధం మాత్రం తెంచుకోలేదు. విభజన చట్టంలోని 8, 9వ షెడ్యూలులో పొందుపరిచిన సంస్థలకు సంబంధించిన స్థిర, చరాస్తుల్లో వాటాల పంపకం పూర్తిచేయడంపై దృష్టి సారించారు. దీనిపై కేంద్రం నియమించిన షీలాబిడే కమిటీ నివేదిక కూడా ఇచ్చింది. కానీ... అప్పటి కేసీఆర్ సర్కారు ఈ కమిటీనే గుర్తించలేదు. ఉమ్మడి సంస్థల విభజనకు ఆయన సహకరించలేదు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని

మిగతా 12వ పేజీలో...



# ఇంగ్లండ్ నుంచి లక్ష కిలోల బంగారం!

**భారీ భద్రత నడుమ ప్రత్యేక విమానంలో ఆర్బీఐ ఖజానాకు**

నిల్వ సర్దుబాట్లలో భాగంగానే తరలింపు
15 ఏళ్ల క్రితం ఐఎంఎఫ్ నుంచి ఆర్బీఐ 200 టన్నుల కొనుగోలు
కొన్నేళ్లుగా బంగారాన్ని కొంటూ బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌లో నిల్వ
విదేశీ మారక నిల్వల సంక్షోభంతో 1991లో బంగారం తనఖా
ఇప్పుడు 100 టన్నులను తేవడం దేశ ఆర్థికశక్తికి నిదర్శనం: ఆర్బీఐ
2



ఎంపీ ప్రజ్వల్‌ను అరెస్టు చేసి తీసుకెళుతున్న పోలీసులు

# ఏడు రోజుల కస్టడీకి ప్రజ్వల్

జర్మనీ నుంచి అర్ధరాత్రి ఎయిర్‌పోర్టుకు రాక
అరెస్టు చేసిన మహిళా అధికారులు
సిట్ ఆఫీసులో విచారణ.. అనంతరం మేజిస్ట్రేట్ ముందు హాజరు.. వారంపాటు కస్టడీకి అప్పగింత
11

# మాకు మీరు.. మీకు మేము!



**టీడీపీతో ఒప్పందానికి అవినాశ్ శిబిరం యత్నం!**

**పులివెందులలో తెర వెనుక ఆసక్తికర పరిణామాలు**

కడప లోక్‌సభకు షర్మిల పోటీతో అవినాశ్ వర్గానికి ఓటమి భయం
టీడీపీతో చీకటి ఒప్పందానికి యత్నం
25 బూత్‌లలో తమకు ఓట్లు వేయిస్తే.. అసెంబ్లీకి టీడీపీకి వేయిస్తామని ప్రతిపాదన
జగన్ ఓట్లకే గండికొట్టే యత్నం!
భాస్కర్‌రెడ్డి సందేశానికి 'నో' అన్న బీటెక్ రవి
అయినా కడప లోక్‌సభ పరిధిలోని మిగతా అసెంబ్లీ అభ్యర్థులకూ వర్తమానం
ఒకచోట పరస్పరం ఓట్లేసుకున్నట్లు ప్రచారం
రాష్ట్రంలో పలుచోట్ల ఇదే దారిన వైసీపీ అభ్యర్థులు
అనైతిక ఒప్పందాలకు టీడీపీ ససేమిరా

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'ఈసారి ఎన్నికల్లో రాష్ట్రంలో 175 అసెంబ్లీ సీట్లూ మావే' ..ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడానికి ముందు వైసీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ధీమాగా పలికిన పలుకులివి. తీరా బరిలోకి దిగాక క్షేత్రస్థాయిలో తమ పరిస్థితేంటో అర్థమై వైసీపీ అభ్యర్థులు బెంబేలెత్తిపోయారు. ఓటమి నుంచి తప్పించుకోవడానికి టీడీపీతో తెర వెనుక ఒప్పందాలకు పలువురు ఆరాటపడ్డారు. జగన్ సొంత జిల్లా కడపలోనే ఈ తరహా ఒప్పందాలకు

మిగతా 11వ పేజీలో...

# వలంటీర్లు లబోదిబో!

మొన్నటి దాకా వలంటీర్లంతా తమ వారేనన్నారు. పార్టీ కోసం అడ్డగోలుగా వాడుకున్నారు. ఎన్నికల ముందు చాలామందితో రాజీనామా చేయించి మరీ ప్రచారం చేయించుకున్నారు. అవసరం తీరిపోవడంతో ఇప్పుడు వైసీపీ నేతలు మొహం చాటేస్తున్నారు. పాపం... వలంటీర్లు పావులుగా మారిపోయారు.



ముఖం చాటేస్తున్న వైసీపీ నాయకులు
రాజీనామా చేయించి మరీ ఎన్నికల ప్రచారం
ఇప్పుడు మీవల్లే నష్టపోయామంటూ చిందులు
ఓటుకు నోటు సొమ్ము నొక్కేశారని అభాండాలు
చదరంగంలో పావులయ్యామని వలంటీర్ల నిర్వేదం
వైసీపీ మాటలు నమ్మి మునిగిపోయామని ఆవేదన
ఫలితాలు తారుమారవుతాయన్న అనుమానాలు
టీడీపీ నేతలతో టచ్‌లోకి పలువురు వలంటీర్లు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

వలంటీర్లే మా సైన్యం అన్నారు. వలంటీర్ల వ్యవస్థ బేష్ అంటూ ప్రశంసలు కురిపించారు. సేవారత్న పురస్కారాలు, వలంటీర్లకు వందనం అంటూ ప్రోత్సాహకాలు అందించారు. కాబోయే నాయకులు మీరేనంటూ వారిని ఊహాలోకాల్లో విహరింపజేశారు. చివరకు ఎన్నికల వ్యూహంలో బలిపశువులుగా మార్చారు. వలంటీర్లను ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని ఈసీ ఆదేశించడంతో సీన్ మారిపోయింది. ఈసీ జోక్యంతో రూటు మార్చిన వైసీపీ నేతలు.. వారి మెడపై రాజీనామా కత్తి పెట్టారు. పార్టీ అభ్యర్థుల తరఫున ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలని ఆదేశించారు. రాజీనామా చేసినవారికి నెలకు రూ.5వేల చొప్పున రెండు నెలలకు కలిపి రూ.10వేలు ఇస్తామని ఆశ చూపారు. కావాలంటే ఇంకొంత మొత్తం అదనంగా కూడా ఇస్తామని ప్రలోభపెట్టారు. వలంటీర్ల ద్వారానే ఓటుకు నోటు పంపిణీ చేయిస్తామని, ఆ సొమ్మంతా వారి చేతికే ఇస్తామని ఊరించారు. తమ మాట విని రాజీనామా చేసిన వారిని అధికారంలోకి రాగానే మళ్లీ విధుల్లోకి తీసుకుంటామని, మిగిలిన వారిని పరిగణనలోకి తీసుకోబోమని హెచ్చరించారు. దీంతో ఇష్టం లేకపోయినా వేల మంది వలంటీర్లు రాజీనామా చేశారు. తీరా ఇప్పుడు ఫలితాలు తారుమారయ్యే పరిస్థితి కనిపిస్తుండటంతో వలంటీర్లకు సదరు వైసీపీ నేతలు ముఖం చాటేస్తున్నారు. ఎన్నికల తర్వాత తమను పట్టించుకున్న దాఖలాలు లేవని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓటర్లకు పంపిణీ చేయమని ఇచ్చిన సొమ్మును కొందరు వలంటీర్లు తమ జేబుల్లో వేసుకున్నారని, దీంతో జనం టీడీపీకి

మిగతా 12వ పేజీలో...



# 'బ్యాలెట్' ఉత్తర్వులు సరైనవే

ఫెసిలిటేషన్ కేంద్రంలో ఓటేసిన ఉద్యోగులందరికీ వర్తిస్తాయి: ఈసీ
ఈ ఉత్తర్వులకు కారణాలు చెప్పలేదు
కౌంటింగ్‌కు 4 రోజుల ముందు ఇచ్చారు
వైసీపీ తరఫు న్యాయవాదుల అభ్యంతరం
వ్యాజ్యాలపై ముగిసిన వాదనలు
నేడు తీర్పు వెలువరించనున్న హైకోర్టు
3



# నాగపూర్‌లో 56°

**ప్రపంచ రికార్డుకు చేరువలో ఉష్ణోగ్రత**

దేశంలో వడదెబ్బతో 79 మంది మృతి.. 25 మంది ఎన్నికల సిబ్బందే
ఉత్తరాదికి 3 రోజులు భారీ వర్షాలు.. ఢిల్లీ పరిసరాల్లో ధూళి తుపాను!
ఐఎండీ హెచ్చరిక.. జాతీయ విపత్తుగా ప్రకటించండి: రాజస్థాన్ హైకోర్టు

న్యూఢిల్లీ, మే 31: దేశంలో ఉష్ణోగ్రతలు ప్రపంచ రికార్డును సమీపిస్తున్నాయి..! దేశవ్యాప్తంగా శుక్రవారం వడదెబ్బతో 79 మంది మృతిచెందారు. వీరిలో 25 మంది ఎన్నికల సిబ్బంది ఉన్నారు. నాగపూర్‌లో శుక్రవారం 56 డిగ్రీల సెల్సియస్ మేర ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక్కడి రామదాస్‌పేట్‌లోని ఆటోమాటిక్ వెదర్ స్టేషన్(ఏడబ్ల్యూఎస్)లో ఈ మేరకు ఉష్ణోగ్రత నమోదైనట్లు భారత వాతావరణ శాఖ(ఐఎండీ) వెల్లడించింది. ఈ ఉష్ణోగ్రత

మిగతా 2వ పేజీలో...

# రాష్ట్రంలో సెగలు

జనం ఉక్కిరిబిక్కిరి
వినుకొండలో 45.9 డిగ్రీలు
నేడూ వేడి సెగలు
రేపటి నుంచి వర్షాలు!
2

## 'ఈశాన్యం' అతలాకుతలం

తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు, వరదలు
నిరాశ్రయులైన లక్షలాది మంది
మణిపూర్ రాజ్‌భవన్‌లోకి వరద.. అసోంలో రైళ్ల రాకపోకలపై ఎఫెక్ట్



# సజ్జలపై క్రిమినల్ కేసు

కౌంటింగ్ ఏజెంట్లను రెచ్చగొట్టారంటూ టీడీపీ ఫిర్యాదు
తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో నమోదు
11



# అబ్ కీ బార్?



## సేవలు, లావాదేవీలకు 160తో సరికొత్త సిరీస్

న్యూఢిల్లీ, మే 31: సేవలు, లావాదేవీల నిర్వహణ సంస్థలు తమ వినియోగదారులను చేరుకోవడానికి సరికొత్త నంబర్ సిరీ స్‌ను కేంద్రం ప్రవేశపెట్టింది. గురువా రం నుంచి అందుబాటు లోకి వచ్చిన ఈ సంఖ్యతో వినియోగదారుడు తనకు అవసర మైన కాల్స్‌ను గుర్తించడం తేలిక అవుతుంది. నిన్నటి వరకూ 140 సిరీస్‌తో ఆరంభమయ్యే 10 అంకెల సంఖ్యతో కూడిన నంబరును టెలీ మార్కెటింగ్ కోసం వినియోగించేవారు. దీంతో ఆయా సంస్థలు ప్రచార ప్రకటనల కోసం, సేవలు, లావాదేవీల కోసం ఒకే సిరీస్‌తో కూడిన నంబరును వినియోగించేవి. దీంతో వినియోగదారుడు ముఖ్యమైన సేవలు, లావాదేవీలకు సంబంధించిన కాల్స్‌ని కూడా ఎత్తలేకపోయేవారు. మరోవైపు మోసాలకు పాల్పడే వారి సంఖ్యకూడా పెరిగింది. ఈ ఇబ్బందిని తొలగించడానికి కేంద్రం కొత్తగా 160 ప్రారంభమయ్యే 10 అంకెల నంబర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది.

## 'నైరుతి'లో మరింత పురోగతి

- ఈశాన్య రాష్ట్రాలకు పూర్తిగా విస్తరణ
- ఏపీలో తీవ్ర వేడి సెగలు.. జనం ఉక్కిరిబిక్కిరి
- వినుకొండలో 45.9 డిగ్రీలు.. నేడూ వేడి సెగలు

విశాఖపట్నం, అమరావతి, కోల్‌కతా, మే 31(ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల విస్తరణలో మరింత పురోగతి కనిపించింది. శుక్రవారం ఈశాన్య భారతంలో అసోం, త్రిపుర, మేఘాలయలో అన్ని ప్రాంతాలకూ, పశ్చిమ బెంగాల్‌లో కొన్ని ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరించాయి. రానున్న రెండు, మూడు రోజుల్లో కర్ణాటక, తమిళనాడుల్లో పలు ప్రాంతాలకూ విస్తరిస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. సాధారణంగా జూన్ 5న నైరుతి రుతుపవనాలు ప్రవేశిస్తాయి. ఈసారి 6 రోజుల ముందే ప్రవేశించాయి. ఇక, రాష్ట్రంలో ఎండ తీవ్రత, వడగాడ్పులతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. పగటి వేళ మాదిరిగానే రాత్రి పొద్దుపోయే వరకు వెచ్చని సెగ తగ్గడం లేదు. తుఫాన్ తర్వాత 2-4డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరిగి, వేడి గాలులు వీస్తున్నాయి. ఇంటా-బయట వేడి సెగలతో ఆవిర్లు వస్తున్నాయి. ఉక్కపోత తప్పడం లేదు. పగటి ఉష్ణోగ్రతలు 3 నుంచి 5 డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. శుక్రవారం వినుకొండలో 45.9, పుల్లెలచెరువులో 45.4, నందిగామలో 45.3, తుళ్లూరు, ఫిరంగిపురంలో 45, పర్చూరులో 44.8, కూనవరంలో 44 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే 71 మండలాల్లో వడగాడ్పులు వీచాయి. శనివారం దక్షిణ కోస్తాలో వడగాడ్పులు వీస్తాయని, ఉత్తర కోస్తా, రాయలసీమల్లో వేడి వాతావరణం కొనసాగుతుందని, వాతావరణ శాఖ, విపత్తుల నిర్వహణ సంస్థలు హెచ్చరించాయి.

### రేపటి నుంచి వర్షాలు!

శుక్రవారం సాయంత్రం ఉత్తరకోస్తాలో అక్కడక్కడా ఈదురుగాలులు, పిడుగులతో వర్షం కురిసింది. కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల ఉరుములతో వర్షాలు కురుస్తాయని, ఆదివారం నుంచి రాయలసీమలో వర్షాలు పెరుగుతాయని, ఉత్తరకోస్తాలో అక్కడక్కడా భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

## మాపై కేరళలో శత్రు భైరవీ యాగం

- కర్ణాటక డీసీఎం డీకే శివకుమార్.. ఖండించిన కేరళ మంత్రి

బెంగళూరు, మే 31(ఆంధ్రజ్యోతి): సీఎం సిద్దరామయ్యతోపాటు తనపై, తమ ప్రభుత్వంపై కేరళ రాష్ట్రంలో శత్రుభైరవీ యాగం నిర్వహించారని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆరోపించారు. బెంగళూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రానికి చెందిన ప్రముఖ రాజకీయ నాయకుడు ఒకరు ఈ యాగం చేయించారన్నారు. కేరళలోని రాజరాజేశ్వరీ ఆలయంలో అఘోరాల ద్వారా ఈ యాగం చేయించి, పంచబలులు ఇచ్చారని ఆరోపించారు. నలుపు రంగు మేకలు 21, గొర్రెలు 21, దున్నపోతులు మూడింటిని బలి ఇచ్చారని అన్నారు. శత్రువులను కోలుకోలేని దెబ్బ కొట్టేందుకు ఈ యాగం చేశారని ఆరోపించారు. కేరళలో యాగం జరిపించిన ప్రముఖ నాయకుడి గురించి తనకు తెలుసునని, యాగంలో పాల్గొన్నవారి ద్వారానే సమాచారం వచ్చిందని అన్నారు. యాగం జరిపించింది జేడీఎస్ వారా..? బీజేపీ వారా..? అన్న ప్రశ్నకు ఆయన సమాధానం దాటవేశారు. 'మీరు నమ్ముతారా?' అని విలేకరులు ప్రశ్నించగా.. ఎవరి నమ్మకాలు వారికి ఉంటాయని, అలాంటివి చేయరాదని తాము చెప్పలేం కదా అని అన్నారు. తాము నమ్మే శక్తి తమను కాపాడుతుందని అన్నారు.

## 45 గంటలు.. ద్రవాహారమే..!

- కాషాయ వస్త్రాలు, జపమాలతో ధ్యానంలో మోదీ



చెన్నై, మే 31 (ఆంధ్రజ్యోతి): కన్యాకుమారిలోని స్వామి వివేకానంద రాక్‌మెమోరియ ల్ వద్ద ప్రధాని నరేంద్ర మోదీ గురువారం సాయంత్రం 6.45 గంటలకు ధ్యానం లో కూర్చున్నారు. 45 గంటల పాటు ధ్యానం చేయనున్నారు. ఈ సమయంలో ప్రధాని కేవలం ద్రవాహారాన్ని మాత్రమే స్వీకరిస్తారని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. కొబ్బరి నీళ్లు, ద్రాక్షరసం ఉంటాయని పేర్కొన్నాయి. 45 గంటలూ ఆయన మౌనంగానే ఉంటారని తెలిపాయి. కాషాయ దుస్తులు, జపమాలతో ధ్యాన మండపంలో ధ్యాన ముద్రలో కూర్చుని ఉన్న ప్రధానమంత్రి ఫొటోలు, వీడియోలు బయటకు వచ్చాయి. ప్రస్తుతం ఆ ఫొటోలు నెట్టింట్లో వైరల్ అవుతున్నాయి. ధ్యానంలో భాగంగా శుక్రవారం సూర్యోదయ సమయంలో ఆయన సూర్యభగవానుడికి అర్ఘ్యం సమర్పించారు. ఆదిత్యుడికి పవిత్ర జలాన్ని సమర్పించి, రెండు చేతులూ జోడించి నమస్కారం చేస్తున్న చిత్రాలను బీజేపీ 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేసింది. 'సూర్యోదయం, సూర్య అర్ఘ్య, ఆధ్యాత్మికం' పేరిట వీడియో క్లిప్‌ను కూడా జత చేసింది. కాషాయ వస్త్రాలు, జపమాలతో ప్రధాని ధ్యాన మండపం చుట్టూ నడిచారు. మోదీ ధ్యానం శనివారం సాయంత్రానికి ముగియనుంది. కాగా, 131 ఏళ్ల కిందట స్వామి వివేకానంద ధ్యానం చేసిన చోటే ప్రధాని మోదీ కూడా 45 గంటలపాటు ధ్యానంలో కూర్చోవడం విశేషం. మోదీ ధ్యానం చేస్తున్న ఫొటోలు, వీడియోలపై తమిళనాడు కాంగ్రెస్ అధ్యక్షుడు సెల్వపెరున్‌తుంగై 'ఎక్స్'లో స్పందించారు. "ఎన్ని యాంగిల్స్! ఎంత మంది వీడియోగ్రాఫర్లు! స్వామి వివేకానంద కూడా ఖిన్నుడైపోయారు!" అంటూ ఎద్దేవా చేశారు.

# నాగపూర్ @ 56 డిగ్రీలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రపంచ రికార్డుకు చేరువలో ఉండడం గమనార్హం..! 1913 జూలై 10న కాలిఫోర్నియాలోని డెత్ వ్యాలీలో 56.7 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఇదే ఇప్పటి వరకు ప్రపంచంలో అత్యధిక ఉష్ణోగ్రత. నాగపూర్‌లోని సోనేగావ్‌లో ఉన్న మరో ఏడబ్ల్యూఎస్‌లో కూడా శుక్రవారం అసాధారణంగా 54 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కాగా.. ఇటీవల ఢిల్లీలోని ముంగేశ్‌పూర్‌లో 52.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైన విషయం తెలిసిందే..! ఢిల్లీ చరిత్రలోనే ఇది అత్యధికం కాగా.. అక్కడ వెదర్‌స్టేషన్‌లోని సెన్సర్ సరిగ్గా పనిచేస్తుందో? లేదో? తనిఖీ చేస్తున్నట్లు ఐఎండీ వెల్లడించింది. ఇప్పుడు నాగపూర్‌లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవ్వడం మరోమారు చర్చకు దారి తీసింది. సోషల్‌మీడియాలో నెటిజన్లు ఏకంగా ఐఎండీని "ఇక్కడ కూడా సెన్సర్ పనితీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయా" అని ట్రోల్ చేస్తున్నారు.

### వడదెబ్బతో మరణాలు..

దేశంలో తీవ్రమైన ఎండలు, వడగాలులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. దేశవ్యాప్తంగా వడదెబ్బతో 69 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వివరించారు. బిహార్‌లో అత్యధికంగా 32 మంది మృతి చెందగా.. వారిలో 10 మంది ఎన్నికల సిబ్బంది కావడం గమనార్హం..! ఉత్తరప్రదేశ్‌లో చోటుచేసుకున్న మరణాల్లో మరో 15 మంది ఎన్నికల సిబ్బంది ఉన్నట్లు అధికారులు తెలిపారు. వీరిలో 13 మంది మిర్జాపూర్‌లో, ఇద్దరు సోన్‌భద్రలో వడదెబ్బకు గురయ్యారు. ఒడిసాలో 14, తెలంగాణలో 10 మరణాలు నమోదయ్యాయి. ఝార్ఖండ్‌లో ఐదుగురు, రాజస్థాన్‌లో మరో ఐదుగురు, ఉత్తరప్రదేశ్‌లోని సుల్తాన్‌పూర్‌లో ఒకరు, ఢిల్లీలో మరొకరు మృతిచెందారు. ఢిల్లీలో వడదెబ్బకు మృతిచెందిన వ్యక్తి బిహార్‌లోని దర్భంగాకు చెందినవాడని అధికారులు తెలిపారు. 40 ఏళ్ల వయసున్న ఆ వ్యక్తికి ఒకేసారి శరీర ఉష్ణోగ్రత 108 డిగ్రీల ఫారిన్‌హీట్‌కు పెరిగిందని, ఆ తర్వాత అంతర్గత అవయవాలు పనిచేయక, చనిపోయినట్లు వివరించారు. ఝార్ఖండ్‌లో వడదెబ్బతో 1,326 మంది ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు పేర్కొన్నారు.



వారాణసీలో వడదెబ్బతో స్పృహ తప్పిన అధికారి

### వర్ష సూచనలు

నైరుతి రుతుపవనాలు కేరళ వ్యాప్తంగా విస్తరించాయని, కర్ణాటక, తమిళనాడులో రెండ్రోజుల్లో విస్తరిస్తాయని ఐఎండీ తెలిపింది. అటు ఈశాన్య రాష్ట్రాల్లోనూ నైరుతి రుతుపవనాల రాకతో భారీ వర్షాలు కురుస్తున్నాయి. మరోవైపు పశ్చిమ గాలులు, తుపాను కారణంగా జమ్మూకశ్మీర్, లద్దాఖ్, గిల్గిట్, బాల్టిస్థాన్, ముజఫరాబాద్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ రానున్న రెండ్రోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ పేర్కొంది. అదే సమయంలో.. యూపీ, ఢిల్లీ, చండీగఢ్, హరియాణాలోని పలు ప్రాంతాల్లో దుమ్ము తుపాను వచ్చే ప్రమాదముందని హెచ్చరించింది. కాగా, ఎండలు, వడగాలుల తీవ్రత నేపథ్యంలో జాతీయ విపత్తుగా ప్రకటించే అవకాశాలను పరిశీలించాలని రాజస్థాన్ హైకోర్టు కేంద్రానికి సూచించింది. ఇటీవలి కాలంలో వడదెబ్బతో వందల మంది మృతిచెందారని, బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వాలు నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించింది. వడగాలులు,శీతలగాలులతో మరణాల నియంత్రణ బిల్లు-2015ను ఈ సందర్భంగా ఉటంకించింది.

## డేంజర్ బెల్స్

### అడుగంటిపోతున్న జలాశయాలు

న్యూఢిల్లీ, మే 31: దేశంలోని ప్రధాన జలాశయాలు అడుగంటిపోతున్నాయి. ఇతర ప్రాంతాల కంటే దక్షిణాదిలో ఈ తీవ్రత మరింత ఎక్కువగా ఉంది. కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) డేటా ప్రకారం దేశంలోని 150 రిజర్వాయర్లలో ప్రస్తుతం నీటిమట్టాలు సగటున 23 శాతానికి పడిపోయాయి. గతేడాది ఇదే సమయానికి ఉన్న నీటి నిల్వలతో పోలిస్తే ఈ సారి 77 శాతం తక్కువ. గత వారం రిజర్వాయర్లలో దాదాపు 24 శాతం నీటిమట్టాలు ఉన్నాయి. వారంలోనే ఒక శాతం తగ్గాయి. ఇక దక్షిణాదిలో ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళలో గోదావరి, కృష్ణా, పెన్నా, కావేరి సహా ఇతర నదులపై నిర్మించిన 42 రిజర్వాయర్లలో ప్రస్తుతం 14 శాతం మాత్రమే నీటి నిల్వలు అందుబాటులో ఉన్నాయి. మొత్తం నీటి నిల్వల సామర్థ్యం 53.334 బిలియన్ క్యూబిక్ మీటర్లు కాగా, ప్రస్తుతం 7.317 బిలియన్ క్యూబిక్ మీటర్ల నిల్వలు మాత్రమే ఉన్నాయి. సాధారణంగా ఈ సమయానికి ప్రధాన రిజర్వాయర్లలో 44.511 బిలియన్ క్యూబిక్ మీటర్ల నీటి నిల్వలు ఉండాలని, అయితే ఈ సారి గణనీయంగా తగ్గాయని సీడబ్ల్యూసీ ఆందోళన వ్యక్తం చేసింది.



## ఇంగ్లండ్ నుంచి లక్ష కిలోల బంగారం!

### ప్రత్యేక విమానంలో ఆర్బీఐ ఖజానాకు

ముంబై, మే 31: వంద టన్నుల బంగారం.. కిలోల్లో లెక్కేస్తే లక్ష కిలోలు! ఇంత భారీ స్థాయిలో బంగారం ఇంగ్లండ్ నుంచి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్బీఐ) ఖజానాకు చేరింది. 1991 తర్వాత ఇంత పెద్ద మొత్తంలో దేశానికి బంగారాన్ని తరలించడం ఇదే తొలిసారి. చాలా దేశాల్లోని కేంద్ర బ్యాంకులు బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌లో త మ బంగారాన్ని నిల్వ చేస్తుంటాయి. భారత్ ఇదే చేసిం ది. 15 ఏళ్ల క్రితం అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎంఎఫ్) నుంచి 200 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసింది. పై గా కొన్నేళ్లుగా పెద్ద ఎత్తున పుత్తడిని కొనుగోలు చేస్తూ వచ్చిన ఆర్బీఐ, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌లో నిల్వచేస్తూ వస్తోంది. 2024 మార్చి నాటికి ఆర్బీఐ వద్ద 822 ట న్ను ల బంగారం ఉంది. ఇందులో 413.8 టన్నులు ఇతర దే శాల్లో నిల్వ చేసి ఉంచింది. 2023లో 27.5 టన్నుల పసిడిని కొత్తగా నిల్వలో చేర్చింది. ఈ ఏడాది జనవరి-ఏప్రి ల్ వ్యవధిలోనే నిరుడు కంటే ఒకటిన్నర రెట్లు అధిక బం గారాన్ని కొనుగోలు చేసింది. కాగా ఇంగ్లండ్ నుంచి 100 టన్నుల బంగారాన్ని తరలించేందుకు ప్రత్యేకంగా కొన్నినెలల పాటు కసరత్తు చేసి భారీ భద్రత నడుమ ప్రత్యేక విమానంలో భారత్‌కు తరలించారు.

## ఈశాన్యం అతలాకుతలం

### రీమల్ తుఫాన్‌తో భారీ వర్షాలు.. నిరాశ్రయులైన లక్షలాది మంది

న్యూఢిల్లీ, మే 31: రీమల్ తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు, వరదలతో ఈశాన్య రాష్ట్రాలు అతలాకుతలమవుతున్నాయి. త్రిపుర, మణిపూర్, మిజోరాం, అసోం దక్షిణ ప్రాంతంలో ఈ ప్రభావం ఎక్కువగా ఉంది. వర్షాలు, వరదలకు తోడు పలు చోట్ల కొండచరియలు విరిగిపడటంతో జనజీవనం స్తంభించిపోయింది. నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. లక్షలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. రోడ్లు, రైల్వే ట్రాక్‌లు దెబ్బతినడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అసోంలో వరదలు ముంచెత్తడం, కొండచరియలు విరిగిపడటంతో పలు మార్గాల్లో రైళ్లను పూర్తిగా రద్దు చేశారు. ఇతర ప్రాంతాలతో సంబంధాలు తెగిపోయాయి. అసోంలో రెండు లక్షల మందికి పైగా ప్రజలు వరద ప్రభావానికి గురయ్యారు. వరదలకు ఆరుగురు మరణించారు. అసోం, మణిపూర్‌లో బ్రహ్మపుత్ర, బరాక్ సహా ఆరు నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. బ్రహ్మపుత్ర, బరాక్ ప్రమాద స్థాయిని మించి ప్రవహిస్తున్నాయి. బరాక్ ఉగ్రరూపం దాల్చడంతో పరీవాహక ప్రాంతాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు. మణిపూర్‌లో దాదాపు లక్షా 90 వేలమంది ప్రజలు నిరాశ్రయులు కాగా ముగ్గురు చనిపోయారు. దాదాపు 25 వేల ఇళ్లు దెబ్బతిన్నాయి. ఇంఫాల్‌లో రాజ్‌భవన్ సముదాయంలోకి భారీగా వరద చేరింది. రీమల్ తుఫాన్ అనంతరం ఈశాన్య రాష్ట్రాల్లో పరిస్థితి అధ్వానంగా మారింది. నిరంతరాయంగా వర్షం పడుతుండటంతో సహాయక చర్యలకు అంతరాయం ఏర్పడుతోంది. పెట్రోల్, డీజిల్ సహా నిత్యావసర సరుకులకు కొరత ఏర్పడింది.



### ఆదుకుంటాం: అమిత్ షా

ఈశాన్య రాష్ట్రాల్లో భారీ వర్షాలు, వరద పరిస్థితిపై శుక్రవారం కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా సమీక్షించారు. అన్నివిధాలా సాయం చేస్తామని హామీ ఇచ్చారు. అసోం, త్రిపుర, మణిపూర్, మేఘాలయా, మిజోరాంలో వరద పరిస్థితులపై ప్రధాని నరేంద్ర మోదీతో మాట్లాడినట్టు 'ఎక్స్'లో వెల్లడించారు. ప్రస్తుత పరిస్థితిపై మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేసినట్టు పోస్టు చేశారు. వరద ప్రభావం ఎక్కువగా ఉన్న ఐదు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో అమిత్ షా మాట్లాడారు.

## ఎగ్జిట్‌పోల్స్.. అటో.. ఇటో!?

న్యూఢిల్లీ, మే 31 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ చివరి దశ ఎన్నికలు ముగిసిన వెంటనే ఎగ్జిట్‌పోల్స్ వెలువడనున్నాయి. శనివారం సాయంత్రం 6.30 గంటల తర్వాత ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు విడుదల కానున్నాయి. ఎగ్జిట్‌పోల్స్‌ను సాయంత్రం 6.30 గంటల తర్వాతే విడుదల చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ప్రజాప్రాతినిధ్య చట్టం సెక్షన్ 126ఏ(1) ప్రకారం నిబంధనలు పాటించాలని స్పష్టం చేసింది. ఇక ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఎగ్జిట్‌పోల్స్ నిర్వహించేవారికి ఓటర్లు ఈసారి తమ వాస్తవ మనోగతాన్ని చెప్పే అవకాశం లేదని, గట్టి పోటీ ఉన్నందువల్ల 1-3 శాతం వరకు తప్పులు జరిగే అవకాశాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఎగ్జిట్‌పోల్స్ నిర్వాహకులు తీసుకునే నమూనాల స్థాయి వల్ల కూడా పొరపాట్లకు అవకాశం ఉంటుందని అంటున్నారు. ఇక ఎగ్జిట్‌పోల్స్ విఫలమైన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. 2004లో ఇండియా షైనింగ్ నినాదంతో ఎన్నికలకు వెళ్లిన బీజేపీకి 240-250 వరకు సీట్లు వస్తాయని దాదాపు అన్ని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. కానీ, కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ అధికారంలోకి వచ్చింది. 2009లోనూ ఎగ్జిట్‌పోల్స్ అంచనాలు తప్పాయి. 2015లో ఢిల్లీలో ఆప్ ప్రభంజనం వీస్తుందని ఏ ఎగ్జిట్‌పోల్ కూడా అంచనా వేయలేకపోయింది. అదే ఏడాది బిహార్‌లో కూడా ఎగ్జిట్‌పోల్స్ అంచనాలకు భిన్నంగా ఆర్జేడీ- కాంగ్రెస్- జేడీయూ కూటమి ఘన విజయం సాధించింది. 2017లో పెద్ద నోట్ల రద్దు అనంతరం జరిగిన యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో హంగ్ వస్తుందని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. కానీ, బీజేపీ 300 సీట్లకు పైగా సాధించి అధికారంలోకి వచ్చింది. 2014 లోక్‌సభ ఎన్నికల్లోనూ బీజేపీ అఖండ మెజారిటీతో అధికారంలోకి వస్తుందని అనేక ఎగ్జిట్ పోల్స్ అంచ నా వేయలేకపోయాయి. అయితే ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలు, అసలు ఫలితాలు ఒకేలా వెలువడిన సందర్భాలు కూడా లేకపోలేదు. ఇదిలా ఉండగా శనివారం వెలువడే ఎగ్జిట్ పోల్స్‌పై మీడియా చర్చలను బహిష్కరిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారని.. వారి తీర్పు ఈవీఎంల్లో భద్రంగా ఉందని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి పవన్ ఖేరా ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 4న ఈవీఎంలను తెరిచి లెక్కిస్తారని.. ఆ లోపు ఊహాగానాలకు తావివ్వకూడదని తెలిపారు. చానెళ్ల టీఆర్‌పీ రేటింగ్‌లు పెంచుకోవడానికి పెట్టే అవసర చర్చల్లో కాంగ్రెస్ పార్టీ పాల్గొనబోదని చెప్పారు. 4 వరకూ ఎగ్జిట్‌పోల్స్‌పై జరిగే చర్చల్లో తమ పార్టీ నేతలెవరూ పాల్గొనరని స్పష్టం చేశారు. కాగా, ఎగ్జిట్‌పోల్స్‌పై చర్చలను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించడమంటే కాంగ్రెస్ పార్టీ తన ఓటమిని అంగీకరించినట్లేనని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు. ఈ ఏడో దశలో ఆ పార్టీకి ఓటేయడం వృథా అన్నారు.

## నేటితో తెర

### సార్వత్రిక ఎన్నికల చివరి దశ నేడే

### వారాణసి సహా 57 స్థానాల్లో పోలింగ్

న్యూఢిల్లీ, మే 31(ఆంధ్రజ్యోతి): ఏడు దశలుగా జరుగుతున్న ఎన్నికల్లోని చివరి దశ పోలింగ్ శనివారం జరగనుంది. ఈ దశలో కేవలం 57 స్థానాలకే పోలింగ్ జరగనున్నప్పటికీ.. అధికార బీజేపీకి ఇది కీలకం కానుంది. 8 రాష్ట్రాల్లో సుమారు 10.06 కోట్ల మంది ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. ఉత్తరప్రదేశ్‌లో 13 స్థానాలు, బిహార్‌లో 8, పశ్చిమబెంగాల్‌లో 9, ఒడిసాలో 6, జార్ఖండ్‌లో 3 స్థానాలతోపాటు పంజాబ్‌లోని మొత్తం 13 స్థానాలు, హిమాచల్ ప్రదేశ్‌లోని మొత్తం 4 స్థానాలకు చివరి దశలో ఎన్నికలు జరగనున్నాయి. కాగా, ఉత్తరప్రదేశ్‌లోని వారాణసి నుంచి ప్రధాని నరేంద్రమోదీ, మీర్జాపూర్ నుంచి అప్నాదళ్(సోనీలాల్) అధినేత్రి, కేంద్ర మంత్రి అనుప్రియా పటేల్, సీఎం యోగి ఆదిత్యనాథ్ స్వస్థలమైన గోరఖ్‌పూర్ నుంచి బీజేపీ సిటింగ్ ఎంపీ రవికిషన్ ఈ దశలో ఉన్న ప్రముఖులు. ఇక బీఎస్పీ పలుచోట్ల దళితులను, ముస్లింలను అభ్యర్థులుగా నిలపడంతో.. వారు ఇండీ కూటమి ఓట్లను చీల్చే అవకాశాలున్నాయని పరిశీలకులు భావిస్తున్నారు. వారాణసి నుంచి రెండుసార్లు ఎన్నికైన మోదీకి తిరుగులేనప్పటికీ.. పట్టువదలని విక్రమార్కుడిలా పోరాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి అజయ్‌రాయ్ ఈసారి కాశీలో మార్పు కనిపిస్తోందని చెప్పుకొంటున్నారు. మోదీ స్థానికుడు కాదని, 'బచేగా కాశీ.. హారేగా ప్రవాసీ(ప్రవాసిని పక్కకు తప్పించి కాశీని కాపాడాలి)' అంటూ ప్రచారం చేస్తున్నారు. ఇక యూపీలోని మిగిలిన 12 స్థానాల్లో ఎస్పీ‌ఏ గట్టి పోటీని ఎదుర్కొంటోంది. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ బెయిల్‌పై వచ్చి పంజాబ్‌లో పెద్ద ఎత్తున రోడ్ షోలు నిర్వహించడంతో పోటీ ఆసక్తిగా మారింది. ఆప్, కాంగ్రెస్ మధ్యే ప్రధాన పోటీ నెలకొంది.

# డబ్బుకు వ్యవస్థ దాసోహం

- వ్యవస్థాగత భ్రష్టత్వానికి నిలువుటద్దం పుణె యాక్సిడెంట్ కేసు
- డబ్బున్న నిందితుడికి గులాములుగా మారిన రాజకీయ నాయకులు, పోలీసులు వైద్యులు
- అడుగడుగునా కేసును నీరుగార్చే యత్నాలు

దేశంలో వ్యవస్థలు ఎంత ఘోరంగా పనిచేస్తున్నాయి.. ఎంత అవినీతిమయమైపోయాయి అనేదానికి పెద్ద ఉదాహరణగా నిలిచిన కేసు.. పుణె యాక్సిడెంట్ కేసు! మైనారిటీ తీరని ఓ కుర్రాడు.. పూటుగా మద్యం తాగేసి, 200 కిలోమీటర్ల వేగంతో కారు నడిపి.. ఎంతో భవిష్యత్తు ఉన్న ఇద్దరు యువతీయువకుల ప్రాణాలను బలిగొంటే.. ఆ కుర్రాణ్ని కాపాడ్డానికి అతడి తండ్రి ఏకంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్‌కే ఫోన్ చేశాడు! ఆయన.. పోలీస్ కమిషనర్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే.. పోలీసులపై ఒత్తిడి తేవడానికి తెల్లవారుజామున పోలీస్ స్టేషన్‌కే వచ్చి కూర్చున్నాడు!! పోలీసులు, వైద్యులు నిందితుడి తండ్రి వెదజల్లిన డబ్బుకు దాసోహమయ్యారు. అయితే.. ఇద్దరి ప్రాణాలు తీసిన నిందితుడు కేవలం మైనర్ అనే కారణంతో బెయిల్ ఇచ్చిన జువెనైల్ జస్టిస్ బోర్డు జడ్జి ఎల్ఎన్ ధన్వాడే.. బెయిల్ షరతుగా యాక్సిడెంట్లపై 300 పదాల వ్యాసం రాయాలని, 15 రోజులపాటు ట్రాఫిక్ పోలీసులతో కలిసి పనిచేయాలని ఆదేశించడమే ఈ కేసు గతి మారడానికి కారణమైంది. ప్రజాగ్రహం వెల్లువెత్తి అన్ని వ్యవస్థలూ అటెన్షన్‌లోకి రావడానికి కారణమైంది!! లేదంటే.. ఈ కేసు కేవలం ఒక 'హిట్ అండ్ రన్' కేసుగా చీకటిలో నిశ్శబ్దంగా కలిసిపోయి ఉండేదేమో! ప్రజాగ్రహం వల్లనే జువెనైల్ జస్టిస్ బోర్డు మే 22న ఈ కేసును తిరగదోడి, మళ్లీ విచారణ జరిపి.. నిందితుడికి ఇచ్చిన బెయిల్‌ను రద్దు చేసి జూన్ 5 వరకూ అతణ్ని అబ్జర్వేషన్ హోమ్‌లో ఉంచాలని ఆదేశాలు జారీ చేసింది.



### ఏసీపీ కుర్చీలో కూర్చోబెట్టి..

పుణె యాక్సిడెంట్ వార్త తెలియగానే అప్రమత్తమై ఎరవాడ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన పాత్రికేయులకు అక్కడ నివ్వెరపోయే దృశ్యాలు కనిపించాయి! నిందితుడిని పోలీసులు ఏసీపీ కుర్చీలో కూర్చోబెట్టారు! అతడికి కుటుంబసభ్యులు పిజ్జా తెచ్చిపెడితే చూస్తూ కూర్చున్నారు. మృతుల బంధువులు పోలీస్‌స్టేషన్‌కు వస్తే వారితో అత్యంత అమానవీయంగా ప్రవర్తించారు. ఈ యాక్సిడెంట్‌లో చనిపోయిన యువతి సొంతూరు మధ్యప్రదేశ్‌లోని జబల్పూర్. ఆమె తల్లిదండ్రులు, ఇతర కుటుంబసభ్యులంతా అక్కడే ఉన్నారు. పుణెలో ఆమెకు సంబంధించిన వ్యక్తి ఆమె మామయ్య ఒక్కరే ఉన్నారు. ఆమె తరఫున ఆయన పోలీస్ స్టేషన్‌కు పరిగెత్తుకు వస్తే.. 'నువ్వెవరివి? తల్లిదండ్రులు రావాలి కదా?' అని ప్రశ్నించారు. ఆయన్ను అసలు మాట్లాడనీయకుండా చేసి.. తమ పని తాము చేసుకుపోయారు. మూడేళ్లలోపు శిక్ష పడే సెక్షన్లతో కేసు పెట్టారు. దీనిపై విమర్శలు రావడంతో మళ్లీ 304 సెక్షన్‌తో రివైజ్ చేశారు.

### వైద్యవృత్తికే అవమానం..

మే 19న.. తెల్లవారాక ఈ వ్యవహారం పోలీస్ స్టేషన్ నుంచి ఆస్పత్రికి మారింది! అప్పటిదాకా నాయకులను, పోలీసులను 'మేనేజ్' చేసిన నిందితుడి తండ్రి.. ఆస్పత్రిలోనూ దాదాపు రూ.50 లక్షలు నీళ్లలా వెదజల్లాడు! దీంతో వైద్యులు నిందితుడి రక్తనమూనా తీసుకోవడానికి తాత్సారం చేశారు. పొద్దున తొమ్మిది గంటలకు అతణ్ని ఆస్పత్రికి తీసుకెళ్తే.. 11 గంటలకు రక్తనమూనాలను తీసుకున్నారు. ఇలా ఆలస్యం చేయడం వల్ల.. పరీక్షల్లో ఆల్కహాల్ శాతం తక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది. పోనీ అలా తీసుకున్న నమూనానైనా పరీక్షించి నివేదిక ఇచ్చారా అంటే.. అదీ లేదు. అతడి రక్తనమూనాను చెత్తబుట్టలో పడేసి అతడి తల్లి రక్తనమూనా పరీక్షించి తప్పుడు నివేదిక ఇచ్చారు. ఈ విషయం బయటపడడంతో బాలుడి రక్తనమూనాను మళ్లీ సేకరించి పరీక్ష చేశారు. అప్పుడు.. ఈ తప్పుడు పనికి పాల్పడిన అజయ్‌తవాడే, శ్రీహరి హల్నోర్ అనే ఇద్దరు డాక్టర్లను డిస్మిస్ చేశారు. నిందితుడైన మైనర్ తండ్రి.. పుణెలో ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి కావడంతో ఆయన విస్తృతంగా రాజకీయ పరిచయాలున్నాయి. ఆ పరిచయాలతోనే.. తన కొడుకును కాపాడుకునేందుకు ఆయన నేరుగా మహారాష్ట్ర డిప్యూటీ సీఎం, ఎన్సీపీ నేత అజిత్‌పవార్‌కు ఫోన్ చేసినట్టు సమాచారం. ఆయన పుణె సీపీకి ఫోన్ చేసి ఈ కేసులో చూసీ చూడనట్టు పోవాలని సూచించినట్టు ఆరోపణలున్నాయి. ఇక.. స్థానిక ఎన్సీపీ ఎమ్మెల్యే సునీల్ టింగరేకైతే తెల్లవారుజామున 2.30 నుంచి 3.45 నడుమ.. నిందితుడి తండ్రి 45సార్లు ఫోన్ చేశారు! గాఢనిద్రలో ఉండి ఆ ఎమ్మెల్యే ఫోన్ ఎత్తకపోతే.. నేరుగా ఆయన ఇంటికి వెళ్లి, నిద్రలేపి తీసుకెళ్లి ఎరవాడ పోలీస్‌స్టేషన్‌లో కూర్చోబెట్టారు!

> **సౌమ్యుడు.. పదవి ఇవ్వండి!**
>
> ఈ కేసులో తప్పుడు రిపోర్టు ఇచ్చిన వైద్యుడు డాక్టర్ అజయ్ తవాడే.. పుణెలోని సాసూన్ జనరల్ ఆస్పత్రిలో మెడికల్ సూపరింటెండెంట్‌గా 2023 డిసెంబరులో నియమితులయ్యారు. ఆయనకు ఆ పదవి రావడానికి కారణం ఎవరో తెలుసా? ఇదే యాక్సిడెంట్ కేసులో నిందితుడి కోసం తెల్లవారుజామున పోలీస్ స్టేషన్‌కు వెళ్లి కూర్చున్న ఎమ్మెల్యే సునీల్ టింగరే. కొవిడ్ సమయంలో డాక్టర్ అజయ్‌తవాడే అద్భుతంగా పని చేశారని.. ఆయన తనకు బాగా తెలుసని.. కాబట్టి, ఆయన్ను సాసూన్ జనరల్ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్‌గా నియమించాలని విజ్ఞప్తిచేస్తూ మహారాష్ట్ర వైద్య విద్య మంత్రి హసన్ ముష్రిఫ్‌కు సునీల్ టింగరే అప్పట్లో రాసిన లేఖ ఇప్పుడు వైరల్ అవుతోంది.

### మీడియాను తప్పించుకు తిరుగుతున్న జడ్జి

ఈ కేసు ఇంత సంచలనం కావడానికి.. కారణమైన జువెనైల్ జస్టిస్ బోర్డు జడ్జి ఎల్ఎన్ దన్వాడే ప్రస్తుతం మీడియాను తప్పించుకు తిరుగుతున్నారు. పాత్రికేయులు ఎన్ని ప్రశ్నలు అడిగినా.. నోరు విప్పి సమాధానం చెప్పకుండా అక్కణ్నుంచీ వెళ్లిపోతున్నారు. నిజానికి ఈ కేసులో ఆరోజు తీర్పు చెప్పాల్సింది ఈయన కాదు. బోర్డులో జ్యుడీషియల్ మెంబర్, ప్రిన్సిపల్ మేజిస్ట్రేట్, ఇద్దరు నాన్-జ్యుడీషియల్ అపాయింటెడ్ మెంబర్లు ఉంటారు. ఇద్దరు నాన్ జ్యుడీషియల్ మెంబర్లలో ఒకరు.. ఎల్ఎన్ ధన్వాడే. ఆరోజు ప్రిన్సిపల్ మేజిస్ట్రేట్, ఒక నాన్‌జ్యుడీషియల్ మెంబర్ సెలవులో ఉండడంతో కేసు ఈయన ముందుకు వచ్చింది.

- సెంట్రల్ డెస్క్

## లోకం తీరు





ఘాట్ రోడ్డులో ప్రమాద దృశ్యం

## ఏజెన్సీ ఘాట్ రోడ్డులో ప్రమాదం

- లోయలోకి దూసుకుపోయిన బైక్
- తండ్రి, కొడుకు మృతి.. తల్లి, కుమార్తెకు తీవ్ర గాయాలు

కొయ్యూరు, మే 31: ద్విచక్ర వాహనం అదుపుతప్పి లోయలోకి దూసుకుపోవడంతో తండ్రి, కొడుకు మృతిచెందారు. అదే వాహనంపై ఉన్న తల్లి, కూతురు తీవ్రంగా గాయపడ్డారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం చింతవానిపాలెంలో శుక్రవారం జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. అడ్డతీగల మండలం సీతారాం గ్రామానికి చెందిన వెలమ రాంబాబు (35), కాసులమ్మ దంపతులకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరిలో పెద్ద కుమార్తె రంపచోడవరంలోని పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతోంది. మరో కుమార్తె ప్రమీలను కొయ్యూరు మండలం బాలరేవులలో ఉన్న తమ బంధువుల ఇంటికి పండగ కోసం పంపించారు. కుమార్తెను తిరిగి తీసుకురావడానికి రాంబాబు, కాసులమ్మ కుమారుడు ప్రశాంత్(7)తో కలిసి గురువారం బాలరేవుల వచ్చారు. శుక్రవారం ఉదయం ద్విచక్ర వాహనంపై కుమార్తె ప్రమీలతో కలిసి తమ సొంత గ్రామం బయలుదేరారు. చింతవానిపాలెం గ్రామం దాటాక ఘాట్ రోడ్డులోని ప్రమాదకర మలుపులో వాహనం బ్రేకులు ఫెయిలవ్వడంతో అదుపుతప్పి లోయలోకి దూసుకుపోయింది. దీంతో రాంబాబు, ప్రశాంత్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కాసులమ్మ, ప్రమీల తీవ్రంగా గాయపడ్డారు. వారిద్దరూ కేకలు వేయడంతో అటుగా వెళుతున్న ప్రయాణికులు గమనించి స్థానికులతో కలిసి రాజేంద్రపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. సమాచారం అందుకున్న కొయ్యూరు ఎస్ఐ రామకృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## శ్రీవారి సేవలో జస్టిస్ శ్యాంసుందర్



తిరుమల ఆలయం ముందు జస్టిస్ శ్యాంసుందర్

తిరుమల, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్యాంసుందర్ తిరుమల శ్రీవారిని శుక్రవారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్న ఆయన రంగనాయక మండపానికి చేరుకోగా వేదపండితులు ఆశీర్వచనం చేశారు. అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గీత రచన పోటీ

- ఎంపికైన గీతానికి రూ.లక్ష బహుమానం

విజయవాడ(అజిత్‌సింగ్‌నగర్), మే 31: ఆంధ్రప్రదేశ్ భౌగోళిక, సాహితి, సాంస్కృతిక వైభవాన్ని చాటి చెప్పే గీత రచన పోటీలు నిర్వహిస్తున్నామని, ఎంపికైన గీతానికి రూ.లక్ష బహుమానం అందజేస్తామని ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి రాష్ట్ర గీతంగా ఉన్న "మా తెలుగు తల్లికి మల్లెపూదండ" గీతాన్ని గౌరవిస్తూనే దాని స్థానంలో వర్తమాన ఆంధ్రప్రాంత వైభవ స్వాభిమాన గీతాన్ని రూపొందించాలని, అందుకు ఐదు నిమిషాల నిడివి గల గీత రచన పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. జూన్ 30వ తేదీ లోపు రూపొందించిన గీతాన్ని ఆంధ్ర సారస్వత పరిషత్, అల్లూరి సత్యనారాయణరాజు సాంస్కృతిక కేంద్రం, నరసాపురం, పశ్చిమ గోదావరి జిల్లా చిరునామాకు పంపించాలని సూచించారు.

# 'బ్యాలెట్' ఉత్తర్వులు సరైనవే

- ఫెసిలిటేషన్ కేంద్రంలో ఓటేసిన ఉద్యోగులకు వర్తిస్తాయి
- కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టీకరణ
- ఈ ఉత్తర్వులకు కారణాలు చెప్పలేదు
- కౌంటింగ్‌కు 4 రోజుల ముందు ఇచ్చారు
- దీనిపై అనేక అనుమానాలు ఉన్నాయి
- వైసీపీ తరపు న్యాయవాదుల వాదనలు
- నేడు తీర్పు వెలువరించనున్న హైకోర్టు

అమరావతి, మే 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోస్టల్ బ్యాలెట్ల ఓట్ల లెక్కింపు విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ వైసీపీ దాఖలు చేసిన వ్యాజ్యాలపై శుక్రవారం హైకోర్టులో సుదీర్ఘ వాదనలు జరిగాయి. ఇరువైపుల వాదనలు ముగియడంతో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ మండవ కిరణ్మయి, జస్టిస్ న్యాపతి విజయ్‌తో కూడిన ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించింది. శనివారం నిర్ణయాన్ని వెల్లడిస్తామని తెలిపింది. పోస్టల్ బ్యాలెట్ డిక్లరేషన్‌కు సంబంధించి ఫాం-13(ఏ)పై అటెస్టింగ్ అధికారి సంతకం ఉండి, ఆయనకు సంబంధించిన హోదా, వివరాలు పేర్కొననప్పటికీ.. ఆ పోస్టల్ బ్యాలెట్ చెల్లుబాటు అవుతుందని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. అయితే.. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ వైసీపీ కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మరోవైపు ఇదే పిటిషన్‌లో విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అనుబంధ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలను హైకోర్టు శుక్రవారం హౌజ్‌మోషన్లుగా విచారణకు స్వీకరించింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపిస్తూ.. రాష్ట్రంలో దాదాపు 5.5 లక్షలకు పైగా పోస్టల్ బ్యాలెట్లు ఉన్నాయని, అభ్యర్థుల గెలుపు ఓటముల నిర్ణయంలో ఇవి కీలకమని తెలిపారు. ప్రస్తుతం అమల్లో ఉన్న చట్ట నిబంధనలకు లోబడి ఈ ఓట్ల చెల్లుబాటును నిర్ణయించాలని కోరారు. ఫాం-13(ఏ)పై అటెస్టింగ్ అధికారి సంతకం ఉండి, ఆయనకు సంబంధించిన హోదా, వివరాలు తెలుపకపోయినా ఆ పోస్టల్ బ్యాలెట్ చెల్లుబాటు అవుతుందని ఎన్నికల సంఘం మే 30న ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. ఇవి చట్ట నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ చెల్లుబాటు నిబంధనలు మార్చడం ఎన్నికల ప్రక్రియను బలహీనపర్చడమేనని పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపునకు నాలుగు రోజులు ముందు ఈసీ ఇలాంటి ఉత్తర్వులు ఇవ్వడం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఎన్నికల స్వచ్ఛతను కాపాడేందుకు కోర్టులు జోక్యం చేసుకోవచ్చునని తెలిపారు.



### ఈసీ ఆకస్మిక నిర్ణయం

పిటిషనర్ తరఫున మరో సీనియర్ న్యాయవాది పి. వీరారెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఏపీ సీఈవో ఇచ్చిన సర్క్యులర్‌ను సవాల్ చేస్తూ వేసిన పిటిషన్ కోర్టులో విచారణలో ఉందని తెలిపారు. అయితే, ఆకస్మికంగా కేంద్ర ఎన్నికల సంఘం కూడా ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. రాష్ట్రం లో మాత్రమే ఈ ఉత్తర్వులు అమలు చేస్తున్నారని వివరించారు. ఈ ఉత్తర్వుల జారీకి కారణాలు పేర్కొనలేదని తెలిపారు. ఈసీ సైతం చట్ట నిబంధనలకు లోబడి వ్యవహరించాల్సిందేనని పేర్కొన్నారు. ఈసీ రాసిన లేఖపై ఎన్నికల పిటిషన్ దాఖలు చేయడం వీలుపడదని తెలిపారు. ఫెసిలిటేషన్ సెంటర్ వద్ద జరిగిన తప్పులను సరిచేసేందుకు ఎన్నికల సంఘం ఈ చర్యకు దిగినట్టు కనబడుతోందన్నారు. ఫాం-13 (ఏ) నిబంధన సవరించకుండా రూల్ 18(ఏ) చెల్లుబాటు కాదన్నారు. ఈ నేపథ్యంలో పిటిషన్‌కు విచారణార్హత ఉందన్నారు.

### సంతకం ఉంటే చాలు: ఈసీ

కేంద్ర ఎన్నికల సంఘం తరఫున సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్ వాదనలు వినిపించారు. ఎన్నికల విధుల్లో ఉండి ఫెసిలిటేషన్ సెంటర్ వద్ద పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్న ఉద్యోగులకు తాజా ఉత్తర్వులు వర్తిస్తాయని తెలిపారు. ఫెసిలిటేషన్ సెంటర్‌లోని అటెస్టింగ్ ఆఫీసర్‌ను రిటర్నింగ్ అధికారే నియవించారన్నారు. ఈ నేపథ్యంలో ఫాం-13 (ఏ)పై అటెస్టింగ్ అధికారి సంతకం ఉంటే సరిపోతుందని పేర్కొన్నారు. ఆ అధికారి పేరు, సీలు అవసరం లేదన్నారు. ఫెసిలిటేషన్ కేంద్రాల వద్ద పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ మొత్తం వీడియో రికార్డింగ్ చేశారని వివరించారు. ఫెసిలిటేషన్ సెంటర్ వద్ద పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకొనే ఉద్యోగుల కోసం గత ఏడాది ఆగస్టులో ప్రత్యేకంగా 18(ఏ) నిబంధన తీసుకొచ్చారని తెలిపారు. ఇతర ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ పత్రాలపై గ్రూప్-ఏ, గ్రూప్-బీ అధికారులు అటెస్ట్ చేస్తారన్నారు. చట్ట నిబంధనలు ఉల్లంఘించి ఎన్నికల సంఘం ఏదైనా నిర్ణయం తీసుకొంటే ఎన్నికల పిటిషన్ ద్వారా మాత్రమే సవాల్ చేయగలరని తెలిపారు. రాజ్యాంగంలోని అధికరణ 329 (బీ) ప్రకారం ఎన్నికల ప్రక్రియలో కోర్టులు జోక్యం చేసుకోవడానికి వీల్లేదన్నారు. ఈ వ్యాజ్యంలో అనుబంధ పిటిషన్ వేసిన వెలగపూడి రామకృష్ణబాబు తరఫున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు, న్యాయవాది పదిరి రవితేజ వాదనలు వినిపించారు. చట్ట నిబంధనలను కోర్టు ముందుంచారు.



ఐసెట్‌లో ర్యాంకులు సాధించిన ఆదిత్య కళాశాల విద్యార్థులు

## ఐసెట్‌లో ఆదిత్య హవా

రాజమహేంద్రవరం, మే 31(ఆంధ్రజ్యోతి): ఐసెట్-2024 ఫలితాల్లో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో 10 లోపు 3, 100 లోపు 22, 1000 లోపు 95 ర్యాంకులు సాధించారని విద్యా సంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి తెలిపారు. రెండో ర్యాంకర్ బి.కార్తీక్, 6వ ర్యాంకు సాధించిన ఎన్.దశరథరామిరెడ్డి, 8వ ర్యాంకర్ పి.అనుపమను ఆయన అభినందించారు. ఆప్టిట్యూడ్, ఇంగ్లీషు వంటి ప్రత్యేక అంశాల్లో శిక్షణ ద్వారా ఈ విజయాలను సాధించామన్నారు. 100 లోపు 22 ర్యాంకులు సాధించడం ఆదిత్యకు మాత్రమే సాధ్యమైందని డైరెక్టర్ డాక్టర్ ఎన్.సుగుణారెడ్డి పేర్కొన్నారు. ఈ విజయానికి కృషి చేసిన అధ్యాపకులు, విద్యార్థులను అభినందించారు. క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా 52 ఎంఎన్‌సీల్లో 10,140కి పైగా ఉద్యోగాలతో అరుదైన ఘనత తమ విద్యార్థులు సాధించారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ సీహెచ్ ఫణికుమార్, ఎస్ఎన్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.



విరాళం డీడీలను ఈవోకు అందజేస్తున్న దాతలు

## ఎస్వీ ప్రాణదానం ట్రస్టుకు రూ.1.5 కోట్ల విరాళం

తిరుమల, మే 31 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎస్వీ ప్రాణదానం ట్రస్టుకు శుక్రవారం రూ.1.5 కోట్లు విరాళంగా అందింది. హైదరాబాదుకు చెందిన వివేక్ కైలాస్, విక్రమ్ కైలాస్ కుటుంబ సభ్యులతో తిరుమలలో టీటీడీ ఈవో ధర్మారెడ్డిని కలిసి విరాళానికి చెందిన డీడీలను అందజేశారు.

## శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న అమిత్ షా

తిరుమల, మే 31 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం మంత్రి అమిత్ షా తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని శుక్రవారం దర్శించుకున్నారు. గురువారం రాత్రి తిరుమలకు చేరుకున్న ఆయన శుక్రవారం ఉదయం వీఐపీ బ్రేక్‌లో సతీమణి సోనాల్ షాతో కలిసి ఆలయంలోకి వెళ్లి ధ్వజస్తంభం వద్ద సాష్టాంగ నమస్కారం చేశారు. శ్రీవారిని దర్శించుకున్న అనంతరం హుండీలో కానుకలు సమర్పించి, రంగనాయక మండపానికి చేరుకోగా వేద పండితులు ఆశీర్వచనం చేశారు. అనంతరం ఈవో ధర్మారెడ్డి శ్రీరాములవారి చిత్రపటం, లడ్డూప్రసాదాలు అందజేశారు.



రంగనాయక మండపంలో అమిత్ షా దంపతులు

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

## ట్రంప్‌కు నగుబాటు

ఈ ఏడాది నవంబరులో అధ్యక్ష ఎన్నికలు ఉండగా, 'హష్‌మనీ' కేసులో నేర నిర్ధారణ జరగడం అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు పెద్ద ఎదురుదెబ్బ. తనతో ఉన్న సంబంధం గురించి నోరువిప్పకుండా ఉండేందుకు పోర్న్‌స్టార్ స్మార్టీ డేనియల్‌కు ట్రంప్ భారీగా డబ్బు ముట్టచెప్పిన కేసులో మాన్‌హటన్ కోర్టు వెలువరించిన తీర్పు ఆయనకు అవమానకరమైనది. ఈ కేసులో ట్రంప్‌మీద మోపిన ముప్పైనాలుగు అభియోగాలు రుజువైనట్లు జ్యూరీ ప్రకటించింది. తుదితీర్పు వెలువరించడానికి, శిక్షఖరారు కావడానికి ఒక నెల సమయం పట్టవచ్చును. నాలుగేళ్ళవరకూ జైలుశిక్షపడుతుందన్న అంచనాలు, ఊహాగానాలను అటుంచితే, అమెరికా అధ్యక్షపదవి చేపట్టిన వ్యక్తి ఒక క్రిమినల్ కేసులో దోషిగా రుజువుకావడం ఆ దేశ చరిత్రలో ఇదే తొలిసారి.

వచ్చేనెల 11న కోర్టు తుదితీర్పు ప్రకటించిన నాలుగురోజుల్లోనే, అంటే జూలై 15న ఆయన దేశాధ్యక్ష పదవికి రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా నామినేషన్ వేస్తారట. ట్రంప్ ప్రయాణం వేగంగా సాగుతోంది... అటు జైల్లోకి, ఇటు అధ్యక్ష భవనంవైపు అంటూ అమెరికా పత్రికలు రాస్తున్నాయి. చాలా విచిత్రమైన పరిస్థితి ఆయనది. తనను టీవీ స్టార్‌ను చేస్తానని హామీ ఇచ్చి 2006లో ట్రంప్ తనతో శృంగారంలో పాల్గొన్నారని, మాటకు కట్టుబడకపోగా, ఈ విషయం చెప్పకుండా ఉండేందుకు తనకు డబ్బు ముట్టచెప్పారన్నది ఆమె వాదన. 2016ఎన్నికల ముందు ఆమె నోరుతెరవకుండా ఉండేందుకు డబ్బు ముట్టచెప్పిన ట్రంప్ ఇప్పుడు మళ్ళీ ఎన్నికల ముందు ఆ కేసులో దోషిగా రుజువైనారు. ఈ విచారణను, కోర్టు తీర్పును ట్రంప్ తప్పుబట్టడం, రాజకీయకక్షగా అభివర్ణించడం సహజం. శిక్షపడినా కూడా ఆయన ఎన్నికల ప్రచారానికీ, పోటీకి అనర్హుడు కాబోడని, దేశాధ్యక్షుడు కావడానికి ఏ అడ్డంకీ ఉండబోదని అంటున్నారు. దిగువకోర్టు నిర్ణయాన్ని ఎలాగూ ఆయన పైకోర్టులో సవాల్ చేస్తారు.

నిజమైన తీర్పు నవంబరు 5న వెలువడుతుందని ట్రంప్ అంటున్నారు. ఒక పోర్న్‌స్టార్‌కు ఏవో ఆశలు చూపి, శృంగారం నెరపి, ఆమెకు డబ్బుముట్టచెప్పిన ట్రంప్ ప్రజలు దీనిని ఏమాత్రం పట్టించుకోరని నమ్ముతున్నారు. స్మార్టీ డేనియల్‌కు సొమ్ముచెల్లించిన విషయం రహస్యంగా ఉండాలి కనుక, తదనుగుణంగా ఖాతాల్లో ఆ మొత్తాన్ని తారుమారు చేశారు. ఎన్నికల విరాళాలనుంచి ఆ మొత్తాన్ని పోర్న్‌స్టార్‌కు పంచారని, తన న్యాయవాదిద్వారా దానిని ఆమెకు అందించారన్నది అభియోగం. ట్రంప్‌తో సంబంధం, సొమ్ముచెల్లింపు నిజమేనని స్మార్టీ డేనియల్ కోర్టుకు వచ్చిచెప్పారు, లెక్కల తారుమారు, వేర్వేరు మార్గాల్లో సర్దుబాట్లు వాస్తవమేనని సదరు న్యాయవాది కూడా అంగీకరించి జైలుపాలైనారు. విచిత్రమేమంటే, మాన్‌హట్టన్ కోర్టు తీర్పు వెలువడిన కొద్ది గంటల్లోనే విరాళాల వరదతో ట్రంప్ వెబ్‌సైట్ కాసేపు క్రాష్ అయింది.

ట్రంప్‌కు జైలుశిక్షపడవచ్చు, జరిమానాతో సరిపెట్టవచ్చు. ఇంతకంటే తీవ్రమైన కేసులు మరో మూడు ఉన్నా అవేమీ ఈ ఎన్నికలయ్యేలోగా ట్రంప్‌ను ఇబ్బందిపెట్టవు. కానీ, హష్‌మనీ కేసులో ఆయనకు శిక్షపడటం ఓటరు నిర్ణయంమీద ఎంతోకొంత ప్రభావం చూపుతుంది. ఆయన దోషిగా తేలి, స్వల్పకాలిక జైలుశిక్ష పడినా కూడా రిపబ్లికన్ పార్టీ సంకటస్థితిని ఎదుర్కోవలసి వస్తుంది. దోషిగా తేలితే ఆయన అభ్యర్థిత్వాన్ని తిరస్కరించాలని పార్టీ ఓటర్లు నిర్ణయించుకున్నట్టుగా ఈ ఏడాది ఆరంభంలో ఓ సర్వే తేల్చింది. జూలై నాటి రిపబ్లికన్ సమావేశాల్లో కూడా ఇదే వేడి ఉంటుందా అన్నది తెలియదు. రిపబ్లికన్ పార్టీ తరఫున పోటీపడుతున్న హేమాహేమీలంతా వరుసపెట్టి పక్కకు జరిగిపోతూ, ట్రంప్ ప్రధానంగా పరుగుపందెంలో నిలిచివున్న స్థితిలో ఆయనను కాదనడం అసాధ్యం. ట్రంప్ మద్దతుదారులు ఈ కేసును బైడెన్ రాజకీయ కుట్ర అంటారు, ట్రంప్ వ్యతిరేకులు ఆయనకు శిక్షపడినందుకు సంతోషిస్తారు. రాజకీయాన్ని అటుంచితే, మరోమారు దేశాధ్యక్షుడు కావాలనుకుంటున్న ఓ మాజీ అధ్యక్షుడు ఇలా వరుస కేసులు ఎదుర్కోవడం, నేరస్థుడిగా ముద్రపడటం అమెరికా పరువు ప్రతిష్ఠలకు భంగకరం. గత ఎన్నికల్లో ఓటమిని సహించక, ప్రజలు ఎన్నుకున్న బైడెన్‌కు అధ్యక్షబాధ్యతలను అప్పగించడానికి మనసొప్పక, తన అభిమానులను రెచ్చగొట్టి తీవ్ర విధ్వంసానికి కారకుడై దేశం పరువుతీసిన డోనాల్డ్ ట్రంప్‌కు మరోమారు అధికారం అప్పగించడం సరైనదో కాదో ప్రజలు నిర్ణయించుకోవాలి. నవంబరులో వారు ఇచ్చే అసలైన తీర్పుమీద అమెరికా భవిష్యత్తు, దాని పరువుప్రతిష్ఠలు ఆధారపడి ఉన్నాయి.

## ఆశాభావాల ఆఖరి దశ

భారతదేశ జాతీయ ఎన్నికల చరిత్రలో అతి సుదీర్ఘమైనది అయిన 18వ సార్వత్రిక పోరు దేశవ్యాప్తంగా ఏడు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలోని 57 లోక్‌సభా నియోజకవర్గాలలో శనివారం పోలింగ్‌తో ముగియనున్నది. భారతీయ జనతా పార్టీ గెలుపునకు కష్టపడవలసిన రాష్ట్రాలు, తన సంఖ్యా బలాన్ని మెరుగుపరచుకోగలనన్న ఆశాభావం ఉన్న ప్రాంతాలలో ఈ ఆఖరి దశ ఎన్నికలు జరుగుతున్నాయి. 2019లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ఈ 57 స్థానాలలో 30ని మాత్రమే గెలుచుకున్నది. ఇండియా కూటమి 19 స్థానాలను గెలుచుకోగా 'అలీన' (ఏ కూటమిలోనూ భాగస్వామిగా లేని) పార్టీలు 8 స్థానాలను కైవసం చేసుకున్నాయి.



▪ యోగేంద్ర యాదవ్

2019 అనంతరం జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ప్రాతిపదికన చూస్తే ఇండియా కూటమి మరో 12 సీట్లను అదనంగా గెలుచుకునే అవకాశమున్నది ఈ దశలో ఎన్డీఏ విజయావకాశాలు, ముఖ్యంగా బెంగాల్, ఒడిషా, పంజాబ్‌లలో గతంలో కంటే అధికంగానే ఉన్నాయి. కాగా ఈ దశలో ఎన్నికలు జరగనున్న స్థానాలలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సొంత నియోజకవర్గం కూడా ఉన్నది. ప్రధానమంత్రి ప్రచారంపై పూర్తి శ్రద్ధ చూపించేందుకు వీలుగా ఈ ఏడో దశ ఎన్నికల నియోజకవర్గాలను నిర్ణయించారు. అందుకు తగ్గట్టుగానే అత్యధిక స్థానాలను గెలుచుకోవడానికి ఆయన ఉధృత ప్రచారం చేశారు. అయితే బీజేపీ శ్రేణులు ఊహించిన రీతిలో ఆ ప్రచారం విజయవంతంగా జరగలేదు.

బిహార్ భోజ్‌పూర్ ప్రాంతంలోని ఎనిమిది లోక్‌సభా నియోజకవర్గాలను గత సార్వత్రిక ఎన్నికలలో బీజేపీ గెలుచుకున్నది. అయితే ఈసారి అవే నియోజకవర్గాలలో గెలవడం పాలక కూటమికి ఒక సవాల్‌గా ఉన్నది. 2020 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను పరిగణనలోకి తీసుకుంటే, ఈ 8లోని 6 నియోజకవర్గాలలో ఎన్డీఏ కంటే ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలకే ఎక్కువ మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ప్రస్తుత పొత్తుల ప్రకారం చూస్తే ఇండియా కూటమి మూడు నియోజకవర్గాలు జెహనాబాద్, పాటలీపుత్ర, అరాహ్‌లను తప్పక గెలుచుకుంటుంది. మరో 2 శాతం ఓట్లు అదనంగా లభిస్తే ఇండియా కూటమి గెలుచుకునే స్థానాల సంఖ్య 5కు పెరుగుతుంది. ఇండియా కూటమి కూడా 5 స్థానాలను గెలుచుకోవడానికి కృతనిశ్చయంతో కృషి చేస్తోంది. ఇందులో భాగంగానే రాష్ట్రీయ జనతా దళ్ 'My' (ముస్లిం–యాదవ్) వ్యూహానికి స్వస్తి చెప్పి సకల సామాజికవర్గాలకు సమ ప్రాధాన్య మిచ్చే 'A to Z' వ్యూహానికి ప్రాధాన్యమిస్తోంది.

ఉత్తరప్రదేశ్‌లో ఈ సార్వత్రిక ఎన్నికలు పూర్వాంచల్‌లోని 13 నియోజకవర్గాలలో ముగియనున్నాయి. 2019 లోక్‌సభ, 2022 అసెంబ్లీ ఎన్నికలలో ఎన్డీఏ ఈ నియోజకవర్గాలలో మంచి ఫలితాలను సాధించింది. గత సార్వత్రిక ఎన్నికలలో 11 స్థానాలను కైవసం చేసుకున్నది. ఆ తరువాత అసెంబ్లీ ఎన్నికలలో గోరఖ్‌పూర్, వారణాసి లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని అత్యధిక సీట్లను ఎన్డీఏ గెలుచుకున్నది. ఘాజీపూర్, ఘోసి లోక్‌సభా నియోజకవర్గాల పరిధిలోని అత్యధిక అసెంబ్లీ సీట్లు ఇండియా కూటమికి దక్కాయి. అయితే ఇప్పుడు ఆ పరిస్థితులలో మార్పు వచ్చింది. మొత్తం మీద యూపీలో ఎన్డీఏ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులలో 45 శాతం మంది అగ్రకులాలవారు కాగా ఇండియా కూటమి అభ్యర్థులలో అగ్రవర్ణాలవారు 27.5 శాతం మంది మాత్రమే ఉన్నారు.

పంజాబ్‌లో బీజేపీకి విజయావకాశాలు జారిపోయాయని చెప్పక తప్పదు. కొత్త సాగు చట్టాలకు వ్యతిరేకంగా రైతుల ఆందోళన బీజేపీ–అకాలీదళ్‌ల మధ్య 25 ఏళ్ల స్నేహ బంధం తెగిపోయింది. దరిమిలా గ్రామీణ సిక్కు రైతుల ఆగ్రహావేశాలను బీజేపీ చవి చూస్తోంది హిందూ ఓట్లను నిలుపుకోవడంతో పాటు హిందూ, సిక్కు, దళిత ఓటర్ల మద్దతును సాధించుకోవడం ద్వారా కొద్ది సీట్లను గెలుచుకోవడానికి బీజేపీ శతథా ప్రయత్నిస్తోంది అదే సమయంలో కాంగ్రెస్, ఆప్ నుంచి చేర్చుకున్న సిక్కు నేతల సహాయంతో సిక్కు ఓటర్ల మద్దతును కూడా పొందేందుకు జాతీయ అధికార పక్షం ప్రయత్నిస్తోంది. అయితే ఈ ప్రయత్నాలతో లబ్ధి పొందడానికి బదులు ప్రస్తుతమున్న రెండు సీట్లలో ఒక దాన్నిగానీ లేదా రెండిటిని గానీ బీజేపీ కోల్పోయే అవకాశమున్నది. పంజాబ్‌లో ప్రధాన పోటీ అధికార ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్ మధ్యే ఉన్నది. ఈ రెండూ ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలు కావడం విశేషం. హిందూ, సిక్కు ఓట్లను సాధించుకోగల ఈ రెండు పార్టీల మధ్య తీవ్ర పోటీ నెలకొనడం ఆసక్తిదాయకంగా ఉన్నది. 2019లో కాంగ్రెస్ ఎనిమిది స్థానాలను గెలుచుకోగా బీజేపీ–అకాలీదళ్ కూటమి నాలుగు స్థానాలను గెలుచుకున్నది. ఆ సార్వత్రిక ఎన్నికలలో కేవలం ఒకే ఒక్క స్థానాన్ని గెలుచుకున్న ఆప్ ఆ తరువాత 2022 అసెంబ్లీ ఎన్నికలలో ఐదింట నాలుగు స్థానాలను గెలుచుకుని రాష్ట్రంలో అధికారానికి వచ్చింది. ఆ ఫలితాల ప్రాతిపదికన చూస్తే ప్రస్తుత సార్వత్రిక ఎన్నికలలో ఆప్ 11 స్థానాలను గెలుచుకోవచ్చు.




**2019 అనంతరం జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ప్రాతిపదికన చూస్తే ఇండియా కూటమి ఈ దశ పోలింగ్‌లో మరో 12 సీట్లను గెలుచుకునే అవకాశమున్నది. యూపీ, బిహార్‌లలో ఇండియా కూటమికి, బెంగాల్, ఒడిషాలలో ఎన్డీఏకు విజయావకాశాలు గతంలో కంటే అధికంగా ఉన్నాయి. నేడు పోలింగ్ జరగనున్న స్థానాలలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సొంత నియోజకవర్గం వారణాసి కూడా ఉన్నది.**

హిమాచల్‌ప్రదేశ్‌లో మొత్తం నాలుగు లోక్‌సభా నియోజకవర్గాలు ఉండగా కాంగ్రెస్ 2019లో ఒక్క స్థానాన్నీ గెలుచుకోలేకపోయింది. ఆ తరువాత జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో సాధించుకున్న ఓట్ల బలాన్ని నిలుపుకోగలిగితే ఈ సారి సిమ్లా, హమీర్‌పూర్‌లను కైవసం చేసుకోగలుగుతుంది. ఆప్ ఓట్లు కూడా కలిస్తే కాంగ్రా నియోజకవర్గం కూడా కాంగ్రెస్‌కు స్వాయత్తమవుతుంది. నాలుగో నియోజకవర్గమైన మండీలో కాంగ్రెస్ విజయానికి సానుకూల పరిస్థితులు ఉన్నాయి.

పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ ప్రాబల్యమున్న ఉత్తర బెంగాల్, జంగల్‌మహల్ ప్రాంతాలలో ఎన్నికలు ఇప్పటికే ముగిసాయి. నేడు పోలింగ్ జరగనున్న కోల్‌కతా మహానగరంలోని లోక్‌సభ నియోజకవర్గాలు 2009 నుంచి తృణమూల్ కాంగ్రెస్‌కు కంచుకోటలుగా ఉన్నాయి. ఉత్తర కోల్‌కతా లేదా దక్షిణ కోల్‌కతా నియోజకవర్గాలలో ఒకటి తమకు దక్కగలదనే ఆశాభావం బీజేపీ శ్రేణులలో ఉన్నది. కోల్‌కతాలో ప్రధాన మంత్రి ర్యాలీలకు ప్రజలు పెద్ద సంఖ్యలో రావడం బీజేపీ ఆశాభావానికి బలం చేకూర్చుతుంది. బెంగాల్ ప్రజలపై బీజేపీ తన సైద్ధాంతిక ప్రభావాన్ని ఎంతగా చూపినప్పటికీ కోల్‌కతా నగరంలో తృణమూల్ కాంగ్రెస్‌ను ఓడించగల సత్తా బీజేపీకి లేదన్నదే పలువురి అభిప్రాయంగా ఉన్నది.

జార్ఖండ్‌లో నేడు పోలింగ్ జరగనున్న మూడు నియోజకవర్గాలలో ఒకటి మాత్రమే కాంగ్రెస్ చేతిలో ఉన్నది. 2019 అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ప్రాతిపదికన చూస్తే ఆ మూడు స్థానాలూ ఎన్డీఏకే దక్కాలి. అయితే ప్రస్తుతం ఇండియా కూటమి, ఎన్డీఏ మధ్య తీవ్ర పోటీ ఉన్నది. ఈ మూడు స్థానాలను ఈ సారి తాను గెలుచుకోగలననే ఆశాభావం ఇండియా కూటమి శ్రేణుల్లో వ్యక్తమవుతోంది.

బీజేపీకి ఓట్లతో పాటు సీట్ల లబ్ధి కూడా తప్పక సమకూరే రాష్ట్రం ఏదైనా ఒకటి ఉంటే అది ఒడిషా అని చెప్పితీరాలి. ఈ రాష్ట్రంలో బీజేపీ, బిజూ జనతాదళ్ మధ్య తీవ్ర పోటీ నెలకొనివున్నది. లోక్‌సభకు, రాష్ట్ర శాసనసభకు ఏకకాలంలో ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఆఖరి దశలో ఆరు నియోజకవర్గాలకు ఎన్నికలు జరగనున్నాయి. 2019లో బిజూ జనతాదళ్ వాటిలో 4 స్థానాలను గెలుచుకున్నది. వాటి పరిధిలోని 42 అసెంబ్లీ సీట్లలో 33 ఆ పార్టీకే దక్కాయి. 2022లో జరిగిన పంచాయత్ ఎన్నికలలో బిజూ జనతాదళ్ ఆ నియోజకవర్గాలపై తన పట్టును మరింత పటిష్ఠం చేసుకున్నది. ఒడిషాలో బీజేపీ తన సీట్ల సంఖ్యను బాగా పెంచుకోవాలంటే ఈ ఆఖరి దశలో అత్యధిక సీట్లను గెలుచుకోవలసి ఉంది. అందుకు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, ఆయన వారసుడుగా భావిస్తున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి వికె పాండ్యన్‌పై తీవ్ర విమర్శలు చేస్తోంది. ఒడిషా అస్మిత (ఆత్మగౌరవం) గురించి బీజేపీ నేతలు అధికంగా మాట్లాడుతున్నారు. మొత్తం మీద ఎన్డీఏ, ఇండియా కూటమి రెండూ ఈ ఆఖరి దశలో విజయం సాధించే ప్రాంతాలూ ఉన్నాయి, నష్టపోయే ప్రాంతాలూ ఉన్నాయి.

*(వ్యాసకర్త జాతీయ కన్వీనర్, భారత్ జోడో అభియాన్)*

***(శ్రేయాస్ సర్దేశాయి, రాహుల్ శాస్త్రి సహకారంతో)***

# అరుదైన అవకాశం ఇది, రేవంత్!




**కేసీఆర్‌కు లాగానే, రేవంత్ రెడ్డికి కూడా తెలంగాణ ముఖ్యమంత్రిత్వం ఒక అరుదైన, చారిత్రక అవకాశం. ఉద్యమ ఆకాంక్షలు నెరవేర్చవలసిన కర్తవ్యంతో కేసీఆర్ అధికారంలోకి వచ్చారు. ఉద్యమ ఆకాంక్షలను పరిపూర్తి చేయడంతో పాటు, కేసీఆర్ దోషాలను సవరించవలసిన కర్తవ్యంతో రేవంత్ ముఖ్యమంత్రి అయ్యారు.**



▪ కె. శ్రీనివాస్

ప్రత్యేక సందర్భం

పది సంవత్సరాల కిందట ఇదే జూన్ ఒకటోతేదీ అర్ధరాత్రి. అసెంబ్లీ ఎదురుగా గన్‌పార్క్ అమర వీరుల స్థూపం పరిసరాలన్నీ, విజయంతో ఉప్పొంగిన హృదయాల అలయ్ బలయ్‌లతో, ప్రాణత్యాగాల స్మరణల తడి కళ్ల తళుకులతో కిక్కిరిసిపోయాయి. తెలంగాణలోని అన్ని పట్టణాల కూడళ్లలోనూ ఆ రాత్రి అంతే ఉద్వతితో ఆనందాతిరేకంలో, అమరసాధకుల స్మరణలో పరవళ్లు తొక్కింది. చరిత్రను శాసించి తమ దారికి తెచ్చుకున్న స్వప్నసాధకుల సంబరం అది!

వైఫల్యం అనాథ అట, విజయానికి వేయిమంది తండ్రులట! ప్రాణాలిచ్చినవారిని, అష్టకష్టాలు పడినవారిని విస్మరించి, తెలంగాణ సాధన కేవలం తమ ఘనకార్యమేనని ఎవరు చెప్పుకున్నా అది అన్యాయమే. దశాబ్దాల కాలం నుంచి నిప్పును నిలుపుకుంటూ వచ్చిన ఆచార్య జయశంకర్, ప్రజాకవి కాళోజీ, విశ్వవిద్యాలయ విద్యార్థులు, ప్రొఫెసర్లు, జనసభలు మహాసభలు నిర్వహించి డిక్లరేషన్లు ప్రకటించిన ప్రజాసంఘాలు, కవులు, కళాకారులు, రచయితలు.. వీరు సారవంతం చేసిన నేల మీద కదా మలిదశ ఉద్యమం మొలకెత్తింది! చివరి అయిదు సంవత్సరాల కాలంలో, కేసీఆర్ దీక్ష, తెలంగాణ తొలిప్రకటన తరువాత పరిణామాలలో తెలంగాణ సమాజంలోని అసంఖ్యాక శ్రేణులు ఉద్యమంలో పాలుపంచుకున్నాయి. రాజకీయ జేఏసీ సారథ్యంలో ప్రజలనుంచి ఏకగ్రీవ, ఏకోన్ముఖ రాజకీయ వ్యక్తీకరణ జరిగింది. 2001లో పార్టీ స్థాపించిన దగ్గర నుంచి, కల్వకుంట్ల చంద్రశేఖరరావు, తెలంగాణ రాష్ట్ర సమితి అందించిన స్థిర నాయకత్వానికి, తెలంగాణ వాదన అభివ్యక్తిలో చేసిన దోహదానికి ప్రథమ ప్రశంస అందించవలసిందే. రాష్ట్రసాధనే లక్ష్యంగా చెప్పుకునే ఒక పార్టీ రంగంలో లేనిపక్షంలో, ఉద్యమానికి ఒక ఇరుసు లేకుండా పోయేది. బహుముఖాలుగా, స్వచ్ఛందంగా విస్తరించిన ఉద్యమానికి కేసీఆర్, టీఆర్ఎస్ ఆధారబిందువులుగా ఉన్నారు. అదే సమయంలో, ఉద్యమానికి వేగాన్ని, తీవ్రతను జోడించడానికి ప్రయత్నించకుండా, రాజకీయ లాబీయింగ్ పేరుతో తాత్సారం చేయడం, ఉద్యమ సమాజం నుంచి ఉత్సాహం, చొరవ వ్యక్తమైన సందర్భాలలో వెనుకకు లాగడం చరిత్రలో నమోదైన విషయాలే. సంస్థాగత నిర్మాణం చేయకపోవడం, సైద్ధాంతిక నిబద్ధతకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం వల్ల పార్టీ క్షేత్రస్థాయిదాకా పెరగలేదు. ఎన్నికల విజయాలూ నిలబడలేదు. రాష్ట్ర విభజన తీర్మానం పార్లమెంటులో ఆమోదం పొందే నాటికి టీఆర్ఎస్ నుంచి ఇద్దరు మాత్రమే లోక్‌సభ సభ్యులు ఉన్నారు.

తెలంగాణ వచ్చింది. ప్రజలు టీఆర్ఎస్‌నే ఎంచుకున్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణలో చొరవ చూపినందుకు కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్‌లోనూ నష్టపోయింది. తెలంగాణలోనూ లాభపడలేదు. కాంగ్రెస్ అధిష్ఠానం వైఖరి ఎట్లా ఉన్నా, ఉద్యమంలో తెలంగాణ కాంగ్రెస్ మమేకం కాలేదనే చెప్పాలి. ఎంపీలు మాత్రం తమ గొంతును బలంగా వినిపించారు. ఒకరిద్దరు తప్ప, రాష్ట్ర మంత్రులు చివరిదాకా పదవుల్లో ఏదో సాకుతో కొనసాగుతూ వచ్చారు. ఉద్యమంతో తెలంగాణ కాంగ్రెస్‌కు బలమైన సంబంధం లేకపోవడం ఇప్పటికీ ఆ పార్టీ ధోరణుల్లో ప్రతిఫలిస్తూ ఉంటుంది.

పదేళ్ల టీఆర్ఎస్ పాలన ప్రజలకు నిరాశనే మిగిల్చింది. కూటమి ఏర్పాటులో కాంగ్రెస్ తప్పిదం చేయకపోతే, 2018లో కూడా టీఆర్ఎస్‌కు అంతటి ఘనవిజయం దక్కక పోయేది. ఓటర్లు మరో దఫా అవకాశమిచ్చారు. కానీ, అందుకు పశ్చాత్తాపపడే పరిస్థితులు ఏర్పడి, 2023లో బీఆర్ఎస్‌ను ప్రతిపక్షానికి పంపారు. ఈ నిర్ణయం తీసుకోవడం తెలంగాణ ప్రజలకు బాధాకరమైనదే. ఉద్యమంతో పాటు నడచిన పార్టీని, నాయకుడిని నిరాకరించడమంటే అది పెద్ద నిర్ణయం. కానీ, ఉద్యమ ఆకాంక్షలకు పరిపాలనకూ పొంతన లేకపోవడం, జన నాయకుడిగా ఉండవలసిన నేత, అందని అందలం మీద కూర్చోవడం ప్రజలను బాధించింది. సమాజంలోనేకాదు, పార్టీలోకూడా ప్రజాస్వామ్యం లేకపోవడం ప్రస్ఫుటంగా కనిపించింది. తెల్లారుతుందనుకున్న తెలంగాణ బతుకు నడిరాతిరిలోనే నిలిచిపోయింది. అసంతృప్తి, అసమ్మతి వ్యతిరేకతగా పరిణమించాయి. తరువాతి కథ తెలిసిందే.

కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన కొత్తలో కలిసినప్పుడు ప్రొఫెసర్ హరగోపాల్ ఆయనకు ఒక మాట చెప్పారట. "కేసీఆర్ గారూ, మీకు చరిత్ర గొప్ప అవకాశం ఇచ్చింది. చాలా అపురూపమైన అవకాశం. సత్పరిపాలన అందించి, ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి" అని. కేసీఆర్ ఆ సలహాకు తగ్గట్టు నిలబడలేకపోయారని హరగోపాల్ బాధపడుతూ ఉంటారు. కేసీఆర్ వైఫల్యం ఎనుముల రేవంత్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రి కాగలగడానికి ఒక ముఖ్యమైన కారణం. కానీ, అదే ఏకైక కారణం కాదు. తెలంగాణ సమాజంలో బీఆర్ఎస్‌పై పెరుగుతున్న విముఖతను, ప్రత్యామ్నాయానికి ఉన్న అవకాశాన్ని గుర్తించి, అందుకు అనుగుణంగా రేవంత్ రెడ్డి తనను తాను సన్నద్ధం చేసుకోగలిగారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న ఇతర నేతలు కానీ, భారతీయ జనతాపార్టీ కానీ ప్రతిపక్షపాత్రను సమర్థంగా నిర్వహించలేదని కాదు. తనకు ఎదురెవ్వరూ లేని వాతావరణాన్ని కేసీఆర్ సృష్టించుకుని, అదే తనకు భద్రత అనుకున్నారు. కానీ, అదే ఒక భర్తీ చేయవలసిన శూన్యాన్ని కూడా సృష్టించింది. కేసీఆర్ పాలనమీద ఆయనకు దీటైన రీతిలో దూకుడుగా, ఒక్కొక్కసారి మొరటుగా కూడా మాట్లాడడమే ఫలితం ఇస్తుందని భావించి రేవంత్ అందుకు తగ్గట్టు తన ప్రయాణం సాగించారు. టీడీపీని వీడి, కాంగ్రెస్‌లోకి వచ్చిన కొంతకాలానికే పీసీసీ అధ్యక్ష స్థానం లభించిందంటే అందుకు అధిష్ఠానం ఆశీస్సులు కారణం. తెలంగాణలో బలమైన సామాజిక వర్గానికి చెందడం, వయోధికుడు కాకపోవడం ఆయనకు అదనపు యోగ్యతలయ్యాయి. బీఆర్ఎస్ విమర్శిస్తున్నట్టు, తెలంగాణ ఉద్యమంతో పరిమితమైన అనుబంధమే ఉన్నప్పటికీ, దాన్ని ఎట్లా అధిగమించాలో ఆయనకు కొన్ని సొంత ఆలోచనలు ఉన్నాయి. గద్దర్‌తో నాడు మెలగిన, కోదండరామ్‌తో నేడు మెలగుతున్న తీరు తన నాయకత్వంలోని పాలనకు ఉద్యమస్ఫూర్తి జోడించగలవని రేవంత్ నమ్ముతున్నారు. కేసీఆర్ పాలనలో లోపించిన ముఖ్యమైన దినుసు ఏదో గ్రహించబట్టే, ఆయన పార్టీ ఇచ్చిన ఆరుగ్యారంటీలకు తోడు ఏడోదిగా ప్రజాస్వామ్యాన్ని హామీ ఇచ్చారు. అది ఎంతవరకు నెరవేరుతుందన్నది తెలంగాణ పౌరసమాజం గమనిస్తూ ఉన్నది. అలాగే, తాజాగా, రాష్ట్రగీతం, రాష్ట్ర చిహ్నాల విషయంలో ఏర్పడిన వివాదం ఉద్యమ విలువలకు సంబంధించిన చర్చను రేవంత్ పాలనలో మొదటిసారిగా ముందుకు తెచ్చింది.

కేసీఆర్‌కు లాగానే, రేవంత్ రెడ్డికి కూడా తెలంగాణ ముఖ్యమంత్రిత్వం ఒక అరుదైన, చారిత్రక అవకాశం. ఉద్యమ ఆకాంక్షలు నెరవేర్చవలసిన కర్తవ్యంతో కేసీఆర్ అధికారంలోకి వచ్చారు. ఉద్యమ ఆకాంక్షలను పరిపూర్తి చేయడంతో పాటు, కేసీఆర్ దోషాలను సవరించవలసిన కర్తవ్యంతో రేవంత్ ముఖ్యమంత్రి అయ్యారు. కేసీఆర్‌కు లేని అదనపు భారాలు రేవంత్ రెడ్డికి ఉన్నాయి. ఎన్నికల హామీలను పూర్తి చేయడంలో ఉండే ఆర్థిక బాధలు సరే.. లోక్‌సభ ఎన్నికల ఫలితాల అనంతరం పరిస్థితి రాష్ట్ర ప్రభుత్వ రాజకీయ స్థిరత మీద ప్రభావం చూపే అవకాశం ఉంది. కేంద్రంలో మోదీ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తే, రేవంత్ మీద కేంద్రం నుంచి, కేంద్ర ఏజెన్సీల నుంచి రకరకాల ఒత్తిళ్లు మొదలవుతాయి. గోడదాటుకు సిద్ధంగా ఉన్న బీఆర్ఎస్ శాసనసభ్యులు, తమ గమ్యాన్ని కాంగ్రెస్ వైపు కాక, బీజేపీ వైపు మార్చుకుంటారు. ఒకవేళ మోదీయేతర ప్రభుత్వం వస్తే కొంత ఊరట ఉంటుంది. ఇవన్నీ కాక, కాంగ్రెస్‌లో సహజమైన ఇంటిపోరు ఉండనే ఉంటుంది. ఇవన్నీ ఉన్నప్పటికీ, తెలంగాణ సమాజానికి నెరవేర్చవలసిన బాధ్యతల విషయంలో ఏ మాత్రం అలసత్వం సాధ్యపడదు.

విజయం మీద కాంక్ష, అపజయం అంటే భయం, ఈ రెండూ నాయకుడికి అవసరమైన లక్షణాలు. ఎంతో కొంత కీర్తి లాలస ఉండాలి, అదే సమయంలో అపకీర్తికాంక్ష ఉండకూడదు. సాధారణ రాజకీయ నాయకుడినైనా ఉత్తమ శ్రేణికి తీసుకువెళ్లగలిగే గుణాలు అవి. ప్రాంతీయ వనరుల ఆధారంగా అభివృద్ధి, ప్రాంతీయ మానవవనరులకు ఆలంబన, ఈ రెండూ టీఆర్ఎస్ ప్రభుత్వం అలక్ష్యం చేసిన లక్ష్యాలు. ప్రభుత్వాలు ఇవ్వగలిగిన ఉద్యోగాలకు మించినది తెలంగాణ ఉపాధిసమస్య. కార్పొరేట్ కంపెనీలకు భూములు లైసెన్సులు ఇవ్వడానికి మించినది తెలంగాణ అభివృద్ధి అంశం. సకలరంగాలలో తెలంగాణ అభివృద్ధిని స్వప్నించి, మార్గాలు అన్వేషించి, ప్రతిపాదనలు సిద్ధంచేసిన శాస్త్రవేత్తలు, నిపుణులు ఎందరో ఉద్యమంలో పాల్గొన్నారు. వారికి విధానరచనలో భాగస్వామ్యం ఇవ్వాలి. వ్యవసాయాది రంగాల సంక్షోభ పరిస్థితులను అధ్యయనం చేసి పరిష్కారాలు వెదకాలి. సాంస్కృతికరంగంలో తెలంగాణ తనానికి పెద్దపీట వేయాలి. గత ప్రభుత్వంలో జరిగిన మంచిపనులన్నిటినీ కొనసాగించాలి. కొత్తగా మంచిపేరు తేగలిగిన అనేక పనులను ప్రారంభించాలి. ఓట్ల ఆధారిత పథకాలు కాక, నిలకడైన అభివృద్ధికి సానుకూలతలు కల్పించాలి. చేయాలనుకోవాలే కానీ, మరో ఉద్యమమే చేయవచ్చు! ప్రజానుకూల పునర్నిర్మాణోద్యమం!!

> **రేవంత్ రెడ్డి లక్ష్య సాధకుడు. లేకపోతే, ఇంత స్వల్పకాలంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కాలేరు. ఆ లక్ష్యాలు వ్యక్తిగతం మాత్రమే కాకుండా, సామాజికం కూడా అయి ఉంటే, ఆయననుంచి మంచి ఫలితాలు ఆశించవచ్చు.**

రేవంత్ పాలన మొదలయి ఎంతో కాలం కాలేదు. వ్యక్తిత్వ విశేషాలు, ప్రాధాన్యాలు ఏమిటో పూర్తిగా తెలియవు. ఎన్నికల పర్వం ముగిసిన తరువాత, రాజకీయ సంవాదాలు సద్దుమణిగిన తరువాత ఆయన మరింత పరిణతితో, గాంభీర్యంతో కనిపించవచ్చు. ఒకటి మాత్రం స్పష్టం. రేవంత్ రెడ్డి లక్ష్య సాధకుడు. లేకపోతే, ఇంత స్వల్ప కాలంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కాలేరు. ఆ లక్ష్యాలు వ్యక్తిగతం మాత్రమే కాకుండా, సామాజికం కూడా అయి ఉంటే, ఆయననుంచి మంచి ఫలితాలు ఆశించవచ్చు.

ప్రభుత్వాచరణను స్వతంత్ర మేధావులు సమీక్షించి, సూచనలు ఇచ్చే వ్యవస్థను ఏర్పాటు చేస్తానని చెప్పిన కేసీఆర్, నోరువిప్పడానికే ఆస్కారం లేకుండా చేశారు. దానితో, నిర్బంధంలోనో, స్వచ్ఛంద మౌనంలోనో తెలంగాణ పౌరసమాజం అణగారిపోయింది. ఇప్పుడు, పది సంవత్సరాల తరువాత కూడా ఇంకా ఫలితాలను 'ఇచ్చే' పాలకుల కోసం నిరీక్షించే స్థితిలో ఉంది. ఇచ్చే, తీసుకునే సంబంధం నుంచి విముక్తమై, తాను సొంతంగా ప్రజాస్వామ్యాన్ని క్రియాశీలంగా ఆచరించాలి. ప్రభుత్వాలకు మంచిచెడ్డల కొలమానాలను అందించాలి. ప్రజాభిప్రాయ నిర్మాత కావాలి!

## అజరామరమైన సృజనాసక్తి...!

ఆయనో బహుముఖ ప్రజ్ఞాశాలి. కవి, నవలాకారుడు చిత్రకారుడు– అన్నింటికీ మించి గొప్ప మానవతావాది. సౌమ్యుడు. సహనశీలి, నిబద్ధత, క్రమశిక్షణ కలవారు. గంభీరంగా కనిపించే అతి సున్నిత మనస్కుడు. కుందుర్తిగారింట పుట్టడం వలన శీలా వీర్రాజు గారితో నాకు ఊహ తెలియని రోజుల నుంచీ పరిచయం ఏర్పడింది. తాతగారి ప్రస్తావన ఏది చేయవలసి వచ్చినా శీలావి పేరెత్తకుండా ఉండటం చాలా కష్టం. ఆయన పరిచయమే గర్వకారణమైతే ఇక జీవితాంతం ఆ మనిషి సాన్నిహిత్యం, మమకారం పొందడం ఇంకెంత ఉప్పొంగిపోయే విషయమో కదా.



**కళను అమ్ముకోవడం ఇష్టం లేక, డబ్బూ పేర్ల కోసం వ్యామోహం లేక, జీవితం ఎన్ని సవాళ్ళు విసిరినా, ఎన్ని సమస్యలని తెచ్చిపెట్టినా, అన్నిటినీ ధైర్యంగా ఎదుర్కొని నిలబడిన మనిషి నాకు తెలిసిన శీలా వీర్రాజు గారు. ఆయన సృజనాత్మకత, స్ఫూర్తి, ఉత్తేజం, నిలువెత్తు భావుకత ఈ తరానికీ రానున్న కాలాలకీ ఆదర్శవంతం కావాలి. అందుకే ఆయనకి అడుగడుగునా తోడు నిలిచిన సుభద్రాదేవి 'శీలావీ సాహిత్య చిత్రకళా వేదిక' ఏర్పాటును ప్రకటించారు.**

నాన్న చేయి పట్టుకుని నడుచుకుంటూ వాళ్ళింటికి వెళ్ళిన దారిలో మొక్కలకి మొలిచే చిన్ని కాయలను కోసుకెళితే, వాటిలో అందమైన బొమ్మలను చూపిన మాంత్రికుడు వీర్రాజు. నాకు బాగా గుర్తు– మా నాన్నని ఎవరికైనా భయపడడం నేను చూసానంటే, అది వీర్రాజు గారికే. నాన్న ఉద్యోగంలో పడో, పిల్లలూ సంసారం వలనో ఫ్రీవర్స్ ఫ్రంట్ అవార్డుల పనులు మర్చిపోతూ ఉండేవారు. కానీ వచ్చి మాట్లాడేంత దూరంలోనే ఇల్లున్నా కూడా వీర్రాజు గారు ఆ బాధ్యతను గుర్తుచేస్తూ ఒక ఉత్తరం రాసేవారు. ఫోన్లు లేని రోజుల్లో సరే కానీ, ఫోన్లున్న రోజుల్లో కూడా అంతే. ఆ పోస్టుకార్డు వచ్చిందంటే వీర్రాజు గారికి కోపమొచ్చిందని అర్థం. ఇక ఆపై ఆదివారం నాన్న, వెనుక నేనూ పొద్దున్నే టిఫిన్లు కూడా చేయకుండా వెళ్ళి వారింట్లో వాలిపోయేవారం, సుభద్రాదేవి గారు ఏదోటి పెడతారనే నమ్మకంతో. మా వరకూ ఆయన ఉత్తరం ఓ అల్టిమేటం. బహుశా మా నాన్నకి నాన్న లేని లోటూ, ఒక బాధ్యతాయుతమైన అన్న లేని లోటూ ఆయనే తీర్చారేమో. ఫ్రీవర్స్ ఫ్రంట్ నడపడంలో శీలావీగారి నిబద్ధతా, నిర్వహణ సామర్థ్యం చాలా అసమానమైనవి.

వీర్రాజు గారు అనేక రచనా ప్రక్రియల్లో నిష్ణాతులు. అందంగా బొమ్మలేసేవారు. కవర్ పేజీలు తయారు చేసేవారు. జ్ఞాపికలు కూడా ఆయన సృజనాత్మకతే. బాపూ ఫాంట్‌లాగా శీలావీ ఫాంట్ కూడా ప్రత్యేకమైనది. ఆయన రంగుల మేళవింపు చాలా బాగుంటుంది. 1939 రాజమండ్రిలో పుట్టిన శీలా వీర్రాజు, 1956లో 'వెలుగు నీడలు' నవల రాసారు. దానినే 2006లో యాభై ఏళ్ళ తర్వాత 'బతుకు బాట' పేరుతో వచన కవిత్వ నవలగా రాసారు. 1957లోనే 'అస్థిపంజరం' కథ రాశారు. అంటే పద్దెనిమిదేళ్ళ వయస్సుమాట. ఆయన కవిత్వం కూడా ఎంతో ప్రయోగాత్మకంగా సాగింది. 'పడుగు పేకల మధ్య జీవితం' (ఆత్మకథ) కూడా రాశారు. 'సమాధి', 'బండి చక్రం', 'హ్లాదిని', 'రంగుటద్దాలు' మొదలైన ఎనిమిది కథా సంపుటాలతో బాటు; 'కొడిగట్టిన సూర్యుడు', 'కిటికీ కన్ను', 'ఎర్రడబ్బా రైలు', 'మళ్ళీ వెలుగు', 'హృదయం దొరికింది' వంటి ఎనిమిది కవిత్వ పుస్తకాలు; 'కాంతి పూలు', 'వెలుగు నీడలు', 'మైనా', 'కరుణించని దేవత' అనే నాలుగు నవలలు రచించారు. ఆయన స్కెచ్ పుస్తకాలను చూడ్డానికి మన రెండు కళ్ళూ చాలవు.

కళను అమ్ముకోవడం ఇష్టం లేక, డబ్బూ పేర్ల కోసం వ్యామోహం లేక, జీవితం ఎన్ని సవాళ్ళు విసిరినా, ఎన్ని సమస్యలని తెచ్చిపెట్టినా, అన్నిటినీ ధైర్యంగా ఎదుర్కొని నిలబడిన మనిషి నాకు తెలిసిన వీర్రాజు గారు. నిరాడంబరతలోనే అసలైన సంతోషం ఉంటుందని నిరూపించిన నిజాయితీపరుడు. అన్నిటికీ మించి తమకున్న అతి కాస్త ప్రతిభకే తెగ విర్రవీగే మనుషులున్న ఈ కాలంలో ఒదిగి ఉండటం వీర్రాజు గార్ని చూసి నేను నేర్చుకున్నాను. ఏదో బతికేయడం కాదు, జీవించడం నేర్చుకున్నాను. ఆయన పోయి అప్పుడే రెండేళ్ళైపోయింది. కానీ ఆయన సృజనాత్మకత, స్ఫూర్తి, ఉత్తేజం, నిలువెత్తు భావుకత ఈ తరానికీ రానున్న కాలాలకీ ఆదర్శవంతం కావాలి. అందుకే ఆయనకి అడుగడుగునా తోడు నిలిచిన శీలావీ సహచరి సుభద్రాదేవి గారు 'శీలావీ సాహిత్య చిత్రకళా వేదిక'ని ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. ఆయన ఎంతో ఇష్టపడే దీర్ఘ కవితా ప్రక్రియకు, చిత్రకళకూ చెరో పదిహేనువేల నగదు పురస్కారం ఇస్తున్నారు. శీలావీని చిరంజీవిగా నిలబెట్టే విధంగా ఆయన ఆశయాలకు ఆమె రూపం ఇస్తున్నారు. పుప్పాల శ్రీరాం రాసిన 'పద్దెనిమిదొందల పద్దెనిమిది' (1818) ఈ మధ్య కాలంలో వచ్చిన మంచి దీర్ఘ కవిత. అన్వర్ చాలాప్రతిభ ఉన్న చిత్రకారులు. శీలావీ గారు మెచ్చిన గీత ఆయనది. అతని రాత కూడా అద్భుతమైనది. ఈ పురస్కారాలు లబ్ధప్రతిష్ఠులకే కాక, కొత్తతరానికి కూడా ఎంతో ప్రేరణ.

శీలావీ జీవితాంతం సాహిత్య, చిత్రకళా రంగాల్లో సమానంగా కృషి చేసారు. అందులో కృషి చేస్తున్న వారిని గుర్తించాలని ఆయన కుటుంబం సంకల్పించింది. యువతరానికి ఇదొక సరికొత్త ప్రోద్బలాన్నీ, ఉత్సాహాన్నీ, ఆశనీ తప్పక ఇస్తుంది. సుభద్రాదేవి, వారి కూతురు పల్లవి, మనవరాలు ప్రశంసనీయులు. 'శీలావీ శిల్పరేఖలు' పుస్తకావిష్కరణతో బాటు సభ కూడా జయప్రదం కావాలని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నాను.

• **కవిత కుందుర్తి**

*(నేడు శీలావీ వర్ధంతి – రవీంద్రభారతి కాన్ఫరెన్సు హాల్లో శీలావీ సాహిత్య చిత్రకళా వేదిక ఆవిర్భావ కార్యక్రమం)*

## పదేళ్లయినా అమలు కాని హామీలు!

రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం–1956 ప్రకారం ఏర్పాటు చేసిన రాష్ట్రాలు రాజధానులను నిర్మించుకొని ప్రగతిపథాన పయనిస్తుండగా, 1953లో ఆవిర్భవించిన ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఏడు దశాబ్దాల అనంతరం రాజధాని సైతం లేని రాష్ట్రంలో మిగిలిపోయారు. ఏకపక్షంగా జరిగిన రాష్ట్ర విభజనలో 57.3 శాతం జనాభా ఉన్న ఆంధ్రప్రదేశ్ 46 శాతం రెవెన్యూతో లోటు బడ్జెట్ రాష్ట్రంగాను, 41.7 శాతం జనాభా ఉన్న తెలంగాణ 54 శాతం రెవిన్యూతో మిగులు బడ్జెట్ రాష్ట్రంగాను ఏర్పడ్డాయి.

రాజధాని నగరం హైదరాబాద్‌ను కోల్పోతున్నందుకు పరిహారంగా నాటి ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టేందుకు ఐదు సంవత్సరాలు అన్ని పారిశ్రామిక రాయితీలతో కూడిన ప్రత్యేక హోదాను పార్లమెంటులో ప్రకటించి కేబినేట్ ఆమోదం పొంది, అప్పటి ప్లానింగ్ కమిషన్‌కు పంపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో భాగంగా పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన ప్రత్యేక హోదా సహా విభజన చట్టంలోని ప్రధాన హామీలేవీ నేటికీ అమలు కాలేదు.

ఉమ్మడి రాజధానిలో 1.42 లక్షల కోట్ల రూపాయల విలువ కలిగిన 242 సంస్థల ఆస్తుల పంపకం పెండింగ్‌లో ఉండగా, ఉమ్మడి రాజధాని గడువు ముగియడం అంటే ఉమ్మడి రాజధాని లక్ష్యం, విభజన చట్టం స్ఫూర్తికీ విరుద్ధం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం–2014 షెడ్యూల్–9లోని 89, షెడ్యూల్–10లో 142 ప్రభుత్వరంగ సంస్థల ఆస్తులు సుప్రీంకోర్టు నిర్దేశించిన జనాభా ప్రాతిపదికన (58:42 శాతం) విభజన జరగవలసి ఉండగా, పదేళ్ళ కాలంలో పూర్తి చేయనేలేదు. సుప్రీంకోర్టు తీర్పు అనంతరం కూడా ఏపీ స్టేట్ కౌన్సిల్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆస్తుల విభజన జరగనే లేదు. రాష్ట్ర ప్రజలు అప్రమత్తంగా లేకుంటే ఇవన్నీ ముగిసిపోయిన అధ్యాయాల జాబితా అయిపోవచ్చు. సిబ్బంది విభజనపై షీలా భిడే కమిటీ సిఫార్సులు కూడా పూర్తిగా అమలు చేయలేదు.

విభజన చట్టం ప్రకారం గత పది ఏళ్లుగా అన్ని విద్యాసంస్థల్లోనూ 15శాతం కన్వీనర్ కోటా కింద ఇరు రాష్ట్రాల విద్యార్థులకు మెరిట్ ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తున్నారు. జూన్ 2తో ఉమ్మడి రాజధాని పదేళ్ళ కాలం ముగిస్తే ఏపీ విద్యార్థులకు కేటాయించిన సీట్లు కూడా మొత్తం తెలంగాణకే కేటాయించే విధంగా తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నించవచ్చు. కాబట్టి దానిని తక్షణం ఆపే విధంగా కేంద్రం జోక్యం చేసుకోవాలి. ఉమ్మడి కోటా రద్దైతే 200 ఎంబీబీఎస్ సీట్లు, అదే విధంగా పీజీ మెడికల్ సీట్లు ఏపీ విద్యార్థులు కోల్పోతారు. కాబట్టి ఉమ్మడి రాజధాని కొనసాగింపు తప్పనిసరి.

విభజన చట్టం, పార్లమెంటు హామీలు పూర్తిగా అమలయ్యే వరకూ హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా కొనసాగించాలి. ఇందుకు కొత్తగా ఏర్పడే అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపాలి. కొత్త పార్లమెంటు ఈ అంశంపై సమగ్ర చర్చ జరిపి, ఉమ్మడి రాజధాని కొనసాగింపునకు విభజన చట్టానికి సవరణ చేయాలి. తెలంగాణ సోదరులు సైతం తమ సోదర రాష్ట్రానికి సంఘీభావం తెలిపి కేంద్రం నిర్లక్ష్య వైఖరిపై ఆంధ్రప్రదేశ్ కోలుకుని నిలబడే విధంగా రాజకీయాలకతీతంగా కేంద్రంపై వత్తిడి తేవడానికి సహకరిస్తే ఆ చర్య తెలంగాణ ప్రతిష్ఠను ఇనుమడింపజేస్తుంది.

**– అవధానుల హరి**

# డయేరియా భయం



డయేరియా లక్షణాలతో ప్రజాశక్తినగర్‌లో మంచం పట్టిన మహిళ

*నగరాన్ని డయేరియా వణికిస్తోంది. ఈ వ్యాధి లక్షణాలతో పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. చాలామంది వాంతులు, విరేచనాలతో ఆసుపత్రుల్లో చేరుతున్నారు. తాజాగా పాయకాపురంలోని ప్రజాశక్తినగర్‌లో వరుస కేసులు, మరణాలు సంభవిస్తున్నాయి. డయేరియా లక్షణాలతో 15 రోజుల వ్యవధిలో ముగ్గురు మృతిచెందగా, అనేకమంది మంచాన పడ్డారు. ఇక మొగల్రాజపురంలో శుక్రవారం మరొకరు చనిపోగా, మృతుల సంఖ్య ఏడుకు చేరింది.*

## నగరాన్ని వణికిస్తున్న డయేరియా లక్షణాలు

- వాంతులు, విరేచనాలతో ఒకేరోజు ఇద్దరి మృతి
- ప్రజాశక్తినగర్‌లో బయటపడుతున్న కేసులు
- 15 రోజుల్లో ఏడు నెలల బాబు సహా ముగ్గురి మృతి
- మురికినీరు సరఫరా వల్లేనని స్థానికుల ఆరోపణ
- మొగల్రాజపురంలోనూ అదుపులోకి రాని పరిస్థితి

పాయకాపురం/గుణదల, మే 31 : పాయకాపురంలోని ప్రజాశక్తినగర్‌లో డయేరియా లక్షణాలతో బాధపడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. 15 రోజుల వ్యవధిలో వాంతులు, విరేచనాలతో ముగ్గురు మృతిచెందారు. తామవరపు సన్యాసమ్మ అనే వృద్ధురాలు వాంతులు, విరేచనాలతో పది రోజుల కిందట ప్రభుత్వాసుపత్రిలో చేరింది. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ చనిపోయింది. పక్కనే ఉన్న రాధానగర్ ప్రాంతానికి చెందిన యడ్లపల్లి వినయ్ సిద్ధార్థ అనే ఏడు నెలల బాలుడు 15 రోజుల కిందట డయేరియా లక్షణాలతో మృత్యువాత పడ్డాడు. ప్రజాశక్తినగర్‌కు చెందిన చౌదరి కనకమ్మ వారం రోజులుగా వాంతులు, విరేచనాలతో ప్రభుత్వాసుపత్రిలో చేరింది. అప్పటి నుంచి చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది.



బాధితురాలిని పరామర్శిస్తున్న సీపీఎం నేత బాబూరావు

### మరికొందరిలో లక్షణాలు.. అధికారుల గోప్యత

ప్రజాశక్తినగర్, రాధానగర్ ప్రాంతాల్లో మరికొందరికి డయేరియా లక్షణాలు కనిపిస్తున్నాయి. సుమారు 15 మంది నగరంలోని వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. కాగా, బాధితులను సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు శుక్రవారం పరామర్శించారు. స్థానికంగా పదుల సంఖ్యలో ప్రజలు ఆసుపత్రులపాలైనప్పటికీ అధికారులు కేసుల్లో గోప్యత పాటిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారం రోజులుగా చికిత్స పొందుతూ ప్రభుత్వాసుపత్రిలో శుక్రవారం మృతిచెందిన కనకమ్మ వివరాలను కూడా అధికారులు బయటకు చెప్పట్లేదు.

### మురుగునీటి సరఫరా వల్లే..

15 రోజులుగా కుళాయిల్లో మురుగు నీరు సరఫరా అవుతోందని ప్రజాశక్తినగర్ వాసులు చెబుతున్నారు. దీనివల్ల అనారోగ్యం పాలై డయేరియా లక్షణాలు కనిపిస్తున్నాయంటున్నారు. మంచినీటి సరఫరాపై ఎన్నిమార్లు ఫిర్యాదులు చేసినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### మొగల్రాజపురంలో మరొకరు మృతి

మొగల్రాజపురంలో డయేరియా లక్షణాలు ఇంకా కనిపిస్తూనే ఉన్నాయి. రోజురోజుకూ బాధితుల సంఖ్య పెరుగుతూనే ఉంది. కాగా, డయేరియా లక్షణాలతో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మెట్లు అంజమ్మ శుక్రవారం ఉదయం మరణించింది. దీంతో మొగల్రాజపురంలో మృతుల సంఖ్య 7కు చేరింది. ప్రభుత్వం తక్షణమే నిపుణుల కమిటీ ఏర్పాటు చేసి సమస్యకు కారణాలను వెలికి తీయాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంజమ్మ మృతదేహానికి శుక్రవారం ఆయన నివాళులర్పించారు. డయేరియా లేకపోతే నాలుగు రోజులుగా ఆ ప్రాంతంలో మెడికల్ క్యాంపు ఎందుకు నిర్వహిస్తున్నారని, ఈ క్యాంపులో 50మందికి పైగా డయేరియా లక్షణాలతో వైద్యం చేయించుకున్నారన్నారు.

**రంగుమారిన నీటికి యాక్టివేటెడ్ చార్‌కోల్ ట్రీట్మెంట్**

» మునిసిపల్ కమిషనర్ 6లో..

## ఫైటర్





కోర్టు ఉత్తర్వుల అనంతరం రాష్ట్ర ప్రింటింగ్ అండ్ స్టేషనరీ కమిషనర్‌గా శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన సీనియర్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావుకు ఘన స్వాగతం లభించింది. పలువురు ఆయనకు అభినందనలు తెలిపి పుష్పాభిషేకం చేశారు. ప్రభుత్వంపై పోరాడి గెలిచిన వెంకటేశ్వరరావును 'ఫైటర్' అనే ప్లకార్డులతో ఘనంగా ఆహ్వానించారు.

### కారుచౌకగా కొట్టేశారు!

» రూ.2 కోట్ల ఆస్తి కేవలం రూ.88 లక్షలకే

» గాంధీ బ్యాంకు డైరెక్టర్ల నిర్వాకం

6లో..

### 2నే పోస్టల్ బ్యాలెట్ల ఓపెన్

» యాభై పోస్టల్ బ్యాలెట్లు ఒక కట్టగా

## వారధిపై ట్రాఫిక్ జామ్

- ఉదయం విజయవాడ-గుంటూరు మార్గంలో..
- సాయంత్రం గుంటూరు-విజయవాడ రూట్‌లో..

విజయవాడ, మే 31 (ఆంధ్రజ్యోతి) : కనకదుర్గమ్మ వారధిపై విజయవాడ నుంచి గుంటూరు వైపు వెళ్లే మార్గంలో శుక్రవారం ఉదయం ఒక లారీ, గుంటూరు నుంచి విజయవాడ వచ్చే మార్గంలో సాయంత్రం ఒక లారీ సాంకేతిక కారణాలతో ఆగిపోయాయి. దీంతో రెండు వైపులా ట్రాఫిక్ భారీగా ఆగిపోయింది. గుంటూరు-విజయవాడ మార్గంలో శుక్రవారం ఉదయం తాడేపల్లి వరకు ట్రాఫిక్ ఆగిపోయింది. గంటకు పైగా ఇదే పరిస్థితి ఏర్పడటంతో వాహన దారులు అనేక ఇబ్బందులు పడ్డారు. ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండటంతో ద్విచక్రవాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సరిగ్గా సాయంత్రం 5 గంటల తర్వాత విజయవాడ-గుంటూరు మార్గంలో మరో లారీ వారధిపై ఆగిపోయింది. దీంతో కృష్ణలంక, స్క్యూ బ్రిడ్జి వరకు ట్రాఫిక్ ఆగిపోయింది. ఈ ప్రభావం నగరంలోని ట్రాఫిక్‌పై పడింది. ఆగిపోయిన లారీలను తొలగించిన తర్వాత ట్రాఫిక్ మామూలు పరిస్థితికి చేరింది.

## 56,150 మందికే ఇంటింటికీ పెన్షన్

- మిగిలిన 1,80,216 మందికి బ్యాంకు ఖాతాల్లో జమ
- జూన్ పెన్షన్‌పై కలెక్టర్ సమీక్ష

(విజయవాడ, ఆంధ్రజ్యోతి) : మే నెల సామాజిక పెన్షన్లను దాదాపు మూడొంతుల మందికి బ్యాంకుల్లో జమ చేయటానికి జిల్లా యంత్రాంగం రంగం సిద్ధం చేసింది. కదల్లేని పరిస్థితుల్లో ఉన్నవారికే ఇంటికి వెళ్లి పెన్షన్ ఇస్తారు. జిల్లావ్యాప్తంగా 2,36,726 మందికి సామాజిక పెన్షన్లు ఉన్నాయి. వీరిలో ఇంటి నుంచి కదల్లేనివారు, అనారోగ్య స్థితిలో ఉన్నవారు, తీవ్ర వృద్ధాప్యం కలిగినవారు, వికలాంగులు, దివ్యాంగులు తదితరులు 56,510 మంది ఉన్నారు. వీరికి జూన్ 1న ఇంటింటికీ వెళ్లి పెన్షన్ ఇస్తారు. మిగిలిన 1,80,216 మందికి మాత్రం బ్యాంకుల్లోనే జమ చేస్తారు. పెన్షన్ల పంపిణీకి సంబంధించి శుక్రవారం కలెక్టర్ దిల్లీరావు, డీఆర్‌డీఏ, విజయవాడ కార్పొరేషన్ అధికారులతో సమీక్షించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటిస్తూ, పింఛనుదారులు ఇబ్బందులు పడకుండా పెన్షన్లు పంపిణీ చేయాలని ఆదేశించారు.

# అధికారులే అమ్మేశారు..!



అక్రమిత భూముల్లో మొదలైన నిర్మాణాలు (ఇన్‌సెట్‌లో) అసైన్డ్ భూమిలో చేపల చెరువు తవ్వకాలు

*భూములను రక్షించాల్సిన వారే భక్షకులుగా మారారు. ప్రభుత్వ భూములను పరిరక్షించటం విస్మరించి, ఇళ్ల పట్టాలుగా విడగొట్టి మరీ విక్రయిస్తున్నారు. అసైన్డ్ భూములను అన్యాక్రాంతం చేస్తున్నారు. సాగు చేసుకోమని చెప్పి, అందినకాడికి మామూళ్లు దండుకుని ఇప్పుడు ప్లాట్లుగా విడగొట్టి అమ్ముకుంటున్న తేలప్రోలులోని రెవెన్యూ అధికారుల తీరు వివాదాస్పదంగా మారింది.*

## రెవెన్యూ ఆధ్వర్యంలో తేలప్రోలులో అసైన్డ్ భూముల అమ్మకాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/ఉంగుటూరు) : రెవెన్యూ అధికారుల కనుసన్నల్లో తేలప్రోలు గ్రామంలో అసైన్డ్ భూముల అమ్మకాలు జోరుగా జరుగుతున్నాయి. సర్వే నెంబర్ 1174/4లోని సుమారు 4 ఎకరాల వాగు పోరంబోకు భూమిని ఇళ్ల పట్టాలుగా విభజించి అమ్మేస్తున్నారు. కొన్నవారు ఇళ్లు కూడా నిర్మించుకుంటున్నారు. మరికొందరు పక్కా ఇళ్ల నిర్మాణానికి సిద్ధమవుతున్నారు. ఇంకొందరైతే చేపల చెరువులు తవ్వేస్తున్నారు. ఇంతా జరుగుతున్నా రెవెన్యూ అధికారులు మాకు తెలియదనే చెబుతున్నారు.

- తొలుత వాగును పూడ్చేసి.. సాగుకు అనుకూలంగా మార్చి...
- ఆనక ప్లాట్లుగా విభజించి అమ్మకాలు
- 4 ఎకరాల్లో 4, 5 సెంట్ల ప్లాట్లుగా విభజన
- రెవెన్యూ డైరెక్షన్‌లో సెంటు రూ.లక్షకు విక్రయం

### వాగును పూడ్చేసి..

ఈ అసైన్డ్ భూమిలో గతంలో వాగు ప్రవహించేది. దానిని పూడ్చేశారు. తేలప్రోలు సమీపంలో విజయవాడ మెయిన్ రైల్వేలైన్ దిగువగా వాగునీటి ప్రవాహం కోసం అండర్ టన్నెల్‌ను నిర్మించారు. ఈ అండర్ టన్నెల్.. వాగులోకి అనుసంధానమై ఉంటుంది. వాగులోకి నీరు అప్పుడప్పుడూ వస్తుందన్న ఉద్దేశంతో చాలాకాలంగా దీనిని ఆక్రమించుకుని కొంతమంది సాగు చేయటం ప్రారంభించారు. ఇలా సాగు చేయటానికి సహకరించింది కూడా స్థానిక రెవెన్యూ అధికారులే. వ్యవసాయం చేస్తున్న ఆ భూములనే నేడు ఇళ్ల ప్లాట్లుగా బేరంపెట్టి విక్రయిస్తున్నారు. తమ మనుషులను పెట్టుకుని రెవెన్యూ అధికారులే ఈ తతంగాన్ని నడిపిస్తున్నారు.

నాలుగు సెంట్లు, ఐదు సెంట్లుగా విభజించిన ప్లాట్లను చాలామంది కొన్నారు. సరిహద్దు రాళ్లను కూడా పాతుకున్నారు. కొందరు పక్కా ఇళ్లు నిర్మించుకుంటున్నారు. ఒక్కో సెంటు రూ.లక్షకు విక్రయించినట్టుగా తెలుస్తోంది. కొనుగోలు చేసినవారే ఈ విషయాన్ని చెబుతున్నారు.

### రైల్వే అధికారుల ఆగ్రహం

తేలప్రోలులోని సర్వే నెంబర్ 1774/4 ఆక్రమణపై రైల్వే అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విజయవాడ-విశాఖపట్నం మెయిన్ లైన్ కావటంతో రైల్వే అధికారులు అప్రమత్తమయ్యారు. భారీ వర్షాలు కురిస్తే రైల్వేట్రాక్ దిగువన అండర్ టన్నెల్ నుంచి వరద పారుతుందని, ఇళ్లు అడ్డుగా ఉంటే ఆ వరద నీరు ట్రాక్‌పైకి వస్తుందంటున్నారు. ఇలాంటి ఘటనలు జరిగితే రెవెన్యూ విభాగమే బాధ్యత వహించాల్సి వస్తుందంటున్నారు. ఈ ఆక్రమణల వ్యవహారాలపై స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవటం లేదు. కలెక్టర్ తక్షణం ఈ వ్యవహారంపై దృష్టిసారించి అవినీతి రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

### మరో భూమిలోనూ రెవెన్యూ కర్కశం

ప్రస్తుతం ఆక్రమణకు గురైన భూమి రోడ్డుకు అభిముఖంగా రెండోవైపున సర్వే నెంబర్ 1175, 1176 ఉన్నాయి. ఈ భూములను 1988లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం 'ముందడుగు' పథకంలో భాగంగా కొందరికి కేటాయించింది. కోళ్ల పెంపకాలు సాగించి ఉపాధిని పొందేందుకు వీలుగా వారికి ఈ భూములిచ్చింది. ఐదు, పది సెంట్ల చొప్పున భూములు ఇచ్చి, అందులో కోళ్లఫారాలు ఏర్పాటు చేసుకోవటానికి ఆర్థిక సహాయం చేసింది. చాలాకాలం పాటు నిరుద్యోగులు కోళ్ల ఫారాలు నిర్వహించారు. ఆ తర్వాత వచ్చిన తుఫాన్లకు అవి కొట్టుకుపోయాయి. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు ఆదుకోకపోవటంతో లబ్ధిదారులు ఆ కోళ్ల ఫారాలను పునరుద్ధరించలేదు. వారంతా ఇతర ప్రాంతాలకు వెళ్లి జీవనాధారం సాగించారు. 2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జగనన్న కాలనీల కోసం ఈ భూములపై స్థానిక అధికార పార్టీ పెద్దలు దృష్టి సారించారు. ఈ భూములను జగనన్న కాలనీలకు తీసుకునేందుకు స్కెచ్ వేశారు. ఈ విషయం తెలుసుకున్న లబ్ధిదారులు ఆందోళన చేశారు. వారంతా ఎక్కడో ఉంటున్నారని స్థానిక వైసీపీ నాయకులు జులుం ప్రదర్శించారు. దీంతో బాధితుల్లో పలువురు కోర్టును ఆశ్రయించారు. కోర్టు కూడా తక్షణం వారికి ఆ భూములను స్వాధీనం చేయాలని ఆదేశించింది. కానీ, ఆ భూములను లబ్ధిదారులకు ఇవ్వకుండా వాటికి చుట్టూ ఉన్న భూములను మాత్రం జగనన్న కాలనీకి ఎంపిక చేశారు. కోర్టు ఆదేశాల మేరకు తమ భూములను స్వాధీనం చేసుకోవటానికి ప్రయత్నాలు చేసే వారికి స్థానిక రెవెన్యూ అధికారులు చుక్కలు చూపిస్తున్నారు. వారి భూమిలో ఎలాంటి ఇళ్లు కట్టుకోవటానికి కూడా వారిని అనుమతించటం లేదు. అడుగడుగునా ఇబ్బందులు పెడుతున్నారు. కాగా, కోర్టు తీర్పు ఉన్నా లెక్క చేయట్లేదని, కోర్టు ధిక్కరణ వేసేందుకు బాధితులు రంగం సిద్ధం చేస్తున్నారు.



నిర్మానుష్యంగా ఏలూరురోడ్డు

# రోహిణి భగభగలు

## రికార్డు స్థాయిలో నమోదైన ఉష్ణోగ్రతలు

- ఆరు మండలాల్లో అధిక ఉష్ణోగ్రతలు
- నేడూ ఇదే పరిస్థితి



వెలగపూడిలో గొడుగు సాయంతో..

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : భానుడు భగ్గుమంటున్నాడు. రెండు రోజులుగా ఠారెత్తిస్తున్నాడు. ఉదయం ఏడు గంటల నుంచే సూర్యుడు మండిపోతున్నాడు. 10 గంటల నుంచి వడగాడ్పులు సైతం వీస్తుండటంతో ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు ప్రజలు జంకుతున్నారు. రోహిణీకార్తె చివరి దశకు చేరుకునే సరికి ఉష్ణోగ్రతలు టాప్‌లేపేస్తున్నాయి. ఉక్కపోతలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. వరుసగా నమోదవుతున్న అధిక ఉష్ణోగ్రతలతో పిల్లలు, వృద్ధులు బెంబేలెత్తిపోతున్నారు. జిల్లా వాసులు గడప దాటి బయటకు రావడానికి భయపడుతున్నారు. శుక్రవారంతో రోహిణీకార్తె ముగుస్తున్నా ఎండలు మరికొద్దిరోజులు తీవ్రంగా ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఆరు మండలాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎన్టీఆర్ జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రత నందిగామలో నమోదైంది. ఇక్కడ 45.3 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. తర్వాత విజయవాడ రూరల్‌లో 45.1, చందర్లపాడులో 44.9, కంచికచర్లలో 44.9, జి.కొండూరులో 44.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కృష్ణా జిల్లా కోడూరులో అత్యధికంగా 44.2 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. ఈ ఆరు మండలాల్లోను వడగాల్పులు బలంగా వీచాయి. ఎన్టీఆర్ జిల్లాలో 12 మండలాల్లో ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలు దాటాయి. విజయవాడ అర్బన్‌లో 44.0 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. కృష్ణా జిల్లాలో కోడూరులో మాత్రమే 44.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. తర్వాత మొవ్వలో, పమిడిముక్కల మండలాల్లో 43.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవ్వగా నాగాయలంకలో 43.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఈ జిల్లాలో పది మండలాల్లో 42 డిగ్రీలను దాటి ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. ప్రస్తుతం ఎండలు టాప్‌లేపేస్తుండగా వాతావరణ శాఖ మరో రెండు రోజులకు ఫోర్‌కాస్ట్‌ను విడుదల చేసింది. శనివారం ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలను దాటి నమోదవుతాయని తెలిపింది. ఆదివారం నుంచి మాత్రం ఈ ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడతాయని పేర్కొంది.



## దుర్గమ్మకు రూ.38.53లక్షల ఆదాయం

▸ ఫలించిన భక్తుల రద్దీ నియంత్రణ చర్యలు

**వన్‌టౌన్, మే 31 :** దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానంలో శుక్ర, శని, ఆదివారాలలో భక్తుల రద్దీని పురస్కరించుకుని చేపట్టిన విస్తృత చర్యలు ఫలించాయి. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి 8 గంటల వరకు దేవస్థానానికి రూ.38,53,664లు ఆదాయం సమకూరింది. 1965 మంది రూ.500 టికెట్టు ద్వారా దుర్గమ్మను దర్శించుకున్నారు. 1390 మంది రూ.300 టికెట్టు ద్వారా దర్శనం చేసుకోగా, రూ.100 రుసుం టికెట్టు ద్వారా రూ.6,26,200 ఆదాయం వచ్చింది. తలనీలాలను, లడ్డూలు విక్రయాల ద్వారా విరాళాల ద్వారా ఆదాయం వచ్చినట్టు డిప్యూటీ కలెక్టర్, ఆలయ ఈవో కేఎస్ రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ వెంకట్‌నగర్‌కు చెందిన ఎస్.గుల్షన్ కుటుంబసభ్యులు శుక్రవారం దేవస్థానానికి విచ్చేసి అన్నవితరణకు రూ.లక్షను ఈవో రామారావుకు చెక్కు ద్వారా విరాళాన్ని అందజేశారు. ఈవో కేఎస్ రామారావు పర్యవేక్షణలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకున్నారు. గుడివాడ శివజ్యోతి నృత్యాలయ కళాబృందం నాట్యచారిణి సరితనెహ్రూ ఆధ్వర్యంలో వివిధ కీర్తనలకు నాట్యం చేసి అలరించారు.

### చంద్రబాబు సీఎం కావాలని మోకాళ్లపై..



**విజయవాడ రూరల్, మే 31 :** తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని, గన్నవరం టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు అత్యధిక మెజారిటీతో గెలవాలని ఆకాంక్షిస్తూ అంబాపురం గ్రామ సర్పంచ్ గండికోట సీతయ్య శుక్రవారం మోకాళ్లపై ఇంద్రకీలాద్రి ఎక్కి అమ్మవారి దర్శనం చేసుకున్నారు. అనంతరం ఆలయంలో చండీహోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గండికోట సీతయ్య మాట్లాడుతూ, చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, ఆయన గెలుపు రాష్ట్రానికి అవసరమని పేర్కొన్నారు. ఆయనతో పాటు గ్రామ టీడీపీ నేతలు పాల్గొన్నారు.



మెగా ఎక్స్‌పో 2024లో పాల్గొన్న భాస్కరరావు, వెంకట్రావులు

### యూనియన్ బ్యాంక్ మెగా రిటైల్ ఎక్స్‌పో-2024

**అజిత్‌సింగ్‌నగర్, మే 31 :** యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రీజనల్ కార్యాలయం మచిలీపట్నం ఆధ్వర్యంలో పోరంకిలోని ద్వారకా రెసిడెన్సీ వద్ద శుక్రవారం మెగా రిటైల్ ఎక్స్‌పో-2024 నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న జోనల్ హెడ్ కె.భాస్కరరావు మాట్లాడుతూ, బ్యాంకు అభివృద్ధికి సహాయ సహకారాలు అందజేసిన బిల్డర్స్, డీలర్స్, ఖాతాదారులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం బ్యాంకు రీజనల్ హెడ్ వెంకట్రావు మాట్లాడుతూ, గృహ, వాహన ఋణాలు అతి తక్కువ వడ్డీకే మంజూరు చేస్తామని, ఈ అవకాశాన్ని ఖాతాదారులు వినియోగించుకోవాలని సూచించారు. మెగా ఎక్స్‌పోలో బిల్డర్లు, కార్ డీలర్లు, ఎడ్యుకేషన్ కన్సల్టెంట్స్, ఉయ్యూరు, తాడిగడప, పోరంకి, ఈడుపుగల్లు, కానూరు, పెనమలూరు బ్రాంచ్ మేనేజర్లు పాల్గొన్నారు.




పర్వతనేని విజయ సాంబశివరావు దంపతులను సత్కరిస్తున్న కేశినేని శివనాథ్, వసంత వెంకట కృష్ణ ప్రసాద్‌లు

### పర్వతనేని సేవలు ప్రశంసనీయం

▸ కేశినేని శివనాథ్, వసంత కృష్ణ ప్రసాద్

**ఇబ్రహీంపట్నం, మే 31 :** ఎన్టీటీపీఎస్‌లో జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌గా తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం బి-1245 రాష్ట్ర అధ్యక్షుడు పర్వతనేని సాంబశివరావు చేసిన సేవలు ప్రశంసనీయమని, ట్రేడ్ యూనియన్‌లో ఉద్యోగస్తులకు రిటైర్మెంట్ అనేది ఉద్యోగానికి మాత్రమే అని ప్రజాసేవకు కాదని విజయవాడ పార్లమెంట్, మైలవరం అసెంబ్లీ కూటమి అభ్యర్థులు కేశినేని శివనాథ్ (చిన్ని), వసంత వెంకట కృష్ణ ప్రసాద్‌లు అన్నారు. పర్వతనేని సాంబశివరావు పదవీ విరమణ సందర్భంగా శుక్రవారం ఇబ్రహీంపట్నం ఎ.కాలనీలోని కల్యాణ మండపంలో సాంబశివరావు, విజయ దంపతులను నేతలు, యూనియన్ సభ్యులు దుశ్శాలువాలతో, పూలమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం నేతలు మాట్లాడుతూ తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా సాంబశివరావు ఎనలేని కృషి చేశారన్నారు. ఇకపై ప్రజా సమస్యలపై పోరాడాలని ఎల్లప్పుడు ఆయనకు అండగా ఉంటామని వారు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పరుచూరి అశోకబాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య, టీఎన్టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కేశినేని శివనాథ్‌ను కలిసిన నందిగామ టీడీపీ నాయకులు

### క్యాడరే పార్టీకి కొండంత అండ : కేశినేని చిన్ని

**విద్యాధరపురం :** టీడీపీకి క్యాడరే కొండంత అండ అని కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జంపాల సీతారామయ్య ఆధ్వర్యంలో నందిగామ నియోజకవర్గం చందర్లపాడు, కంచికచర్ల మండలాలకు చెందిన టీడీపీ నాయకులు, మైలవరం నియోజకవర్గానికి చెందిన ఇబ్రహీంపట్నం, జీ కొండూరు మండలాలు, కొండపల్లికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం మర్యాదపూర్వకంగా ఆయనను కలిసారు. ఈ నెల 13వ తేదీన జరిగిన పోలింగ్ సరళిని, 4వ తేదీన జరగనున్న ఓట్ల లెక్కింపులో అనుసరించాల్సిన విధివిధానాల గురించి చర్చించారు. శివనాథ్ మాట్లాడుతూ, ప్రత్యర్థి పార్టీ కవ్వింపు చర్యలకు పాల్పడినప్పటికీ సంయమనం పాటించాలని సూచించారు. అనంతరం కేశినేని శివనాథ్‌ను నాయకులు సన్మానించారు.

### యాప్‌లతో మోసం చేస్తున్న ముఠా అరెస్టు



**ఉయ్యూరు, మే 31 :** చెడువ్యసనాలకు అలవాటుపడి సులువుగా డబ్బు సంపాదించాలన్న ఆలోచనతో ప్రాంక్‌యాప్‌లు సృష్టించి వ్యాపారులను మోసంచేస్తున్న ముగ్గురు యువకులను శుక్రవారం అరెస్టు చేసినట్టు ఉయ్యూరు సీఐ మహ్మద్ హబీబ్ బాషా తెలిపారు. వివరాల ప్రకారం.. పట్టణంలోని శ్రీవెంకటేశ్వర టైర్‌షాపుకు ఓ యువకుడు వచ్చి పల్సర్ బైక్ 220 టైర్, యాక్టివా బైక్‌కు టైరు తీసుకుని ఫోన్‌పే, పేటీఎం ద్వారా డబ్బు చెల్లింపు చేసినట్టు నమ్మబలికాడు. అనుమానం వచ్చిన టైర్ షాపు యజమాని వెంటనే తనఫోన్‌లో పేమెంట్ చూసుకోగా ఎటువంటి డబ్బు, మెసేజ్ రాకపోవడంతో అతడిని పట్టుకుని పోలీస్ స్టేషన్‌లో అప్పగించాడు. దీంతో సీఐ, ఎస్సై గణేశ్‌కుమార్ అతడ్ని విచారించగా కైకలూరుకు చెందిన షేక్ రబ్బాని అలియాస్ నిఖిల్ ముఠా గుట్టు విప్పాడు. దీంతో సంబంధం ఉన్న మరో ఇద్దరు యువకులు సింగవరపు దుర్గాప్రసాద్, షేక్ ఇస్మాయిల్‌ను పట్టుకుని వీరి వద్దనుంచి మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదుచేసి కోర్టులో హాజరుపరిచినట్టు తెలిపారు.



పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ అధికారులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

# 2నే పోస్టల్ బ్యాలెట్లు ఓపెన్..

▸ రాజకీయ పార్టీల సమక్షంలో కట్టలు కట్టనున్న అధికారులు

▸ లెక్కింపు తేలిక కావటానికి నూతన విధానం

**(ఆంధ్రజ్యోతి, విజయవాడ) :** పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు విధానంలో ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల యంత్రాంగం నూతన విధానాన్ని అవలంబిస్తోంది. యాభై పోస్టల్ బ్యాలెట్లను ఒక కట్టగా కట్టి లెక్కింపునకు శ్రీకారం చుట్టబోతోంది. జూన్ 2వ తేదీన జిల్లా ఎన్నికల పరిశీలకులు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఆయా పార్టీల ఏజెంట్లు, రిటర్నింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్ల సమక్షంలో పోస్టల్ బ్యాలెట్ బ్యాక్సులను ఓపెన్ చేసి యాభై చొప్పున కట్టలుగా కడతారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ ఆవరణలోని ఎన్నికల గోడౌన్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించటానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ విధానం వల్ల తేలిగ్గా పోస్టల్ బ్యాలెట్లను లెక్కించవచ్చని, వేగంగా ఈ ప్రక్రియను చేపట్టవచ్చని జిల్లా ఎన్నికల యంత్రాంగం భావిస్తోంది. నియోజకవర్గాల వారీగా పోస్టల్ బ్యాలెట్లను 50 చొప్పున కట్టలుగా కట్టి.. సంబంధిత నియోజకవర్గాల బ్యాలెట్ బాక్సులలో వేస్తారు. లెక్కింపు రోజున ఈ కట్టల ప్రాతిపదికన లెక్కింపు చేపడతారు. ఈ విధానంలో కొన్ని ఇబ్బందులు కూడా ఉన్నాయన్న వాదనలు కూడా వినిపిస్తున్నాయి. ఈ కట్టల ప్రాతిపదికన మొత్తం పోస్టల్ బ్యాలెట్ ఓట్లన్నింటినీ విప్పి చూపించిన తరువాత మళ్లీ వాటిని కట్టలుగా కడతారు. ఈ క్రమంలో ఏదైనా కట్టలో 50 పోస్టల్ బ్యాలెట్లు ఉన్నాయా లేదా అన్న అనుమానం వచ్చినపుడు మళ్లీ వాటన్నింటినీ లెక్కించాలంటే సమయాభావం పడుతుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సమయం హేమంతకుమార్ ఎన్నికల సంఘానికి పోస్టల్ బ్యాలెట్ కేంద్రాలలో వేయింగ్ మిషన్లను ఏర్పాటు చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. 50 ఓట్ల పోస్టల్ బ్యాలెట్ కట్ట సగటు తూకాన్ని నమోదు చేసుకోవాలని సూచిస్తున్నారు. ఏదైనా కట్టపై అనుమానాలు వచ్చినపుడు వాటన్నింటినీ లెక్కించే బదులు తూకం ద్వారా నివృత్తి చేసుకోవచ్చని సూచిస్తున్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ఎన్నికల సంఘం సత్వరం అమల్లోకి తీసుకు రావాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేస్తున్నారు.

### ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగానే.. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు

▸ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఢిల్లీరావు

**కృష్ణలంక, మే 31 :** ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు చేపట్టేందుకు అధికారులు, సిబ్బంది పూర్తిస్థాయి అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ అధికారులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో కలెక్టర్ ఢిల్లీరావు, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు సంబంధించి ప్రతి దశలో అనుసరించాల్సిన విధివిధానాలను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సజావుగా సాగేందుకు నోవా, నిమ్రా కళాశాలల్లో ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశామని, అధికారులు, సిబ్బందికి ఇస్తున్న శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్ (వీఎఫ్‌సీ), పోస్టల్ ఓటింగ్ సెంటర్ (పీఓసీ), హోం ఓటింగ్, ఎలక్ట్రానికల్లీ ట్రాన్స్‌మిటెడ్ పోస్టల్ బ్యాలెట్ సిస్టమ్ (ఈటీపీబీఎస్) ద్వారా వచ్చిన పోస్టల్ బ్యాలెట్ల ఓట్ల లెక్కింపును అత్యంత పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ప్రతి టేబుల్‌కు కౌంటింగ్ సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్ వుంటారన్నారు. ఒక్కో టేబుల్‌కు కేటాయించిన అధికారుల బృందం పూర్తిస్థాయిలో సమన్వయంతో పనిచేయాలన్నారు. ఫారం-13సి, ఫారం-13 ఎ (డిక్లరేషన్), ఫారం-13 బి స్థాయిల్లో రిజెక్షన్ల నిబంధనలు, డిక్లరేషన్‌లో సీరియల్ నెంబర్, ఓటర్ సంతకం, అటెస్టర్ సంతకం తదితరాలతో పాటు బ్యాలెట్‌లో మార్కింగ్, ట్యాబ్యులేషన్ తదితరాలకు సంబంధించిన అంశాలను కలెక్టర్ వివరించారు. 50 చొప్పున ఉన్న పోస్టల్ బ్యాలెట్‌ల కట్టలను వేరుచేసి సజావుగా లెక్కించే విధానాన్ని ప్రాక్టికల్‌గా వివరించారు. శిక్షణా కార్యక్రమంలో డీఆర్వో వి.శ్రీనివాసరావు, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి కె.శ్రీనివాసరావు, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎం.పురేంద్ర, ఎన్నికల సిబ్బంది నోడల్ అధికారి ఎం.రజనీకుమారి, కలెక్టరేట్ ఏవో సీహెచ్.నాగలక్ష్మి, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ ఎం.దుర్గాప్రసాద్ తదితరులు హాజరయ్యారు.



హెడ్ వాటర్‌వర్క్స్‌లో పరిశీలన చేస్తున్న మునిసిపల్ కమిషనర్

### రంగు మారిన నీటికి యాక్టివేటెడ్ చార్‌కోల్ ట్రీట్మెంట్

▸ మునిసిపల్ కమిషనర్



**వన్‌టౌన్, మే 31 :** రంగుమారిన నీటితో ఎటువంటి అనారోగ్యాలు ఉండవని నిర్ధారణ అయిందని, రంగు మారిన నీటికి యాక్టివేటెడ్ చార్‌కోల్ ట్రీట్మెంట్ అనుసరిస్తున్నామని మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. మల్లికార్జునపేటలోని హెడ్ వాటర్ వర్క్స్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. హెడ్ వాటర్ వర్క్స్‌లో నీటి నమూనాలను తీయడంతో పాటు నగరంలోని అన్ని ప్రాంతాలలో నీటి నమూనాలను తీసి పరీక్షలు నిర్వహించామని చెప్పారు. ఇంజనీర్లతో, సీనియర్ ల్యాబ్ అసిస్టెంట్‌లతో సంప్రతింపులు జరిపిన అనంతరం రంగుమారిన నీటి వలన అనారోగ్యం కలగదని నిర్ధారించారని చెప్పారు. అయినప్పటికీ మరికొంత మెరుగు కోసం రంగుమార్పుపై శ్రద్ధ తీసుకుని యాక్టివేటెడ్ చార్‌కోల్ ట్రీట్మెంట్ చేస్తున్నామని చెప్పారు. హెడ్ వాటర్ వర్క్స్ నుంచి పైపుల్లో ప్రజల వద్దకు కుళాయిలలో చేరుతున్న నీటి విషయంలో శుద్ధి అవసరమని, అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాతావరణంలో మార్పుల కారణంగా ప్రజలు తాగునీటి విషయంలో శ్రద్ధ తీసుకుని కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. ఈఈలు నారాయణమూర్తి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

▸ కృష్ణా జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

**మచిలీపట్నం, మే 31 :** ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కృష్ణా జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు, అల్లర్లను సృష్టించేవారిని గుర్తించి ఇప్పటికే బైండోవర్‌లు చేసినట్టు చెప్పారు. ఎన్నికల సమయంలో నిబంధనలు ఉల్లంఘించిన 10 మందిని గుర్తించి రూ.50వేల నుంచీ లక్ష రూపాయల వరకు జరిమానా విధించామన్నారు. కౌంటింగ్ తేదీ సమీపిస్తున్న తరుణంలో రౌడీ షీటర్లు, గత ఎన్నికల్లో నేరాలకు పాల్పడిన వారు, నేరచరిత్ర కలిగిన వారిపై నిఘా పెంచినట్టు తెలిపారు. అల్లర్లు సృష్టిస్తారన్న అనుమానం ఉంటే తహసీల్దార్ల ఎదుట ప్రవేశపెట్టి బైండోవర్‌లు చేశామని చెప్పారు. కౌంటింగ్ సమయంలో నేర ప్రవర్తన కలిగిన వారు గొడవలకు దిగితే ఉపేక్షించేది లేదనీ, అరెస్ట్ చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు.

### పొగాకుకు దూరంగా ఉండండి : కలెక్టర్ ఢిల్లీరావు

**కృష్ణలంక, మే 31 :** మత్తుపదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరించి ఊపిరితిత్తులు, కేన్సర్ వ్యాధులకు కారణమయ్యే పొగాకు, గుట్కా, ఖైనీ వంటి వాటి నుంచి ఆరోగ్యాన్ని పరిరక్షించుకునేలా ప్రతి ఒక్కరిని చైతన్యవంతులను చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్ చాంబర్‌లో కలెక్టర్ ఢిల్లీరావు, ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థ సహకారంతో ముద్రించిన అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పొగాకు వినియోగంతో ఊపిరితిత్తులు దెబ్బతినడమే కాకుండా కేన్సర్ వంటి భయంకరమైన వ్యాధుల బారినపడి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం వుందన్నారు. స్వచ్ఛంద సంస్థ ద్వారా కళాశాలలు, ఉన్నత విద్యాసంస్థల్లో పొగాకు దుష్పరిణామాల అంశంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఫోరం ఫర్ చైల్డ్‌రైట్స్ జిల్లా కో-ఆర్డినేటర్ అరవ రమేష్, ఎన్ఎస్ఎస్ వలెంటీర్ జోష్ ఆక్రుత్, దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రైవేట్ అంబులెన్స్‌లో జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రికి తరలించిన మృతదేహాలు

### సరదా కోసం వచ్చి..

▸ లారీలో ఇద్దరి అనుమానాస్పద మృతి

▸ అతి మద్యం, వడదెబ్బ కారణం!

▸ లారీ డ్రైవర్ ఫిర్యాదుపై కేసు నమోదు

**జగ్గయ్యపేట/పెనుగంచిప్రోలు, మే 31 :** అతిగా మద్యం సేవించటంతో పాటు వడదెబ్బకు గురై లారీలో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన సంఘటన జాతీయ రహదారిపై నవాబుపేట సమీపంలో శుక్రవారం రాత్రి జరిగింది. అనకాపల్లి నుంచి జగ్గయ్యపేటకు బొగ్గులోడ్‌తో గురువారం రాత్రి బయల్దేరిన లారీలో డ్రైవర్ కనగాల అప్పారావుతో పాటు ఆయన స్నేహితులు పాటు నర్సింగరావు, సత్యనారాయణలు సరదాగా బయల్దేరారు. లారీలో వారిరివురు మద్యం సేవించటం, రెండు రోజులగా ఎండ వేడిమి తీవ్రంగా ఉండటం, వడగాడ్పులకు శుక్రవారం మధ్యాహ్నం నుంచి నీరసపడ్డారని డ్రైవర్ చెబుతున్నాడు. హైవేపై నవాబుపేట వద్ద సాయంత్రం వారిద్దరు లారీలో ఎంత లేపినా లేవకపోవటంతో అనుమానం వచ్చి చూడగా అపస్మారకస్థితిలో ఉన్నారని, అంబులెన్స్‌లో జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు చెప్పారు. అక్కడ వారు చనిపోయినట్టు నిర్ధారించారు. నర్సింగరావు(55) ఎస్‌బీఐలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తూ సస్పెన్షన్‌లో ఉండగా, సత్యనారాయణ (63) విశాఖస్టీల్‌ప్లాంట్‌లో పనిచేసి రిటైరై ఖాళీగా ఉంటున్నాడని డ్రైవర్ తెలిపాడు. లారీ జగ్గయ్యపేటకు చెందిన ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టుది కాగా, ఇక్కడ నుంచి సిమెంట్ లోడ్‌తో వైజాగ్ వెళ్లి తిరుగు ముఖంలో బొగ్గులోడ్‌తో వస్తున్నట్టు డ్రైవర్ చెప్పారు. పెనుగంచిప్రోలు పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని విచారిస్తున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

# కారుచౌకగా కొట్టేశారు!

▸ రూ.2 కోట్ల ఆస్తి కేవలం రూ.88 లక్షలకే

▸ గాంధీ బ్యాంకు డైరెక్టర్ల నిర్వాకం

▸ నిబంధనలకు విరుద్ధంగా వేలంలో పాల్గొన్న డైరెక్టర్ల బంధువులు, సీఈవో భర్త

▸ సహకార శాఖకు ఫిర్యాదు చేసిన ఆస్తి యజమాని

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

సుమారు రూ. 2 కోట్ల విలువైన ఆస్తిని కారుచౌకగా కొట్టేశారు. నిబంధనలను తుంగలో తొక్కి మరీ బ్యాంకు డైరెక్టర్లే బంధుగణాన్ని వేలంలో పాల్గొనేలా చేసి అతి తక్కువకు ఖరీదైన ఆస్తిని కాజేశారు. గాంధీ సహకార అర్బన్ బ్యాంకులో వాయిదాలు కట్టకుండా వేలానికి వచ్చిన ఆస్తిని బ్యాంకు డైరెక్టర్లే కుమ్మక్కయి కొట్టేయడం చర్చనీయాంశంగా మారింది. నిబంధనలను అడ్డగోలుగా ఉల్లంఘిస్తున్నా సహకార శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు చూస్తుండటంపై విమర్శలు వస్తున్నాయి.

గాంధీ అర్బన్ బ్యాంకు డైరెక్టర్ల మరో అవినీతి బాగోతం వెలుగుచూసింది. రుణ గ్రహీతల ఆస్తుల వేలంలో బ్యాంకు యాజమాన్యం అవినీతికి పాల్పడిన ఉదంతంపై సభ్యులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజుల క్రితం బందరు రోడ్డులో తాజ్ వివంత హోటల్‌కు ఎదురుగా ఉన్న సుమారు 80 గజాల స్థలం, అందులోని 3 అంతస్థుల భవనం వేలానికి వచ్చింది. భవన యజమాని బి.రవిబాబు వాయిదాలు చెల్లించకపోవడంతో బ్యాంకు సదరు ఆస్తిని వేలం వేసింది. ఆస్తి విలువ సుమారు రూ. 2 కోట్ల వరకు ఉంటుంది. అయితే వేలంలో కేవలం రూ.88 లక్షలకే ఆస్తిని చేజిక్కించుకోవడం ప్రస్తుతం వివాదాస్పదమవుతోంది. బ్యాంకు డైరెక్టర్లు అంతా ఒక్కటై కేవలం రూ.88 లక్షలకే తమ వారికి అప్పజెప్పారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణాధికారి భర్త కూడా వేలంలో పాల్గొనడం గమనార్హం. ఇది బ్యాంకు నిబంధనలకు విరుద్ధం. ఈ మొత్తం ఉదంతంలో బ్యాంకు సేల్ ఆఫీసర్ పాత్ర వివాదాస్పదంగా మారింది. నిబంధనలకు అనుగుణంగా ఎవరు వేలంపాటలో పాల్గొంటున్నారు.. ఆస్తి మార్కెట్ ధర ఎంత.. ఎంత వరకు వేలంలో ధర రావచ్చు అన్న అంశాలను పర్యవేక్షించాల్సిన ఈయన బ్యాంకు డైరెక్టర్లకు కొమ్ముకాసేలా వ్యవహరించారన్న ఆరోపణలు ఉన్నాయి. సహకార శాఖ నుంచి డిప్యుటేషన్‌పై బ్యాంకులో విధులు నిర్వహిస్తున్న ఈయన గత పదేళ్లగా అదే పోస్టులో ఉండటం గమనార్హం. నిబంధనల ప్రకారం ప్రతి మూడేళ్లకు సేల్ ఆఫీసర్‌ను మార్చాల్సి ఉన్నా ఇక్కడ అది జరగలేదు. ఈ ఆస్తి వేలంపై ఆస్తి యజమాని సహకార శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. సుమారు రూ.2 కోట్లు విలువైన ఆస్తిని కారుచౌకగా వేలం వేసి తనకు నష్టం కలిగించారని ఆయన ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. తక్షణమే వేలాన్ని రద్దు చేసి మళ్లీ వేలం నిర్వహించాలని ఆయన కోరుతున్నారు. సహకార శాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆస్తి యజమాని, బ్యాంకు సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

### ఇంద్ర బస్సులో పొగలు!

▸ డ్రైవర్ అప్రమత్తం.. ప్రయాణికులు సురక్షితం



**గన్నవరం, మే 31 :** కాకినాడ ఆర్టీసీ డిపోకు చెందిన ఇంద్ర ఏసీ బస్సుకు పెను ప్రమాదం తప్పింది. విజయవాడ నుంచి 39మంది ప్రయాణికులతో శుక్రవారం సాయంత్రం కాకినాడకు ఇంద్ర బస్సు బయలుదేరింది. అప్పుడే ఇంజన్ వద్ద సమస్య ఉందని డ్రైవర్ అధికారులకు సూచించినా.. ఏం కాదులే గన్నవరం డిపోలో చూపించుకోమని సలహా ఇచ్చి బస్సును పంపించేశారు. గన్నవరం గాంధీబొమ్మ సెంటర్ వద్దకు బస్సు రాగానే ఇంజన్‌లో నుంచి పొగలు వచ్చాయి. డ్రైవర్ అప్రమత్తంగా ఉండటంతో వెంటనే బస్సును నిలిపివేసి స్థానికుల సహకారంతో పొగ వ్యాపించకుండా ప్రయాణికులను సురక్షితంగా దించేశారు. దీంతో ప్రయాణికులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్ అప్రమత్తంగా లేకపోతే పెను ప్రమాదం సంభవించేదని వారు పేర్కొన్నారు. విజయవాడ నుంచి మరొక బస్సును రప్పించి ప్రయాణికులను కాకినాడ తరలించారు.

### డిగ్రీ ఫలితాలు విడుదల

**మచిలీపట్నం టౌన్, మే 31 :** కృష్ణా విశ్వవిద్యాలయం డిగ్రీ నాల్గవ సెమిస్టర్ పరీక్షా ఫలితాలను శుక్రవారం వర్సిటీ ఉపకులపతి ఆచార్య జి.జ్ఞానమణి వెల్లడించారు. విశ్వవిద్యాలయంలో వీసీ ఛాంబర్‌లో పరీక్షా ఫలితాలను ప్రకటించారు. 5622 మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 2641 (46.97 శాతం)మంది ఉత్తీర్ణతను సాధించారు. సప్లిమెంటరీ పరీక్షలకు 7354 మంది హాజరుకాగా 46.11 శాతం ఉత్తీర్ణులయ్యారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ శోభన్ బాబు, పరీక్షల నియంత్రణ అధికారి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

**ఘంటసాల, మే 31 :** పదో తరగతి, తత్సమాన పరీక్షల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు 2024-25 విద్యా సంవత్సరానికి ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం - లాం గుంటూరు అందించే డిప్లొమా కోర్సుల్లో ప్రవేశం కోరుకునే అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఘంటసాల వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డా.వి.సత్యప్రియ లలిత శుక్రవారం తెలిపారు. దరఖాస్తుకు సంబంధించిన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభం 1.6.2024 నుంచి చివరి తేదీ 20.6.2024 అని తెలిపారు. ఆన్‌లైన్ అప్లికేషన్, సాధారణ సమాచారం కోసం (ఏఎన్‌జీఆర్ఏయు.ఏసీ.ఇన్), 08671-254799లో సంప్రదించాలని కోరారు.

**జగ్గయ్యపేట రూరల్ :** వ్యవసాయ డిప్లొమా కోర్సుల ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని గరికపాడు వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ మధువాణి శుక్రవారం తెలిపారు. 10, తత్సమాన పరీక్ష పాసైన విద్యార్థులు జూన్ ఒకటి నుంచి 20వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. గరికపాడు కళాశాలలో మొత్తం 34 సీట్లు అందుబాటులో ఉన్నాయని రిజర్వేషన్ దామాషా ప్రకారం ఓపెన్ కేటగిరిలో 50 శాతం, బీసీ(ఏ) ఏడు శాతం, బీసీ(బీ) 10 శాతం, బీసీ(సీ) ఒక శాతం, బీసీ(డీ) ఏడు శాతం, బీసీ(ఈ) నాలుగుశాతం, ఎస్సీ15 శాతం, ఎస్టీ ఆరు శాతం చొప్పున సీట్లు భర్తీ చేయటం జరుగుతుందన్నారు.

### ఎన్‌సీసీ కేటగిరిలో కౌన్సెలింగ్..

**భారతీనగర్ :** ఎన్టీఆర్ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో అందుబాటులో ఉన్న సీట్ల భర్తీకి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కొనసాగుతున్న కౌన్సెలింగ్ ప్రక్రియలో శుక్రవారం ఎన్‌సీసీ కేటగిరీకి సంబంధించి 141మంది హాజరైనట్టు పాలిసెట్ జిల్లా కో-ఆర్డినేటర్, ప్రిన్సిపల్ ఎం.విజయసారథి తెలిపారు. ఎస్ఆర్ఆర్, అండ్ సీవీఆర్ కళాశాలలో 172 మంది, ఆంధ్రాలయోలా కళాశాలలో 210మంది విద్యార్థులు హాజరైనట్టు తెలిపారు.

### టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షకు 42.27శాతం హాజరు

**వన్‌టౌన్ :** ఎన్‌టీఆర్ జిల్లాలో శుక్రవారం నిర్వహించిన టెన్త్ అడ్వాన్స్ సప్లిమెంటరీ సోషల్ పరీక్షకు 2068 మంది విద్యార్థులకు గాను 874 మంది హాజరయ్యారని 1194 మంది గైర్హాజరయ్యారని మొత్తంగా 35 పరీక్షా కేంద్రాలలో కలిపి 42.27శాతం హాజరు నమోదైందని జిల్లా విద్యాశాఖాధికారి యు.వి సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు 19 పరీక్షా కేంద్రాలను పరిశీలించారన్నారు. మొత్తంగా అధికారులు, ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు కలిసి 21 కేంద్రాలలో తనిఖీలు చేసారని ఎటువంటి మాల్‌ప్రాక్టీసులు నమోదు కాలేదని చెప్పారు.

### ఎన్టీటీపీఎస్‌లో మూడో యూనిట్ నూరు రోజుల సంబరాలు

**ఇబ్రహీంపట్నం, మే 31 :** డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ విద్యుత్ కేంద్ర మూడో యూనిట్ నిరంతరాయంగా విద్యుత్‌ను ఉత్పత్తి చేసి విజయవంతంగా 100 రోజులు పూర్తి చేసుకోవడం అభినందనీయమని చీఫ్ ఇంజనీరు (ఓఅండ్ఎమ్) టి.నాగరాజు అన్నారు. ఈసందర్భంగా శుక్రవారం ద్వితీయ దశ జనరల్ డివిజన్ ఆధ్వర్యంలో విజయోత్సవ వేడుకలు యూనిట్ కంట్రోల్ బోర్డు హాల్లో నిర్వహించారు. భవిష్యత్ సంస్థలకు మంచి పేరు తేవాలని ఆయన సూచించారు. ద్వితీయ దశ సూపరింటెండెంట్ ఇంజనీరు తిరుమల ప్రసాద్ కేక్ కట్ చేసి సంబరాలు చేయించారు. వెంకట్రావ్, కె.శ్రీనివాస రెడ్డి, డి.కిరణ్, కొత్తపల్లి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



బాధితుడితో కలిసి స్టేషన్‌లో సీఐ రామారావుతో మాట్లాడుతున్న బోడె ప్రసాద్

### బాధితునికి బోడె ప్రసాద్ పరామర్శ

**పెనమలూరు, మే 31 :** యనమలకుదురు ఎన్టీఆర్ సెంటరు వద్ద గురువారం అర్ధరాత్రి టీడీపీ నేతపై వైసీపీ మూకదాడి ఘటనపై కూటమి అభ్యర్థి బోడెప్రసాద్ స్పందించారు. స్థానిక నాయకులతో కలిసి శుక్రవారం సూర్యనారాయణను పరామర్శించి బాధితుడిని వెంటబెట్టుకొని పెనమలూరు స్టేషనుకు వచ్చారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకొని, బాధితునికి న్యాయం చేయాలని సీఐ రామారావును కోరారు.

### సెంట్రల్ జోన్ క్రికెట్‌లో కృష్ణా బోణీ

**విజయవాడ స్పోర్ట్స్, మే 31 :** మూలపాడు స్టేడియం వేదికగా శుక్రవారం ప్రారంభమైన ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెంట్రల్ జోన్ సీనియర్ పురుషుల వన్డే అంతర్ జిల్లా క్రికెట్ టోర్నీలో కృష్ణాజట్టు పశ్చిమగోదావరి జట్టుపై 164 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించి బోణీ కొట్టింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కృష్ణా జట్టు 50 ఓవర్లలో 285/9 పరుగులు చేసింది. బహ్మతేజ 140 బంతుల్లో 11 ఫోర్లు, ఓ సిక్స్‌తో 122 పరుగుల చేసి సత్తా చాటాడు. అనంతరం 286 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పశ్చిమగోదావరి జట్టు 31.2ఓవర్లలో 121కు ఆలౌటైంది. మునీష్ వర్మ ఒక్కడే 32 పరుగుల అత్యధికంగా చేశాడు. కృష్ణా బౌలర్లలో ప్రమోదకు 4, టి.శివకుమార్‌కు 3 వికెట్లు లభించాయి.

### పద్మ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

**మచిలీపట్నం టౌన్ :** గణతంత్ర దినోత్సవ వేడుకల్లో అందించనున్న పద్మ పురస్కారాలు-2025కుగాను అంతర్జాతీయ క్రీడలలో ప్రతిభా పాటవాలు ప్రదర్శించిన క్రీడాకారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు జిల్లా క్రీడాధికార సంస్థ అధికారి ఝాన్సీ తెలిపారు. దరఖాస్తులను ఆగస్టు 1లోగా పంపాలన్నారు. వెబ్‌సైట్‌లో దరఖాస్తు వివరాలు ఉన్నాయన్నారు.

**బ్రాయిలర్ ధరలు**



| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 150, 159, 170 |
| చికెన్ విత్ స్కిన్ | 292 |
| చికెన్ స్కిన్‌లెస్ | 302 |

**నెక్ కోడిగుడ్డు ధర**

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.85

## పురందేశ్వరికి సత్కారం



**చిట్టినగర్, మే 31:** విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పార్టీలో కొత్తగా చేరిన వారిని పరిచయం చేసుకునేందుకు శుక్రవారం వేదికను ఏర్పాటు చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు కార్యకర్తలు, మహిళా నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పురందేశ్వరి నాయకత్వాన్ని పలువురు ప్రస్తుతించారు. రాష్ట్ర నాయకుడు బుల్లా విజయకుమార్ పురందేశ్వరికి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. దుశ్శాలువా కప్పి సత్కరించారు.

# పొగాకు వినియోగాన్ని మానండి

### నో టొబాకో డే కార్యక్రమంలో వక్తలు



ప్రసంగిస్తున్న శౌరిబాల



నగరంలో ర్యాలీ నిర్వహించిన వైద్యులు

**రైల్వేస్టేషన్, మే 31:** పొగాకు వినియోగాన్ని మానుకుని ఆరోగ్యాలను పరిరక్షించుకోవాలని, ధూమపానం నుంచి పిల్లలను దూరంగా ఉంచాలని రైల్వే ఆసుపత్రిలో వరల్డ్ నో టొబాకో డే సందర్భంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో వక్తలు పేర్కొన్నారు. ఓపీడీ బ్లాకులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆసుపత్రి చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.శౌరిబాల ముఖ్యఅతిథిగా హాజరై పొగాకు నుంచి పిల్లలను రక్షించడం భవిష్యత్తు తరాలను పరిరక్షించడంపై ప్రసంగించారు. పొగాకు నుంచి పిల్లలను పరిరక్షించడం ఈ ఏడాది నినాదంగా ఇచ్చారని తెలిపారు. అదనపు చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.జయదీప్, శ్రీనిధి డెంటల్ హాస్పిటల్ సర్జన్ డాక్టర్ రామ్‌సునీల్, డాక్టర్ సింధూ పొగాకుతో కలిగే ఆరోగ్య నష్టాలను వివరించారు. ఈ సందర్భంగా పొగాకు వ్యతిరేక ప్రతిజ్ఞ చేశారు.

● నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో శుక్రవారం విజయవాడ రైల్వేస్టేషన్ ప్రాంగణంలో పొగాకు, ధూమపానాలకు వ్యతిరేకంగా ఉందామంటూ సంతకాల సేకరణ చేశారు. పోస్టర్లను ఆవిష్కరించారు. విజయవాడ రైల్వేస్టేషన్ డైరెక్టర్ ఎం.శైలజ, నవజీవన్ బాలభవన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫాదర్ ఎస్.రత్నకుమార్, రైల్వే రక్షక చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ ప్రభాత్ రంజన్ పాల్గొన్నారు. ప్రోగ్రామ్ మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు, జోనల్ కో ఆర్డినేటర్ కె.ప్రియాంక, డి.వెంకటేశ్వరరావు. నీతోడు మానసికవికాస కేంద్రం సైకాలజిస్ట్ జి.అనూష పాల్గొన్నారు.

● ఆర్టీసీ బస్టాండ్‌లో నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్టీసీ విజయవాడ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ బషీర్ అహ్మద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. పొగాకుకు వ్యతిరేకంగా సంతకాలు చేశారు. నవజీవన్ బాలభవన్ సిబ్బంది, ఆర్టీసీ డిపో ఉద్యోగులు, డ్రైవర్లు, కండక్టర్‌లు, ప్రయాణికులు పాల్గొన్నారు. ధూమపానాల వలన కలిగే అనర్థాలను వక్తలు వివరించారు.

**హెల్త్ యూనివర్సిటీలో ఉద్యోగులకు దంత పరీక్షలు**

డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీలో శుక్రవారం ఉద్యోగులకు ఓరల్ హెల్త్ చెకప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇండియన్ డెంటల్ అసోసియేషన్ కోస్టల్ ఆంధ్ర బ్రాంచ్ విజయవాడ శాఖ ఆధ్వర్యంలో ఈ క్యాంప్‌ను నిర్వహించారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ కె.బాబ్జి ఓరల్ హెల్త్‌పై అవగాహన కల్పించారు. రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి ప్రతిజ్ఞ చేయించారు. ఇండియన్ డెంటల్ అసోసియేషన్ కోస్టల్ ఆంధ్ర బ్రాంచ్ విజయవాడ సెక్రటరీ డాక్టర్ సీహెచ్ ఆర్.సునీల్, ప్రెసిడెంట్ డాక్టర్ భవన్‌ల ఆధ్వర్యంలో అన్ని రకాల నోటీ పరీక్షలను నిర్వహించారు. గ్రామాల్లో అవగాహన ర్యాలీలు, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, వీధి నాటకాలు ద్వారా అవగాహన కల్పించారు. హెల్త్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం డాక్టర్ కె.వివేకానంద్ సమన్వయకర్తగా వ్యవహరించారు.

**వరల్డ్ నో టొబాకో డే ర్యాలీ**

**గవర్నర్‌పేట:** శ్రీ మానస సైకియాట్రిక్ నర్సింగ్‌హోం ఆధ్వర్యంలో వరల్డ్ నో టొబాకో డే కార్యక్రమం జరిగింది. శుక్రవారం ఎంజీ రోడ్డులోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద మానస ఆసుపత్రి, వీఐపీ వాకర్స్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ మానస కాజ, డాక్టర్ అయోధ్య ఆర్‌కెలు ధూమపానం వల్ల కలిగే ప్రమాదాలు, వాటి నివారణ గురించి ప్రసంగించారు. సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ సూరె పవన్‌కుమార్ పొగాకు ఉత్పత్తుల వల్ల వచ్చే నోరు, జీర్ణకోశ సమస్యలను వివరించారు.

# సోషల్ మీడియా సెల్ పనితీరు భేష్ : కలెక్టర్



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కలెక్టర్

**కృష్ణలంక, మే 31 :** సాధారణ ఎన్నికలు-2024 నేపథ్యంలో ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) అనుబంధ సోషల్ మీడియా సెల్ పనితీరు భేష్ అంటూ జిల్లా ఎన్నికల ప్రధాన అధికారి, కలెక్టర్ ఎస్.దిల్లీరావు పేర్కొన్నారు. నగరంలోని శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాలకు చెందిన నలుగురు బీఏ (హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్) విద్యార్థులు కలెక్టరేట్‌లో ఇంటర్న్‌షిప్‌లో భాగంగా సోషల్ మీడియా సెల్ కార్యకలాపాల్లో భాగస్వాము లయ్యారు. ఈ ఏడాది ఫిబ్రవరి 19 నుంచి మే 19 వరకు ఇంటర్న్‌షిప్‌ను విజయవంతంగా పూర్తిచేసిన విద్యార్థులకు కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్‌లో సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ దిల్లీరావు మాట్లాడుతూ సోషల్ మీడియా సెల్ ద్వారా సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) ఓటరు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు సోషల్ మీడియా మానిటరింగ్‌లో మంచి సేవలు అందించారని ప్రశంసించారు. సీనియర్ అసిస్టెంట్ బి.ఈశ్వర్ పాల్గొన్నారు.

## కౌంటింగ్ రోజున శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న గవర్నరుపేట పోలీసులు

**వన్‌టౌన్, మే 31:** ఓట్ల లెక్కింపు రోజున శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దని గవర్నరుపేట పోలీసులు ప్రజలకు సూచించారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్ పరిధి బీసెంట్‌రోడ్డులో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సౌత్‌జోన్ ఏసీపీ జి.రత్నరాజు ఆధ్వర్యంలో గవర్నరుపేట సీఐ డి.వి రమణ, ఎస్సైలు కృష్ణబాబు, నారాయణమ్మ, పోలీసు సిబ్బంది తదితరులు ఈ అవగాహనలో పాల్గొన్నారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఫలితాలు తమకు అనుకూలంగా రాకపోతే ఎవరూ కూడా చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడవద్దని హెచ్చరించారు. ఎవ్వరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై కఠిన చర్యలుంటాయన్నారు. అన్ని ప్రాంతాల్లోను 144 సెక్షన్, యాక్ట్ 30 అమలులో ఉందన్నారు. ఎటువంటి విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులకు అనుమతి లేదన్నారు. బాణాసంచా కాల్చినా, అల్లర్లకు పాల్పడినా, గొడవలను ప్రోత్సహించినా చర్యలుంటాయని తెలిపారు.

# ఘనంగా కృష్ణ జయంతి వేడుకలు



ఎస్‌కేసీవీ చిల్డ్రన్స్ ట్రస్ట్‌లో అన్నదానం

**గవర్నర్‌పేట, మే 31:** సూపర్‌స్టార్ కృష్ణ 81వ జయంతిని పురస్కరించుకుని ఫ్యాన్స్ ఆధ్వర్యంలో శుక్రవారం నగర వ్యాప్తంగా అనేక చోట్ల కేక్ కటింగ్‌లు, పేదలకు చీరలు పంపిణీ, మజ్జిగ పంపిణీ కార్యక్రమాలు జరిగాయి. సూపర్ స్టార్ కృష్ణ, మహేష్‌బాబు ఫ్యాన్స్ రాష్ట్ర అధ్యక్షుడు సుధాస్వామి ఆధ్వర్యంలో లెనిన్ సెంటర్‌లోని పార్కు ఆవరణలో ఏర్పాటు చేస్తున్న కృష్ణ కాంస్య విగ్రహం వద్ద కేక్ కటింగ్ జరిగింది. మున్సిపల్ శానిటరీ సిబ్బందికి చీరలు పంపిణీ చేశారు. పేదలకు పండ్లు, ఆహార పొట్లాలు, మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. ఫ్యాన్స్ సభ్యుడు పాపారావు ఆధ్వర్యంలో మరిపిళ్ల చిట్టి పార్కులో జయంతి వేడుకలు నిర్వహించారు. పేదలకు చీరలు, మజ్జిగ పంపిణీ చేశారు. కృష్ణలంక పాత దుస్తుల సెంటర్‌లో పేదలకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ జరిగింది. బ్రహ్మం ఆధ్వర్యంలో నాలుగు స్తంభాల సెంటర్‌లో మహిళలకు చీరలు పంపిణీ, ఆహారం పొట్లాలు అందజేశారు. సుధాస్వామి ఆధ్వర్యంలో సాయి ఆశ్రమంలో చిన్నారులకు బిస్కెట్లు పంపిణీ చేశారు. కె. విజయ్, రాజు, సాయి, వెంకటేశ్వరరావు, టైలర్ పాల్గొన్నారు. ● ఎస్‌కేసీవీ పిల్లల ట్రస్ట్ గాంధీనగర్‌లో అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వీఎల్‌రెడ్డి, చంటీ యూత్, టీం మహేష్ యూత్, ఫోర్స్ సూర్య, సాకేత్, బాజీ, ఇబ్రహీం, మహేష్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.



## మజ్జిగ పంపిణీ

**అజిత్‌సింగ్‌నగర్, మే 31 :** కంపానియన్‌షిప్ సంస్థ ఆధ్వర్యంలో వైవీ రావు ఆసుపత్రి వద్ద శుక్రవారం మజ్జిగ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు షబ్బీర్, సి. రాజుద్దీన్‌లు ప్రయాణికులకు మజ్జిగ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడేళ్ల క్రితం ప్రారంభమైన కంపానియన్‌షిప్ సేవా సంస్థ ద్వారా రక్తదానం, మజ్జిగ పంపిణీ వంటి కార్యక్రమాల ద్వారా సమాజ సేవలో ఎల్లప్పుడు ముందుంటుందని పేర్కొన్నారు. వేసవిలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం ఇండస్ట్రియలిస్ట్ ఇంతియాజ్ పర్యవేక్షణలో జరుగుతోందని తెలిపారు.

# మంచినీటి సరఫరాను మెరుగుపరచాలి

● నగర కమిషనర్‌ను కోరిన బొండా ఉమా

**అజిత్‌సింగ్‌నగర్, మే 31 :** నగరంలో మంచినీటి సరఫరాను మెరుగుపరచి ప్రజలు రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్‌ను కోరారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో శుక్రవారం విలేకర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర శివారుల్లో మురుగునీరు సరఫరా అవుతోందని, దీని వల్లన ప్రజలు రోగాల బారినపడుతున్నారని చెప్పారు. తక్షణమే నగరపాలక సంస్థ అధికారులు మెరుగైన మంచినీరు సరఫరా చేయా లనికోరినట్లు తెలిపారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు.

**పరిసరాల పరిశుభ్రత పాటించాలి**

● జోనల్ కమిషనర్ శివరామకృష్ణ

**మాచవరం:** నగరంలో ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని జోనల్ కమిషనర్ శివరామకృష్ణ అన్నారు. 2వ డివిజన్‌లోని యారం వారి వీధి, కార్మికనగర్, కొండ ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. అనంతరం స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు.

**కాచి చల్లార్చిన నీటినే వాడాలి**

**వన్‌టౌన్:** కాచి చల్లార్చిన నీటినే వాడాలని 52వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు తన వాహనానికి ఫ్లకార్డును ఏర్పాటు చేసుకుని మైకు ద్వారా శుక్రవారం ప్రచారం నిర్వహించారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలని ఆయన వార్డు ప్రజలను చైతన్యవంతులను చేశారు.



## సాగునీటి ప్రాజెక్టులను భ్రష్టు పట్టించిన జగన్‌రెడ్డి

● టీడీపీ తెలుగు రైతు ఉపాధ్యక్షుడు గద్దె ప్రసాద్

**విద్యాధరపురం, మే 31:** గత ఐదేళ్ల కాలంలో జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అన్ని విధాలా నష్టపోయిందని సాగునీటి ప్రాజెక్టులను భ్రష్టు పట్టించాడని టీడీపీ తెలుగు రైతు ఉపాధ్యక్షుడు గద్దె ప్రసాద్ విమర్శించారు. శుక్రవారం ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్‌రెడ్డి తాను రైతు పక్షపాతినని ఉపన్యాసాలు చేశాడు తప్ప రైతులను ఏమాత్రం ఆదుకోలేదని వారి కడుపు కొట్టాడని విమర్శించారు. కేంద్రం నుంచి ఆర్థిక సహాయం అందుకుని కరువు మండలాల్లో రైతాంగాన్ని ఆదుకునే సదుపాయం ఉన్నప్పటికీ ఆ మాత్రం కూడా చేయలేదన్నారు. రాజకీయ దాడులు, కక్ష సాధింపు చర్యలపై దృష్టి పెట్టిన జగన్‌రెడ్డి రైతాంగ ప్రయోజనాలను గాలికి వదిలేశాడన్నారు. రాబోయేది ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వమని, చంద్రబాబు, సీఎం అవుతారని, రైతాంగ కష్టాలను తీరుస్తారని పోలవరాన్ని నూరుశాతం అభివృద్ధి చేసి చూపిస్తారని చెప్పారు.

## నేడు హనుమజ్జయంతి వేడుకలు

**భారతీనగర్, మే 31:** కరెన్సీనగర్ దాసాంజనేయ స్వామి ఆలయంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ శ్రీరామభక్త సేవాసమితి కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి స్వామి వారికి పంచామృత అభిషేకములు, సహస్రనామ ఆకు పూజ, మంత్ర పుష్పార్చన వంటి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని తెలిపారు.

## నేటి నుంచి అంతర్జాతీయ యోగా దినోత్సవం

**ధర్నాచౌక్, మే 31:** పదవ అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 1 నుంచి 21 వరకు నిర్వహిస్తున్నట్లు యోగ శక్తి సాధన సమితి వ్యవస్థాపకుడు డాక్టర్ మాకాల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 'అసహజ మరణాల తగ్గింపునకు యోగా చికిత్స' అనే అంశంపై ప్రజల్లో అవగాహన, వారే తగ్గించుకునేలా శిక్షణ, ప్రత్యక్ష ప్రదర్శనలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. జూన్ 21న యోగశక్తి చికిత్సను ప్రజల్లోకి తీసుకువెళ్తున్న వ్యక్తులు, సంస్థలకు అవార్డులను ప్రదానం చేస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు 90003 47367 నంబర్‌ను సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు .

## ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్‌ను మరో పదేళ్లు కొనసాగించాలి

రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానం

**ధర్నాచౌక్, మే 31:** హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా జూన్ 2తో గడువు ముగుస్తున్న నేపథ్యంలో మరో పదేళ్లు కొనసాగించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సామాజిక సంఘాలు, రాజకీయ పార్టీల ప్రతినిధుల రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది. సామాజిక, రాజకీయ ఉద్యమనేత కొరివి వినయ్‌కుమార్ అధ్యక్షతన గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఈ కార్యక్రమం జరిగింది. పలువురు వక్తలు మాట్లాడుతూ ఏపీ పునర్విభజన చట్టం-2014ను అమలు చేసేందుకు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, పౌర సంస్థలతో ఉమ్మడి కార్యాచరణ కమిటీని రూపొందించి నిరంతరం రాష్ట్ర హక్కుల సాధన కోసం ఉద్యమించాలని సమావేశం తీర్మానించింది. జైఆంధ్ర డెమోక్రటిక్ ఫోరం ప్రతినిధులు మేడా శ్రీనివాస్, అవదానుల హరి, కాంగ్రెస్ నేత షేక్ బాజీ, ఏపీ ప్రొఫెషనల్ ఫోరం అధ్యక్షుడు నేతి మహేశ్వరరావు, దళిత బహుజన ఫ్రంట్ ప్రతినిధులు ప్రకాష్, కోసనం రాము, ఎల్‌హెచ్‌పీఎస్ నేతచంద్రనాయక్, రెల్లి సంఘం నేత నాగేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.





కార్మికులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న టింకరర్స్ అసోసియేషన్ సభ్యులు

## కార్మికులకు మజ్జిగ పంపిణీ

**ఆటోనగర్(పెనమలూరు), మే 31:** ఆటోనగర్‌లో కార్మికుల వేసవి దాహాన్ని దృష్టిలో పెట్టుకొని ఆటోనగర్ టింకరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్మికులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఎండదెబ్బ కొట్టకుండా కార్మికులకు మజ్జిగ పంపిణీ మంచి కార్యక్రమమని ఐలా చైర్మన్ సుంకర దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. అసోసియేషన్ ప్రెసిడెంటు చిమటా పూర్ణ, సెక్రటరీ మునీర్‌లను ఆయన అభినందించారు. డాక్టర్ అబ్దుల్ కలాం, కత్తిక శివనాగేశ్వరరావు, బాహుబలేంద్ర కోటేశ్వరరావు, కొమ్మిడి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

## ముగిసిన క్రికెట్ శిక్షణ

**విజయవాడ స్పోర్ట్స్, మే 31 :** సిద్ధార్థ మెడికల్ కళాశాల ఆవరణలో గత నెల రోజుల నుంచి కేడీసీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి క్రికెట్ శిక్షణా శిబిరం శుక్రవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి కేడీసీఏ క్రికెట్ అసోసియేషన్ అడహక్ కమిటీ చైర్మన్ టి.త్రినాథ్ రాజు ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఈ సారి అనూహ్యంగా 500 మంది శిక్షణకు రావడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. సత్తా చాటిన క్రికెటర్లకు మెరిట్ సర్టిఫికెట్లను త్రినాథ్‌రాజు పంపిణీ చేశారు. క్రికెట్ హెడ్ విజయసారథి, కోచ్ గాంధీలు పాల్గొన్నారు.

## గూడవల్లి ఆయుష్ ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య సదుపాయాలు

**వన్‌టౌన్, మే 31:** విజయవాడకు సమీపంలోని గూడవల్లిలో గల గవర్నమెంట్ ఆయుష్ ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య సదుపాయాలున్నాయని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పాపినేని మల్లిక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అన్ని రోగాలకు వైద్యం అందుబాటులో ఉందని తెలిపారు. రోగులు వచ్చేటప్పుడు ఇప్పటికే తాము వాడుతున్న మందులు, వైద్య నివేదికలను వెంట తెచ్చుకోవాలని చెప్పారు. వివరాలకు 9849654641 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

## సృజనాత్మకతకు పదును పెట్టాలి

● కేబీఎన్ కళాశాల అధ్యక్షుడు ఉసిరిక ఉమామహేశ్వరరావు

**వన్‌టౌన్, మే 31:** మహిళలు తమలోని సృజనాత్మకతకు పదునుపెట్టి సాధికారితను సాధించాలని కేబీఎన్ కళాశాల అధ్యక్షుడు ఉసిరిక ఉమామహేశ్వరరావు అన్నారు. యూజీసీ ఉమెన్స్ స్టడీ సెంటర్, క్రీడా విభాగం, పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో వేసవిని పురస్కరించుకుని మహిళలకు, చిన్నారులకు నిర్వహించిన ఉచిత శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన జ్యోతి వెలిగించి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకున్న మహిళలను అభినందించారు. జూనియర్ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శశికళ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడారు. సీనియర్ అధ్యాపకురాలు డాక్టర్ సుభాషిణి, డాక్టర్ జి.కృష్ణవేణి, విశైలజ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు, చిన్నారులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు.

## ఆక్టోపస్ ఎస్పీ రవీంద్రనాథ్ బాబుకు వీడ్కోలు, అభినందన



పోలీసు అధికారులు, ఉద్యోగులతో రవీంద్రనాథ్ బాబు

**వన్‌టౌన్, మే 31:** ఆక్టోపస్ ఆపరేషన్స్ ఎస్పీ రవీంద్రనాథ్ పదవీ విరమణ సందర్భంగా వడ్డేశ్వరంలోని ఆక్టోపస్ హెడ్ క్వార్టర్ కార్యాలయంలో శుక్రవారం ఆయనకు ఘనంగా వీడ్కోలు, అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆక్టోపస్ ఐజీ సీహెచ్ శ్రీకాంత్ మాట్లాడుతూ రవీంద్రనాథ్ బాబు ఉద్యోగ దీక్షా దక్షతలను వివరించారు. పోలీసు శాఖలో 23 సంవత్సరాల పాటు పలు విభాగాల్లో ఆయన పనిచేశారన్నారు. ఎస్పీ బి. రవిచంద్ర, అదనపు ఎస్పీ కే రామచంద్రమూర్తి, డీఎస్పీ పి.జగ్గునాయుడు, అధికారులు, సిబ్బంది పాల్గొని రవీంద్రబాబుకు అభినందనలు తెలిపారు.

## ఆయుష్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో వాకథాన్




**పాయకాపురం, మే 31 :** పొగాకు సంబంధిత సిగరెట్ తాగడం వల్ల ఆరోగ్యం మీద దుష్ప్రభావం చూపిస్తుందని ఆయుష్ హాస్పిటల్స్ నిర్వహణ కమిటీ చైర్మన్ డాక్టర్ రమేష్ బాబు అన్నారు. ప్రపంచ పొగాకు రహిత దినోత్సవం సందర్భంగా ఆయుష్ హాస్పిటల్స్ విజయవాడ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలో వాకథాన్ నిర్వహించారు. ఈ సందర్భంలో డాక్టర్ రమేష్ బాబు మాట్లాడుతూ చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, అప్పుడే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని అన్నారు. పల్మనాలజిస్ట్ డాక్టర్ ఎంఎస్ గోపాలకృష్ణ మాట్లాడారు. వాకథాన్ అనంతరం నగరంలోని ఆయుష్ హాస్పిటల్ సమీపంలోని కూడలి వద్ద హాస్పిటల్స్ సిబ్బంది, వైద్యులు మానవహారం చేపట్టారు. డాక్టర్ హేమేష్, మేడ జయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# మూడు పాత్రల చుట్టూ తిరిగే కథ



శర్వానంద్ హీరోగా నటించిన 35వ చిత్రం 'మనమే' ఈ నెల 7న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్రకథానాయిక కృతి శెట్టి శుక్రవారం ఈ సినిమా విశేషాలను మీడియా సమావేశంలో వెల్లడించారు.

- ఈ సినిమాలో నా పాత్ర పేరు సుభద్ర. ఇప్పటివరకూ చేసిన పాత్రలకు భిన్నంగా ఉంటుంది. క్యూట్, సాఫ్ట్, బబ్లీ క్యారెక్టర్స్ చేసిన నాకు ఈ పాత్ర చాలా కొత్తగా అనిపించింది. 'ఇంత స్ట్రిక్ట్‌గా ఉండాలా' అని దర్శకుడు శ్రీరామ్‌ను అడిగాను. అలాగే కావాలనడంతో ఆయన్ని ఫాలో అయ్యా.
- శర్వానంద్ అద్భుతంగా నటించారు. నిన్నే సినిమా చూశా. ప్రతి సీన్‌లో ఆయన అదరగొట్టారు. ఇందులో నా ఫేవరెట్ సీన్ ఒకటుంది. దాని కోసం చాలా వెయిట్ చేశా. ఎలా చేయాలా అని ఆలోచించా. కానీ శర్వానంద్ చాలా క్యాజువల్‌గా వచ్చి ఒకే ఒక్క నిమిషంలో ఆ సీన్ చేయడంతో చాలా ఆశ్చర్యపోయా.
- స్ట్రాంగ్ ఎమోషన్స్ కలిగిన ఎంటర్‌టైనింగ్ ఫిల్మ్ 'మనమే'. కిడ్, పేరెంట్ ఎమోషన్ కూడా ఉంది. గ్లోబల్ ఆడియన్స్‌కు కనెక్ట్ అవుతుంది. శర్వానంద్, నేను, పాప.. ఈ మూడు పాత్రల చుట్టూ తిరిగే కథ ఇది. అందుకే 'మనమే' అని పేరు పెట్టారు.
- చిత్రం షూటింగ్ లండన్‌లో జరిగింది. అక్కడి వెదర్ ఎప్పటికప్పుడు మారిపోయేది. ఒక్కోసారి హఠాత్తుగా వర్షం పడేది. అటువంటి వాతావరణంలోనూ నిర్మాత చక్కగా ప్లాన్ చేయడం వల్ల షూటింగ్ బాగా జరిగింది.
- ప్రస్తుతం మూడు తమిళ చిత్రాల్లో నటిస్తున్నాను. అలాగే ఓ మలయాళ సినిమా కూడా చేస్తున్నాను.



## తెలంగాణ తేజం

'జబర్దస్త్' ఫేమ్ రాకింగ్ రాకేశ్ ప్రధాన పాత్ర పోషించిన చిత్రం 'కేసీఆర్' (కేశవ చంద్ర రమావత్). ఈ చిత్రంలోని 'తెలంగాణ తేజం' అంటూ సాగే గీతాన్ని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆవిష్కరించారు. గోరేటి వెంకన్న రచించి.. మను, కల్పనతో కలసి ఆలపించారు. చరణ్ అర్జున్ స్వరాలు సమకూర్చారు. ఈ కార్యక్రమంలో చిత్రబృందంతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



## జేమ్స్‌బాండ్ ఇన్ కుప్పం

సుధీర్‌బాబు నటిస్తున్న తాజా చిత్రం 'హరోంహర'. జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వంలో సుమంత్ నాయుడు గ్రాండ్‌గా నిర్మించిన ఈ యాక్షన్ థ్రిల్లర్ థియేట్రికల్ ట్రైలర్‌ను సూపర్‌స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా విడుదల చేశారు. ఈ ట్రైలర్‌ను మహేశ్‌బాబు సోషల్ మీడియా ద్వారా విడుదల చేసి, సుధీర్‌బాబుకు, టీమ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ట్రైలర్ లాంచ్ వేడుకకు దర్శకులు అనిల్ రావిపూడి, సంపత్ నంది హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అనిల్ రావిపూడి మాట్లాడుతూ 'సుధీర్‌బాబు రాంబోలా ఉంటాడు. ఇందులో జేమ్స్‌బాండ్ ఇన్ కుప్పం అని చెప్పడం ఆసక్తికరంగా ఉంది. రాయలసీమ యాస లో సుధీర్‌బాబు అద్భుతంగా మాట్లాడారు. ఆయన కెరీర్‌లోనే ఇది బిగ్గెస్ట్ హిట్ కావాలి' అని కోరారు. 'ట్రైలర్ టెర్రిఫిక్‌గా ఉంది. విజువల్స్ బాగున్నాయి. సినిమా పెద్ద హిట్ కావాలి' అన్నారు సంపత్ నంది. సుధీర్‌బాబు మాట్లాడుతూ 'యాక్షన్ సినిమా చేయమని కృష్ణగారు చాలా సార్లు చెప్పారు. ఈ సినిమా ఆయనకు ఆనందం కలిగిస్తుందని నమ్ముతున్నా. ఇండియన్ సినిమాలో 'హరోం హర' లాంటి బ్యాక్‌డ్రాప్ ఉన్న సినిమా రాలేదనే చెప్పాలి. యాక్షన్ సీన్లు టాప్ రేంజ్‌లో ఉంటాయి. నిర్మాతలు బాగా ఖర్చు పెట్టారు. దర్శకుడు సాగర్ ఈ సినిమా కోసం సరికొత్త ప్రపంచాన్ని సృష్టించారు' అని చెప్పారు. జూన్ 14న సుధీర్‌బాబు మాస్ సంభవం చూడబోతున్నారని దర్శకుడు జ్ఞానసాగర్ ద్వారక చెప్పారు.

## సినిమా చూడకుండానే రివ్యూ ఇస్తున్నారు



విష్వక్‌సేన్

'సినిమా చూసి నిజాయితీగా సమీక్ష రాయడంలో తప్పు లేదు. కానీ కొంత మంది సినిమా చూడకుండానే ఆ పని చేస్తున్నారు. మరికొందరు కావాలనే నెగెటివ్ రివ్యూలు రాస్తున్నారు. అయితే వాటిని పట్టించుకోకుండా ప్రేక్షకులు 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' చిత్రాన్ని చూసేందుకు వస్తున్నారు' అని హీరో విష్వక్‌సేన్ అన్నారు. ఆయన హీరోగా కృష్ణచైతన్య దర్శకత్వం వహించిన ఈ చిత్రం శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా విష్వక్‌సేన్ మీడియాతో మాట్లాడుతూ 'కొన్నాళ్లుగా థియేటర్ల దగ్గర ప్రేక్షకుల సందడి కనిపించ లేదు. ఇప్పుడు మా 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' చిత్రం కోసం మళ్లీ ప్రేక్షకులు థియేటర్ల బాట పడుతున్నారు. మా సినిమాకు వస్తున్న ప్రేక్షకాదరణకు చాలా ఆనందంగా ఉంది. 'విష్వక్ సినిమాల ఎంపికలో వైవిధ్యం చూపుతార'ని ప్రశంసలు వస్తున్నాయి. నాలోని నటుడిగా సవాల్ విసిరేలా ఉంటేనే సినిమా చేయడం అలవాటు. ఇకముందు కూడా ఇలాంటి కొత్తదనం ఉన్న కథలతో వస్తాను' అన్నారు. 'బాలకృష్ణ గారు, వారి కుటుంబ సభ్యులు 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' సినిమా బావుందని మెచ్చుకున్నారు. మంచి వసూళ్లు వస్తున్నాయని అన్ని ఏరియాల డిస్ట్రిబ్యూటర్లు ఫోన్ చేసి చెప్పారు. దీనికి త్వరలోనే సీక్వెల్ చేస్తాం' అని కృష్ణ చైతన్య చెప్పారు.

## సూపర్ హీరో మూవీ 'వెపన్'

సత్యరాజ్, వసంత్ రవి, తాన్యా హోప్ ముఖ్య పాత్రలు పోషించిన 'వెపన్' చిత్రం ట్రైలర్‌ను గురువారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సత్యరాజ్ మాట్లాడుతూ 'పెన్, మైక్, మీడియా.. అనేవి రియల్ వెపన్స్. అలాగే ఓటు మరో గొప్ప వెపన్. కంటెంట్ బాగుంటే ప్రస్తుతం భాష అనేది హద్దుగా లేదు. దర్శకుడు గుహన్



అద్భుతమైన కథ రాశారు. సూపర్ హ్యూమన్ సాగాలో సాగే ఈ సినిమా ఓ ట్రెండ్ క్రియేట్ చేస్తుంది. నిర్మాత మన్సూర్ బాగా ఖర్చు పెట్టారు. ఈ నెల 7న మా సినిమా విడుదలవుతోంది. చూసి ఆదరించండి' అని కోరారు. 'ఇదొక స్పై థ్రిల్లర్. సెకండాఫ్ చాలా విభిన్నంగా ఉంటుంది. సత్యరాజ్ లోని ఓ కొత్త కోణాన్ని ఈ చిత్రంలో చూస్తారు. సెకండ్ వరల్డ్ వార్‌ను బేస్ చేసుకుని కథ రాసుకున్నా. ఈ సినిమా కోసం కొన్ని చోట్ల ఏఐ టూల్స్ వాడాం' అని చెప్పారు దర్శకుడు గుహన్. సూపర్ మ్యాన్, బ్యాట్ మ్యాన్ లా ఈ సినిమా కూడా ఓ సూపర్ హీరో మూవీలా నిలిచిపోతుందని నటుడు వసంత్ రవి చెప్పారు. కొత్త కాన్సెప్ట్‌తో ఈ సినిమా ఉంటుందని తాన్యా హోప్ తెలిపారు.

## 'సత్యభామ' కోసం ఫైట్ చేశా



కాజల్ అగర్వాల్ లీడ్ రోల్‌లో నటించిన 'సత్యభామ' చిత్రం ఈ నెల ఏడున విడుదల కానుంది. నవీన్‌చంద్ర కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రానికి సుమన్ చిక్కాల దర్శకుడు. విడుదల నేపథ్యంలో గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో చిత్ర సమర్పకుడు శశికిరణ్ తిక్క మాట్లాడుతూ 'గూఢచారి' చిత్రం చేస్తున్న సమయంలోనే నా విత్రుడు రమేశ్ ఈ కథ చెప్పారు. ప్రేక్షకులకు చెప్పాల్సిన కథ అనిపించింది. ఈ సినిమా పూర్తిగా హైదరాబాద్ బేస్డ్‌గా ఉంటుంది' అని చెప్పారు. దర్శకుడు సుమన్ చిక్కాల మాట్లాడుతూ 'ఇందులో ఎమోషన్‌తో పాటు యాక్షన్ ఉంది. అవి రెండూ చేయగలరు కనుకే కాజల్‌ను తీసుకున్నాం. ప్రతి పోలీస్ ఆఫీసర్ జర్నీలో ఒక స్పెషల్ కేసు ఉంటుంది. ఇందులో కాజల్ కూడా ఒక కేసుని పర్సనల్‌గా తీసుకుని, దాని విషయంలో ఎమోషనల్ అవుతుంది' అని చెప్పారు. కాజల్ మాట్లాడుతూ 'నా కెరీర్‌లో కొత్త ప్రయత్నం చేశా. ఇలాంటి పాత్ర, చిత్రం చేయడం ఇదే మొదలు. కథ వినగానే కొత్తగా అనిపించి ఓకే చెప్పేశా. 'సత్యభామ' కంటే ముందు లేడీ ఓరియెంటెడ్ చిత్రాల కోసం చాలా ఆఫర్లు వచ్చాయి కానీ అంగీకరించలేదు. ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాను. కెరీర్‌లో మొదటిసారిగా భారీ ఫైట్లు చేశా. ఇది నా సెకండ్ ఇన్నింగ్స్ కాదు కానీ కెరీర్ మరో కొత్త దశలో వెళుతుందనుకోవచ్చు' అన్నారు.

## మిడిల్ క్లాస్ కష్టాలు



అజయ్ ఘోష్, చాందిని చౌదరి ముఖ్య పాత్రలు పోషించిన 'మ్యూజిక్ షాప్ మూర్తి' చిత్రం ఈ నెల 14న విడుదల కానుంది. ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ఈ సినిమాను విడుదల చేస్తోంది. శివ పాలడుగు దర్శకత్వంలో హర్ష గారపాటి, రంగారావు గారపాటి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రం ట్రైలర్‌ను శుక్రవారం విడుదల చేశారు. నవ్విస్తూ కంట తడిపెట్టేలా ఈ ట్రైలర్ ఉంది. మిడిల్ క్లాస్ కష్టాలు చూపిస్తూ కలను నెరవేర్చుకోవడానికి వయసుతో సంబంధం లేదని ఈ చిత్రంలో చూపించబోతున్నారని ట్రైలర్ చూశాక అర్థమవుతుంది. 'అన్నీ మన కోసమే చేసుకోకూడదు.. కొన్ని మన అనుకునేవాళ్ల కోసం వదులుకోవాలి' అంటూ మూర్తి పాత్ర పోషించిన అజయ్ ఘోష్ చెప్పిన ఎమోషనల్ డైలాగ్ ఆకట్టుకుంటుంది.


## 'జై బోలో కృష్ణ'

దివంగత నటుడు సూపర్‌స్టార్ కృష్ణ మనవడు అశోక్ గల్లా హీరోగా నటిస్తున్న చిత్రం 'దేవకీ నందన వాసుదేవ'. కృష్ణ జయంతి సందర్భంగా శుక్రవారం ఈ చిత్రం నుంచి 'జై బోలో కృష్ణ' అంటూ సాగే



గీతాన్ని యూనిట్ విడుదల చేసింది. కృష్ణాష్టమి నేపథ్యంలో సాగే ఈ గీతానికి రఘురామ్ అడ్వకేట్ సాహిత్యం అందించగా, భీమ్స్ సిసిరోలియో స్వరాలందించారు. స్వరాగ్ కీర్తన్ ఆలపించారు. ఈ చిత్రంలో వారణాసి మానస కథానాయిక. అర్జున్ జంధ్యాల దర్శకత్వంలో సోమినేని బాలకృష్ణ నిర్మిస్తున్నారు. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తామని యూనిట్ తెలిపింది.

## ఈసారి క్రికెటర్ బయోపిక్‌తో...



'దేదే ప్యార్ దే 2, రెయిడ్ 2, సన్ ఆఫ్ సర్దార్ 2, సింగమ్ అగైన్' లాంటి పలు చిత్రాల షూటింగ్‌తో బిజీగా ఉన్నారు బాలీవుడ్ హీరో అజయ్ దేవ్‌గణ్. ఇప్పుడు ఆయన తన తదుపరి చిత్రాన్ని ప్రకటించారు. ఆయన హీరోగా పాత తరం క్రికెటర్ పల్వాంకర్ బాలూ జీవిత గాథను తెరపైకి తెస్తున్నారు. నిర్మాత ప్రీతీ సిన్హా సోషల్ మీడియా ద్వారా ఈ చిత్రానికి సంబంధించిన వివరాలను తెలిపారు. తిగ్మాన్షు ధూలియా ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నట్లు ఆమె చెప్పారు. ప్రముఖ చరిత్రకారుడు రామచంద్రగుహ రాసిన 'ఏ కార్నర్ ఆఫ్ ఏ ఫారెన్ ఫీల్డ్' పుస్తకం ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. భారతదేశంలో తొలి తరం దళిత క్రికెటర్‌గా పల్వాంకర్ ఖ్యాతి గడించారు. ఈ ఏడాది చివర్లో ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్లే అవకాశం ఉంది. ఇటీవలే అజయ్ దేవ్‌గణ్ క్రీడానేపథ్య చిత్రం 'మైదాన్'తో విజయాన్ని సొంతం చేసుకున్నారు. 'మిషన్ మంగళ్' చిత్రం దర్శకుడు అజయ్‌శక్తితో ఆయన ఓ చిత్రం చేయబోతున్నట్లు బాలీవుడ్ వర్గాల్లో వినిపిస్తోంది.

*నిర్నీరం మథితం ఘనేన సహితం సంభావితం శర్కరా*
*ధూళీ ఖిర్మరిచోద్భవేన రజసావ్యాలోడితం కించన్!*
*జాతీ చంపక కేతకీ సురభితం మృత్పాత్ర మధ్యస్థితం*
*జిహ్వాయాం విదధాత్యుపక్షమ మిదం మోదాఫలైష్టాఫలమ్!*

# పెరుగు... అరటిపండు

అన్నం వండటం నేర్చిన మనిషి ఆ అన్నంలోకి కూర వంటం గురించి ఆలోచించినప్పుడు మొదటగా చేతికి దొరికింది అరటికాయ. దాన్ని కాల్చి, తొక్క తీసి, లోపల గుజ్జుని తిన్నాడు. నూనె వాడకం తెలిశాక దానికి తాలింపు పెట్టుకుని తిన్నాడు. పండించడం నేర్చాక పండుని పెరుగులో కలుపుకొని తిన్నాడు. ఎందుకు పెట్టారో తెలియదు కానీ, దీని వృక్షనామం 'మూసా పేరడైజియాకా' అనడంలోనే ఇది స్వర్గం నుంచి వచ్చిన పండు అనే భావన కనిపిస్తుంది.

పెరుగుకూ, అరటిపండుకూ విరోధం ఏమీ లేదు. రెండూ కఫాన్ని పెంచుతాయి కాబట్టి, జాగ్రత్తగా తినాలంతే. రెండింటికీ వాతాన్ని తగ్గించే గుణం ఉంది కాబట్టి, వాతమే సమస్త అనారోగ్యాలకూ కారణం కాబట్టి, వాతహరమైన అరటి, పెరుగు మిశ్రమం గురించి కొన్ని విషయాలు తెలుసుకోవాలి.

అరటిపండుకు ఆలస్యంగా అరిగే గుణం ఉంది. అయినా పెరుగు లేదా మజ్జిగతో పాటు దీన్ని తీసుకొంటే తేలికగా అరుగుతుంది. నరాల పటుత్వం పెంచుతుంది. పేగుల్లో వచ్చే వ్యాధుల్లో యాసిడ్ ఎక్కువగా పేరుకోకుండా నియంతిస్తుంది. స్వతహాగా ఇది క్షార స్వభావం కలిగిన ఫలం. ఇందులోని పొటాషియం, ఆహారపీచు, సి-విటమిన్, కార్బోహైడ్రేట్స్, షుగరు పదార్థాలు... ఇవన్నీ యాసిడ్‌కు వ్యతిరేకంగా పని చేస్తాయి. ఇవి తక్షణ శక్తిదాయకాలు.

**ఔషధ గుణాలెన్నో...**

కలరా, జిగురు విరేచనాలు, అమీబియాసిస్, హిస్టీరియా లాంటి మానసిక వ్యాధులు, రక్తస్రావం, పురుషత్వంలో బలహీనతలు, స్త్రీల సంబంధిత వ్యాధులు, అరికాళ్ల, కడుపులో మంటలు, నీరసం, నిస్సత్తువ తగ్గుతాయి. పెరుగు, అరటి జంటను ఆహార ప్రయోజనాలకు చక్కగా వాడుకోగలగాలి. అరటిపండు, పెరుగు, పంచదార కలిపితే పంచామృతాల్లో సగం కలిసినట్టే. తేనె, నెయ్యి, పాలు కూడా కలుపుకొంటే మరీ మంచిది. అప్పుడది అరటిపండు పంచామృతం అవుతుంది. శరీరానికి చలవనీ, పోషణనీ, శక్తినీ ఇచ్చి, ఆరోగ్యాన్ని కాపాడేది ఏదైనా సరే మన రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం మంచిది. క్షేమశర్మ తన 'క్షేమ కుతూహలం' గ్రంథంలో చెప్పిన అనేక వంటకాలు, పానీయాలు ఆయుర్వేద పరంగా రూపొందించినవి. భక్తితోనూ తీసుకోతగినవి.



**గుండెకు బలం...**

'రసాల రసవష్టల్యం మధురం పిత్తనాశనమ్! సుహృద్యం కఫకృత్నోకం కించిద్విష్టంభకారకమ్!'... ఈ తియ్యని రసాల పానీయం పైత్యాన్ని తక్షణం తగ్గించి, శరీరానికి చలవనిస్తుంది. గుండెకు బలాన్నిస్తుంది. కొద్దిగా కఫాన్ని పెంచుతుంది. అందుకే దాల్చినచెక్క, వియరియాల పొడి తగినంత కలుపుతారు. ఇవి కఫం పెరగకుండా చూస్తాయి. ఈ అరటిపండు లస్సీకి మలబద్ధకం కలిగించే గుణం కొంచెం ఉందని (కించిద్విష్టంభకారకమ్) క్షేమశర్మ చెప్పాడు. కలరా లాంటి వ్యాధులు వచ్చినప్పుడు ఈ పానీయాన్ని తాగితే విరేచనంలో నీటి శాతాన్ని తగ్గించి, ప్రాణాపాయ స్థితిని తప్పిస్తుంది. స్వతహాగా అరటిపండు విరేచనకారే. ఫైబరు కలిగినది కదా. షుగరు వ్యాధి, స్థూలకాయాలతో బాధపడేవారు మినహా అందరూ ఆస్వాదించదగిన గొప్ప పానీయం ఇది.

**అరటిపండు లస్సీ...**

శుభ్రమైన వస్త్రంలో పెరుగు వడగట్టి, నీటిని తీసేసి, లస్సీ కోసం వాడాలని చెప్పాడు క్షేమశర్మ. ఎటు తిరిగీ చిలికి, పలచగానే చేస్తాం కదా... మళ్లీ వడగట్టడం దేనికనే సందేహం రావచ్చు. పెరుగులో నీటికి వగరు గుణం ఉంటుంది. తియ్యని పానీయం తయారు చేస్తూ, వగరు నీటిని కలపడం దేనికనేది ఆయన భావన. వడగట్టిన పెరుగు నీటిని విడిగా మజ్జిగలో కలిపి తాగవచ్చు.

మంచి మట్టి కుండ తీసుకొని, అందులో వడగట్టిన పెరుగు, గుజ్జుగా చేసిన అరటిపండు, దాల్చిన చెక్క, పంచదార, వియరియాల పొడి కలిపి, బాగా చిలకాలి. లేదంటే మిక్సీ పట్టుకోవచ్చు. చిక్కని, తియ్యని, మాటైన ద్రవం తయారవుతుంది. ఈ పానీయంలో మల్లెపూలు, మొగలి రేకులు, సంపెంగలు కలిపి కాసేపు మూతపెట్టి ఉంచండి. పూల పరిమళం ఆ లస్సీకి బాగా పట్టుకుని ఉంటుంది. తాగే ముందు మరొకసారి వడగట్టుకుని, పూలన్నిటినీ తీసేస్తే పరిమళ భరితమైన అరటిపండు లస్సీ తయారైనట్టే. ఇలాంటి గొప్ప పానీయం తాగేవారిని చూసి ఇతరులు అసూయపడతారని అంటాడు క్షేమశర్మ.

• గంగరాజు అరుణాదేవి

**మీకు తెలుసా?**

## ఏ సప్లిమెంట్లు ఎప్పుడు?



మనందరం ఏవో ఒక సప్లిమెంట్లు తీసుకుంటూనే ఉంటాం. విటమిన్ మాత్రలు, క్యాల్షియం టాబ్లెట్లు వాడుకుంటూ ఉంటాం. అయితే ఏ సప్లిమెంట్లు ఎప్పుడు వేసుకోవాలో మీకు తెలుసా?

**ఉదయం:** విటమిన్ సి, బి కాంప్లెక్స్, అమీనో యాసిడ్లు, ఎమ్‌సిటి ఆయిల్

**బ్రేక్‌ఫాస్ట్:** విటమిన్ ఎ, డి, ఇ, కె సప్లిమెంట్లు, బ్రేక్‌ఫాస్ట్ తిన్న తర్వాత వేసుకోవాలి.

**మధ్యాహ్నం:** మెగ్నీషియం, ఒమేగా 3 మధ్యాహ్న భోజనం వేళ వేసుకోవాలి.

**రాత్రి:** క్యాల్షియం, యాంటీఆక్సిడెంట్లు, ప్రొబయాటిక్స్, మినరల్ సప్లిమెంట్లు రాత్రి భోజనం తర్వాత వేసుకోవాలి.



అందుబాటులో ఉండే ప్రతి ఆహారాన్ని తినాలంటే మధుమేహగ్రస్తులకు (డయాబెటిక్) కాస్త ఇబ్బందే. ఆహారం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిందే. డయాబెటిక్ సమస్య ఉండే వారు.. ఇంట్లోనే మింట్ మిల్లెట్ పులావ్, మల్టీ గ్రెయిన్ మిల్లెట్ ఇడ్లీ, మిల్లెట్ సలాడ్, మూంగ్‌దాల్ విజిటేబుల్ సూప్ వంటలను సులువుగా చేసుకోవచ్చు ఇలా...

# మధుమేహులకు... మేలైన వంటకాలు!

**వంటిల్లు**

## మింట్ మిల్లెట్ పులావ్

**కావాల్సిన పదార్థాలు**

కొర్రలు- 1 కప్పు, పచ్చి కొబ్బరి పాలు- 1 కప్పు, పుదీనా ఆకులు- 1 కప్పు, తరిగిన అల్లం- 1 ఇంచు(సన్నగా తరగాలి), బిర్యానీ ఆకు- 1, యాలకులు- 2, లవంగాలు-2, దాల్చిన చెక్క- 1, నెయ్యి- టేబుల్ స్పూన్, ఉప్పు- రుచికి తగినంత, పచ్చిమిర్చి- 2 (సన్నగా తరగాలి)

**తయారీ విధానం**

ముందుగా కొర్రలను శుభ్రంగా మూడుసార్లు కడగాలి. చల్లని నీటిలో కొర్రలను రాత్రంతా నానబెట్టాలి. వంట చేసేప్పుడు ముందుగా మూకుడులో కొబ్బరిపాలు వేసి గోరువెచ్చగా వేడిచేసి పక్కన ఉంచుకోవాలి. ఆ తర్వాత పుదీనా ఆకులను శుభ్రంగా కడిగి పక్కన ఉంచుకోవాలి. మరో మూకుడులో నెయ్యి తీసుకోవాలి. నెయ్యి వేడయ్యాక బిర్యానీ ఆకు, యాలకులు, లవంగాలు, దాల్చిన చెక్క వేసి గరిటెతో కలపాలి. మంచి సువాసన వచ్చేదాక గరిటెను తిప్పుతూ వేయించుకోవాలి. ఇందులో తరిగిన అల్లం ముక్కలతో పాటు పచ్చిమిర్చి ముక్కలు వేయాలి. తరిగిన పుదీనా ఆకులు వేయాలి. పుదీనా వాసన వచ్చేంత వరకూ వేయించాక.. నానబెట్టిన కొర్రలు వేయాలి. మూడు నిముషాల పాటు గరిటెతో తిప్పితే.. కొర్రలకు మసాలా పదార్థాలు, పుదీనా ఫ్లేవర్ అంటుతుంది. ఆ తర్వాత పక్కన బెట్టిన కొబ్బరి పాలు వేసి రెండు నిముషాలు కలిపాక.. తగినంత ఉప్పు వేయాలి. మూకుడు మీద మూత బెట్టి కనీసం ఇరవై నిముషాలు ఉడకబెట్టాలి. చివరగా మంటను తగ్గించి మిశ్రమాన్ని గరిటెతో కలపాలి. మింట్ మిల్లెట్ పులావ్ రెడీ. అవసరం అనుకుంటే పుదీనాతో పాటు నెయ్యిలో వేయించిన జీడిపప్పును గార్నిష్ చేసుకోవాలి. వేడివేడి మింట్ మిల్లెట్ పులావ్ తింటే ఎంతో రుచికరంగా ఉంటుంది.



## మల్టీ గ్రెయిన్ మిల్లెట్ ఇడ్లీ

**కావాల్సిన పదార్థాలు**

జొన్నలు- అరకప్పు, సజ్జలు-అరకప్పు, రాగులు- అరకప్పు, మూడు స్పూన్లు- నగ్గుబియ్యం, సన్నబియ్యం- అరకప్పు, మినప్పప్పు- ఒకటిన్నర కప్పు, ఉప్పు- రుచికి తగినంత

**తయారీ విధానం**

ముందుగా బౌల్‌లో జొన్నలు, సజ్జలు, రాగులు, నగ్గుబియ్యం, సన్నబియ్యం, మినప్పప్పు వేసిన తర్వాత నీళ్లు పోసి శుభ్రం చేయాలి. రెండుసార్లు కడగాలి. ఆ తర్వాత వీటిని రాత్రంతా నానబెట్టుకోవాలి.

రాత్రంతా నానబెట్టిన తర్వాత ఈ మిల్లెట్స్‌ను జార్‌లో వేసి తగినంత ఉప్పు వేసి మిక్సీ పట్టుకోవాలి. ఇడ్లీలకు తగినట్లు మిక్సీ పట్టుకోవాలి. ఈ మిశ్రమాన్ని ఒక పాత్రలో వేసి రాత్రంతా పులియబెట్టాలి. ఉదయాన్నే ఉప్పు సరి చూసుకోవాలి. లేకుంటే తగినంత కలపాలి. ఇక ఇడ్లీ పాత్రల్లో పిండి వేసి.. ఇడ్లీలు చేసుకోవటమే. ఈ మల్టీగ్రెన్ మిల్లెట్ ఇడ్లీలను పల్లీల చట్నీ లేదా సాంబార్‌తో తినాలి.

## మిల్లెట్ సలాడ్

**కావాల్సిన పదార్థాలు**

సజ్జలు- కప్పు, చిన్న టమోటాలు- కప్పు, కీరా- 1, పాలకూర ఆకులు- 3, లేత కొత్తిమీర- 3 ఆకులు, మిక్స్ బెల్ పెప్పర్ ముక్కలు- కొన్ని, తరిగిన తాజా పుదీనా ఆకులు- పావు కప్పు, నిమ్మకాయ-1, పావు కప్పు- బ్లాక్ ఆలివ్స్, పెప్పర్- రుచికి తగినంత, ఉప్పు- రుచికి తగినంత, వర్జిన్ ఆలివ్ ఆయిల్- మూడు టేబుల్ స్పూన్లు



**తయారీ విధానం**

మొదట సజ్జలను రాత్రంతా నానబెట్టుకోవాలి. ఉదయాన్నే వంట చేసేప్పుడు.. మూకుడులో సజ్జలతో పాటు రెండు కప్పుల నీళ్లు పోసి ఉడకబెట్టాలి. ఆ తర్వాత మంటను తగ్గించి.. ఇరవై నిముషాల పాటు ఉంచితే సజ్జలు నీళ్లను పూర్తిగా పీల్చుకుంటాయి. ఈ మిశ్రమాన్ని పక్కన ఉంచి చల్లారబెట్టాలి.

మరో మూకుడులో కొన్ని నీళ్లు పోసి తరిగిన పాలకూర ఆకులు, చిన్న టమోటాలు, కొత్తిమీర, మిక్స్ బెల్ పెప్పర్, పుదీనా, బ్లాక్ ఆలివ్స్ వేసి కుక్ చేయాలి. ఆ తర్వాత చల్లార్చాలి. ఈ మిశ్రమాన్ని సజ్జలున్న మూకుడులో వేయాలి. మరో చిన్న మూకుడులో నిమ్మరసం, ఆలివ్ ఆయిల్, పెప్పర్, తగినంత ఉప్పు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని మిల్లెట్స్ మిశ్రమంలో వేసి బాగా కలపాలి. ఆ తర్వాత మూకుడును కాస్త కదిపి.. చివరగా పుదీనా ఆకులతో గార్నిష్ చేసుకుని తినాలి.

## మూంగ్‌దాల్ వెజిటెబుల్ సూప్

**కావాల్సిన పదార్థాలు**

పచ్చి పెసర పప్పు- కప్పు, తరిగిన సొరకాయ ముక్కలు- అర కప్పు, టొమాటో- 1 (సన్నగా తరగాలి), నీళ్లు- నాలుగు కప్పులు, పసుపు- టీస్పూన్, జీలకర్ర- 1 టీస్పూన్, పెప్పర్- అరటీస్పూన్, సన్నగా తరిగిన అల్లం ముక్కలు- పావు టీస్పూన్, నెయ్యి- టేబుల్ స్పూన్, ఉప్పు- రుచికి తగినంత, తాజా కొత్తిమీర- అరకప్పు

**తయారీ విధానం**

ముందుగా మూకుడులో పెసరపప్పుతో పాటు నీళ్లుపోసి మెత్తగా అయ్యేంత వరకూ ఉడికించాలి.

మరో మూకుడులో నెయ్యి వేసి వేడయ్యాక జీలకర్ర వేసి కలపాలి. దీనికి టొమాటో ముక్కలు, అల్లం ముక్కలు, పెప్పర్ పొడి, పసుపు వేసి గరిటెతో బాగా కలపాలి.

ఇందులోకి ఉడకబెట్టిన పెసరపప్పు, సొరకాయ ముక్కలు వేసి కలిపాక తగినంత ఉప్పు వేసి మెత్తగా నలపాలి. తాజా కొత్తిమీరతో గార్నిష్ చేసుకుని సూప్ తాగాలి.



# కొలువు వదిలి, కూరగాయలు పండిస్తూ...



**చదువుకున్న యువతీయువకులు ఎవరైనా పట్నంలో ఉద్యోగం సంపాదించి, అక్కడే స్థిరపడాలని కలలు కంటారు. కానీ ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన స్మరికా చంద్రాకర్, పట్నం ఉద్యోగాన్ని వదిలేసి, కూరగాయలను పండించడం కోసం ఊరి బాట పట్టింది. ఎకరానికి 55 టన్నుల టమాటాలు పండిస్తూ, 8 రాష్ట్రాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదిగిన స్మరికా స్ఫూర్తివంతమైన కథ ఇది.**

**వినూత్నం**

పూణెలో ఐదేళ్ల పాటు టెలికాం సెక్టార్‌లో పని చేసిన స్మరికా, 2018లో రాయ్‌పూర్‌కు వెళ్లిపోయి, బాలింతలు, పిల్లల ఆరోగ్యభద్రతకు సంబంధించిన స్వచ్ఛంద సంస్థలో ఉద్యోగం చేసింది. ఆమె నాన్న, తాతయ్యలు ఆరు దశాబ్దాలుగా ఛత్తీస్‌ఘడ్, ధమ్తారి జిల్లాలోని చార్మడియా గ్రామంలో వ్యవసాయం చేస్తూ ఉన్నారు. చిన్నప్పటి నుంచి వాళ్లనే చూస్తూ పెరిగిన స్మరికా, వాళ్ల అడుగు జాడల్లోనే నడవాలని అనుకుంది. కానీ ఎమ్‌బిఎ చదువు, ఆమెను పూణె వైపు పరుగులు పెట్టించింది. అయినా ఆమె వ్యవసాయం పట్ల ఆసక్తి కోల్పోలేదు. రాయ్‌పూర్‌లో ఉద్యోగం చేసే సమయంలో వారాంతాల్లో ఇంటికి వెళ్లిపోయి కుటుంబ వ్యవసాయ పద్ధతులను మరింత క్షుణ్ణంగా అర్థం చేసుకోవడం మొదలుపెట్టింది. అప్పట్లో వాళ్ల కుటుంబం వరి పండిస్తూ ఉండేది. ఉద్యోగం మానేసి పూర్తిగా వ్యవసాయానికే అంకితమైపోదామని నిర్ణయించుకున్న స్మరికా వ్యవసాయ పద్ధతుల్లో తనదైన శైలిని కనబరచాలని అనుకుంది. ఆ సందర్భం గురించి మాట్లాడుతూ... " 2021లో పూర్తి స్థాయిలో వ్యవసాయం చేయగలిగే ఆత్మవిశ్వాసాన్ని సాధించి, ఉద్యోగానికి రాజీనామా చేసి మా ఊరు వచ్చేశాను. అంతకంటే ముందు, 2018 నుంచి 2021 వరకూ, అధిక ధరల వల్ల వరి పంటతో మా కుటుంబానికి రాబడి తగ్గడాన్ని నేను గమనించాను. బదులుగా ఒకే పంటను పండిస్తే, వాతావరణం అనుకూలించకపోతే పంట మొత్తం ఒక్కసారిగా తుడిచిపెట్టుకుపోతుంది. కాబట్టి ఏ పంటను పండించాలా అని ఆలోచిస్తుండగా, నాన్న, దుర్గేష్ చంద్రాకర్, కూరగాయలను పండిద్దామని అనడంతో, వాటిని పండించడమే మేలని నిర్ణయించుకున్నాను" అంటూ వ్యవసాయంలో అడుగుపెట్టిన తొలినాళ్ల గురించి చెప్పుకొచ్చింది స్మరికా.

**క్షుణ్ణంగా తెలుసుకుని...**

ఏ పంట పండాలన్నా భూసారం భేషుగ్గా ఉండాలి. మట్టిలో పోషకాల కొరత ఉండకూడదు. అలాగే మొక్కల మధ్య తగిన దూరం పాటించాలి. వీటి గురించిన లోతైన అవగాహన కోసం 20 ఎకరాల పొలంలో పంటలను సాగు చేసే ముందు వ్యవసాయ నిపుణులను కలిసి తగిన సూచనలు, సలహాలను పొందింది స్మరికా. నీటి వృథాను అరికట్టడం కోసం తుంపరి సేద్యాన్ని ఆశ్రయించింది.



ఈ రకమైన సేద్యంతో ద్రవరూప ఎరువులు నేరుగా మొక్కల వేర్లలోకి చేరుకునే అదనపు ప్రయోజనం కూడా దక్కుతుందని ఆమె గ్రహించింది. తుంపరి సేద్యం చేసే రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సబ్సిడీలను కూడా సద్వినియోగం చేసుకుంది. "పొలాన్ని దున్నిన తర్వాత, 12 ట్రాలీల ఆవు పేడను జోడించి కొన్ని రోజుల పాటు ఎండకు అలాగే వదిలేశాను. అలాగే భూసారాన్ని పెంచడం కోసం సూక్ష్మపోషకాలు, ఎంజైమ్‌లను కూడా జోడించాను. తర్వాత టమాటా మొక్కలను నాటడం కోసం బెడ్లను ఏర్పాటు చేసి మొక్కల మధ్య ఎడం ఉండేలా చూసుకున్నాం. వంకాయ మొక్కలను అంతర పంటగా కాకుండా విడిగా నాటాం. దాంతో మేం ఆశించిన ఫలితాలొచ్చాయి. మార్కెటింగ్‌లో స్మరికాకు ఆమె చదివిన ఎమ్‌బిఎ కూడా ఎంతో బాగా తోడ్పడింది.

**8 రాష్ట్రాలకు ఎగుమతి చేస్తూ...**

కూరగాయలను అమ్మడం కోసం, పంట కోతకొచ్చే ముందే స్థానిక మండీలకు వెళ్లి, రైతులతో మాట్లాడి, దుకాణదారులు, వ్యాపారులతో ఒక నెట్‌వర్క్ తయారుచేసుకుంది. "మేం ఎకరానికి 55 టన్నుల చొప్పున 13 ఎకరాల్లో టమాటాలను పండించగలిగాం. బ్రోకర్లతో మాట్లాడి ముందుగానే ధరలను నిర్ణయించుకుంటూ ఉంటాను. తర్వాత కూరగాయలను ప్యాక్ చేసి బ్రోకర్ల దగ్గరకు చేరుస్తూ ఉంటాను. అలా మా కూరగాయలు స్థానికంగానే కాకుండా, భువనేశ్వర్, పాట్నా, కోల్‌కతా, గౌహతి, ఢిల్లీ, హైదరాబాద్, బెంగుళూరు, విశాఖపట్నాలకు ఎగుమతి అవుతూ ఉంటాయి. టమాటో, వంకాయలను కోసిన తర్వాత, ఎరువులు, వెర్మికంపోస్టలను కలిపి నేలను అలాగే మూడు నెలల పాటు ఏ పంటా వేయకుండా వదిలేస్తాం. అలా వదిలేయడం వల్ల భూమి తిరిగి సారవంతమై రెండో పంటకు సిద్ధమవుతుంది. ఈ ఏడాది సొరకాయలు, దోసకాయలను పండించాలని అనుకుంటున్నాం. ఈ పంటల తర్వాత మళ్లీ టమాటాలు, వంకాయలను పండిస్తాం. హార్టికల్చర్‌లో భాగంగా మా 20 ఎకరాల భూమిని 35 ఎకరాలకు విస్తరించాలన్నదే నా లక్ష్యం" అంటూ ఉత్సాహంగా చెప్పుకొస్తోంది స్మరికా.

**గ్రామీణులకు ఉపాధి కల్పిస్తూ...**

స్మరికా కూరగాయల తోటల్లో కూరగాయలు కోయడానికీ, వాటిని ప్యాక్ చేయడానికీ, లోడ్ చేయడానికి 70 మంది పని చేస్తూ ఉంటారు. వాళ్ల గురించి ప్రస్తావిస్తూ.... "కూరగాయలను పండించడం వల్ల, మా గ్రామంలో ఉపాధి అవకాశాలు పెరిగాయి. దాంతో ప్రజలు ఉపాధి కోసం పట్టణాలకు వలస వెళ్లే బాధ తప్పింది. పీక్ సీజన్‌లో నేను ఇంకా ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తూ ఉంటాను." అని చెప్పుకొచ్చింది స్మరికా. స్మరికా తండ్రి, తాత, అమ్మమ్మలు కూడా స్మరికాను చూసి ఎంతో గర్వపడుతున్నారు. "నిజానికి మా గ్రామస్థులందరికీ కూడా ఇది గర్వించదగిన విషయం. స్మరికా మంచి రైతే కాదు, మంచి వ్యాపారవేత్త కూడా" అని గర్వంతో పొంగిపోతూ చెప్తున్నాడు స్మరిక తండ్రి దుర్గేష్.

**మేకప్**

## నవయవ్వనంగా...

మేకప్‌తో వృద్ధాప్య ఛాయలను కొంత మేరకు దాచవచ్చు. అయితే అందుకోసం సరైన మేకప్ ఉత్పత్తులను, మెలకువలను అనుసరించాలి. వయసును దాచే మేకప్ టిప్స్ ఏవంటే...

**అతి అనర్థం:** వృద్ధాప్య ఛాయలు దాచడం కోసం అతిగా మేకప్ వేస్తే అసలుకే మోసం వస్తుంది. మేకప్ ముడతల్లో ఇంకిపోయి, చర్మం మీది సన్నని గీతలు మరింత స్పష్టంగా కనిపిస్తాయి. కాబట్టి మేకప్ మరీ మందంగా కాకుండా, వాటిని తగ్గించే ప్రయత్నం చేయాలి.

**లిక్విడ్ మేకప్:** వయసు పైబడేకొద్దీ చర్మం తేమ కోల్పోయి, పొడిబారుతుంది. కాబట్టి చర్మం మృదువుగా కనిపించడం కోసం లిక్విడ్ మేకప్ ఉత్పత్తులు ఎంచుకోవాలి. బ్లషెస్, బ్రాంజర్స్ కూడా ద్రవ రూపంలోనివే ఎంచుకోవాలి.

**మాయిశ్చరైజర్:** ప్రతి రాత్రీ నిద్రకు ముందు మాయిశ్చరైజర్ తప్పనిసరిగా అప్లై చేసుకోవడంతో పాటు ఉదయం మేకప్‌కు ముందు టింటెడ్ మాయిశ్చరైజర్‌ను పూసుకోవాలి.

**సహజ మెరుపు:** పైబడే వయసుతో చర్మం సహజసిద్ధమైన మెరుపును కోల్పోతుంది. కాబట్టి బ్లషర్, బ్రాంజర్ల వాడకాన్ని తగ్గించి, బదులుగా లిక్విడ్ హైలైటర్‌ను పెంచాలి.

**ఐ మేకప్:** తక్కువ ఐమేకప్ చేసుకోవాలి. ముదురు రంగు, స్మోకీ కలర్స్‌కు బదులుగా తేలికపాటి రంగులను ఎంచుకోవాలి. ముదురు రంగు ఐలైనర్, ఐ షాడోలతో వయసుకు మించి కనపడతారు. కాబట్టి తేలిక రంగులే ఎంచుకోవాలి.



**న్యాచురల్ లిప్‌స్టిక్:** బోల్డ్ కలర్స్‌కు బదులుగా న్యూడ్ లేదా లేత రంగు లిప్‌స్టిక్ ఎంచుకోవాలి. లిప్‌గ్లాసులు, చమ్కీల్లా మెరిసే లిప్‌స్టిక్‌ల జోలికి వెళ్లకూడదు. లిప్‌లైన్ కూడా సహజసిద్ధంగా ఉండేలా చూసుకోవాలి. అదనపు లిప్‌స్టిక్‌ను బ్లాటింగ్ పేపర్‌తో తొలగించి, పల్చగా పౌడర్ అద్దుకోవాలి.

**ఐ మేకప్:** కృత్రిమ కనురెప్పలకు బదులుగా నాణ్యమైన మస్కారా ఉపయోగించాలి. ఐ షాడో కూడా లేత గులాబీ రంగులో ఉండేలా చూసుకోవాలి. మస్కారా, ఐలైనర్ పొదుపుగా వాడుకోవాలి.

నవ్య 'స్మార్ట్ పేజీ'లో ఆసక్తికర కథనాల కోసం... ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/okRYNp6 లో చదవండి.

# సమరానికి సై

## నేడు బంగ్లాతో భారత్ వామప్

**రేపటి నుంచే టీ20 ప్రపంచకప్**

మెగా టోర్నమెంట్‌కు సమయం సమీపించింది. మరి కొద్ది గంటల్లో టీ20 వరల్డ్ కప్‌నకు తెర లేవనుంది. ఇప్పటికే కొన్ని జట్లు వామప్ మ్యాచ్‌ల ద్వారా తమ బలాలు, బలహీనతలపై అంచనాకొచ్చేశాయి. వాటిని సమీక్షించుకొని, తప్పులు సవరించుకొని అసలు సమరానికి సన్నద్ధమయ్యాయి. టీమిండియా కూడా సిసలైన ఫైట్‌కు ముందు బంగ్లాదేశ్‌తో నేడు ప్రాక్టీస్ మ్యాచ్‌లో తలపడనుంది.




న్యూయార్క్: ప్రతిష్ఠాత్మక టీ20 వరల్డ్‌కప్‌లో ఈనెల 5న జరిగే అసలు సమరానికి టీమిండియా అస్త్రశస్త్రాలను పరీక్షించుకోనుంది. ఈక్రమంలో బంగ్లాదేశ్‌తో శనివారం వామప్ మ్యాచ్‌లో రోహిత్ సేన తలపడనుంది. టీమిండియాలోని 15 మంది ఆటగాళ్లు.. ఐపీఎల్‌లో ఆయాజట్లకు ప్రాతినిధ్యం వహించారు. దాంతో అందరికీ మ్యాచ్ ప్రాక్టీస్ కొరత ఏమాత్రం లేదు. ఈ ప్రాక్టీస్ మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ మినహా మిగిలిన 14 మంది క్రికెటర్లంతా బరిలో దిగనున్నారు. విరాట్ శుక్రవారమే జట్టుతో చేరిన నేపథ్యంలో అతడు ఈ మ్యాచ్‌కు దూరం కానున్నాడు. అయితే మెగా టోర్నీకి కాంబినేషన్లను రూపొందించడమే భారత్‌కు సవాలు కానుంది. మంచి ఫామ్‌లో ఉన్న యశస్వీ జైస్వాల్‌ను తుది జట్టులో ఎలా చేర్చాలన్నదే జట్టు మేనేజ్‌మెంట్ ముందున్న సమస్య. జైస్వాల్‌ను తీసుకొంటే పవర్ హిట్టర్ శివమ్ దూబేను పక్కన పెట్టక తప్పదు. అందువల్ల జైస్వాల్‌ను పక్కన పెడితే..రోహిత్, విరాట్ ఇన్నింగ్స్‌ను ప్రారంభిస్తారు. అదే జరిగితే టోర్నమెంట్ తదుపరి దశలో దూబేకు అవకాశం కల్పించవచ్చు. అలవోకగా సిక్సర్లు దంచే దూబే టోర్నమెంట్‌లో ఎక్స్ ఫాక్టర్ అవుతాడనేది విశ్లేషకుల అంచనా. బుమ్రాతో కొత్త బంతిని పంచుకొనే బౌలర్ విషయంలోనూ జట్టు సముచిత నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఐపీఎల్‌లో సిరాజ్‌తో పాటు అర్షదీప్ ధారాళంగా పరుగులు ఇచ్చుకున్నారు. దాంతో వీరి ఫామ్ జట్టును కలవరపరుస్తోంది. కొత్తగా ఏర్పాటు చేసిన డ్రాప్ ఇన్ పిచ్‌లపై అర్షదీప్ మెరుగ్గా బౌలింగ్ చేస్తాడని క్రికెట్ పండితులు చెబుతున్నారు. అమెరికాలో భారత్ మ్యాచ్‌లు ఉదయాన్నే మొదలవుతాయి కనుక..బౌలింగ్‌లో వైవిధ్యం కనబర్చడం ముఖ్యం. ఈ కోణంలో చూస్తే సిరాజ్ కంటే అర్షదీప్ మెరుగైన ప్రత్యామ్నాయం అవుతాడు. ఇక..స్లో వికెట్‌పై షకీబల్, మెహ్దీ హసన్, ముస్తాఫిజుర్‌ను మిడిలార్డర్ బ్యాటర్లు ఎలా ఎదుర్కొంటారనేది ఆసక్తికరం. కాగా, టీ20 ప్రపంచకప్ తొలి మ్యాచ్ భారత కాలమానం ప్రకారం ఆదివారం ఉదయం 6.30 గంటలకు ఆతిథ్య అమెరికా, కెనడా జట్ల మధ్య జరగనుంది. అదేరోజు రాత్రి 8 గంటలకు వెస్టిండీస్‌తో పపువా న్యూగిని జట్టు తలపడనుంది.

### బేస్‌బాల్ దేశంలో.. క్రికెట్‌కు దారి దొరికేనా?

18వ శతాబ్దం మధ్య కాలంలో అమెరికాలో ఆదరణ పొందిన క్రికెట్ ఆ తర్వాతి కాలంలో కనుమరుగైంది. ఇప్పుడు మళ్లీ టీ20 వరల్డ్‌కప్‌తో క్రమంగా వేళ్లూనుకోవాలనుకొంటోంది. కానీ, బేస్‌బాల్ మేనియా నెలకొన్న అగ్రరాజ్యంలో మెగా ఈవెంట్‌తో క్రికెట్ ఏమేరకు యువతను ఆకర్షించగలుగుతుందనేది చర్చనీయాంశంగా మారింది. ప్రపంచ క్రికెట్‌ను నడిపిస్తోంది భారత్ అనడంలో సందేహం లేకపోయినా.. అమెరికాలో కూడా క్రికెట్ విస్తరణకు భారీగా అవకాశాలున్నాయని ఐసీసీ లెక్కలేస్తోంది. యూఎస్‌లో భారీగా క్రికెట్ అభిమానులున్నారని చెబుతోంది. అంతేకాకుండా 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో క్రికెట్‌కు చోటు దక్కడం కూడా ఆట పాపులారిటీని పెంచే అవకాశం ఉంది. అందులోనూ ఈ వరల్డ్‌కప్‌నకు స్ప్రింట్ దిగ్గజం ఉసేన్ బోల్ట్‌ను ప్రచారకర్తగా ఎంచుకోవడం కూడా అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) వ్యూహంలో భాగమే. యూఎస్‌లో ముద్ర వేయగలిగితే.. విశ్వవ్యాప్తంగా క్రికెట్ విస్తరణకు మార్గం మరింత సుగమమవుతుందన్నది ఐసీసీ ఆలోచన.

**సుదీర్ఘకాలం తర్వాత..:** పొట్టికప్‌లో భాగంగా అమెరికాలోని మూడు స్టేడియాలు న్యూయార్క్, డాలస్, ఫ్లోరిడాలో మొత్తం 16 మ్యాచ్‌లు జరగనున్నాయి. కాగా, 1844లో యూఎస్, కెనడా మధ్య న్యూయార్క్‌లో అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్ జరిగింది. మళ్లీ 180 ఏళ్ల తర్వాత వరల్డ్‌కప్‌తో ఇక్కడ క్రికెట్ జోష్ కనిపించనుంది. ఒకానొక దశలో జెంటిల్మన్ క్రీడను అమెరికాలో విపరీతంగా ఆడేవారు. కానీ, 1860ల్లో దేశంలో నెలకొన్న అంతర్యుద్ధం కారణంగా బేస్‌బాల్‌కు ఆదరణ పెరిగింది. అయితే, క్రికెట్ మూలాలున్న దేశాల వారు అమెరికాలో ఎక్కువగా స్థిరపడడం సానుకూలాంశం. అయితే, క్రికెట్‌ను కూడా బాస్కెట్‌బాల్, బేస్‌బాల్ తరహాలో కెరీర్‌గా మలచుకోవచ్చనే భరోసా యువతలో కలిగించగలిగితే చాలని ప్రస్తుత టోర్నీలో తలపడుతున్న యూఎస్ జట్టు స్పిన్నర్ నిసర్గ్ పటేల్ చెప్పాడు. ఈ క్రమంలో ఆటను మూలాలకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నాడు.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)






### మురికివాడల నుంచి కప్పు దాకా..

మురికివాడలో పుట్టినా.. తన క్రికెట్ ప్రతిభతో ఎంతో మందికి స్ఫూర్తిగా నిలవాలనుకొంటున్నాడు ఉగాండ పేసర్ జుమా మియాగి. తొలిసారి టీ20 వరల్డ్‌కప్‌నకు అర్హత సాధించిన ఈ జట్టు ఆశలన్నీ మియాగిపైనే పెట్టుకొంది. రాజధాని కంపాలలోని మురికివాడల్లో పుట్టి పెరిగిన జుమా.. అండర్-19 క్రికెట్‌తో వెలుగులోకి వచ్చాడు. రెండేళ్ల తర్వాత ఇప్పుడు జట్టు బౌలింగ్‌కు వెన్నెముకగా మారాడు. జట్టులోని మరో సభ్యుడు సైమన్ సెజాజి, రిజర్వ్ ఆటగాడు ఇన్నోసెంట్ మెవిబేజ్‌లతో పాటు మరికొందరి ఆటగాళ్లది కూడా ఇలాంటి కథే. ఉండడానికి తగిన ఇల్లు, తాగడానికి పరిశుభ్రమైన నీరు లేని ప్రదేశంలో పుట్టిన వీళ్లు.. ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో దేశానికి ఆడుతూ అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నారు. అక్కడి సమాజం వీళ్లను వెలుగు రేఖలుగా భావిస్తోంది. ఉగాండా కోచ్ అభయ్ శర్మ కూడా వీరి దుస్థితిని చూసి చలించిపోయాడు. ఆటతో తమ తలరాతలు మార్చుకోవాలనే పట్టుదల వారిలో ప్రస్ఫుటంగా కనిపిస్తోందని చెప్పాడు. అయితే, కెన్యా మాదిరి క్రికెట్‌లో తెరమరుగవకుండా ఉండేందుకు వారికి అండదండలు అందించాలని శర్మ అన్నాడు.

### ప్రాక్టీస్ ఏర్పాట్లపై టీమిండియా అసంతృప్తి

న్యూయార్క్: టీ20 వరల్డ్‌కప్‌నకు సిద్ధమయ్యేందుకు తమకు ఏర్పాటు చేసిన ప్రాక్టీస్ సౌకర్యాలపై టీమిండియా అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రస్తుతం న్యూయార్క్‌లో ఉన్న రోహిత్ సేన నెట్ ప్రాక్టీస్ కోసం కాంటియేగ్ పార్క్‌ను కేటాయించారు. బుధవారం నుంచి ఆటగాళ్లు ఇక్కడ సాధన ఆరంభించారు. ఇక వామప్ మ్యాచ్‌తో పాటు మూడు గ్రూప్ మ్యాచ్‌లు జరిగే నాసౌ కౌంటీ క్రికెట్ స్టేడియంలో అయితే ఎలాంటి ప్రాక్టీస్ సౌకర్యాలు లేవు. అలాగే భోజన ఏర్పాట్లు కూడా సరిగా లేవని సమాచారం. మరోవైపు ప్రాక్టీస్‌లో సౌకర్యాలలేమిపై ఏ జట్టు కూడా తమకు ఫిర్యాదు చేయలేదని ఐసీసీ చెబుతోంది.

## చెస్‌లో ఇషాని రికార్డు



హైదరాబాద్: చెస్‌లో నగరానికి చెందిన ఐదేళ్ల బాలిక ఇషాని చక్కిలం అరుదైన రికార్డును నెలకొల్పింది. 9.3 నిమిషాల్లో 104 చెక్‌మేట్ (ఒక్క ఎత్తులో)లను పూర్తి చేసి అబ్బురపరిచింది. శుక్రవారం రాయదుర్గంలోని తన నివాసంలో పలువురు చెస్ నిపుణుల మధ్య ఇషాని ఈ రికార్డును నమోదు చేసింది. ఇషాని ఆటను ప్రత్యక్షంగా వీక్షించిన మంత్రి కొండా సురేఖ, బ్రిటీష్ డిప్యూటీ హై-కమిషనర్ గారెత్ విన్ తదితర ప్రముఖులు ఆమెను అభినందించారు. ఈ రికార్డును వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్సు (లండన్)లో నమోదు చేయిస్తామని నిర్వాహకులు తెలిపారు.

**ప్రపంచ జూనియర్ చెస్ నేటినుంచి**

**గాంధీనగర్:** ఫిడే వరల్డ్ జూనియర్ చెస్ చాంపియన్‌షిప్‌నకు భారత్ ఆతిథ్యమిస్తోంది. శనివారం గాంధీనగర్‌లో మొదలయ్యే ఈ టోర్నీలో భారత స్టార్లు ప్రణవ్ ఆనంద్, అభిమన్యు మిశ్రా, దివ్యా దేశ్‌ముఖ్ సహా 46 దేశాల నుంచి 230 మంది ప్లేయర్లు పోటీపడుతున్నారు.

## నిషాంత్‌కు పారిస్ బెర్త్



**బ్యాంకాక్:** ప్రపంచ చాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత, యువ బాక్సర్ నిషాంత్ దేవ్ పారిస్ ఒలింపిక్స్‌కు బెర్త్ దక్కించుకున్నాడు. శుక్రవారం ఇక్కడ జరిగిన బాక్సింగ్ ఒలింపిక్ క్వాలిఫయర్స్ 71 కిలోల విభాగంలో నిషాంత్ క్వార్టర్స్‌లో వాసిలె సెబోటరి (మాల్డోవా)ను ఓడించి సెమీస్ చేరడంతో ఒలింపిక్స్‌కు అర్హత సాధించాడు. భారత్ నుంచి బాక్సింగ్‌లో ఇది నాలుగో పారిస్ ఒలింపిక్ కోటా. పురుషుల్లో మాత్రం నిషాంత్‌దే తొలి బెర్త్. ఇప్పటికే నిఖత్ జరీన్ (50 కి), ప్రీతి పవార్ (54 కి), లవ్లీనా (75 కి) పారిస్ క్రీడలకు ఎంపికైన సంగతి తెలిసిందే. ఇక, అమిత్ పంఘాల్ (51 కి), సచిన్ (57 కి) తమ విభాగాల్లో క్వార్టర్స్ చేరారు.

## వరల్డ్ బాక్సింగ్‌కు భారత్ జై

**న్యూఢిల్లీ:** భారత బాక్సింగ్ సమాఖ్య (బీఎఫ్ఐ)..వరల్డ్ బాక్సింగ్‌కు జై కొట్టింది. ఈ విషయాన్ని బీఎఫ్ఐ అధ్యక్షుడు అజయ్ సింగ్ శుక్రవారం వెల్లడించారు. అవినీతి ఆరోపణలతో ఇంటర్నేషనల్ బాక్సింగ్ అసోసియేషన్ (ఐబీఏ) గుర్తింపును అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) సస్పెండ్ చేసింది. దాంతో ఐఓసీకి అనుబంధంగా కొత్తగా వరల్డ్ బాక్సింగ్ ఏర్పడిన సంగతి తెలిసిందే. అయితే ఆయా ఆదేశాల బాక్సింగ్ సమాఖ్యలు ఐబీఏతో కొనసాగితే 2028 లాస్‌ఏంజెల్స్ ఒలింపిక్స్ కమిటీ నుంచి బాక్సింగ్‌ను తప్పిస్తామని ఐఓసీ ఇటీవల హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ఐబీఏ నుంచి వైదొలగి వరల్డ్ బాక్సింగ్‌లో చేరుతున్నట్టు అజయ్ సింగ్ వివరించారు.

## సెమీస్‌లో గాయత్రి జోడీ

**సింగపూర్:** తెలుగమ్మాయి గాయత్రి గోపీచంద్-ట్రీసా జాలీ జోడీ సింగపూర్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో టైటిల్ దిశగా దూసుకెళుతోంది. గతరౌండ్లో ప్రపంచ రెండో ర్యాంక్ జంటను చిత్తుచేసిన గాయత్రి ద్వయం ఈసారి ఆరో ర్యాంకర్‌ను కంగుతినిపించి సెమీఫైనల్‌కు చేరింది. శుక్రవారం జరిగిన మహిళల డబుల్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో గాయత్రి-ట్రీసా జంట 18-21, 21-19, 24-22తో ప్రపంచ ఆరో ర్యాంక్ జోడీ కిమ్ సో యెంగ్-కాంగ్ హీ యోంగ్ (దక్షిణ కొరియా)పై గెలిచింది. సూపర్ 750 సిరీస్ ఈవెంట్‌లో సెమీస్‌లో ప్రవేశించడం గాయత్రి జంటకిదే తొలిసారి. శనివారం జరిగే సెమీస్ పోరులో 4వ సీడ్ నమి మత్సుయమ-చిహారు షిడా (జపాన్)తో గాయత్రి జోడీ అమీతుమీ తేల్చుకోనుంది.

## స్వియటెక్, గాఫ్ జోరు

**రుబ్లేవ్ అవుట్ ● ఫ్రెంచ్ ఓపెన్**

**పారిస్:** ఫ్రెంచ్ ఓపెన్‌లో మరో సంచలనం చోటు చేసుకుంది. ఈసారి ఆరో సీడ్ ఆండ్రీ రుబ్లేవ్ తిరుగుముఖం పట్టాడు. అన్‌సీడెడ్ మాటియో ఆర్నాల్డీ.. రష్యా స్టార్ రుబ్లేవ్‌కి షాకిచ్చాడు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ మూడో రౌండ్‌లో ఇటలీ ఆటగాడు మాటియో ఆర్నాల్డీ 7-6 (6), 6-2, 6-4తో రుబ్లెవ్‌ను కంగుతినిపించాడు. రెండోసీడ్ సిన్నర్ 6-4, 6-4, 6-4తో కొటోవ్‌పై నెగ్గి నాలుగో రౌండ్ చేరాడు. ఇక మహిళల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ స్వియటెక్ 6-4, 6-2తో బౌజ్కోవాని, మూడో సీడ్ కొకొ గాఫ్ 6-2, 6-4తో 30వ సీడ్ యాస్త్రెమ్‌స్కాని, ఐదో సీడ్ వొంద్రుసోవా 6-1, 6-3తో పాక్వెట్‌ని, 8వ సీడ్ జెబ్యూర్ 6-4, 7-6 (5)తో లెలా ఫెర్నాండెజ్‌ని చిత్తుచేశారు.

**శ్రీరామ్ ముందుకు.. యుకీ ఇంటికి:** ఫ్రెంచ్ ఓపెన్‌లో శుక్రవారం భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. పురుషుల డబుల్స్‌లో యుకీ భాంబ్రీ ఇంటిబాట పట్టగా.. శ్రీరామ్ బాలాజీ ముందంజ వేశాడు. స్థానిక ఆటగాడు అల్బనో వొలివేటితో కలిసి బరిలో దిగిన యుకీ భాంబ్రీ ఆరంభ రౌండ్లో 3-6, 6-7 (5)తో పీర్స్/సఫియులిన్ జంట చేతిలో ఓటమి పాలయ్యాడు. ఇక..మిగ్వెల్ యాంజెల్ (మెక్సికో)తో జట్టు కట్టిన శ్రీరామ్ బాలాజీ 6-3, 6-4తో రీస్ స్టాడర్/వెర్బీక్ జోడీపై విజయం సాధించి రెండోరౌండ్లో అడుగుపెట్టాడు.

---

# బిజినెస్

# కదం తొక్కిన ఆర్థికం

## 2023-24లో జీడీపీ వృద్ధి రేటు 8.2 %.. క్యూ4లో 7.8 శాతానికి పరిమితం

» తయారీ రంగం ఆలంబనగా జోరు

» ప్రపంచంలో శరవేగంగా వృద్ధి చెందుతున్న దేశంగా భారత్




న్యూఢిల్లీ: తయారీ రంగం అందించిన ఊతంతో 2023-24 ఆర్థిక సంవత్సరంలో భారత్ అంచనాలను మించి 8.2 శాతం వృద్ధి రేటును నమోదు చేసింది. దీంతో ప్రపంచంలో వేగవంతమైన వృద్ధిని నమోదు చేస్తున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్ తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. అంతే కాదు, ఈ వృద్ధితో భారత ఆర్థిక వ్యవస్థ 3.5 లక్షల కోట్ల డాలర్ల స్థాయికి చేరడమే కాకుండా వచ్చే కొద్ది సంవత్సరాల కాలంలో 5 లక్షల కోట్ల డాలర్ల లక్ష్యాన్ని చేరడానికి రంగం సిద్ధం చేసుకుంది. అయితే నాలుగో త్రైమాసికంలో (2024 జనవరి-మార్చి) మాత్రం వృద్ధి రేటు 7.8 శాతానికి మందగించింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఇదే త్రైమాసికంలో నమోదైన స్థూల జాతీయోత్పత్తి రేటు (జీడీపీ) 6.2 శాతం కాగా ఏడాది మొత్తానికి నమోదైన వృద్ధి రేటు 7 శాతంగా ఉంది.

పోటీ ఆర్థిక వ్యవస్థ చైనా 2024 తొలి మూడు నెలల కాలంలో నమోదు చేసిన వృద్ధి రేటు 5.3 శాతం కన్నా భారత్ నమోదు చేసిన వృద్ధి చాలా ఎక్కువగా ఉంది. ఈ ఏడాది మార్చి 31వ తేదీతో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరానికి వృద్ధి రేటు గణాంకాలను జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) శుక్రవారం సాయంత్రం విడుదల చేసింది. ఈ ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ప్రారంభమైన 2024-25 ఆర్థిక సంవత్సరంలో దేశం 7 శాతం వృద్ధిని సాధిస్తుందని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) అంచనా.

### జీడీపీ పరిమాణం రూ.174 లక్షల కోట్లు

ఎన్ఎస్ఓ గణాంకాల ప్రకారం స్థిర ధరల ప్రాతిపదికన 2023-24 ఆర్థిక సంవత్సరంలో భారత జీడీపీ పరిమాణం రూ.173.82 లక్షల కోట్లుగా ఉంది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి తొలి సవరించిన అంచనాల ప్రకారం జీడీపీ పరిమాణం రూ.160.71 లక్షల కోట్లు లేదా 7.7 శాతం. దీని ప్రకారం చూసినట్టయితే గత ఏడాది జీడీపీ వృద్ధి రేటు 8.2 శాతం అని ఎన్ఎస్ఓ తెలిపింది. కాగా ప్రస్తుత ధరల ప్రాతిపదికన చూసినట్టయితే 2023-24 ఆర్థిక సంవత్సరంలో 9.6 శాతం వృద్ధి నమోదైంది. జీడీపీ పరిమాణం గత ఏడాదితో పోల్చితే రూ.269.50 లక్షల కోట్ల నుంచి రూ.295.36 లక్షల కోట్లకు పెరిగింది. ఇక మార్చి త్రైమాసికంలో జీడీపీ పరిమాణం స్థిర ధరల ప్రకారం గత ఏడాదితో పోల్చితే రూ.43.84 లక్షల కోట్ల నుంచి రూ.47.24 లక్షల కోట్లకు పెరిగింది. అంటే 7.8 శాతం వృద్ధితో సమానం. ఇదే త్రైమాసికంలో వర్తమాన ధరల ప్రకారం ఇది రూ.71.23 లక్షల కోట్ల నుంచి రూ.78.28 లక్షల కోట్లకు పెరిగింది. అంటే 9.9 శాతంతో సమానం.

**2023-24లో వృద్ధి రేటు తీరిదీ...**

| | |
|---|---|
| ఏప్రిల్-జూన్ (క్యూ1) | 8.2 శాతం |
| జూలై-సెప్టెంబరు (క్యూ2) | 8.1 శాతం |
| అక్టోబరు-డిసెంబరు (క్యూ3) | 8.6 శాతం |
| జనవరి-మార్చి (క్యూ4) | 7.8 శాతం |

### జీవీఏ రూ.158.74 లక్షల కోట్లు

కాగా స్థూల విలువ జోడింపు (జీవీఏ) 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.148.05 లక్షల కోట్ల నుంచి (2022-23) రూ.158.74 లక్షల కోట్లకు పెరిగింది. అంటే జీవీఏ వృద్ధి రేటు 6.7 శాతం నుంచి 7.2 శాతానికి పెరిగింది.

### ఇది ట్రైలర్ మాత్రమే

"రాబోయే కాలంలో మన ఆర్థిక వ్యవస్థ సాధించబోయే జోరుకు ఇది ఒక ట్రైలర్ మాత్రమే. భారత ప్రజల శ్రమించి పని చేసే తత్వానికి ఇది ప్రతీక. భారతదేశం ప్రపంచంలో వేగవంతంగా వృద్ధిచెందుతున్న ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతుందనేందుకు ఇది ఒక సంకేతం"

- ప్రధాని నరేంద్ర మోదీ

### మూడో విడతలోనూ అదే జోరు

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం మూడో విడతలో కూడా వృద్ధిలో ఇదే జోరు కొనసాగుతుంది. అన్ని ప్రధాన సూచీలు ఇదే సంకేతం ఇస్తున్నాయి. 2023-24 సంవత్సరంలో మనం సాధించిన వృద్ధి అద్భుతం. ప్రపంచంలోని అన్ని ప్రధాన ఆర్థిక వ్యవస్థల వృద్ధి కన్నా ఇది అధికం. తయారీ రంగం సాధించిన 9.9 శాతం వృద్ధి మోదీ ప్రభుత్వ విజయాలకు నిదర్శనం. ప్రపంచ సవాళ్ల నడుమన కూడా మనం సాధించిన విజయానికి ఇది తార్కాణం.

- నిర్మలా సీతారామన్, ఆర్థిక మంత్రి

### విత్త లోటు 5.63 శాతం

కేంద్ర ప్రభుత్వ విత్త లోటు 2023-24 ఆర్థిక సంవత్సరంలో జీడీపీలో 5.63 శాతంగా నమోదైంది. నగదు పరిమాణంలో చూసినట్టయితే విత్త లోటు (ప్రభుత్వాదాయాలు, వ్యయాల మధ్య వ్యత్యాసం) రూ.16.53 లక్షల కోట్లుంది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి ఒకటో తేదీన ప్రతిపాదించిన తాత్కాలిక బడ్జెట్లో ప్రకటించిన అంచనా 5.8 శాతం (రూ.17.34 లక్షల కోట్లు) కన్నా ఇది మెరుగైన స్థితి. ప్రభుత్వాదాయం పెరగడంతో పాటు వ్యయాలు తగ్గడం ఇందుకు కారణం. కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా (సీజీఏ) విడుదల చేసిన గణాంకాల ప్రకారం ప్రభుత్వానికి సమకూరిన ఆదాయం సవరించిన అంచనాలతో పోల్చితే 101.2 శాతం ఉంది. నికర పన్ను వసూళ్లు రూ.23.26 లక్షల కోట్లుండగా మొత్తం వ్యయాలు రూ.44.42 లక్షల కోట్ల మేరకు (సవరించిన అంచనాల్లో 98.9 శాతం) ఉన్నాయి. కాగా మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో రెవిన్యూ లోటు జీడీపీలో 2.6 శాతం, వాస్తవిక లోటు 1.6 శాతంగా నమోదయ్యాయి.

### కెనరా హెచ్ఎస్‌బీసీలో ఐపీఓ ద్వారా 14.5% వాటాల విక్రయం

» కెనరా బ్యాంక్

న్యూఢిల్లీ: జీవిత బీమా సంస్థ కెనరా హెచ్ఎస్‌బీసీ లైఫ్ ఇన్సూరెన్స్‌లో 14.5 శాతం వాటాలను విక్రయించేందుకు డైరెక్టర్ల బోర్డు ఆమోదం లభించిందని కెనరా బ్యాంక్ ప్రకటించింది. పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) ద్వారా ఈ వాటాలను విక్రయించాలని చూస్తున్నట్లు తెలిపింది. ఈ షేర్లను బీఎస్ఈ, ఎన్ఎస్ఈలో నమోదు చేయనున్నట్లు పేర్కొంది. కెనరా హెచ్ఎస్‌బీసీ లైఫ్‌లో కెనరా బ్యాంక్‌కు 51 శాతం వాటా ఉండగా హెచ్ఎస్‌బీసీ ఇన్సూరెన్స్ (ఆసియా, పసిఫిక్) హోల్డింగ్స్‌కి 26 శాతం, పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు 23 శాతం వాటా ఉంది. తనకున్న 51 శాతం వాటాలో 14.5 శాతం వాటాలను ఐపీఓ ద్వారా విక్రయించాలని కెనరా బ్యాంక్ నిర్ణయించింది. కాగా, రుణ పత్రాల (బాండ్స్) మార్కెట్ నుంచి రూ.17,000 కోట్లు సమీకరించేందుకు కెనరా బ్యాంక్ సిద్ధమవుతోంది.

### బీఓఐ 666 రోజుల ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకం

ముంబై: ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) 666 రోజుల కాల వ్యవధి ఉండే ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) పథకాన్ని తీసుకొచ్చింది. ఈ ఎఫ్‌డీపై సీనియర్ సిటిజన్లకు 7.8 శాతం, సూపర్ సీనియర్ సిటిజన్లకు 7.95%, ఇతరులకు 7.3 శాతం వడ్డీ చెల్లిస్తారు. జూన్ 1 నుంచి ఈ ఎఫ్‌డీ అమల్లోకి వస్తుంది. ఈ ఎఫ్‌డీపై డిపాజిటర్లు రుణాలు కూడా తీసుకోవచ్చని బీఓఐ తెలిపింది. ఏదైన అవసరం ఏర్పడితే ఈ ఎఫ్‌డీని మధ్యలోనే వెనక్కి తీసుకునే సౌలభ్యమూ ఉంది.



**బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)**

| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 72,850 ▲ | 66,800 ▲ | 1,00,000 ▼ |
| ముంబై | 72,356 ▲ | 66,278 ▲ | 92,449 ▼ |

**ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)**



| జూన్ 1వ తేదీ | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 505 | విజయవాడ | 490 |
| వరంగల్ | 507 | గోదావరి | 485 |
| చిత్తూరు | 563 | విశాఖపట్నం | 500 |
| | | దజను గుడ్లు రూ. | 66 |

**ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 142 | విజయవాడ | 146 |
| వరంగల్ | 142 | గుంటూరు | 149 |
| కరీంనగర్ | 142 | ఒంగోలు | 149 |
| మహబూబ్‌నగర్ | 144 | చిత్తూరు | 147 |
| కర్నూలు | 144 | నెల్లూరు | 147 |
| విశాఖపట్నం | 135 | అనంతపురం | 146 |
| గోదావరి | 146 | | |

### కాంట్రాక్ట్ మాన్యుఫాక్చరింగ్‌లోకి అరబిందో ఫార్మా

» ఎంఎస్‌డీతో ఒప్పందం..

» 1,000 కోట్లతో ప్లాంట్ ఏర్పాటు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌కు చెందిన ఔషధ సంస్థ అరబిందో ఫార్మా తాజాగా కాంట్రాక్ట్ మాన్యుఫాక్చరింగ్‌లోకి ప్రవేశించింది. బయోలాజికల్స్ కాంట్రాక్ట్ మాన్యుఫాక్చరింగ్ కోసం ప్లాంట్ ఏర్పాటుకు మెర్క్ షార్ప్ అండ్ దోహ్మె సింగపూర్ ట్రేడింగ్ పీటీఈ లిమిటెడ్ (ఎంఎస్‌డీ)తో తన అనుబంధ సంస్థ థెరానియమ్ బయోలాజిక్స్ ఒప్పందం కుదుర్చుకుందని అరబిందో ఫార్మా శుక్రవారం వెల్లడించింది. ఇందులో భాగంగా, థెరానియమ్ బయోలాజికల్స్ రూ.1000 కోట్ల పెట్టుబడితో ఏటా 2.5-3 కోట్ల వయల్స్ తయారీ సామర్థ్యంతో కూడిన ప్లాంట్‌ను మెదక్ జిల్లాలోని హత్నూర మండలం, బోరపట్ల గ్రామంలో ఏర్పాటు చేయనుంది. ఈ ప్లాంట్‌లో తయారు చేసే ఉత్పత్తులను ఎంఎస్‌డీకి సరఫరా చేయనుంది. బయోలాజికల్స్ కాంట్రాక్ట్ మాన్యుఫాక్చరింగ్ కార్యకలాపాల కోసం థెరానియమ్‌లో మైనారిటీ వాటా కలిగిన అరబిందో ఫార్మా అనుబంధ సంస్థ క్యూరాటెక్ బయోలాజిక్స్ గత ఏడాది అక్టోబరులో ఎంఎస్‌డీతో లెటర్ ఆఫ్ ఇంటెంట్‌ను కుదుర్చుకుంది. అందులో భాగంగా ఒప్పందం ఖరారుపై చర్చలను ఈ మార్చి 31 నాటికి ముగించాల్సి ఉండగా.. డెడ్‌లైన్‌ను మే 31 వరకు పొడిగించుకున్నాయి.

- ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నంలో తొలి మల్టీప్లెక్స్‌ను ప్రారంభించినట్లు పీవీఆర్ ఐనాక్స్ ప్రకటించింది. పీవీఆర్-ఐనాక్స్ విలీనం అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసిన తొలి మల్టీప్లెక్స్ ఇది. ఈ థియేటర్ సామర్థ్యం 875 మంది ప్రేక్షకులని తెలిపింది.
- ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐఓబీ).. తిరుపతిలో కొత్తగా రీజినల్ కార్యాలయాన్ని ప్రారంభించింది. బ్యాంక్‌కు ఇది 50వ రీజినల్ కార్యాలయం. బ్యాంక్ ఎండీ, సీఈఓ అజయ్ కుమార్ శ్రీవాత్సవ ఈ కార్యాలయాన్ని ప్రారంభించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కార్యకలాపాల విస్తరణలో భాగంగా తిరుపతిలో ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు శ్రీవాత్సవ తెలిపారు.
- క్షేమ జనరల్ ఇన్సూరెన్స్ లిమిటెడ్.. దేశవ్యాప్తంగా 20కి పైగా రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల్లో క్రాప్ ఇన్సూరెన్స్ స్కీమ్ 'సుకృతి'ని అందుబాటులోకి తీసుకువచ్చింది. ఎకరానికి రూ.499 చెల్లించటం ద్వారా ఈ పంట బీమాను రైతులు తీసుకోవచ్చని తెలిపింది. 100కు పైగా సీజనల్ క్రాప్స్‌ను ఈ బీమా కవర్ చేస్తుందని పేర్కొంది.

### 5 రోజుల తర్వాత లాభాలొచ్చాయ్

**సెన్సెక్స్ 75 పాయింట్లు అప్**

ముంబై: వరుసగా ఐదు రోజుల్లో 2 శాతం నష్టపోయిన ఈక్విటీ సూచీలు వారాంతం ట్రేడింగ్‌లో స్వల్ప లాభాలతో సరిపెట్టుకున్నాయి. సెన్సెక్స్ 75.71 పాయింట్లు పెరిగి 73,765.15 వద్ద స్థిరపడగా.. నిఫ్టీ 42.05 పాయింట్ల వృద్ధితో 22,530.70 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో సగం లాభపడగా.. మిగతా సగం నష్టపోయాయి. టాటా స్టీల్ 1.80 శాతం వృద్ధితో సూచీ టాప్ గెయినర్‌గా నిలవగా.. బజాజ్ ఫైనాన్స్, పవర్‌గ్రిడ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు ఒక శాతానికి పైగా పెరిగాయి. నెస్లే ఇండియా మాత్రం 2 శాతానికి పైగా క్షీణించింది. కాగా, బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు 0.76 శాతం వరకు పెరిగాయి. రంగాలవారీ సూచీల్లో యుటిలిటీస్, రియల్టీ 2 శాతానికి పైగా పుంజుకోగా.. పవర్, సర్వీసెస్, మెటల్, టెలికాం సూచీలు ఒక శాతానికి పైగా పెరిగాయి. ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 13 పైసలు క్షీణించి 83.42 వద్ద ముగిసింది.

- ఎలక్ట్రిక్ మొబిలిటీ సొల్యూషన్స్ సంస్థ గ్రీన్ డ్రైవ్ మొబిలిటీతో హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఎలక్ట్రిక్ వాహన ఓఈఎం సంస్థ క్వాంటమ్ ఎనర్జీ లిమిటెడ్ ఒప్పందం కుదుర్చుకుంది. ఒప్పందంలో భాగంగా గ్రీన్ డ్రైవ్ మొబిలిటీకి 5,000 ఈవీ2డబ్ల్యూ, బిజినెస్ ఎలక్ట్రిక్ వాహనాలను క్వాంటమ్ ఎనర్జీ డెలివరీ చేయనుంది. లాస్ట్ మైల్ డెలివరీకి ఈ వాహనాలను ఉపయోగించనున్నారు.

## విశాఖలో ఏం జరుగుతోంది..?

- భూముల కుంభకోణంపై చంద్రబాబు ఆరా
- ఈ దందా తీరును వివరించిన పార్టీ నేతలు

అమరావతి, మే 31 (ఆంధ్రజ్యోతి): అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణ పేరుతో విశాఖ కేంద్రంగా భూముల కుంభకోణంపై పత్రికల్లో పెద్ద ఎత్తున వస్తున్న వార్తా కథనాలపై టీడీపీ అధినేత చంద్రబాబు ఆరా తీశారు. శుక్రవారం సాయంత్రం ఆయనను హైదరాబాద్‌లోని నివాసంలో పలువురు పార్టీ అభ్యర్థులు, ఇతర నేతలు కలిశారు. వారిలో విశాఖ నగర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, నెల్లిమర్ల ఇన్‌చార్జి బంగార్రాజు తదితరులున్నారు. అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణ పేరుతో విశాఖ చుట్టుపక్కల భారీ కుంభకోణం చోటు చేసుకుందని వారు చంద్రబాబుకు చెప్పారు. అసలుసిసలు ఇన్‌సైడర్ ట్రేడింగ్ విశాఖలోనే జరిగిందని వివరించారు. అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణ ఎలా చేయబోతున్నారో.. ముందుగానే తెలుసుకుని, తదనుగుణమైన భూములను అధికార పార్టీ నేతలు, కొందరు ఉన్నతాధికారులు చేజిక్కించుకున్నారని వారు వివరించారు. కనీసం 2 వేల ఎకరాలు పేద రైతుల నుంచి పెద్దల చేతుల్లోకి పోయాయని, లబ్ధి పొందిన వారిలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి కూడా ఉన్నారని చెప్పారు. ఈ తతంగం మొదటి దశ నుంచి చివరి వరకు ఎలా జరిగిందో మాజీ ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, జ్యోతుల నెహ్రూ చెప్పారు. భూములను ఇంత ఘోరంగా కొట్టేయడం గతంలో ఎప్పుడూ చూడలేదని చంద్రబాబు ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. రాజధాని ప్రాంత రైతుల సమస్యల గురించి మాజీ ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ వివరించగా.. రైతులకు పార్టీ పరంగా పూర్తి అండగా ఉంటామని, టీడీపీ అధికారంలోకి వస్తే.. రాజధాని నిర్మాణాన్ని వేగంగా ముందుకు తీసుకెళ్తామని చంద్రబాబు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు, అధికారులు, పోలీసులు వ్యవహరిస్తున్న తీరు తదితర అంశాలపై వారి మధ్య చర్చకు వచ్చినట్లు సమాచారం.

## ఆ ముగ్గురు అధికారులను తప్పించాలి

- ఎన్నికల సంఘానికి టీడీపీ నేతల ఫిర్యాదు

అమరావతి, మే 31(ఆంధ్రజ్యోతి): 'పల్నాడులో పోలింగ్ సందర్భంగా హింసాత్మక ఘటనలకు ముఖ్య కారకులైన ముగ్గురు అధికారులను తక్షణమే ఎన్నికల విధుల నుంచి తప్పించాలి. వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి' అని టీడీపీ నేతలు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం అమరావతి సచివాలయంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాను కలసిన టీడీపీ నేతలు మన్నవ సుబ్బారావు, గూడపాటి లక్ష్మీనారాయణ కలిశారు. ముగ్గురు అధికారులపై ఫిర్యాదు చేశారు. 'పల్నాడు డీపీవో విజయభాస్కర్‌రెడ్డి, డీఆర్వో వినాయక్‌రెడ్డి, పుడా డిప్యూటీ చైర్మన్ గజ్జల శ్రీనివాసరెడ్డి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. వైసీపీకి అనుకూలంగా వ్యవహరించారు. ఈ ముగ్గురు అధికారులూ కౌంటింగ్ సిబ్బందిని నియమించడంలో, ఇతర అనుమతులిచ్చే విషయాల్లో వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. వైసీపీ ఎమ్మెల్యేలు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి సిఫారసు చేసిన వారినే డీపీవో విజయభాస్కర్‌రెడ్డి ఎన్నికల విధుల్లో కీలక పోస్టుల్లో నియమించారు. దీనిపై టీడీపీ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. కలెక్టర్, విచారణాధికారిగా డీఆర్వో వినాయకరెడ్డిని నియమించారు. ఆయన డీపీవోకు అనుకూలంగా నివేదిక ఇచ్చారు. కౌంటింగ్ సిబ్బందిగా వైసీపీకి అనుకూలంగా పనిచేసే వారినే డీఆర్వో నియమిస్తున్నారు. కౌంటింగ్‌లో పాలకపక్షానికి అనుకూలంగా పని చేయడానికి కుట్ర జరుగుతోంది. భాస్కర్‌రెడ్డిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి' అని వారు కోరారు.

## వైసీపీ కేసు డిస్మిస్ కాకతప్పదు: అశోక్‌బాబు

అమరావతి, మే 31(ఆంధ్రజ్యోతి): పోస్టల్ బ్యాలెట్ అంటే వైసీపీ నేతలు ఎందుకు భయపడుతున్నారో అర్థం కావట్లేదని మాజీ ఎమ్మెల్సీ పీ అశోక్ బాబు అన్నారు. శుక్రవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, పోస్టల్ బ్యాలెట్ విషయంలో సీఈవో ఇచ్చిన వివరణపై వైసీపీ హైకోర్టులో రిట్ వేయడాన్ని తప్పు పట్టారు. టీడీపీకి సీఈవో అనుకూలంగా చేసినట్లు తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. పోస్టల్ బ్యాలెట్‌పై స్టాంప్, సీల్ విషయంలో ఈసీ 2023లోనే స్పష్టం చేస్తూ ఓ సర్క్యులర్ జారీ చేసిందని, అదే అంశాన్ని తాజాగా ఈసీ మరోసారి స్పష్టం చేసిందని తెలిపారు. అదే విషయాన్ని కోర్టుకు సమర్పించారని వివరించారు. సీఈవో సర్క్యులర్‌లో వివాదం లేదని తీర్పు వస్తే.. వైసీపీ కేసు డిస్మిస్ అవుతుందని అశోక్ బాబు వ్యాఖ్యానించారు.

## పగటి కలలు కంటున్న మోదీ, జగన్: నారాయణ

తిరుపతి, మే 31: తమదే గెలుపంటూ ప్రధాని మోదీ, సీఎం జగన్.. పగటి కలలు కంటున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఎద్దేవా చేశారు. తిరుపతి సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఆపార్టీ అభ్యర్థి మురళి అభినందన సభలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడారు. బీజేపీకి 400 ఎంపీ సీట్లు వస్తాయని మోదీ, రాష్ట్రంలో 175 అసెంబ్లీ స్థానాలూ తమవేనని జగన్ ప్రకటనలు చేస్తూ.. ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని విమర్శించారు. ఈ ఎన్నికల్లో బీజేపీ ఓటమిపాలు కావడవడం ఖాయమన్నారు. వైసీపీకి కూడా అదే దుస్థితి అని అన్నారు. బీజేపీ అధికారం కోల్పోయిన వెంటనే చంద్రబాబు ఎన్డీయే కూటమి నుంచి బయటకు వస్తారని జోస్యం చెప్పారు. దక్షిణ భారత దేశంలో బీజేపీకి బోణీ కాదన్నారు. హరియాణా, ఢిల్లీ, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, పంజాబ్ రాష్ట్రాల్లోనూ ఎంపీ సీట్లు రావన్నారు. యూపీ, ఎంపీ, కర్ణాటక రాష్ట్రాల్లో తక్కువ సీట్లు వచ్చే అవకాశం ఉందని నారాయణ అన్నారు.

## సజ్జలపై క్రిమినల్ కేసు

- కౌంటింగ్ ఏజెంట్లను రెచ్చగొట్టారంటూ టీడీపీ ఫిర్యాదు
- తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో నమోదు

తాడేపల్లి టౌన్, మే 31: కౌంటింగ్ ఏజెంట్లను రెచ్చగొట్టే విధంగా అనుచిత వ్యాఖ్యలు చేసిన అభియోగంపై ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. నిబంధనలు పాటించే వారు కౌంటింగ్ ఏజెంట్లుగా అవసరం లేదని ఇటీవల సజ్జల చేసిన వ్యాఖ్యలపై టీడీపీ నేత దేవినేని ఉమ, న్యాయవాది గూడపాటి లక్ష్మీనారాయణ ఈ నెల 30న తాడేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం తాడేపల్లి సీఐ కల్యాణ్ రాజు... సజ్జల రామకృష్ణారెడ్డిపై ఐపీసీలోని 153, 505(2), 125 సెక్షన్లతో పాటు ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951లోని సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

## కౌంటింగ్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి

- టీడీపీ సీనియర్ నేతల సూచన
- చీఫ్ ఎలక్షన్ ఏజెంట్లతో వర్క్‌షాపు

అమరావతి, మే 31 (ఆంధ్రజ్యోతి): ఓట్ల లెక్కింపు రోజు (జూన్ 4) పార్టీ కౌంటింగ్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని చీఫ్ ఎలక్షన్ ఏజెంట్లకు టీడీపీ సీనియర్ నేతలు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల నుంచి వచ్చిన చీఫ్ ఎలక్షన్ ఏజెంట్లతో శుక్రవారమిక్కడ ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో వర్క్‌షాపు నిర్వహించారు. కౌంటింగ్ కేంద్రాల్లో ఏ విధంగా వ్యవహరించాలో వారికి శిక్షణ ఇచ్చారు. కౌంటింగ్ ప్రక్రియపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఏజెంట్లకు పలు సూచనలు, సలహాలతో పాటు వారికి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో యనమల రామకృష్ణుడు, దేవినేని ఉమామహేశ్వరరావు, పరచూరి అశోక్‌బాబు, పల్లె రఘునాథరెడ్డి, పట్టాభి, జంగా కృష్ణమూర్తి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కృష్ణయ్య పాల్గొన్నారు. శనివారం ఐదు జోన్ల పరిధిలో నియోజకవర్గాల ఏజెంట్లతో ప్రాంతీయ సమావేశాలు జరుగనున్నాయి.

## ఆందోళనకరంగా ఆర్థిక పరిస్థితి

- గవర్నరుతో బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి

విజయవాడ, మే 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చాలా ఆందోళనకరంగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పుల గణాంకాలను వెల్లడించాలి' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి కోరారు. విజయవాడలోని రాజ్‌భవన్‌లో గవర్నరు అబ్దుల్ నజీర్‌కు శుక్రవారం ఈమేరకు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం రాజ్‌భవన్ బయట మీడియాతో మాట్లాడారు. 'ఆర్‌బీఐ నిబంధనలను ఉల్లంఘించి ప్రభుత్వ ఆస్తులను తనఖా పెట్టి అప్పులు తీసుకొచ్చింది. ఆదాయం లేని కార్పొరేషన్ ద్వారా అప్పులు తీసుకొచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు ఇవ్వలేదు. చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో సర్పంచ్‌లు, కాంట్రాక్టర్లు ఆత్మహత్యలు చేసుకున్నారు. మద్యంపై భవిష్యత్తులో వచ్చే ఆదాయాన్నీ పూచీకత్తుగా చూపించి అప్పులు తెచ్చారు. ఆర్థిక అంశాలపై అన్ని వివరాలను సీఎస్ నుంచి రప్పించాలని గవర్నరును కోరాం. ఆర్బీఐ నిబంధనలకు అనుగుణం చేసిన అప్పులు, కార్పొరేషన్ల ద్వారా తీసుకున్న అప్పుల వివరాలను కోరాం. వడ్డీ, అసలు కలిపి ప్రభుత్వం ప్రతినెలా ఆర్‌బీఐకి ఎంత చెల్లిస్తుందో వివరాలు కోరాం. అదేవిధంగా సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందిన వారి వివరాలను సీఎస్ నుంచి రప్పించాలని కోరాం. ఆర్‌బీఐ, ఎఫ్‌ఆర్‌బీఎం నిబంధనలను ఉల్లంఘించి అప్పులు చేసిందని ధ్వజమెత్తారు. ఈ అప్పులు ప్రభుత్వానివి కాదని చూపించడానికి కార్పొరేషన్లను ఏర్పాటు చేసింది. ప్రభుత్వ ఉద్యోగుల పీఎఫ్, ఇతర నిధులనూ ప్రభుత్వం తీసుకుంది' అని పురందేశ్వరి ఆరోపించారు. గవర్నరును కలిసిన వారిలో రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, నాయకులు పాతూరి నాగభూషణం, లంకా దినకర్, యామినీశర్మ ఉన్నారు.

# అల్లుడి గిల్లుడు!

(మొదటి పేజీ తరువాయి)

బయటకొచ్చింది. కోట్లాది రూపాయలు విలువ చేసే జిరాయితీ, అసైన్డ్ భూములను కారుచౌకగా కొట్టేస్తున్నారు. భోగాపురం మండలంలో కడప జిల్లా వ్యక్తి సాగించిన భూ అక్రమాలను 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చిన విషయం తెలిసిందే. ఇప్పటికే 218 ఎకరాల అసైన్డ్ భూములను ఆయన సొంతం చేసుకున్నారు. మరో 160 ఎకరాల కొనుగోలుకు అగ్రిమెంట్లు చేసుకున్నారు. మరో 320 ఎకరాలకు అగ్రిమెంట్లు సిద్ధం చేసుకున్నారు. ఇవిగాక ఈ భూముల పక్కనే ఉన్న మరో 225 ఎకరాలను చేజిక్కించుకునేందుకు 'స్కెచ్' వేసిన విషయం తాజాగా బయటపడింది. అధికారుల అండతో రైతుల నుంచి తక్కువ ధరకు బలవంతంగా భూములు లాక్కొంటున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో రైతులు తమ పట్టా భూములను కూడా అమ్ముకునేలా ఒత్తిడి చేశారు. ఈ తప్పుడు పనికి రెవెన్యూ యంత్రాంగాన్ని వాడుకున్నట్లు తెలిసింది.

### త్రిముఖ వ్యూహం

భోగాపురం మండలంలో సముద్రం పక్కన కంచేరు, కొంగవానిపాలెం గ్రామాలు ఉన్నాయి. అక్కడ నిషేధిత విముక్తి పొందిన అసైన్డ్ భూములు, జిరాయితీ (పట్టా) భూములు ఉన్నాయి. పక్కనే భోగాపురం ఉంటుంది. ఆ భూముల చుట్టే బీచ్ కారిడార్. వీటిని తమ మాస్టర్‌ప్లాన్‌లో బంధించేలా పెద్దసారు మేనల్లుడు వ్యూహం పన్నారు. మొదట భోగాపురం మండలంలోని ఆరు గ్రామాలను గుప్పిటపట్టారు. అసైన్డ్ భూములను చేజిక్కించుకున్నారు. తర్వాత వాటి మధ్యలో ఉన్న జిరాయితీ భూములపై కన్నేశారు. పెద్ద పరిశ్రమలు రాబోతున్నాయని, భూ సేకరణ కింద తక్కువ రేటుకు భూములు తీసుకుంటారని రైతులను భయపెట్టారు. కడప అల్లుడి టీమ్‌కు భూములు ధారాదత్తం అయ్యేలా ఓ సీనియర్ రెవెన్యూ అధికారి చాపకింద నీరులా పనిచేశారని తెలిసింది. ఇందుకు విశాఖ, విజయనగరం జిల్లాలకు చెందిన ముఖ్య అధికారులు ఇద్దరు బహిరంగంగానే అన్నివిధాలా సహకరించారు. పెద్దసారు ఆశీస్సులు, మెప్పుకోసం అడ్డదారులు తొక్కారు. రెవెన్యూ యంత్రాంగాన్ని పురమాయించి ఎక్కడా ఇబ్బంది రాకుండా భూముల దందా సాఫీగా సాగిపోయేలా తమ వంతు కృషి చేశారు. పెద్దసారు దృష్టిలో మంచి మార్కులు కొట్టేశారు. ఫలితంగా కంచేరు, కొంగవానిపాలెం గ్రామాల పరిధిలో 45 ఎకరాల జిరాయితీ భూమిని మేనల్లుడి టీమ్ దక్కించుకోగలిగింది. దీంతో ఆ రెండు గ్రామాల పరిధిలో అతిపెద్ద భూస్వామిగా ఆయనే నిలిచారు. ఆ భూములతో ఏం చేస్తారో, ఏ ప్రాజెక్టులు చేపడతారో తెలియదు కానీ రైతులకు సెంటు భూమి కూడా లేకుండా మొత్తం కొనాలని టార్గెట్‌గా పెట్టుకున్నట్టు తెలిసింది.

గత ఏడాది సెప్టెంబరులో జగన్ సర్కారు ఆంధ్రప్రదేశ్ అసైన్‌మెంట్ భూముల చట్టం-1977(పీఓటీ) సవరించడానికి ముందే పెద్దసారు మేనల్లుడి టీమ్ విశాఖలో దిగింది. భోగాపురం మండలంలోని కంచేరు, కొంగవానిపాలెం, ముంజేరు, బసవపాలెం, క వులరాడ, పోలిపల్లి తదితర గ్రామాల్లో వాలిపోయింది. 218 ఎకరాల అసైన్డ్ భూములను బినామీల పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఎకరా రెండు కోట్లకు పైగా ధర పలికే భూములను ఎకరా 20 లక్షలు చొప్పున కారుచౌకగా కొట్టేశారు. మరో 160 ఎకరాలకు సంబంధించి ఫ్రీ హోల్డ్ దరఖాస్తులు కలెక్టర్ పరిశీలనలో ఉన్నాయి. వీటికి ఇప్పటికే అగ్రిమెంట్లు చేసుకున్నారు. ఎకరా 20 లక్షలు ధర చొప్పున 50 శాతం చెల్లింపులు చేశారు. మరో 320 ఎకరాలకు అగ్రిమెంట్లు సిద్ధం చేసుకున్నారు. ఇవిగాక కొంగవానిపాలెం, కంచేరు గ్రామాల పరిధిలోనే 45 ఎకరాల జిరాయితీ భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ రెండు గ్రామాల పరిధిలోని అసైన్డ్ భూములను తీసుకున్నాక, వాటి మధ్యలో ఉన్న జిరాయితీ భూములను లాక్కున్నట్లు తెలిసింది. ఇందుకు రెవెన్యూ శాఖలోని కీలక అధికారిని ఉపయోగించుకున్నట్లు సమాచారం. ఎకరాకు 30 లక్షల మేర చెల్లింపులు జరిపినట్లు తెలిసింది. ఈ ప్రక్రియలో ఓ ప్రముఖ రిసార్ట్ యజమాని కూడా పాల్గొన్నారని సమాచారం. ఆయనకు అదే ప్రాంతంలో ఖరీదైన బీచ్ రిసార్ట్ ఉంది. కొన్ని అగ్రిమెంట్లు ఆయన పర్యవేక్షణలో జరిగినట్లు తెలిసింది. కంచేరులో సముద్ర తీరానికి అతి సమీపంలో ఉన్న జిరాయితీ భూములు 18 ఎకరాలను భారీ ప్రాజెక్టుల బూచి చూపి కొనుగోలు చేసినట్లు తెలిసింది. మరో 180 ఎకరాల అసైన్డ్ భూములపై స్కెచ్ వేశారు. అడ్వాన్సులు ఇచ్చి అగ్రిమెంట్లు చేసుకున్నారు. కంచేరు, కొంగవానిపాలెం, పోలిపల్లి పరిధిలో భూములు ఉన్నాయి. మేనల్లుడి భూ దందాకు పేదలు, దళితులు, గిరిజన రైతులు బలవుతున్నారు.

### పెద్దసారు కన్నుపడగానే...

భోగాపురంలో గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే భూసేకరణ పూర్తయింది. దీన్ని దృష్టిలో పెట్టుకొనే విశాఖ జిల్లా భీమిలి నుంచి విజయనగరం జిల్లా భోగాపురం వరకు బీచ్ కారిడార్‌ను ప్రతిపాదించారు. దీంతో పాటు ఇండస్ట్రియల్ కారిడార్‌ను తీసుకొస్తున్నారు. ఇవన్నీ కార్యరూపం దాలిస్తే సముద్రతీరం వెంట ఉన్న కంచేరు, కొంగవానిపాలెం గ్రామాల దిశ, దశ మారుతాయి. భూముల ధరలు ఆకాశాన్నంటుతాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వంలో ముఖ్యస్థానంలో ఉన్న పెద్దసారు కన్నుపడింది. అంతే.. అక్కడి భూములను చేజిక్కించుకునేందుకు కడప జిల్లాకు చెందిన మేనల్లుడిని రంగంలోకి దింపారు.

### ఇక పెద్దసారే చెప్పాలి

భోగాపురంలో అసైన్డ్ భూములు కొన్న వ్యక్తి పెద్దసారుకు సొంత మనిషని తొలుత ప్రచారం జరిగింది. అయితే, భూములను కారుచౌకగా అమ్ముకొని నష్టపోయిన రైతులు ఇప్పుడు గుట్టు విప్పేశారు. పెద్దసారు సొంత మనిషిగా భావిస్తున్న వ్యక్తి ఆయనకు స్వయానా మేనల్లుడని చెబుతున్నారు. ఇక.. పెద్దసారే మేనల్లుడి గురించి చెప్పాలి? పెద్దసారూ... మీరేమైనా చెప్పగలరా?



విశాఖ టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భూములకు సంబంధించిన పత్రాలు చూపుతున్న భోగాపురం మండలం తూడెం గ్రామస్థులు

## చావనైనా చస్తాం గానీ..

# మా భూములివ్వం!

- 50 ఏళ్ల క్రితమే మా పూర్వీకులకు ప్రభుత్వమిచ్చిన భూములివి
- మే 20న జవహర్‌రెడ్డి వచ్చి ఆ భూములు చూసి వెళ్లారు
- 30న రెవెన్యూ, పోలీసులు, స్థానిక పెద్దల సాయంతో కొందరు రౌడీలు వచ్చి భూముల స్వాధీనానికి ప్రయత్నం
- భోగాపురం మండలం తూడెం గ్రామస్థుల ఆరోపణ

విశాఖపట్నం, మే 31 (ఆంధ్రజ్యోతి): బినామీల పేరిట వందల ఎకరాల అసైన్డ్ భూములు సొంతం చేసుకున్నారంటూ సీఎస్ జవహర్‌రెడ్డిపై వచ్చిన ఆరోపణలు రాష్ట్రంలో తీవ్ర దుమారమే రేపాయి. ఈ భూ కుంభకోణంపై రోజుకో వ్యవహారం వెలుగుచూస్తూనే ఉంది. అయినప్పటికీ.. ప్రభుత్వ పెద్దలు, అధికార పార్టీ నేతలు ఏ మాత్రం వెనక్కు తగ్గడం లేదు. అధికారులు, పోలీసుల సాయంతో కొందరు రౌడీలను వెంటేసుకుని అసైన్డ్ భూములు ఇవ్వాల్సిందేనని బెదిరింపులకు దిగుతున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి, ఆయన బినామీ త్రిలోక్ ప్రోద్బలంతో కొందరు భూము లు ఇవ్వాల్సిందిగా తమను బెదిరిస్తున్నారని విజయనగరం జిల్లా భోగాపురం మండలం తూడెం గ్రామస్థులు శుక్రవారం ఆరోపించారు. ఐదు దశాబ్దాల కిందట ప్రభుత్వం తమ పూర్వీకులకు, ప్రస్తుత విశాఖ జిల్లా భీమిలి మండలం అన్నవరం ప్రాంతంలో భూములు (డి.పట్టాలు) ఇచ్చిందని, వాటిల్లో తోటలు వేసుకుని జీవనం సాగిస్తున్నామని వారు తెలిపారు. అయితే గురువారం రెవెన్యూ అధికారులు, పోలీసులు, స్థానికంగా ఉన్న గ్రామ పెద్దల సాయంతో కొందరు రౌడీలను వెంటేసుకుని వచ్చి త్రిలోక్‌కు భూములు అప్పగించాలని ఒత్తిడి తీసుకువచ్చినట్టు చెప్పారు. తూడెం గ్రామానికి చెందిన రైతులు దువ్వి అప్పన్న, జీరు చిట్టితల్లి, కొయ్య నరసమ్మ, వరలక్ష్మి, డెక్కతి సోంబాబు, జీరు వెంకటరావు, జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్, విశాఖ పార్లమెంటు నియోజకవర్గ టీడీపీ ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాస్ శుక్రవారం నగరంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మే 20న ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి అన్నవరం వచ్చి భూములు చూసి వెళ్లారని.. ఆ తర్వాతే రెవెన్యూ, పోలీసులు, వైసీపీ నేతలు, స్థానిక నాయకులు, రౌడీలు తమ తోటల స్వాధీనానికి ప్రయత్నించారని చెప్పారు. త్రిలోక్ మనుషులమంటూ వారిలో కొందరు వచ్చి గురువారం తమను బెదిరించారన్నారు. వీరికి స్థానిక సర్పంచ్ మైలపిల్లి యల్లాజీ, మాజీ సర్పంచ్ లక్ష్మణరావు, ఎంపీటీసీ సభ్యుని కుమారుడు, మరికొందరు అండగా నిలిచి తమపై దౌర్జన్యానికి దిగారని ఆరోపించారు. డీ.పట్టాల రెగ్యులేషన్‌కు ఇచ్చిన జీవో మేరకు భూములు వేరేవారికి చెందుతాయని అధికారులు చెబుతున్నారని, కోర్టుకు వెళ్లినా చెల్లదని బెదిరిస్తున్నారని అన్నారు. ఆ భూములు తమవేనంటూ అన్నవరం గ్రామానికి చెందిన కొందరు పెద్దలు వాటిచుట్టూ ఫెన్సింగ్ వేయడానికి సిమెంట్ స్తంభాలు, ఇనుప వైరు తీసుకొచ్చారని, దీంతో తామంతా కలిసి వారిని ఎదిరించామని చెప్పారు. ప్రస్తుతం తాము భోగాపురం మండలం తూడెం గ్రామంలో నివాసం ఉంటున్నా 1970లో ఉమ్మడి విశాఖ జిల్లాగా ఉన్నప్పుడు అన్నవరం రెవెన్యూ పరిధిలో తమ తాత, తండ్రులకు ప్రభుత్వం ఇచ్చిన భూముల్లో జీడి, మామిడి, నీలగిరి తోటలు పెంచుకుని జీవిస్తున్నామన్నారు. తాతల నుంచి వారసత్వంగా లభించిన భూములను తాము ఎవరికీ అమ్మలేదని స్పష్టం చేశారు. నాలుగేళ్ల క్రితం ల్యాండ్ పూలింగ్ కోసం వీఎంఆర్‌డీఏ నోటీసులిస్తే హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నామని గుర్తుచేశారు. ఒక పక్క స్టే ఉండగానే మధ్యలో అకస్మాత్తుగా త్రిలోక్ దన్నుతో రౌడీలు, పోలీసులు, రెవెన్యూ అధికారులు వచ్చి భూములు స్వాధీనానికి యత్నించారన్నారు. తమకు ఆ తోటలే జీవనాధారమని.. చావనైనా చస్తాం గానీ.. ఆ భూములను ఎవరికీ ఇచ్చేది లేదని తేల్చి చెప్పారు. ఈ విషయంలో కలెక్టర్, ఇతర అధికారులు జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు.

### జీవో అడ్డంపెట్టుకుని అక్రమాలు: మూర్తి యాదవ్

సీఎస్ జవహర్‌రెడ్డి బినామీలైన త్రిలోక్, కృష్ణంరాజు, శ్రీనివాసరాజు, సుభాష్ విశాఖ పరిసరాల్లో రైతుల నుంచి బలవంతంగా డీపట్టా భూములు కొనుగోలు చేస్తున్న విషయాన్ని ఐదారు రోజుల నుంచి తాము చెబుతూ వస్తున్నామని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ అన్నారు. గతేడాది ప్రభుత్వం ఇచ్చిన జీవో 596ను అడ్డం పెట్టుకుని డీ.పట్టా భూములకు ఫ్రీహోల్డ్ అనుమతులు తీసుకుని తర్వాత తమ బినామీల పేరిట రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారని ఆరోపించారు. భోగాపురం ఎయిర్‌పోర్టుకు దగ్గరలో అన్నవరం గ్రామంలో విలువైన డి.పట్టా భూములపై సీఎస్ జవహర్‌రెడ్డి, అతని బినామీ త్రిలోక్ కన్ను పడిందన్నారు. దళిత, పేద రైతులను బెదిరించి అసైన్డ్ భూములు కొట్టేసిన జవహర్‌రెడ్డి, అతని తరఫున బ్రోకర్ పై చర్యలు తీసుకోవాలన్నారు. జవహర్‌రెడ్డి, కలెక్టర్ మల్లికార్జునను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

## ఏబీవీ దెబ్బకు జగన్‌కు నిద్రలేని రాత్రులు: సోమిరెడ్డి



అమరావతి, మే 31(ఆంధ్రజ్యోతి): 'కక్ష సాధింపుల జగన్‌రెడ్డికి నాలుగు తర్వాత ఎలాగూ నిద్ర పట్టదు. ఏబీ వెంకటేశ్వరరావు దెబ్బకు నాలుగు రోజుల ముందే నిద్రలేని రాత్రులు గడపాల్సిన పరిస్థితి రావడం దేవుడు రాసిన స్క్రిప్టులో భాగమేనేమో!' అని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. శుక్రవారం ఎక్స్ వేదికగా ఏబీ వెంకటేశ్వరరావుకు ఆయన అభినందనలు తెలిపారు. 'ఒక అధికారిని సాక్షాత్తూ సీఎం హోదాలో ఉన్న జగన్ వ్యక్తిగతంగా టార్గెట్ చేసి, ఐదేళ్లుగా వేధించడం బాధాకరం. మీ హక్కును పట్టుబట్టి సాధించుకున్నారు. ఎక్కడా ధైర్యం సడలకుండా పోరాటం సాగించారు. చేతకాని సీఎస్ ఉన్న చోట క్యాట్ ఆర్డర్‌తో ఉద్యోగంలో చేరాల్సి వచ్చింది. మొత్తానికి పదవీ విరమణ రోజుకి పోస్టింగ్ సాధించుకున్నారు' అని సోమిరెడ్డి వ్యాఖ్యానించారు.

### జగన్ తిరుగుప్రయాణం



గన్నవరం, మే 31: విదేశీ యాత్రకు వెళ్లిన సీఎం జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రానికి తిరుగు పయనమయ్యారు. ఇంగ్లాండ్‌లోని ఫార్న్‌బరో విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో భారత కాలమానం ప్రకారం శుక్రవారం రాత్రి బయలుదేరారు. శనివారం తెల్లవారుజామున గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు. మే 17న కుటుంబ సమేతంగా జగన్ లండన్ వెళ్లిన సంగతి తెలిసిందే.

# మాకు మీరు.. మీకు మేము!

(మొదటి పేజీ తరువాయి)

ప్రయత్నాలు జరిగినట్లు రాజకీయ వర్గాల్లో ఇప్పుడు పెద్దఎత్తున ప్రచారం జరుగుతోంది. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడు, కడప లోక్‌సభ వైసీపీ అభ్యర్థి, సీఎం జగన్‌కు మరో చిన్నాన్న కుమారుడైన వైఎస్ అవినాశ్‌రెడ్డి శిబిరం ఏకంగా జగన్ సొంత నియోజకవర్గం పులివెందులలోనే ప్రత్యర్థి పక్షంతో చేతులు కలపాలని ప్రయత్నించినట్లు తెలిసింది. ఈ ప్రయత్నం సఫలమైతే ఆ దెబ్బ జగన్‌కే తగిలేది. కానీ టీడీపీ శిబిరం నిరాకరించడంతో ఫలించలేదు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. కడప ఎంపీ స్థానానికి వైఎస్ రాజశేఖరరెడ్డి కుమార్తె షర్మిల కాంగ్రెస్ తరఫున పోటీ చేయడం అవినాశ్‌రెడ్డి శిబిరంలో కలవరం రేకెత్తించింది. గత ఎన్నికల్లో అక్కడ అవినాశ్ భారీ మెజారిటీతో గెలిచారు. మామూలుగా అయితే అక్కడ వైసీపీ గెలుపుపై సందేహం పెట్టుకోవాల్సిన అవసరం లేదు. కానీ షర్మిల బరిలోకి దిగడం అక్కడ రాజకీయ వాతావరణాన్ని బాగా వేడెక్కించింది. తమ చిన్నాన్న వివేకానందరెడ్డి దారుణ హత్యలో అవినాశ్‌రెడ్డి పాత్రపై ఆమె విస్తృతంగా ప్రచారం చేశారు. వివేకా కుమార్తె సునీత కూడా ఆమెకు మద్దతుగా ఇంటింటి ప్రచారం చేశారు. జగన్ తల్లి విజయలక్ష్మి సైతం షర్మిలకు మద్దతివ్వాలని ఓటర్లను కోరుతూ ఒక వీడియో సందేశం విడుదల చేశారు. ఈ పరిణామాలు కడప జిల్లాలో వైసీపీ మద్దతుదారుల్లో చీలిక తెచ్చాయి. కొంత మంది బాహటంగానే షర్మిలకు మద్దతుగా మాట్లాడడం మొదలుపెట్టారు. ప్రత్యేకించి పులివెందులలో అనేక మంది వైసీపీ ఓటర్లు అసెంబ్లీకి వైసీపీకి వేసి.. లోక్‌సభకు మాత్రం షర్మిలకు వేస్తామని చెప్పినట్లు కొన్ని సర్వేలు పేర్కొన్నాయి. ఇది అవినాశ్‌రెడ్డి వర్గాన్ని కలవరపరచింది. జనం వైసీపీ అసెంబ్లీ అభ్యర్థులకు ఓట్లు వేసి.. ఎంపీగా షర్మిలకు వేస్తే తమ గెలుపు ప్రశ్నార్థకమవుతుందన్న భయం ఏర్పడింది. దీంతో చీకటి ఒప్పందానికి తెరలేపింది. అవినాశ్ తండ్రి వైఎస్ భాస్కర్‌రెడ్డి పులివెందుల టీడీపీ అభ్యర్థి బీటెక్ రవి సన్నిహితులకు ఒక వర్తమానం పంపారు. 25 పోలింగ్ బూత్‌ల్లో పరస్పరం అంగీకారంతో పనిచేద్దామని, ఆ బూత్‌ల్లో అసెంబ్లీ ఓట్లు టీడీపీ వేసుకుంటే.. ఎంపీ ఓట్లు తాము వేసుకుంటామన్నది ఆ సందేశం సారాంశం. 25 బూత్‌ల్లో కలిపి సుమారుగా 25-30 వేల ఓట్లు ఉంటాయి. ఈ ఓట్లు తమకు పడితే పులివెందులలో తమకు ఏర్పడే తరుగు కొంత వరకూ పూడుతుందని అవినాశ్ శిబిరం ఆశించింది. దీనివల్ల జగన్‌కు వచ్చే ఓట్లకు గండి పడే ప్రమాదమున్నా పట్టించుకోలేదు. అయితే ఈ ప్రతిపాదనకు బీటెక్ రవి శిబిరం అంగీకరించలేదు. గెలిచినా, ఓడినా బహిరంగంగానే పోరాడతామని, ఇటువంటి తెర వెనుక ఒప్పందాలకు అంగీకరించబోమని తేల్చిచెప్పింది. పులివెందులలో కుదరకపోవడంతో అవినాశ్ శిబిరం ఇదే ప్రతిపాదనను తమ లోక్‌సభ స్థానం పరిధిలోని మిగతా ఆరు స్థానాలు.. కడప, మైదుకూరు, కమలాపురం, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేల్ (ఎస్సీ)ల్లో పోటీచేస్తున్న టీడీపీ, బీజేపీ అభ్యర్థులకు కూడా పంపింది. వీరిలో ఒక్క అభ్యర్థి మాత్రం దీనికి అంగీకరించారని, ఆ నియోజకవర్గంలో కొన్ని పోలింగ్ బూత్‌ల్లో ఇరు పక్షాలు పరస్పర అంగీకారంతో పనిచేశాయని ఆ జిల్లాలో ప్రచారం జరుగుతోంది. ఇది చెవిన పడడంతో కొందరు టీడీపీ ముఖ్యులు బీటెక్ రవిని ఆరా తీశారు. తన వద్దకు ఈ ప్రతిపాదన వచ్చిన మాట వాస్తవమేనని, తాను తిరస్కరించానని ఆయన వారికి చెప్పారు. మిగిలిన నియోజకవర్గాల్లో ఏం జరిగిందో తనకు తెలియదన్నారు.

### రాష్ట్రంలో మరికొన్ని చోట్ల..!

ఇటువంటి తెరచాటు ప్రయత్నాలు కడప జిల్లాకే పరిమితం కాలేదు. పార్టీ ఎటుపోయినా తాము గెలిస్తే చాలనుకున్న కొందరు వైసీపీ అభ్యర్థులు ఇతర జిల్లాల్లో కూడా ఈ తరహా ఒప్పందాలకు ప్రయత్నించారు. రాష్ట్రం నడిబొడ్డున ఉన్న ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఒక యువ అభ్యర్థి.. ప్రత్యర్థి పక్షంతో ఇదే తరహాలో రాజీకి ప్రయత్నం చేశారు. అసెంబ్లీకి తనకు ఓట్లు వేయిస్తే తన ఓట్లు టీడీపీ లోక్‌సభ అభ్యర్థికి వేయిస్తానని ఆయన బేరం పెట్టారు. కానీ టీడీపీ శిబిరం అంగీకరించలేదు. గోదావరి జిల్లాల్లో ఒక వైసీపీ ఎంపీ అభ్యర్థి తన పరిధిలోని టీడీపీ అసెంబ్లీ అభ్యర్థులను దువ్వాలని చూశారు. కావాలంటే ఆర్థిక సాయం ఎంతైనా చేస్తానని, తనకు ఓట్లు వేయించాలని ఆయన వారిని పదేపదే కోరారు. గుంటూరు జిల్లాలో ఒక వైసీపీ లోక్‌సభ అభ్యర్థి కులం కార్డు వాడారు. తనకు సాయం చేయాలని టీడీపీలో ఉన్న తమ కులం నేతలకు విజ్ఞప్తులు పంపారు. కానీ ఆ ప్రయత్నాలు పెద్దగా ఫలించిన దాఖలాలు కనిపించలేదు.

# ఏడు రోజుల కస్టడీకి ప్రజ్వల్

- జర్మనీ నుంచి అర్ధరాత్రి వేళ ఎయిర్‌పోర్టుకు రాక
- అరెస్టు చేసిన మహిళా అధికారులు

బెంగళూరు, మే 31(ఆంధ్రజ్యోతి): లైంగిక దాడుల వివాదంలో చిక్కుకున్న జేడీఎస్ నాయకుడు, హాసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణను సిట్ అధికారులు శుక్రవారం సాయంత్రం కోర్టులో హాజరుపరిచారు. విచారణ కోసం వారం రోజుల కస్టడీకి కోర్టు అనుమతించింది. లైంగిక దాడుల పెన్‌డ్రైవ్‌లు బయటకు వచ్చిన రోజునే జర్మనీకి పరారైన ప్రజ్వల్.. 34 రోజుల తరువాత బెంగళూరుకు తిరిగి వచ్చారు. బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో గురువారం అర్ధరాత్రి దిగగానే ఇమిగ్రేషన్ విభాగం వద్ద మహిళా పోలీసు అధికారులు ఆయనను అరెస్టు చేస్తున్నట్లు ప్రకటించారు. తనను ఎవరూ తాకవద్దని, వెంటే వస్తానని చెప్పిన ప్రజ్వల్.. వారితో కదిలారు. ఎయిర్‌పోర్టులో దిగిన తరువాత 20 నిమిషాల వ్యవధిలోనే ప్రజ్వల్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అక్కడినుంచి విధానసౌధ సమీపంలోని సీఐడీ కార్యాలయంలోని సిట్ విభాగానికి తెల్లవారుజామున 2గంటలకు తీసుకెళ్లారు. రాత్రి మొత్తం ఆయన అక్కడే గడిపారు. ఉదయం నుంచి ప్రజ్వల్‌ను సిట్ అధికారులు వివిధ కోణాల్లో ప్రశ్నించారని తెలిసింది. ఆ తర్వాత ఆయన న్యాయవాదితో మాట్లాడారు. ప్రజ్వల్‌ను మధ్యాహ్నం శివాజీనగర్‌లోని బౌరింగ్ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యపరీక్షలు చేయించారు. త్వరలోనే ఆయనకు లైంగిక సామర్థ్య పరీక్షలు కూడా నిర్వహించాలని సిట్ యోచిస్తున్నట్టు తెలిసింది. కాగా, వైద్య పరీక్షల అనంతరం ఆయనను 42వ ఏసీఎంఎం కోర్టుకు (ప్రజా ప్రతినిధుల న్యాయస్థానం) తీసుకెళ్లి న్యాయాధికారి ఎదుట హాజరుపరిచారు. విచారణ కోసం 14రోజుల కస్టడీకి ఇవ్వాలని సిట్ అధికారులు కోర్టుకు విన్నవించారు. ప్రజ్వల్ న్యాయవాదులు, సిట్ తరఫున ప్రభుత్వ న్యాయవాదుల వాదనలు విన్న అనంతరం జూన్ 6 వరకూ ప్రజ్వల్‌ను సిట్ కస్టడీకి ఇస్తూ న్యాయాధికారి ఆదేశాలు జారీ చేశారు. దీంతో ప్రజ్వల్‌ను తిరిగి సిట్ కార్యాలయానికి తీసుకెళ్లారు. కాగా, సిట్ చేపట్టిన పకడ్బందీ చర్యల కారణంగానే లైంగిక దాడుల కేసులో ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ అరెస్టు సాధ్యమైందని కర్ణాటక హోంశాఖ మంత్రి పరమేశ్వర్ అన్నారు.



ప్రజ్వల్‌ను అరెస్టు చేసి తీసుకెళుతున్న పోలీసులు

### ప్రజ్వల్ తల్లికి సిట్ నోటీసులు

ఎంపీ ప్రజ్వల్‌పై లైంగిక ఆరోపణలు చేసిన మహిళ కిడ్నాప్ వివాదంలో విచారణకు హాజరు కావాలని ఆయన తల్లి భవానికి సిట్ అధికారులు నోటీసులు ఇచ్చారు. జూన్ 1న విచారణకు హాజరు కావాలని దర్యాప్తు అధికారి హేమంత్‌కుమార్ నోటీసులో పేర్కొన్నారు. కిడ్నాప్ కేసులో ప్రజ్వల్ తండ్రి రేవణ్ణను అరెస్టు చేసి జైలుకు పంపిన విషయం తెలిసిందే. ఏడు రోజుల జ్యుడీషియల్ కస్టడీలో గడిపిన రేవణ్ణ.. కండిషన్ బెయిల్‌పై విడుదలయ్యారు. ఇదే కేసులో భవానికి ఇప్పటికే రెండుసార్లు నోటీసులు ఇచ్చినా ఆమె స్పందించకపోవడంతో మూడోసారి నోటీసులు జారీ చేశారు. ఈ కేసులో ఆమెను విచారించాల్సిన అవసరం ఉన్నందున హాసన్ జిల్లా హొళె నరసీపురలోని చెన్నాంబిక నిలయంలో శనివారం ఉదయం 10నుంచి సాయంత్రం 5గంటల వరకూ అందుబాటులో ఉండాలని, మహిళా పోలీసుల సమక్షంలో విచారణ జరుపుతామని నోటీసుల్లో పేర్కొన్నారు. జస్టిస్ కృష్ణ దీక్షిత్ నేతృత్వంలోని సింగిల్ బెంచ్ ఈ కేసు విచారణను సోమవారానికి వాయిదా వేసింది. మరోవైపు మహిళ కిడ్నాప్ కేసులో భవాని రేవణ్ణ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ప్రజా ప్రతినిధుల ప్రత్యేక న్యాయస్థానం తిరస్కరించింది.

### మహిళా అధికారుల పర్యవేక్షణలోనే...

జర్మనీ నుంచి బెంగళూరు ఎయిర్‌పోర్టులో దిగిన వెంటనే ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణను ఖాకీ యూనిఫాంలో ఉన్న మహిళా పోలీసు సిబ్బంది చుట్టుముట్టారు. మహిళా ఐపీఎస్ అధికారులు సుమన్ డి పెన్నేకర్, సీమా లట్కర్ నేతృత్వంలోని ఈ బృందం ఆయన్ను అక్కడికక్కడే అరెస్టు చేశారు. అక్కడినుంచి ఆసుపత్రికి తరలించడం, ఆ తర్వాత కోర్టులో హాజరు పరచడం, తిరిగి సిట్ కార్యాలయానికి తరలించే ప్రక్రియను మొత్తం వారే పర్యవేక్షించారు. 'ప్రజ్వల్‌ను అరెస్టు చేయడానికి మహిళా అధికారులనే పంపాలని నిర్ణయించాం. ఎంపీగా తన పదవిని, అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఎంతోమంది మహిళలపై లైంగిక దాడులకు, దౌర్జన్యాలకు పాల్పడ్డారు. అలాంటి ఆయన్ను అరెస్టు చేసేది కూడా మహిళలే అనే సందేశం ఇవ్వాలని భావించాం' అని సిట్ అధికారి ఒకరు తెలిపారు. మహిళా అధికారులు ఎవరికీ భయపడరని బాధితులకు భరోసా కల్పించే ఉద్దేశం కూడా ఇందులో ఉందని పేర్కొన్నారు.



వీడ్కోలు సభలో జస్టిస్ ఏవీ శేషసాయి, చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్

## జస్టిస్ ఏవీ శేషసాయికి హైకోర్టు ఘన వీడ్కోలు

- రేపు పదవీ విరమణ చేయనున్న జస్టిస్ శేషసాయి
- న్యాయసేవలను కొనియాడిన సీజే ఠాకూర్, న్యాయమూర్తులు

అమరావతి, మే 31(ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ చేయనున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయికి హైకోర్టు చీఫ్ జస్టిస్ సహా ఇతర న్యాయమూర్తులు, న్యాయాధికారులు, న్యాయవాదులు ఘనంగా వీడ్కోలు పలికారు. జస్టిస్ శేషసాయి ఈనెల 2న పదవీ విరమణ చేయనున్నారు. ఆ రోజు ఆదివారం కావడంతో శుక్రవారమే వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ నేతృత్వంలో మొదటి కోర్టుహాలులో వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ జస్టిస్ శేషసాయి న్యాయమూర్తిగా 23వేలకు పైగా కేసులు పరిష్కరించారన్నారు. న్యాయమూర్తిగానే కాకుండా వివిధ కమిటీల్లో సభ్యుడిగా విశిష్ట సేవలు అందించి న్యాయపాలన వృద్ధికి తోడ్పడ్డారంటూ, ఆయన సేవలను కొనియాడారు. పదవీ విరమణ తరువాత జస్టిస్ శేషసాయి శేషజీవితం ఆయురారోగ్యాలతో ప్రశాంతంగా సాగాలని ఆకాంక్షించారు. జస్టిస్ ఏవీ శేషసాయి మాట్లాడుతూ... న్యాయవాదిగా, న్యాయమూర్తిగా తనకు సహరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. తల్లిదండ్రుల కష్టమే తనను ఈస్థాయిలో నిలబెట్టిందన్నారు. అంతకుముందు అడ్వకేట్ జనరల్ ఎస్.శ్రీరామ్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.నాగిరెడ్డి మాట్లాడుతూ.. జస్టిస్ శేషసాయి ఎంతో ఓపిక, సహనంతో కేసులను విచారించి, పరిష్కరించేవారన్నారు. అనంతరం జస్టిస్ శేషసాయిని ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గంగారావు, జస్టిస్ ఏవీ శేషసాయి కుటుంబ సభ్యులు, రిజిస్ట్రార్‌లు, హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం, బార్ కౌన్సిల్ ఛైర్మన్ ఎన్.ద్వారకానాథ్‌రెడ్డి, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## జామీన్లను అనుమతించండి

- గులకరాయి దాడి కేసులో నిందితుడి తరఫున పిటిషన్

విజయవాడ, మే 31(ఆంధ్రజ్యోతి): విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌లో సీఎం జగన్‌పై జరిగిన గులక రాయి దాడి కేసులో నిందితుడి వేముల సతీష్‌కుమార్ తరఫున జామీన్లను అనుమతించాలని న్యాయవాది అబ్దుస్ సలీం మొదటి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సతీష్‌కు ఎనిమిదో అదనపు జిల్లా జడ్జి కోర్టు ఇద్దరు జామీనులు, రూ.50 వేల ధరావత్తుతో బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. దీనిపై పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేసిన పిటిషన్‌పై ఇదే కోర్టు స్టే ఇచ్చింది. దీని గడువు గురువారంతో ముగిసింది. దీంతో న్యాయవాది సలీం నిందితుడు సతీష్ బెయిల్‌కు సంబంధించిన పూచీకత్తును స్వీకరించాలని పిటిషన్‌లో కోరారు. దీనిపై కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు నోటీసులు జారీ చేయాలని ఆదేశించింది.

## అమెరికా స్పెల్ బీలో తెలుగు సంతతి విద్యార్థి గెలుపు

- 90 సెకన్లలో 29 పదాలు తప్పుల్లేకుండా చెప్పిన బృహత్

న్యూఢిల్లీ, మే 31: అమెరికాలో నిర్వహించే స్క్రిప్స్ జాతీయ స్పెల్లింగ్ బీ పోటీలో తెలంగాణ సంతతికి చెందిన 12 ఏళ్ల బృహత్ సోమ సత్తా చాటాడు. ఫైనల్‌లో 90 సెకన్లలోనే 29 పదాల స్పెల్లింగ్స్ తప్పుల్లేకుండా చెప్పి టైటిల్ గెలుచుకున్నాడు. అలాగే రూ.41.64 లక్షల నగదుతో పాటు వివిధ బహుమతులు దక్కించుకున్నాడు. బృహత్‌కు గట్టి పోటీనిచ్చిన టెక్సాస్‌కు చెందిన ఫైజాన్ జాకీ 25 పదాలు మాత్రమే చెప్పి రెండో స్థానానికే పరిమితమయ్యాడు.. అతడు రూ.20.82 లక్షల ప్రైజ్‌మనీ అందుకున్నాడు. ప్రస్తుతం బృహత్ ఏడో తరగతి చదువుతున్నాడు. అతడి కుటుంబం ఫ్లోరిడాలో నివాసముంటోంది. బృహత్ తండ్రి శ్రీనివాస్ స్వస్థలం తెలంగాణలోని నల్లగొండ.

## శిశు విక్రయాలు, అక్రమ దత్తతలపై కఠిన చర్యలు

- బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి

అమరావతి, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పసి పిల్లలను విక్రయించినా, అనధికారికంగా దత్తత స్వీకరించినా అటువంటి వారిపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన శిశువులను అక్రమంగా సేకరించి సంతానం కలగని దంపతులకు విక్రయించిన అంతర్రాష్ట్ర ముఠాను పోలీసులు పట్టుకుని వారి నుంచి రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన 16మంది శిశువులను హైదరాబాద్‌లోని శిశు సంరక్షణ కేంద్రంలో చేర్పించారన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, రాష్ట్ర పోలీస్ అధికార్లు తక్షణమే విచారణ చేపట్టి నివేదికను రాష్ట్ర బాలల హక్కుల కమిషన్‌కు సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు.

## కౌంటింగ్ దాకా ఎందుకు.. రండిరా!

- వేట కొడవలితో వైసీపీ కార్యకర్త వీరంగం

రాయదుర్గం, మే 31: 'నాలుగో తేదీ వరకూ ఎందుకు..? దమ్ముంటే ఇప్పుడే రండిరా చూసుకుందాం..' అంటూ టీడీపీ వర్గీయులకు సవాల్ చేస్తూ ఓ వైసీపీ కార్యకర్త వీరంగం చేశాడు. అనంతపురం జిల్లా డి.హిరేహాళ్ మండలం కల్యం గ్రామంలో ఎంపీటీసీ సురేష్ ప్రధాన అనుచరుడైన ఈరన్న వేటకొడవలిని చేతబట్టుకుని కవ్విస్తూ శుక్రవారం ఊరంతా తిరిగి హల్‌చల్ చేశాడు. అతడి కవ్వింపు చర్యల వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. చేతిలో మారణాయుధం ఉండటంతో గ్రామస్థులెవ్వరూ అతడికి అడ్డు చెప్పే సాహసం చేయలేదు. ఎంతకూ తగ్గకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఈరన్నను అదుపులో తీసుకున్నారు.



వేట కొడవలితో హల్‌చల్ చేస్తున్న వైసీపీ కార్యకర్త ఈరన్న

**నాయీబ్రాహ్మణ సంఘం**

## రాష్ట్ర నేతపై వైసీపీ ముష్కరుల దాడి

పెనమలూరు, మే 31: రాష్ట్ర నాయీబ్రాహ్మణ సంఘం అధ్యకుడు, టీడీపీ నేత ద్రాక్షారపు సూర్యనారాయణపై వైసీపీ కార్యకర్తలు అర్ధరాత్రి దారికాచి దాడి చేశారు. ఈ దాడిలో అతడి పక్కటెముకలు విరిగాయి. కృష్ణా జిల్లా పెనమలూరులో గురువారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. సూర్యనారాయణ తల, మెడపై నిందితులు ఆతం మోహన్, ఆతం ప్రసాద్, మరో గుర్తు తెలియని వ్యక్తి పిడిగుద్దులు గుద్దడంతో అయన కాసేపు స్పృహ కోల్పోయారు. సూర్యనారాయణ ఫోన్‌ను ధ్వంసం చేశారు. తేరుకున్న అనంతరం పెనమలూరు పోలీసుస్టేషనులో ఫిర్యాదు చేసి విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స చేశారు. మోహన్ కొన్నేళ్ల కిందట ఒక మహిళను వేధిస్తుంటే కుల పెద్దలు పిలిచి హెచ్చరించిన నేపథ్యాన్ని మనసులో పెట్టుకుని, ఎన్నికల ముందు తాము టీడీపీ నాయకులతో కలిసి మీటింగ్ ఏర్పాటు చేసుకోవడం కారణంగా తనపై దాడిచేసినట్టు సూర్యనారాయణ పోలీసులకు తెలిపారు.

## ఏడాదిలో రెండుసార్లు విద్యార్థుల ఇళ్లకు టీచర్లు

అమరావతి, మే 31(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు ఇక నుంచి ఏడాదిలో రెండుసార్లు విద్యార్థుల ఇళ్లకు వెళ్లాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశించింది. 1వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు ఈ విధానం అమలు చేయాలని స్పష్టం చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. జూన్‌లో ఒకసారి, జనవరిలో మరోసారి ప్రతి ఇంటికీ వెళ్లి తల్లిదండ్రులతో చర్చించాలని సూచించారు.

## ఇంకో రూ.4,000 కోట్ల అప్పు

అమరావతి, మే 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఇంకో రూ.4,000 కోట్ల అప్పులు తెస్తోంది. ఓట్ల లెక్కింపు రోజునే ఇంత భారీగా అప్పు తెస్తున్నారు. జూన్ 4న రిజర్వ్ బ్యాంకు నిర్వహించే వేలంలో రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీలు విక్రయించి రూ.4,000 కోట్ల అప్పు తెస్తున్నారు. ఇప్పటివరకు రూ.25,000 కోట్ల అప్పులు అధికారికంగా తెచ్చారు. కేంద్రం 6 నెలల కోసం రూ.47,000 కోట్ల అప్పులకు అనుమతివ్వగా వైసీపీ ప్రభుత్వం రెండు నెలల్లోనే రూ.25,000 కోట్ల అప్పులు తెచ్చేసింది. మిగిలిన 4 నెలలకు గాను ఇంకా కేవలం రూ.22,000 కోట్ల అప్పుల పరిమితి మాత్రమే మిగిలి ఉంది.

# గుడ్‌బై హైదరాబాద్!

(మొదటి పేజీ తరువాయి)

సచివాలయంతోపాటు ఇతర కార్యాలయాల్లో ఏపీకి కేటాయించిన భవనాలను తెలంగాణకు అప్పగించే విషయం కూడా పెండింగ్‌లో పడింది. 'మీకు అక్కర్లేని భవనాలను తెలంగాణకు అప్పగించవచ్చు కదా' అని అప్పటి గవర్నర్ నరసింహన్ సూచించినా... విభజన అంశాలన్నీ పరిష్కారమయ్యే దాకా వాటిని అప్పగించలేమని అప్పటి టీడీపీ సర్కారు స్పష్టం చేసింది. జగన్ ముఖ్యమంత్రి అయ్యాక అమరావతిని అటకెక్కించారు. మూడు రాజధానుల లెక్క తెచ్చారు. పోనీ... విభజన సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టారా... అంటే అదీ లేదు. కేసీఆర్‌తో సాన్నిహిత్యం, ఆయనతో ఉన్న అవసరాలకే పెద్దపీట వేశారు. హైదరాబాద్‌లో ఏపీ ఆధీనంలో ఉన్న భవనాలన్నింటినీ తెలంగాణకు అప్పగించారు. లేక్ వ్యూ గెస్ట్ హౌస్, అసెంబ్లీ ఎదురుగా ఉండే హెర్మిటేజ్ బిల్డింగ్ మాత్రమే ఉంచుకున్నారు. ఈ ఐదేళ్లలోఒక్కసారి కూడా తెలంగాణ సర్కారుతో విభజనకు సంబంధించిన అంశాలపై చర్చించలేదు.

### తీరిగ్గా పదేళ్లకు...

ఆదివారంతో రాష్ట్ర విభజనకు పదేళ్లు పూర్తవుతోంది. చట్ట ప్రకారం హైదరాబాద్‌తో, తెలంగాణతో బంధం పూర్తిగా తెగిపోతుంది. కానీ, విభజన చట్టంలోని షెడ్యూల్ 9, షెడ్యూల్ 10లో ఉన్న రూ.వేల కోట్ల విలువైన ఆస్తుల పంపకాలు ఇంకా జరగలేదు. ఐదేళ్లు ఈ విషయాలను విస్మరించిన జగన్ సర్కారు చివరాఖరులో తూతూమంత్రం సమీక్ష నిర్వహించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి ఇటీవల విభజన అంశాలపై సమావేశం నిర్వహించారు. అందులో ఏం తేల్చారంటే..

- హైదరాబాద్‌లో ఏపీ ప్రభుత్వానికి చెందిన ఆయా శాఖల పరిధిలో ఉన్న భవనాలను తెలంగాణ ప్రభుత్వానికి అప్పజెప్పేందుకు ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. వీటిలో 5 మంత్రుల క్వార్టర్లు, 14 ఎమ్మెల్యే క్వార్టర్లు ఉన్నాయి. లేక్‌వ్యూ అతిథి గృహం, సీఐడీ హెడ్‌క్వార్టర్స్, హెర్మిటేజ్ భవనాలు ప్రస్తుతం ఏపీ ప్రభుత్వం ఆధీనంలో ఉన్నాయి. వీటిని జూన్ 2 తర్వాత కూడా తమ అధీనంలోనే ఉంచుకుంటామని ఏపీ ప్రభుత్వం.. తెలంగాణ ప్రభుత్వానికి తెలిపింది. దీనిపై తెలంగాణ ప్రభుత్వం నుంచి ఇంకా స్పందన రాలేదు.
- రాష్ట్రంలో వ్యవసాయ యూనివర్సిటీ ఏర్పాటు గురించి రాష్ట్ర వ్యవసాయ శాఖ కేంద్రంతో సంప్రదింపులు చేయాలి. అలాగే, షెడ్యూల్-8లో ఉన్న మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల అమలు దిశగా సంబంధిత శాఖలు కేంద్రంతో నిత్యం సంప్రదింపులు జరుపుతున్నాయని జవహర్‌రెడ్డి సమావేశంలో చెప్పారు. ఈ జాబితాలో వైజాగ్-చెన్నై పారిశ్రామిక కారిడార్, విశాఖ, విజయవాడ, తిరుపతి విమానాశ్రయాల ప్రమాణాలను అంతర్జాతీయస్థాయికి పెంచడం, అమరావతి ర్యాపిడ్ రైలు, రోడ్డు కనెక్టివిటీ విస్తరణ, కొత్త రైల్వేజోన్ ఏర్పాటు వంటివి ఉన్నాయి. వీటికి సంబంధించిన శాఖలు తరచూ కేంద్రంతో సంప్రదింపులు జరపాలని సీఎస్ సూచించారు.
- విభజన చట్టంలోని సెక్షన్ 95 ప్రకారం.. తెలంగాణలోని ప్రముఖ ఉన్నత విద్యాసంస్థల్లో ఏపీ విద్యార్థులకు దక్కాల్సిన కోటాను కల్పించేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. గతంలో అవకాశం కోల్పోయిన విద్యార్థులకు న్యాయం చేసేలా సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.
- ఈ పదేళ్లలో తెలంగాణ నుంచి ఏపీకి వలస వచ్చిన వారికి సంబంధించి ఎన్ని దరఖాస్తులు ఉన్నాయి, వాటిలో ఎన్ని ఆమోదించారు, ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయన్న విషయాలు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి తెలియజేయాలని, దీనికి అనుగుణంగా ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌ను సవరించాలి.
- ఏపీ నుంచి తెలంగాణకు వెళ్లేందుకు దరఖాస్తు చేసుకున్న 1,942 మంది ఉద్యోగులు, తెలంగాణ నుంచి ఏపీకి వచ్చేందుకు దరఖాస్తు చేసుకున్న 1,442 మంది ఉద్యోగుల బదిలీ ప్రక్రియను పూర్తిచేయాలని నిర్ణయించారు. తెలంగాణ ప్రభుత్వాన్ని సంప్రదించగా, ఎన్నికల కోడ్ ముగిశాక నిర్ణయం తీసుకుంటామందని అధికారులు వెల్లడించారు.
- విశాఖలో గ్రేహౌండ్స్ ట్రైనింగ్ సెంటర్‌కు సంబంధించిన ప్రతిపాదనను కేంద్రానికి పంపామని, నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నామని తెలిపారు. ఈ ప్రాజెక్టు నిర్మాణ వ్యయం అంచనా రూ.294 కోట్లని పేర్కొన్నారు. భూమి విలువ రూ.358 కోట్లుగా ఉందని వెల్లడించారు.
- మార్చి 31, 2023 నాటికి తెలంగాణ డిస్కమ్స్ నుంచి ఏపీ జెన్కోకి రూ.7,101 కోట్లు రావాలి. దీనిపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై తెలంగాణ డిస్కమ్స్ సుప్రీంకోర్టులో ఎస్ఎల్‌పీ దాఖలు చేశాయి. తక్షణమే ఈ ఎస్ఎల్‌పీని విత్‌డ్రా చేయించి, బకాయిలు వసూలు చేసుకోవాలని సీఎస్ నిర్ణయించారు.
- షెడ్యూల్ 9లో ఉన్న 89 సంస్థలు, షెడ్యూల్ 10లో ఉన్న 142 సంస్థల విభజన ఇంకా పూర్తికాలేదు. షెడ్యూల్ 9లోని సంస్థల విభజన గురించి షీలా బిడే కమిటీ నివేదిక ఇచ్చింది. దీనిప్రకారం ముందుకెళ్లాలని ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చినా తెలంగాణ ప్రభుత్వం స్పందించలేదు. దీనిపై సమావేశంలో అధికారులు చర్చించలేదు.

### 'జువెనల్' భవనం తెలంగాణకు అప్పగింత

సైదాబాద్, మే 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజనలో భాగంగా హైదరాబాద్‌లోని సైదాబాద్‌లో ఉన్న జువెనల్ వెల్ఫేర్, కరెక్షనల్ సర్వీసెస్ కార్యాలయంలో ఏపీకి కేటాయించిన భవనాన్ని తెలంగాణకు అప్పగించారు. ఏపీ జువెనల్ శాఖ జాయింట్ డైరెక్టర్ మధుసూదన్‌రావుతో కూడిన బృందం శుక్రవారం సైదాబాద్‌లోని ప్రధాన కార్యాలయానికి చేరుకుని భవనం తాళాలను తెలంగాణ అధికారులకు అందజేశారు. ఏపీ అధికారుల బృందాన్ని తెలంగాణ జువెనల్ శాఖ డీడీ డాక్టర్ బేగ్ సత్కరించారు.



ఏపీ అధికారులను సత్కరించిన తెలంగాణ జువెనల్ శాఖ అధికారులు

# వలంటీర్లు లబోదిబో!

(మొదటి పేజీ తరువాయి)

ఓట్లేశారని నేతలు వారిపై మండిపడుతున్నారు. ఇంకా కొన్నిచోట్ల వలంటీర్లు తటస్థంగా వ్యవహరించడంతో తమకు పడాల్సిన ఓట్లు టీడీపీకి పడ్డాయని వైసీపీ అభ్యర్థులు చిందులు తొక్కుతున్నారు. దీంతో వైసీపీ నాయకుల కోసం ఎంత శ్రమించినా తమకు గుర్తింపు లేదని, ఎన్నికల్లో తమ సేవలను వాడుకుని.. తీరా తమపైనే నెపం వేస్తున్నారని పలువురు వలంటీర్లు వాపోతున్నారు. ఎన్నికల ముందు తమతో బలవంతంగా రాజీనామా చేయించి, ఇప్పుడు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### రాజీనామాలతో రోడ్డున పడ్డాం

ఎన్నికల్లో వైసీపీ తరపున ప్రచారం చేసేందుకు వలంటీర్లతో పట్టుబట్టి మరీ రాజీనామాలు చేయించారు. ఎంపీడీవోలకు, మున్సిపల్ కమిషనర్లకు వీరు సమర్పించిన రాజీనామాలను అప్పటికప్పుడు ఆమోదించడంతోపాటు వారి లాగిన్‌లో ఐడీలు కూడా తొలగించారు. రాజీనామా చేయనివారు మాత్రం ఏప్రిల్‌కు సంబంధించిన జీతాలను మే మొదటి వారంలో తీసుకున్నారు. వీరికి మే నెలకు సంబంధించిన జీతాలను కూడా జనరేట్ చేస్తున్నారు. దీంతో రాజీనామా చేసినవారంతా వైసీపీ నేతల మాటలు విని జీతం పోగొట్టుకున్నామని వాపోతున్నారు. తమ పరిస్థితి ఏమిటని అడిగితే.. ఎన్నికల్లో గెలుస్తామో, లేదోనన్న టెన్షన్‌లో ఉన్న అభ్యర్థులు వారి ఊసే పట్టించుకోవడం లేదు. ఒకవేళ తాము గెలిచినా వైసీపీ ప్రభుత్వం వస్తుందో, రాదోనన్న ఆందోళనతో వలంటీర్లకు మొహం చాటేస్తున్నారు. దీంతో వైసీపీ అభ్యర్థులకు మద్దతు పలికి తప్పు చేశామని పశ్చాత్తాపపడుతున్నారు. వలంటీర్లను కొనసాగిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని, అప్పట్లోనే టీడీపీ కోసం పనిచేసి ఉంటే బాగుండేదని పలువురు అంతర్గత సంభాషణల్లో వ్యాఖ్యానిస్తున్నారు.

### వైసీపీ ముద్రతో నష్టం

ప్రజలకు ఐదేళ్ల పాటు సేవలందించినా కూడా చివరకు వైసీపీ కార్యకర్తలుగా ముద్ర వేయించుకోవాల్సి వచ్చిందని వలంటీర్లు ఆవేదన చెందుతున్నారు. ఎన్నికల ముందు ప్రభుత్వ సేవలు అందించి తీరా ఎన్నికల్లో వైసీపీ ఏజెంట్లుగా కూడా పనిచేశామంటున్నారు. జూన్ 4 తర్వాత ఫలితాలు తారుమారైతే గ్రామాల్లో తమ పరిస్థితి ఏమిటోనని ఆందోళన చెందుతున్నారు. వైసీపీ ముద్ర పడినందున టీడీపీ ప్రభుత్వంలో తమ ఉనికి ప్రశార్థకంగా మారుతుందని వాపోతున్నారు. ఎన్నికల సందర్భంగా బూత్‌ల వద్ద టీడీపీ కార్యకర్తలతో వాగ్వాదం, గొడవలు పెట్టుకోవడంతో వారికి టార్గెట్ అవుతామన్న ఆందోళనలు కూడా వారిలో పెరిగాయి. జనాల నాడిని పసిగట్టిన వలంటీర్లు కౌంటింగ్ తర్వాత జాతకాలు మారిపోతాయని అనుమానిస్తున్నారు. ఇప్పటికే పలువురు వలంటీర్లు టీడీపీ నేతలకు టచ్‌లోకి వెళ్తున్నారు. ఈసారి టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని చెబుతూ స్నేహహస్తం చాపుతున్నారు. ఇలాంటి వారంతా టీడీపీ ప్రభుత్వంలో తమకు ఉపాధి లభిస్తుందని భరోసాతో ఉన్నారు. వైసీపీ నేతలు ఆదేశించినా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 25శాతం మంది వలంటీర్లు మాత్రమే రాజీనామా చేశారు. అనకాపల్లి జిల్లాలో 8,550 మంది వలంటీర్లకు గాను 2,143 మంది, కాకినాడ జిల్లాలో 6,100 మందికి గాను 700మంది, బాపట్ల జిల్లాలో 8,400 మందికి గాను 4,800 మంది రాజీనామా చేశారు. బాపట్ల జిల్లాలో కోడ్ ఉల్లంఘన కింద 42 మందిని సస్పెండ్ చేశారు. చిత్తూరు జిల్లాలో 9వేల మందికి గాను 3వేల మంది ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత రాజీనామా చేశారు. వీరిలో కుప్పం, పుంగనూరు నియోజకవర్గాల్లోనే ఎక్కువమంది ఉన్నారు. పల్నాడు జిల్లాలో మొత్తం 9వేల మందికి గాను 2,351 మంది రాజీనామా చేశారు.

# రిటైరైన ధనుంజయరెడ్డి

**ముఖ్యమంత్రి పేషీలో ఐదేళ్లు చక్రం తిప్పిన సీనియర్ ఐఏఎస్**

అమరావతి, మే 31 (ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వంలో చక్రం తిప్పిన సీనియర్ ఐఏఎస్ అధికారి, ముఖ్యమంత్రి కార్యదర్శి ధనుంజయరెడ్డి శుక్రవారం పదవీ విరమణ చేశారు. 2006 బ్యాచ్‌కు చెందిన ఆయన.. రాష్ట్రంలో వివిధ శాఖల్లో విధులు నిర్వహించారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి కార్యదర్శి హోదాలో విధులు నిర్వహిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం జగన్ ఆయన్ను తన పేషీలోకి తీసుకున్నారు. ఆయనకు అత్యంత ప్రాధాన్యమిచ్చారు. అసలు ఆయనకు ఐఏఎస్ హోదా రావడమే చిత్రవిచిత్రంగా జరిగింది. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం అండమాన్-నికోబార్ దీవుల నుంచి ఆయన్ను ఏపీకి తీసుకొచ్చింది. ఆ తర్వాత ఆయనకు ఐఏఎస్ హోదా కల్పించింది. తొలి నుంచి అత్యంత ప్రాధాన్య పోస్టింగుల్లో నియమించింది. శుక్రవారంతో ఆయన 60 ఏళ్లు పూర్తికావడంతో పదవీ విరమణ చేశారు. ఆయన రిటైర్మెంట్‌పై సీఎస్ జవహర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన విధులకు సంబంధించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సీఎం కార్యాలయ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. ఆయనతో పాటు అసిస్టెంట్ ఐజీ రవీంద్రబాబు కూడా శుక్రవారం రిటైరయ్యారు.

### సీఎస్‌కు శ్రీనివాసరాజు జాయినింగ్ రిపోర్టు..

సీనియర్ ఐఏఎస్ అధికారి కె.ఎస్.శ్రీనివాసరాజు ఏపీలో రిపోర్ట్ చేశారు. శుక్రవారం ఉదయం సీఎస్ జవహర్‌రెడ్డికి తన జాయినింగ్ రిపోర్టు అందించారు. 2020 మే నెలలో ఇంటర్-కేడర్ డిప్యుటేషన్‌పై తెలంగాణకు వెళ్లిన ఆయన.. నాలుగేళ్ల పాటు అక్కడ విధులు నిర్వహించారు. ఈ ఏడాది మార్చితో డిప్యుటేషన్ గడువు ముగిసింది. అనంతరం రెండు నెలలు సెలవు పెట్టి ఇప్పుడు తిరిగి రాష్ట్రానికి వచ్చారు. పోస్టింగ్ ఇచ్చే వరకూ ఆయన జీఏడీలోనే ఉంటారు.

# విజయంతో విరమణ..!

## జగన్ కక్షసాధింపులకు పాల్పడినా పోలీసు యూనిఫాంలోనే ఏబీవీ రిటైర్మెంట్

(అమరావతి/విజయవాడ-ఆంధ్రజ్యోతి)

చంద్రబాబు హయాంలో నిఘా చీఫ్‌గా పనిచేసిన ఏబీ వెంకటేశ్వరరావుపై జగన్ ప్రభుత్వం తొలి నుంచీ కక్షగట్టింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే ఆ పదవి నుంచి తప్పించేలా ఎన్నికల కమిషన్‌పై ఒత్తిడి తెచ్చింది. పై స్థాయిలో ఒత్తిడి తెచ్చి పక్కకు తప్పించింది. అధికారంలోకి రాగానే లేని కేసు పెట్టింది. ఇజ్రాయెల్ సంస్థ నుంచి నిఘా పరికరాల కొనుగోలులో అవినీతి, అవకతవకలకు పాల్పడ్డారన్న ఆరోపణలతో సస్పెండ్ చేసింది. చివరకు సర్వీస్ నుంచి డిస్మిస్ చేయడానికీ విశ్వప్రయత్నాలు చేసింది. కేంద్ర పరిపాలనా ట్రిబ్యునల్, హైకోర్టు, సుప్రీంకోర్టు జోక్యంతో ఆ పనిచేయలేకపోయారు. అయితే అధికారం అడ్డుపెట్టుకుని ఐదేళ్లుగా ఏబీవీని తీవ్ర ఇబ్బందుల పాల్జేశారు. అయినా ఆయన ఆత్మస్థైర్యం తగ్గలేదు. న్యాయ పోరాటం చేశారు. తనకు జరిగిన అన్యాయంపై కోర్టులను ఆశ్రయించారు.. ప్రభుత్వంపై రాజీలేని పోరాటం చేశారు. ఆయన పోరాటానికి ప్రజల నుంచి కూడా మద్దతు లభించింది. చివరకు విజయం ఆయన్నే వరించింది. తాను అనుకున్నట్లుగా పోలీస్ యూనిఫాంలోనే రిటైర్ అయ్యారు. ఏబీవీని రెండోసారి సస్పెండ్ చేస్తూ రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయడంతో పాటు ఆయన్ను విధుల్లోకి తీసుకోవాలని ఆదేశిస్తూ క్యాట్ ఇచ్చిన ఉత్తర్వుల్లో జోక్యం చేసుకునేందుకు హైకోర్టు గురువారం నిరాకరించిన సంగతి తెలిసిందే. శుక్రవారమే పదవీ విరమణ చేయాల్సిన ఆయన.. సుదీర్ఘకాలం పోలీసు శాఖకు సేవలందించి ప్రస్తుతం డీజీ హోదాలో ఉన్నారని.. పదవీ విరమణకు ముందు ఆయన్ను తిరిగి విధుల్లోకి తీసుకోకపోతే అయనకు పూడ్చుకోలేని నష్టం వాటిల్లే అవకాశం ఉందని తెలిపింది. శుక్రవారం రిటైర్ కాబోతున్న ఆయన్ను తిరిగి సర్వీసులోకి తీసుకుంటే సాక్షులను ప్రభావితం చేస్తారన్న వాదన సరైనది కాదని పేర్కొంది. అయనకు ఇప్పటికే ముందస్తు బెయిల్ లభించిందని, దాని రద్దుకు ప్రాసిక్యూషన్ ఎలాంటి చర్యలూ తీసుకోలేదని గుర్తుచేసింది. హైకోర్టు ఉత్తర్వుల ప్రతిని ఏబీవీ స్వయంగా సీఎస్ జవహర్‌రెడ్డిని కలిసి అందజేశారు. తనకు పోస్టింగ్ ఇవ్వాలని కోరారు. అయితే ఆయన మౌనంగా ఉండిపోయారు. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) ఎంకే మీనాకు కూడా ఏబీవీ కోర్టు ఉత్తర్వుల ప్రతి పంపించారు. ఈ నేపథ్యంలో ఆయన రీ జాయినింగ్‌పై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. క్యాట్ ఉత్తర్వులిచ్చినా, హైకోర్టు చెప్పినా ప్రభుత్వం ఆయనపై కక్షసాధింపు ధోరణి కొనసాగించింది. దేశ చరిత్రలో తొలిసారి సస్పెన్షన్‌లోనే రిటైరైన ఐపీఎస్ అధికారిగా చరిత్రలో నిలిచిపోయేవారు. ఆయన్ను సర్వీసులోకి తీసుకోకూడదని సీఎం జగన్ గట్టి పట్టుదలతో ఉన్నారని, కచ్చితంగా ఆయనకు పోస్టింగ్ ఇవ్వరని అధికార వర్గాల్లో తీవ్ర చర్చ కూడా నడిచింది. తెల్లవారేసరికి సీన్ మారిపోయింది. ఏమైందో ఏమో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి శుక్రవారం ఉదయం ఏబీవీపై సస్పెన్షన్ ఎత్తివేయడమే గాక రాష్ట్ర ప్రింటింగ్, స్టేషనరీ, స్టోర్ పర్చేజింగ్ కమిషనర్‌గా ఆయనకు పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులు జారీచేశారు. లండన్‌లో ఉన్న సీఎంతో సీఎస్ నేరుగా మాట్లాడి ఒప్పించినట్లు తెలుస్తోంది. తెగేదాకా లాగవద్దని.. ఈ వ్యవహారంపై అఖిల భారత అధికారుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని సీఎంకు వివరించినట్లు సమాచారం. జగన్ ఆమోదించిన తర్వాతే ఏబీవీకి పోస్టింగ్ ఇచ్చారు. గతంలో ఎక్కడైతే విధులు నిర్వహించి రెండోసారి సస్పెండయ్యారో.. అదే విభాగంలో నియమించారు. ఉదయం సీఎస్ ఉత్తర్వులు అందుకున్న వెంటనే ఏబీవీ విజయవాడ ముత్యాలంపాడులోని ప్రింటింగ్ అండ్ స్టేషనరీ కార్యాలయానికి చేరుకున్నారు. ఆ శాఖ సిబ్బంది ఆయనకు ఘనస్వాగతం పలికారు. కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'నాకు రెండేళ్ల తర్వాత పోస్టింగ్ లభించింది. ఇదే రోజు నా పదవీ విరమణ కూడా. కారణాలు ఏమైనప్పటికీ అంతా మంచే జరిగింది. ప్రభుత్వ ఉద్యోగంలో ఉన్నాను కాబట్టి ఎలాంటి వివాదాస్పద వ్యాఖ్యలూ చేయను. ప్రభుత్వం పోస్టింగ్ ఆర్డర్స్ ఇవ్వడంతో విధుల్లో చేరాను. ఇన్నాళ్లు నాకు తోడుగా ఉన్న మిత్రులకు, శ్రేయోభిలాషులకు రుణపడి ఉంటాను. కుటుంబ సభ్యులకు, మిత్రులకు, దేశవిదేశాల్లో ఉన్న శ్రేయోభిలాషులకు కృతజ్ఞుడిని' అని వ్యాఖ్యానించారు. ఆత్మ సంతృప్తితోనే పదవీవిరమణ చేస్తున్నానని తెలిపారు.



పదవీ విరమణ చేస్తున్న ఏబీవీని సన్మానిస్తున్న అభిమానులు

### దుష్టశిక్షణ.. శిష్టరక్షణే నా లక్ష్యం: ఏబీవీ

విజయవాడ, మే 31 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్నం విధుల్లో చేరి.. సాయంత్రం ఉద్యోగ విరమణ చేసిన సీనియర్ పోలీసు అధికారి ఏబీ వెంకటేశ్వరరావుకు అధికారులు, శ్రేయోభిలాషులు ఘనంగా వీడ్కోలు పలికారు. శుక్రవారం సాయంత్రం ఉద్యోగ విరమణ చేసిన ఆయనకు వీడ్కోలు పలకడానికి ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు, ఐఏఎస్ అధికారి చెరుకూరి శ్రీధర్ ప్రింటింగ్ అండ్ స్టేషనరీ కార్యాలయానికి వచ్చారు. అమరావతి రైతులు, ఏబీవీ స్నేహితులు, శ్రేయోభిలాషులు కూడా భారీగా చేరుకున్నారు. ఆయన ఫొటోపై ఫైటర్ అని రాసిన ప్లకార్డులను ప్రదర్శించారు. టీడీపీ నేత పట్టాభి, అమరావతి రైతు కార్యాచరణ సమితి నాయకుడు పువ్వాడ సుధాకర్ ఏబీవీని అభినందించారు. అనంతరం ఏబీవీ మీడియాతో మాట్లాడారు. 'దుష్టశిక్షణ శిష్టరక్షణే నా లక్ష్యం. భవిష్యత్‌లో ఈ లక్ష్యాన్ని నెరవేర్చుకునే అవకాశం వస్తుందని ఆశిస్తున్నా. ఇంజనీరింగ్ పూర్తిచేసిన తర్వాత టాటామోటార్స్‌లో ఉద్యోగం చేశాను. అదే సంస్థలో ఉన్నా, అమెరికాలో స్థిరపడినా నా జీవితం మరోలా ఉండేది. ఐపీఎస్ అధికారిగా అధర్మాన్ని, అన్యాయాన్ని, అణచివేతను ఎదుర్కోవడమే వృత్తిధర్మంగా పనిచేశాను. నేను అన్యాయాన్ని ఎదుర్కొన్నాను తప్ప ఎవరికీ అన్యాయం చేయలేదు. పూర్తి సంతృప్తితో పదవీ విరమణ చేస్తున్నా. సర్వీసులో నీతి నిజాయితీతో వ్యవహరించాను. లక్షలాది మంది అభిమానులను సంపాదించుకున్నాను. నేను ఎదుర్కొన్న సవాళ్లు, కష్టాలు చూసిన అభిమానులు ఉద్వేగంతో ఏడ్చారు. నేను పాటించిన నిజాయితీ, ధర్మం, పోరాటమే నన్ను కాపాడాయి. జీవితాంతం ప్రజాసేవలోనే ఉంటాను. శేషజీవితంలోనూ అన్యాయాన్ని, అణచివేతను ఎదిరిస్తాను. నాకు ఆప్తులుగా ఉన్న వారందరికీ రుణపడి ఉంటాను' అని తెలిపారు. అనంతరం ప్రింటింగ్, స్టేషనరీ ఉద్యోగులు ఆయన్ను చేతుల మీద ఎత్తుకొని బయటకు తీసుకురావడం విశేషం.

# లెక్చరర్లు లేని ఇంటర్ విద్య

## రెన్యువల్ కాని కాంట్రాక్టు జేఎల్స్

- ఇంటర్‌కు జూనియర్ లెక్చరర్లే కీలకం.. ప్రతిపాదనలు పంపని బోర్డు
- నేటి నుంచి రాష్ట్రంలో క్లాసులు ప్రారంభం
- ఎండలు మండుతున్నా కాలేజీలు రీ ఓపెన్
- ప్రారంభంకాని సప్లిమెంటరీ మూల్యాంకనం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఇంటర్మీడియెట్‌పై ఇంటర్ విద్యామండలి నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. శనివారం నుంచి ఇంటర్ తరగతులు ప్రారంభమవుతున్నా ఇప్పటి వరకు కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్లను రెన్యువల్ చేయలేదు. కనీసం రెన్యువల్‌కు ఇంటర్ బోర్డు ప్రతిపాదనలు కూడా పంపలేదని తెలిసింది. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున రెన్యువల్ సాధ్యం కాదనే ఆలోచనతో అధికారులు దీనిని పట్టించుకోలేదు. మరోవైపు ఇతర శాఖలు మాత్రం కాంట్రాక్టు ఉద్యోగులను రెన్యువల్ చేసుకున్నాయి. మిగిలిన శాఖల సంగతి ఎలావున్నా ఇంటర్మీడియెట్‌లో కాంట్రాక్టు లెక్చరర్లు కీలకం. 470 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో రెగ్యులర్ జేఎల్స్ 900 మంది పనిచేస్తుంటే, కాంట్రాక్టు జేఎల్స్ 3,600 మంది ఉన్నారు. మరో 1,030 మంది గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేస్తున్నారు. అంటే కాంట్రాక్టు, గెస్ట్ ఫ్యాకల్టీ లేకపోతే ప్రభుత్వ జూనియర్ కాలేజీలు నడపడం వీలు కాదు. అలాంటి కీలకమైన జూనియర్ కాలేజీల విషయంలో ఇంటర్ విద్యాశాఖ ఇలా వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాంట్రాక్టు జేఎల్స్‌తో పాటు గెస్ట్ ఫ్యాకల్టీని కూడా రెన్యువల్ చేయలేదు. దీంతో శనివారం నుంచి కాలేజీలకు వెళ్లాలా? లేదా? అనే సందిగ్ధంలో కాంట్రాక్టు జేఎల్స్, గెస్ట్ ఫ్యాకల్టీ ఉన్నారు. కాగా, రెన్యువల్ కాకపోయినా విధులకు హాజరు కావాలంటూ కొన్ని చోట్ల అధికారులు వారిని ఆదేశిస్తున్నారు. విధులకు హాజరైనా సాంకేతికంగా రెన్యువల్ అయ్యే వరకు జీతం ఇవ్వరు కదా అని కాంట్రాక్టు జేఎల్స్ గెస్ట్ ఫ్యాకల్టీ సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో ఏటా 10 రోజుల గ్యాప్‌తో కాంట్రాక్టు జేఎల్స్‌ను రెన్యువల్ చేసేవారు. ప్రతి సంవత్సరం ఏప్రిల్ నెలాఖరుతో కాంట్రాక్టును ముగించి, 10 రోజుల్లో రెన్యువల్ చేసేవారు. దీంతో 10 రోజులు మినహా విగతా జీతం వారికి అందేది.

### నెరవేరని హామీ

వైసీపీ ప్రభుత్వం వచ్చాక రెండేళ్ల పాటు అదే విధానం కొనసాగింది. ఒక సంవత్సరం ఒక రోజు గ్యాప్‌తో రెన్యువల్ చేశారు. గతేడాది ఎమ్మెల్సీ ఎన్నికలు ఉండటంతో ఒక్క రోజు కూడా గ్యాప్ లేకుండా కాంట్రాక్టు ముగిసిన తర్వాత రోజే రెన్యువల్ చేశారు. ఇక ఇప్పుడు ఎన్నికలు ముగియడంతో ప్రభుత్వం మళ్లీ నిర్లక్ష్య వైఖరిని మొదలుపెట్టింది. వాస్తవానికి వీరందనీ రెగ్యులరైజ్ చేస్తామని వైసీపీ ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఐదేళ్లలో చేయలేదు. కానీ, తాజా ఎన్నికల ముందు రెగ్యులర్ చేస్తామంటూ హడావుడి చేసింది. చివరికి పలు కారణాలు చూపి పక్కన పెట్టింది. ఇప్పుడు కనీసం రెన్యువల్ కూడా చేయకుండా వారిని అంతర్మథనంలో పెట్టింది. మరోవైపు, ఇంత వరకు ఇంటర్ విద్యాశాఖ రెన్యువల్‌కు ప్రతిపాదనలే పంపలేదు. ఇప్పుడు పంపినా ఆర్థిక శాఖ ఆమోదానికి నెల పైగా పట్టే అవకాశం ఉంది. దీంతో రెన్యువల్ అయ్యే వరకు కాలేజీలు ఎలా నడపాలనే ప్రశ్న నెలకొంది.

### ఎండలున్నా తరగతులే

షెడ్యూలు ప్రకారం శనివారం ఇంటర్ తరగతులు ప్రారంభం కావాలి. రెండో విడత అడ్మిషన్ల ప్రక్రియ జూన్ 10న ప్రారంభమవుతుంది. జూలై 1లోగా రెండో విడత అడ్మిషన్లు పూర్తి చేస్తారు. అయితే, ఈ ఏడాది ఉష్ణోగ్రతలు తీవ్రస్థాయిలో ఉన్నా ఇంటర్ బోర్డు యథావిధిగా కాలేజీలు పునఃప్రారంభిస్తుండడంపై విమర్శలు వస్తున్నాయి. మరోవైపు ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు శనివారంతో ముగుస్తాయి. ఈసారి మూల్యాంకనం ఆన్‌లైన్‌లో చేయాలని నిర్ణయించారు. ఇంకా పరీక్షలు పూర్తికాకపోవడం, సమాధాన పత్రాలు స్కానింగ్ చేస్తుండటంతో ఈ ప్రక్రియ ఆలస్యమైంది. మూల్యాంకనానికి కనీసం 10 రోజులు పట్టే అవకాశం కనిపిస్తోంది. కంప్యూటర్లు, ల్యాప్‌ట్యాప్‌లు లేనివారు ఏం చేయాలని జేఎల్స్ ప్రశ్నిస్తున్నారు. మరోవైపు 4రోజుల్లో ఎన్నికల ఫలితాలొస్తాయి. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కాలేజీల ప్రారంభాన్ని కొన్ని రోజులు వాయిదా వేస్తే బాగుంటుందని జేఎల్స్ కోరుతున్నారు. కానీ, జేఎల్స్ లేకపోయినా కాలేజీలు రీఓపెన్ అవుతాయని అధికార వర్గాలు చెబుతుండడం గమనార్హం.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఆంధ్రజ్యోతి
నవ్య స్మార్ట్
శనివారం • 1 జూన్ 2024



## 75 ఉచిత గేమ్స్




యూట్యూబ్ - ప్లేయబుల్స్ ఫీచర్ 75 వరకు గేమ్స్‌ని యూజర్లు అందరికీ ఉచితంగా అందుబాటులోకి తెచ్చింది. యాంగ్రీ బర్డ్స్ షోడౌన్, కట్ ద రోప్, టాంబ్ ఆఫ్ ద మాస్క్ వంటి గేమ్స్ ఈ ఉచిత పరిధిలో ఉన్నాయి. ఈ ప్లేయబుల్స్ ఫీచర్‌ని యూట్యూబ్ గత ఏడాది ఆరంభించింది. 30 ఆర్కేడ్ గేమ్స్‌ని యూట్యూబ్ ప్రీమియమ్ చందాదారులకు అదీ ఎంపిక చేసిన మార్కెట్లలో మార్చి 28 వరకు ఆఫర్ చేసింది. చందాలతో నిమిత్తం లేకుండా ఇప్పుడు తమ వద్ద గేమ్స్‌ని అందరు యూజర్లకు అందిస్తోంది. అయితే ఈ అందుబాటు దశలవారీగా ఉంటుందని తెలిసింది. తమ కలెక్షన్‌లోని ఫ్రీగేమ్స్ అన్నింటినీ ఇదే ప్లాట్‌ఫాంపై ఉచితంగా ఆడుకోవచ్చని యూట్యూబ్ ఒక బ్లాగ్‌పోస్ట్‌లో తెలిపింది. ఆండ్రాయిడ్, ఐఓఎస్ డివైజులు రెంటిలోనూ అలాగే వెబ్‌లోనూ ఈ సదుపాయం ఉంది. ఎక్స్‌ప్లోర్ మెనూలో ప్లేయబుల్ సెక్షన్ ఉంటుంది.

## నెట్‌ఫ్లిక్స్ విండోస్‌లో ఆఫ్‌లైన్ 'నో'!




నెట్‌ఫ్లిక్స్ - విండోస్ యాప్ యూజర్లకు ఆఫ్‌లైన్‌లో వీక్షణకు ఉన్న అవకాశాన్ని తొలగిస్తోందని సమాచారం. వైఫై అవసరం లేకుండా ఆఫ్‌లైన్‌లో నెట్‌ఫ్లిక్స్ కంటెంట్‌ను యూజర్లు చూసేవారు. అందుకోసం కంటెంట్‌ను ముందుగానే డౌన్‌లోడ్ చేసుకునేవారు. రాబోయే రోజుల్లో ఈ అవకాశాన్ని విండోస్ యూజర్లకు నెట్‌ఫ్లిక్స్ తొలగించనుంది. స్మార్ట్‌ఫోన్ యాప్‌లో మాత్రమే ఆ సౌలభ్యం ఉండనుంది. ఎక్స్ యూజర్ ఒకరు ఈ విషయాన్ని పోస్ట్ చేశారు. నెట్‌ఫ్లిక్స్ అందించే వెబ్‌సిరీస్, మూవీలను ఇకపై ల్యాప్‌టాప్‌లలో చూసే అవకాశం ఉండదని పేర్కొన్నారు. ముందస్తుగా డౌన్‌లోడ్ చేసుకుని, పర్యటనల్లో ముఖ్యంగా ల్యాప్‌టాప్‌లో చాలా మంది వీక్షించేవారు. ఇకపై ఆ అవకాశం ఉండబోదన్నది ఆ పోస్టు సారాంశం. మరో ఎక్స్ యూజర్ కూడా ఇదే సమాచారాన్ని షేర్ చేశారు. అయితే అందులో డౌన్‌లోడ్ విషయం లేదు. దీనిపై యూజర్ల స్పందనను రాబట్టి, తదనుగుణంగా మార్పులు, చేర్పులు చేపట్టాలన్నదే ఈ లీక్‌లోని పరమార్థమని 'ఆండ్రాయిడ్ అథారిటీ' పేర్కొంది.

## ఏఐ కాల్ స్కానర్




ట్రూకాలర్ - ఏఐ కాల్‌స్కానర్‌ను పరిచయం చేసింది. ఏఐ జనరేటెడ్ వాయిస్‌లను ఇది గుర్తిస్తుంది. అదే సమయంలో తద్వారా తలెత్తే స్కాములను అరికడుతుంది. ప్రస్తుతం ఇది ఆండ్రాయిడ్ యూజర్లకు అందుబాటులోకి వచ్చింది. కాల్‌లో వినిపించే గొంతు నిజంగా ఒక వ్యక్తిదా లేదంటే కృత్రిమ వాయిసా అన్నది ఈ స్కానర్ పసిగడుతుంది. ఏఐ వాయిస్ సింథసైజర్స్ వ్యక్తుల గొంతులను సెకండ్ల సమయంలోనే ఇది రెప్లికేట్ చేయగలుగుతుంది. అసంబద్ధ వాయిస్ క్లోనింగ్ - స్పీచ్ సింథసిస్ టెక్నాలజీస్ మరింత పురోగతి సాధించడమే కాదు, వాటికి విస్తృత స్థాయిలో సమ్మతి ఉంటోందని కంపెనీ తెలిపింది. ఈ నేపథ్యంలో కృత్రిమ గొంతును ఉపయోగించి జరిగే మోసాలను అరికట్టేందుకు దీన్ని అభివృద్ధిపర్చింది. అమెరికాలో పరిచయం చేసిన ఈ ఏఐ స్కానర్ ప్రస్తుతం ప్రీమియమ్ చందాదారులకు అందుబాటులో ఉంది. కాల్ అనుమానాస్పదంగా అనిపిస్తే చాలు యూజర్ వెంటనే ఏఐ కాల్ స్కానర్ బటన్‌ను యాక్టివేట్ చేయాలి. కాలర్ వాయిస్‌ను రికార్డు చేసి, పరీక్షించి వినిపిస్తున్న గొంతు కరెక్టా కాదా అన్నది తెలుస్తుంది.

## పిల్లలకు ఫిట్‌బిట్ వాచీ



కిడ్స్‌కు ఉపయోగ పడేలా 'ఫిట్‌బిట్ ఏస్ ఎల్‌టీఈ' అమెరికాలో విడుదలైంది. ఓలెడ్ స్క్రీన్‌కు తోడు కార్నింగ్ గొరిల్లా గ్లాస్ 3 ప్రొటెక్షన్ దీనికి ఉంది. ఏడేళ్లు నిండిన పిల్లల కోసం ప్రత్యేకంగా రూపొందించిన మొట్టమొదటి వాచీ అని కంపెనీ పేర్కొంది. ఇది ఉంటే ఫోన్ అవసరం ఉండదు. కాలింగ్, మెసేజింగ్, లోకేషన్ షేరింగ్‌కు సపోర్ట్ ఉంది. ఫిట్‌బిట్ ఆర్కేడ్ సపోర్ట్ ఉంది. దాంతో గేమ్‌లను కూడా పొందొచ్చు. పిక్సెల్ డెన్సిటీ 333పీపీఐ. ఇన్‌బిల్ట్ స్పీకర్, మైక్రోఫోన్ ఉన్నాయి. వాటర్ రెసిస్టెన్స్ 50ఎం. 328ఎంఏహెచ్ బ్యాటరీ ఉంది. పదహారు గంటల సేపు బ్యాటరీ లైఫ్ ఉంటుంది. యూఎస్‌బీ టైప్-సి పోర్ట్ మీదుగా చార్జింగ్ వీలు ఉంటుంది. వైఫై అలాగే బ్లూటూత్ కనెక్టివిటీ కూడా ఉంది. అమెరికాలో దీని ధర సుమారుగా రూ.19,200. అమెజాన్ నుంచి కొనుగోలు చేయవచ్చు.



● ల్యాప్‌టాప్ మౌస్‌పై రైట్ క్లిక్‌తో ఏఐ ఫీచర్లను అందుకోవచ్చు. దీంతో టెక్స్ట్ రాసుకోవచ్చు. యూజర్ ఇచ్చే ఇన్‌పుట్‌తో టెక్స్ట్ పొందొచ్చు. రీరైటింగ్ సదుపాయం కూడా ఉంది. ఫార్మల్, షార్టర్, రీ ఫ్రేజింగ్ వరకు అన్ని సౌకర్యాలను పొందవచ్చు.


● బిల్ట్ ఇన్ క్రోమ్ ఓఎస్‌తో వాల్‌పేపర్లను యూజర్లు క్రియేట్ చేసుకోవచ్చు. వీడియోకాల్స్‌కు బ్యాక్‌గ్రౌండ్‌ను క్రియేట్ చేసుకోవచ్చు.

● ఏఐ ఫొటో ఎడిటింగ్ ఫీచర్ మరొకటి. దీంతో ఎడిట్ చేయాలని భావిస్తున్న ఆబ్జెక్టును ట్యాప్ లేదంటే సర్కిల్‌తో చేయవచ్చు. తిరిగి యథాస్థానానికి లేదా రీసైజ్ చేసేందుకు కూడా అవకాశం దీంతో ఉంటుంది.

● హోమ్ స్క్రీన్‌పైనే జెమిని యాప్ ద్వారా జెమినితో చాట్ చేయవచ్చు. దీంతో 2టీబీ గూగుల్ వన్ ఏఐ ప్రీమియమ్ ప్లాన్‌ని ఏడాదికి గూగుల్ ఆఫర్ చేస్తోంది. తద్వారా జెమిని అడ్వాన్స్‌డ్, జెమిని ఇన్ డాక్స్ షీట్ స్లయిడ్స్, జీమెయిల్ తదితరాలు పొందవచ్చు.

ఆటోమేటిక్ అప్డేట్‌తో ఈ సౌకర్యాలను క్రోమ్‌బుక్ ప్లస్‌లో పొందవచ్చు.

## క్రోమ్‌బుక్ ప్లస్ ల్యాప్‌టాప్స్‌కు ఏఐ ఫీచర్స్



**గూగుల్ - క్రోమ్‌బుక్ ప్లస్ ల్యాప్‌టాప్స్‌కు జెమిని, గూగుల్ ఏఐ ఫీచర్స్‌ను తీసుకువస్తోంది. అయితే అవి క్రోమ్ ఓఎస్‌పై రన్ అవుతూ ఉండాలి. గూగుల్ సెట్ హార్డ్‌వేర్ అవసరాలకు అనుగుణంగా పవర్ కలిగి ఉండాలి. గేమ్స్ డ్యాష్‌బోర్డ్ అనుభవాన్ని కూడా పొందవచ్చు. దీంతో గేమ్‌ప్లేని రికార్డు చేసుకోవచ్చు. కంట్రోల్స్‌ను కస్టమైజ్ చేసుకోవచ్చు. కొత్తగా అందే ఏఐ ఫీచర్ల సహాయంతో....**

## చాట్స్‌లో ఏఐ పవర్డ్ ఇమేజ్



వాట్సాప్ - చాట్స్‌లోనే ఏఐ పవర్డ్ ఇమేజెస్‌ను జనరేట్ చేసే పనిలో ఉందని తెలిసింది. టెక్స్ట్ ప్రాంప్ట్‌తో ఈ పని జరుగుతుందని చెబుతున్నారు. 'డబ్ల్యూఏబీటాఇన్ఫో' నివేదిక ప్రకారం వాట్సాప్ ఒక షార్ట్ కట్‌ను అటాచ్‌మెంట్ సెక్షన్‌కు 'ఇమాజిన్' పేరిట కలుపుతోంది. అది చాట్స్‌లోనే ఏఐ పవర్డ్ ఇమేజెస్‌ను జనరేట్ చేస్తుంది. వాట్సాప్ చాట్ అసిస్టెంట్‌కు క్లిష్టమైన టాస్క్‌లను అర్థం చేసుకునే ఎబిలిటీ ఉంటుంది. అయితే మెటా ఏఐ ఇప్పటికి కొన్ని దేశాల్లోని పరిమిత సంఖ్యలో యూజర్లకు అందుబాటులో ఉంది. అంటే ఏఐ పవర్ ఇమేజ్ జనరేషన్ కూడా పరిమితంగానే ఉంటుంది. ఈ వెసులుబాటు ఉనికిలోకి వస్తే, యూజర్ టెక్స్ట్ ప్రాంప్ట్, డిస్క్రిప్షన్ ఆధారంగానే హై క్వాలిటీ ఇమేజ్ జనరేట్ అవుతుంది. ఈ క్రమంలో యూజర్లు ఏఐ జనరేటెడ్ ఇమేజెస్ కోసం చాట్ అటాచ్‌మెంట్‌ను ఓపెన్ చేయాలి. టాప్‌లో మెటా ఏఐ రింగ్ ఇమేజిన్ కనిపిస్తుంది. ప్రాంప్ట్‌తో అక్కడ ఇమేజ్‌లను పొందవచ్చు. అవి వర్ణనకు అనుగుణంగా ఉంటాయి.

## ఏఐ టాస్క్‌లకు వీలుగా మీడియాటెక్ చిప్‌సెట్స్


మీడియాటెక్ - మిడ్ రేంజ్ స్మార్ట్‌ఫోన్ల కోసం ముఖ్యంగా ఏఐ టాస్క్‌లను నెరవేర్చేందుకు వీలుగా డైమెన్సిటీ 7300, డైమెన్సిటీ 7300ఎక్స్‌ని మీడియా టెక్ చిప్‌సెట్స్‌ని ప్రకటించింది. ఏఐ మల్టీ టాస్కింగ్‌కు తోడు మెరుగైన ఫొటోగ్రఫీ, గేమింగ్ సామర్థ్యాల పెంపునకు ఈ చిప్‌సెట్స్ ఉపయోగపడతాయి. ఈ రెంటినీ 4ఎన్ఎం ప్రాసెస్‌పై అభివృద్ధిపర్చారు. ఆక్టా-కోర్ సీపీయు అదీ 4ఎక్స్ ఆర్మ్‌టెక్స్-ఎ78 కోరెస్ - 2.5జీహెచ్‌జెడ్ వద్ద 4ఎక్స్ ఆర్మ్ కోర్టెక్స్ -ఎ55 కోరెస్‌ను కలుపుకొని ఉండేవాటిని సపోర్ట్ చేస్తాయి. చెరి 20 శాతం మేర ఫాస్టర్ ఎఫ్‌పీఎస్, ఎనర్జీ ఎఫిషియెన్సీకి ఉపయోగపడతాయి. ఈ సిరీస్ 5జీ, వైఫై గేమ్ కనెక్షన్స్, బ్లూటూత్ ఎల్ఈ ఆడియోకు ఉపయోగపడతాయి. మొత్తమ్మీద ఏఐ టాస్క్‌లకు తోడు మెరుగైన గేమింగ్ అనుభవం పొందేందుకు ఈ చిప్‌సెట్స్ తోడ్పడతాయని చెప్పవచ్చు.

## 'నథింగ్' నుంచి కొత్త ఫోన్



నథింగ్ కొత్త ఫోను 2ఎ స్పెషల్ ఎడిషన్ దేశీ మార్కెట్లోకి వచ్చింది. మీడియా టెక్ డైమెన్సిటీ 7200 ప్రో ప్రాసెసర్ ఉంది. 6.7 ఇంచీల ఫుల్ హెచ్‌డీ, అమోల్డ్ డిస్‌ప్లే, 120హెచ్‌జెడ్ రిఫ్రెష్ రేటు ఉన్నాయి. 50 ఎంపి డ్యూయల్ కెమెరా సెటప్, 32ఎంపి ఫ్రంట్ కెమెరా ఉన్నాయి. 5000ఎంఏహెచ్ బ్యాటరీ, 45 వాట్స్ ఫాస్ట్ చార్జింగ్ సపోర్ట్ కూడా ఉంది. ఎరుపు, పసుపు, నీలం రంగుల్లో సింగిల్ హార్డ్‌వేర్‌తో వచ్చింది. ప్రాథమికమైన తెలుపురంగునూ విడిచిపెట్టలేదు. బ్యాక్ పానెల్‌లో గ్రే ఉంది. 12జీబీ ర్యామ్, 256 స్టోరేజీ ఉన్నాయి. ఫోన్ ధర రూ.27,999 కాగా ఆరంభ డిస్కౌంట్‌ను కూడా ఇస్తోంది.

## టెలిగ్రామ్ యాప్‌లో కోపైలెట్ చాట్‌బోట్




మైక్రోసాఫ్ట్‌కు చెందిన కోపైలెట్ చాట్‌బోట్ టెలిగ్రామ్ యాప్‌లోకి అందుబాటులోకి వస్తోంది. మామూలుగా మాట్లాడుకోవడం నుంచి టెక్స్ట్ ప్రాంప్ట్స్‌తో సమాచారాన్ని పొందడం వరకు పలు ప్రయోజనాలు దీంతో టెలిగ్రామ్ యూజర్లకు సమకూరుతాయి. ఫిట్‌నెస్, స్పోర్ట్స్, గేమింగ్, ట్రావెల్ సహా పలు టాపిక్‌లపై స్పందించే లక్షణం కోపైలెట్‌కు ఉంది. అలాంటి దీన్ని ఇప్పుడు టెలిగ్రామ్ - స్మార్ట్‌ఫోన్, డెస్క్‌టాప్‌లపై ఉపయోగించుకోవచ్చు. అయితే ప్రస్తుతానికి ఇది బేటా టెస్టింగ్‌లోనే ఉందని సమాచారం. అలాగే ఇది టెక్స్ట్ ప్రాంప్ట్‌లతోనే పనిచేస్తుంది. చాట్ జీపీటీ మాదిరి వాయిస్ ప్రాంప్ట్‌లతో పని చేయదు. దరిమిలా దీన్ని పొందాలంటే...

● మొబైల్ లేదంటే డెస్క్‌టాప్‌పై టెలిగ్రామ్‌ని డౌన్‌లోడ్ చేసుకోవాలి.

● సైన్ చేయాలి. సంబంధిత వెబ్‌సైట్‌లోకి వెళ్లాలి. ట్రైనౌ ని టాప్ చేయాలి. లేదంటే 'ఆట్‌కోపైలెట్‌అఫీషియల్‌బ్లాట్ కోసం యాప్‌లో సెర్చ్ చేయాలి.

● అపై ప్రాంప్ట్‌తో సంభాషణ మొదలుపెట్టాలి.

పబ్లిక్ యూజర్లకు మాత్రం ఇప్పటికిప్పుడు టెలిగ్రామ్ యాప్‌లో సంబంధిత ఫీచర్లు పరిమితంగానే ఉన్నాయి.

## ఫోన్ లింక్ యాప్ అప్డేట్






**మైక్రోసాఫ్ట్ తన ఫోన్ లింక్ యాప్‌ని అప్డేట్ చేసింది. ఫలితంగా ఆండ్రాయిడ్ డివైజ్‌ల్లోని అదీ విండోస్ డెస్క్‌టాప్‌లోనే ఇమేజ్ నుంచి టెక్స్ట్‌ని తీయవచ్చు. నిజానికి ఫోన్ లింక్ అనేది అటు పీసీ ఇటు ఆండ్రాయిడ్ ఫోన్‌కు వారధిగా పనిచేస్తుంది. నోటిఫికేషన్స్, కాల్స్, మెసెజ్‌లకు రెస్పాన్స్ వంటివి డీల్ చేస్తుంది. ఫొటో టూల్ విషయానికి వస్తే ఆండ్రాయిడ్ నుంచి నేరుగా పీసీలకు ఫొటోలను మరే సహాయం లేకుండా చేరవేస్తుంది. తాజాగా చేసిన ఆధునీకరణ విషయానికి వస్తే...**

● ముందు ఆండ్రాయిడ్ ఫోన్ - ఫోన్ లింక్ యాప్ ద్వారా విండోస్ మెషీన్‌కు లింక్ అయిందీ లేనిది సరి చూసుకోవాలి.

● లింక్ అయితే చాలు, ఫోన్ లింక్ యాప్‌తో డెస్క్‌టాప్ విండోస్‌పైకి ఫోన్‌లోని ఫొటోలను తెచ్చుకోవచ్చు.

● ఫోన్ లింక్ యాప్‌లోని ఫొటోస్ సెక్షన్‌లో నేవిగేట్ చేయాలి.

● టెక్స్ట్ ఉన్న ఫొటోని సెలెక్ట్ చేసుకోవాలి. టెక్స్ట్ ఆప్షన్‌పై క్లిక్ చేయాలి.

● టెక్స్ట్ డిటెక్ట్ కాగానే మౌస్‌తో దాన్ని హైలైట్ చేయాలి. సెలెక్ట్ ఆల్ టెక్స్ట్ లేదా కాపీ టెక్స్ట్ ఆప్షన్‌ను ఉపయోగించుకోవాలి.

● ఎక్కడ కావాలనుకుంటే అక్కడ కాపీ చేసిన టెక్స్ట్‌ను పేస్ట్ చేసుకోవాలి. లేదంటే క్లిప్ బోర్డ్ యాక్సెస్ కోసం విండోస్ + వి ని ఉపయోగించాలి.

## క్లోజ్ ఫ్రెండ్స్‌తోనే టీన్స్ ఇంటరాక్షన్



ఇన్‌స్టాగ్రామ్ - టీనేజర్లపై ఆంక్షలు విధించే ఫీచర్ 'లిమిట్'ను విడుదల చేసింది. సన్నిహిత స్నేహితులతో మాత్రమే ఇంటరాక్ట్ అయ్యే విధంగా టీనేజర్లను పరిమితం చేసేందుకు ఇది వీలు కల్పిస్తుంది. టీనేజర్లు అనవసరంగా వేధింపులకు గురికాకుండా ఉండేలా చూడటం ఈ ఫీచర్ లక్ష్యం. టీనేజర్ల విషయంలో ఇన్‌స్టాగ్రామ్ కొన్నేళ్ళుగా ఎప్పటికప్పుడు తగుచర్యలు తీసుకుంటూనే ఉంది. అందులో భాగంగానే ఈ ఫీచర్‌ను ఇప్పుడు తీసుకువచ్చింది. వేధింపులకు వ్యతిరేకంగా టీనేజర్లు యుద్ధం చేసేందుకు 'లిమిట్ టూల్' ఉపయోగపడుతుందని 'టెక్ క్రంచ్' పేర్కొంది. సన్నిహిత స్నేహితులు మినహా మిగిలిన వ్యక్తుల కామెంట్లు ఈ టూల్‌తో మ్యూట్‌లోకి వెళతాయి. 'క్లోజ్‌ఫ్రెండ్ సెట్టింగ్స్‌'లో ఈ లిమిట్ డిఫాల్ట్‌గా ఉంటుంది. యూజర్ ప్రిఫెరెన్స్‌లకు అనుగుణంగా ఇదిలేకుంటే అప్పుడు వారు 'రీసెంట్ ఫాలోవర్స్‌'ను సెలెక్ట్ చేసుకోవచ్చు. తల్లిదండ్రుల ఫిర్యాదులు, అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకుని ఈ లిమిట్‌ని తీసుకువచ్చినట్టు కంపెనీ పేర్కొంది.

## స్మార్ట్ హోమ్ టిప్స్










**ఇప్పుడు ట్రెండింగ్‌లో ఉన్న పదం స్మార్ట్. వ్యక్తి, వ్యవహారానికే కాదు అది ఇంటికీ వర్తిస్తోంది. చేతిలో ఫోన్‌నే కాదు ఇంటినీ స్మార్ట్‌గా, ఎనర్జీ ఎఫిషియెంట్‌గా మార్చుకోవచ్చు. అందుకు కొన్ని టిప్స్ పాటించాలి. ముఖ్యంగా...**

● ఎనర్జీ ఎఫిషియెంట్, స్మార్ట్ డివైజ్‌ల వాడకంతోనే అసలు ప్రక్రియ మొదలవుతుంది. అదే స్మార్ట్ హోమ్‌వైపుగా అడుగులు వేసేందుకు తోడ్పడుతుంది.

● స్మార్ట్ ప్లగ్స్: మంచి ప్లగ్స్ ఉపయోగిస్తే, ఎనర్జీ వినియోగం తగ్గుతుంది. ఇప్పుడు వస్తున్న డివైజ్‌లతో కన్వెన్షనల్ అప్లయెన్స్‌కు తోడు అవసరమైన విధంగా వాడుకోనూవచ్చు. ఎక్కడో దూరంలో ఉన్నప్పటికీ మర్చిపోయిన లైట్లను ఆర్పివేయడం వంటివి చేయవచ్చు. సెలవుల్లో లైట్ల డిమ్ చేయడం సహా ఎనర్జీ ప్లగ్‌తో ఇంధన వినియోగాన్ని మానిటర్ చేయవచ్చు.

● స్మార్ట్ సెన్సర్స్: ఎనర్జీ మేనేజ్‌మెంట్‌లో ఇవి విప్లవాత్మక పరిణామాలకు దారితీయించాయి. ఫ్యాన్స్ నుంచి ప్యూరిఫైయర్ల వరకు వినూత్న పరిష్కారాలకు సెన్సర్లు దోహదపడ్డాయి. నీటి దుర్వినియోగాన్ని అరికట్టడం నుంచి స్మార్ట్ హోమ్ ఎకోసిస్టమ్స్ వరకు సర్వత్రా సెన్సర్లతో పని జరుగుతుంది.

● స్మార్ట్ బల్బులు, లైట్లు: స్మార్ట్‌ఫోన్, స్మార్ట్ స్పీకర్‌తో కంట్రోల్ అయ్యే విధంగా ఉండేవి ఎంచుకోవాలి. పవర్ వినియోగాన్ని అదుపులో ఉంచుకోవడానికి ఇవి ఉపయోగపడతాయి.

● స్మార్ట్ అప్లయెన్సెస్: వీటి కొనుగోలుకు మొదట్లో ఖర్చు ఎక్కువే అవుతుంది. శాంసంగ్ వంటి కంపెనీల ఉత్పత్తులు ఉపయోగిస్తే విద్యుత్తును ఆదా చేసుకోవచ్చు. ఫ్రిడ్జ్‌లు వంటి ఉపకరణాల విషయంలో ఈ జాగ్రత్త తప్పనిసరి.

● స్మార్ట్ థెర్మోస్టాట్స్ కంట్రోల్: ఎనర్జీ సేవింగ్‌లో థెర్మోస్టాట్ బాగా ఉపయోగపడుతుంది. వృథా నివారణకు తోడ్పడుతుంది. రిమోట్ కంట్రోల్ సామర్థ్యాలతో ఎనిమిది శాతం మేర వృథా తగ్గుతుంది. ఇంటికి దూరంగా ఉండే వ్యక్తులకు ఇది ప్రయోజనకరం.

ఆంధ్రజ్యోతి దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ • శనివారం 1 జూన్ 2024

# ఎంటెక్



## నిట్ సిల్చార్

అసోంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సిల్చార్ (నిట్‌ఎస్)- ఎంటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. స్పాన్సర్డ్/సెల్ఫ్ స్పాన్సర్డ్ కేటగిరీ(ఫుల్ టైం అండ్ పార్ట్ టైం)/ప్రాజెక్టు స్టాఫ్/ఇన్‌స్టిట్యూట్ ఎంప్లాయి (పార్ట్ టైం) కేటగిరీల్లో అడ్మిషన్స్ నిర్వహిస్తారు. విభాగాల వారీగా రిటెన్ టెస్ట్, ఇంటర్వ్యూ నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

విభాగాలు-స్పెషలైజేన్‌లు

- **సివిల్ ఇంజనీరింగ్:** జియో టెక్నికల్ ఇంజనీరింగ్, స్ట్రక్చరల్ డైనమిక్స్ అండ్ ఎర్త్‌క్వేక్ ఇంజనీరింగ్, స్ట్రక్చరల్ ఇంజనీరింగ్, ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్, వాటర్ రిసోర్స్ ఇంజనీరింగ్.
- **కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్:** కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ అండ్ ఇంజనీరింగ్.
- **ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్:** కంట్రోల్ అండ్ ఇండస్ట్రియల్ ఆటోమేషన్, పవర్ అండ్ ఎనర్జీ సిస్టమ్ ఇంజనీరింగ్
- **ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్:** కమ్యూనికేషన్ అండ్ సిగ్నల్ ప్రాసెసింగ్ ఇంజనీరింగ్, మైక్రో ఎలక్ట్రానిక్స్ అండ్ వీఎల్‌ఎస్ఐ డిజైన్, ఆర్‌ఎఫ్ అండ్ టెరాహెర్డ్జ్ కమ్యూనికేషన్స్
- **ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్:** ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్.
- **మెకానికల్ ఇంజనీరింగ్:** క్యాడ్-క్యామ్ అండ్ ఆటోమేషన్, డిజైన్ అండ్ మాన్యుఫాక్చరింగ్ టెక్నాలజీ, మెటీరియల్స్ అండ్ మాన్యుఫాక్చరింగ్ టెక్నాలజీ, థర్మల్ ఇంజనీరింగ్, రెన్యువబుల్ ఎనర్జీ.

**అర్హత:** గుర్తింపు పొందిన కళాశాల నుంచి బ్యాచిలర్స్ డిగ్రీ(ఇంజనీరింగ్/టెక్నాలజీ) లేదా తత్సమాన డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్ అభ్యర్థులకు ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 5 శాతం వరకు సడలింపు వర్తిస్తుంది. స్పాన్సర్డ్/సెల్ఫ్ స్పాన్సర్డ్ కేటగిరీ(ఫుల్ టైం అండ్ పార్ట్ టైం), ప్రాజెక్ట్ స్టాఫ్ కేటగిరీ అభ్యర్థులకు కనీసం ఏడాది ప్రొఫెషనల్ అనుభవం ఉండాలి. ఇన్‌స్టిట్యూట్ ఎంప్లాయి(పార్ట్ టైం) కేటగిరీ అభ్యర్థులకు కనీసం రెండేళ్ల ప్రొఫెషనల్ అనుభవం ఉండాలి. వీరు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ కూడా సబ్మిట్ చేయాలి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1000; ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.500.
- **ఈ-మెయిల్ దరఖాస్తుకు చివరితేదీ:** జూలై 1
- **షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థుల జాబితా వెల్లడి:** జూలై 10
- **రిటెన్ టెస్ట్‌లు, ఇంటర్వ్యూలు:** జూలై 25
- **ఈ-మెయిల్:** deanacd@nits.ac.in
- **వెబ్‌సైట్:** www.nits.ac.in

## మౌలానా ఆజాద్ వర్సిటీలో ఎంటెక్

హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ(సెంట్రల్ యూనివర్సిటీ-మనూ)కి చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ- ఎంటెక్(కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్) పార్ట్ టైం ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ ప్రోగ్రామ్ స్పెషలైజేషన్ 'ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్'. మొత్తం 30 సీట్లు ఉన్నాయి. స్పాన్సర్డ్/సెల్ఫ్ ఫైనాన్స్ మోడ్‌లో అడ్మిషన్స్ ఇస్తారు. పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఉర్దూ/ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. హాస్టల్ సౌకర్యం లేదు. స్కాలర్‌షిప్‌లు లభించవు.


**అర్హత:** పదోతరగతి/ ఇంటర్/ డిగ్రీ స్థాయిలో ఉర్దూ ఒక సబ్జెక్ట్‌గా/సెకండ్ లాంగ్వేజ్‌గా లేదా ఉర్దూ మాధ్యమంలో చదివి ఉండాలి. లేదా మనూ గుర్తింపు పొందిన సంస్థ నుంచి ఉర్దూ మాధ్యమంలో మదర్సా కోర్సు పూర్తిచేసి ఉండాలి. లేదంటే సంస్థ అందించే ఎలిమెంటరీ ఉర్దూ కోర్సు(ఆడిట్ కోర్సు)ను పూర్తిచేయాల్సి ఉంటుంది. ఇందులో కనీసం 40 శాతం మార్కులు రావాలి.

- గుర్తింపు పొందిన కళాశాల నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో(బీఈ/ బీటెక్)(కంప్యూటర్ సైన్స్/కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్/కంప్యూటర్ ఇంజనీరింగ్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్/ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్/ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్/ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్)/ ఐఈటీఈ/ ఏఎంఐఈ( ఈసీఈ/ సీఎస్ఈ/ ఐటీ/ ఈఈ) ఉత్తీర్ణులై ఉండాలి. ఎమ్మెస్సీ(ఐటీ/ ఎలక్ట్రానిక్స్/ కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మాటిక్స్/ఇన్ఫర్మేషన్ సైన్స్ అండ్ టెక్నాలజీ/ ఫిజిక్స్/ మేథమెటిక్స్/ స్టాటిస్టిక్స్/ ఆపరేషన్ రీసెర్చ్/ అప్లయిడ్ ఫిజిక్స్)/ ఎంసీఏ పూర్తిచేసిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 30
- **ఆన్‌లైన్ సర్టిఫికెట్ వెరిఫికేషన్:** జూలై 15
- **ఇంటర్వ్యూకి ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూలై 22
- **ఇంటర్వ్యూలు:** జూలై 29
- **అడ్మిషన్ పొందిన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** ఆగస్టు 2
- **అడ్మిషన్ ఫీజు చెల్లింపు:** ఆగస్టు 15, 16
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** ఆగస్టు 26 నుంచి
- **వెబ్‌సైట్:** https://manuu.edu.in

## నేషనల్ ఆర్కైవ్స్‌లో సర్టిఫికెట్ కోర్సు



నేషనల్ ఆర్కైవ్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలోని స్కూల్ ఆఫ్ ఆర్కైవల్ స్టడీస్- 'షార్ట్ టర్మ్ సర్టిఫికెట్ కోర్స్ ఇన్ రెప్రోగ్రఫీ'లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ కోర్సుని జూన్ 24 నుంచి ఆగస్టు 2 వరకు నిర్వహిస్తారు. ఇందులో రీ ప్రొడక్షన్ ఆఫ్ డాక్యుమెంట్స్ అండ్ మాన్యుస్క్రిప్ట్స్, మైక్రోఫిల్మింగ్, ఆటోమేటెడ్ ఇన్ఫర్మేషన్ స్టోరేజ్, రిట్రైవల్ అండ్ డిసెమినేషన్ సంబంధిత అంశాలు వివరిస్తారు.

**అర్హత:** గుర్తింపు పొందిన కళాశాల నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. సైన్స్ డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుంది. ప్రైవేట్ అభ్యర్థులకు 30, స్పాన్సర్డ్ అభ్యర్థులకు 50 ఏళ్లలోపు వయసు ఉండాలి. కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

ముఖ్య సమాచారం

- **కోర్సు ఫీజు:** రూ.300
- **దరఖాస్తు ఫీజు:** రూ.100
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** జూన్ 7
- **దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు:** ఎడ్యుకేషనల్ సర్టిఫికెట్‌లు; కులం, వయసు, స్పాన్సర్‌షిప్ ధ్రువీకరణ పత్రాలు
- **చిరునామా:** డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఆర్కైవ్స్, నేషనల్ ఆర్కైవ్స్ ఆఫ్ ఇండియా, జన్‌పథ్, న్యూఢిల్లీ - 110001
- **వెబ్‌సైట్:** https://nationalarchives.nic.in

## ఐఎస్‌టీడీలో పీజీ డిప్లొమా

న్యూఢిల్లీలోని ఇండియన్ సొసైటీ ఫర్ ట్రెయినింగ్ అండ్ డెవలప్‌మెంట్(ఐఎస్‌టీడీ)- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ట్రెయినింగ్ అండ్ డెవలప్‌మెంట్(పీజీడీటీడీ) 2024 జూలై బ్యాచ్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది 18 నెలల వ్యవధి గల డిస్టెన్స్ లెర్నింగ్ ప్రోగ్రామ్. ఇందులో హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్‌కు సంబంధించిన అంశాలు బోధిస్తారు. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 12 సబ్జెక్ట్‌లు, మూడు నెలల వ్యవధి గల ఇంటర్న్‌షిప్ ప్రాజెక్ట్ ఉంటాయి. బ్యాంకులు, బిజినెస్ సంబంధిత సంస్థలు, అడ్మినిస్ట్రేషన్ విభాగాలు, అగ్రికల్చర్- హెల్త్ - ఎడ్యుకేషన్ విభాగాలు, డిఫెన్స్ ఫోర్సెస్, సోషల్ సెక్టార్-వాలంటరీ సంస్థలు, కన్సల్టెన్సీలలో పనిచేస్తున్న హెచ్‌ఆర్‌డీ ఆఫీసర్స్, ట్రెయినింగ్ ప్రొఫెషనల్స్, లైన్ మేనేజర్స్, ప్రొఫెషనల్స్‌కు ఈ కోర్సు ప్రయోజనకరంగా ఉంటుంది. రిజిస్ట్రేషన్ చేసుకొన్ననాటి నుంచి నాలుగేళ్లలోపు ప్రోగ్రామ్‌ను పూర్తిచేయాల్సి ఉంటుంది. ఏటా రెండుసార్లు అడ్మిషన్ ప్రక్రియ నిర్వహిస్తారు.

**ప్రోగ్రామ్ వివరాలు:** ఇందులో మూడు సెమిస్టర్‌లు ఉంటాయి. ప్రతి సెమిస్టర్‌లో నాలుగు సబ్జెక్ట్‌లు ఉంటాయి. మొదటి సెమిస్టర్‌లో బిజినెస్ స్ట్రాటజీ అండ్ హెచ్‌ఆర్‌డీ, ఇన్‌స్ట్రక్షనల్ డిజైన్, ట్రెయినింగ్ మెథడ్స్-కాగ్నిటివ్, ట్రెయినింగ్ మెథడ్స్ -ఎక్స్‌పీరియెన్షల్; రెండో సెమిస్టర్‌లో ఫెసిలిటేషన్ స్కిల్స్, కమ్యూనికేషన్ అండ్ ప్రజంటేషన్ స్కిల్స్, ట్రెయినింగ్ మెజర్‌మెంట్ అండ్ ఎవల్యూషన్, మేనేజింగ్ ట్రెయినింగ్ ప్రాసెస్; మూడో సెమిస్టర్‌లో డేటా అనలిటిక్స్, ఇన్నొవేషన్ అండ్ ఛేంజ్ మేనేజ్‌మెంట్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఇన్ టీ అండ్ డీ, ఎలక్టివ్ సబ్జెక్ట్(టాలెంట్ మేనేజ్‌మెంట్, డెవలప్‌మెంట్ సెంటర్ మేనేజ్‌మెంట్, రీసెర్చ్ మెథడాలజీ) పేపర్లు ఉంటాయి. వీటికి సంబంధించిన రీడింగ్ మెటీరియల్, ఈ-జర్నల్ అందిస్తారు. వారాంతాల్లో ఆన్‌లైన్ సెషన్స్ ఉంటాయి. సంస్థకు చెందిన ప్రొఫెషనల్స్ మెంటార్లుగా వ్యవహరిస్తారు. మొదటి రెండు సెమిస్టర్‌లు పూర్తయ్యాక మెంటార్ ఆధ్వర్యంలో ఇంటర్న్‌షిప్ ప్రాజెక్ట్ పూర్తిచేయాల్సి ఉంటుంది. ప్రోగ్రామ్ చివరలో ప్రొక్టోర్డ్ ఆన్‌లైన్ విధానం ద్వారా పరీక్షలు నిర్వహిస్తారు. ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులకు ఏడాదిపాటు సంస్థలో ఉచితంగా మెంబర్‌షిప్ ఇస్తారు.

**అర్హత:** గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. బీఈ/బీటెక్, ఎంబీబీఎస్, సీఏఐబీ, ఏసీఏ, ఏఐసీడబ్ల్యుఏ, ఎంఈడీ వంటి ప్రొఫెషనల్ కోర్సులు చేసినవారు; మెడికల్, ఇంజనీరింగ్, ఐటీ, మార్కెటింగ్, ఫైనాన్స్, అకౌంట్స్, పబ్లిక్ రిలేషన్స్ తదితర విభాగాల్లో పీజీ, పీజీ డిప్లొమా ఉత్తీర్ణులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. సాయుధ దళాల ఉద్యోగులు, మాజీ సైనిక అధికారులు, పారా మిలిటరీ దళాల అభ్యర్థులు, సీనియర్ సిటిజన్స్ కూడా అర్హులే. అనుభవం ఉండాల్సిన అవసరం లేదు.

- **ప్రోగ్రామ్ ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.50,000+18 శాతం జీఎస్‌టీ(ఇన్‌స్టాల్‌మెంట్‌లో చెల్లించే అవకాశం ఉంది); సంస్థ మెంబర్లు, వారి కుటుంబ సభ్యులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.45,000+18 శాతం జీఎస్‌టీ; సాయుధ దళాల ఉద్యోగులు, మాజీ సైనిక అధికారులు, పారా మిలిటరీ దళాల అభ్యర్థులకు రూ.30,000+18 శాతం జీఎస్‌టీ
- **దరఖాస్తు ఫీజు:** రూ.1500+18 శాతం జీఎస్‌టీ(రూ.270)
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 30
- **వెబ్‌సైట్:** www.istd.in



# జాబ్ కార్నర్

## యూపీఎస్సీ ఎన్‌డీఏ ఎగ్జామ్

నేషనల్ డిఫెన్స్ అకాడమీ అండ్ నేవల్ అకాడమీ(ఎన్‌డీఏ అండ్ ఎన్ఏ) నోటిఫికేషన్‌ను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) విడుదల చేసింది. త్రివిధ దళాల్లో 2025 జూన్ 2 నుంచి ప్రారంభం అయ్యే 154వ కోర్సులో, 116వ ఇండియన్ నేవల్ అకాడమీ(ఐఎన్ఏసీ) కోర్సులో ప్రవేశాలకు ఈ పరీక్షను ఉద్దేశించారు. అర్హులైన మహిళా, పురుష అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- యూపీఎస్సీ - నేషనల్ డిఫెన్స్ అకాడమీ అండ్ నేవల్ అకాడమీ ఎగ్జామినేషన్(2)-2024

**ఖాళీలు:** మొత్తం 404. వీటిలో నేషనల్ డిఫెన్స్ అకాడమీ పోస్టులు 370(ఆర్మీ-208, నేవీ-42, ఎయిర్ ఫోర్స్-120) ఉన్నాయి. వాటిలో 28 గ్రౌండ్ డ్యూటీకి సంబంధించిన ఖాళీలు. నేవల్ అకాడమీ(10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్) ఖాళీలు 34 ఉన్నాయి.

**అర్హత:** ఆర్మీ వింగ్ పోస్టులకు దరఖాస్తు చేసుకునే వారు ఏదైనా గ్రూపుతో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. ఎయిర్ ఫోర్స్, నేవీ పోస్టులకు 10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్(ఇండియన్ నేవల్ అకాడమీ) ద్వారా దరఖాస్తు చేసుకునే వారు ఫిజిక్స్, మేథ్స్ సబ్జెక్టులతో ఇంటర్ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. దీంతోపాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు ఉండాలి. ప్రస్తుతం ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

**వయసు:** అవివాహిత పురుష, మహిళా అభ్యర్థులు 2006 జనవరి 1కి ముందు, 2009 జనవరి 1 తరవాత జన్మించి ఉండకూడదు.

**దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

**ఎంపిక విధానం:** అభ్యర్థులను రెండు దశల్లో ఎంపిక చేస్తారు. రాత పరీక్ష, ఇంటెలిజెన్స్- పర్సనాలిటీ టెస్ట్, ఎస్ఎస్‌బీ టెస్ట్/ఇంటర్వ్యూ, మెడికల్ టెస్ట్ తదితరాల ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.

**కోర్సులు:** నేషనల్ డిఫెన్స్ అకాడమీ అండ్ నేవల్ అకాడమీ(ఎన్‌డీఏ అండ్ ఎన్ఏ), ఆర్మీ 10+2 బీటెక్ క్యాడెట్ ఎంట్రీ పరీక్షలో మెరిట్ సాధిస్తే డిగ్రీ కోర్సులకు ఎంపికవుతారు. అలా ఎంపికైనవారు బీఏ, బీఎస్సీ, బీటెక్ కోర్సుల్లో తాము ఎంచుకున్న దాన్ని ఉచితంగా చదవవచ్చు.

**శిక్షణ:** తుది అర్హత సాధించిన అభ్యర్థులు నేషనల్ డిఫెన్స్ అకాడమీ, పుణెలో చదువు శిక్షణ పొందుతారు. అనంతరం ఆర్మీ క్యాడెట్లను డెహ్రాడూన్‌లోని ఇండియన్ మిలిటరీ అకాడమీకి; నేవల్ క్యాడెట్లను ఎజిమలలోని ఇండియన్ నేవల్ అకాడమీకి; ఎయిర్ ఫోర్స్ క్యాడెట్‌లు హైదరాబాద్‌లోని ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అకాడమీకి సంబంధిత ట్రేడ్ శిక్షణ కోసం పంపుతారు. కోర్సు విజయవంతంగా పూర్తి చేసుకున్న అభ్యర్థులను ఉద్యోగాల్లోకి తీసుకుంటారు. ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్‌లో ప్రారంభ స్థాయి ఆఫీసర్ ఉద్యోగాలైన లెఫ్టినెంట్, సబ్-లెఫ్టినెంట్, ఫ్లయింగ్ ఆఫీసర్/గ్రౌండ్ డ్యూటీ ఆఫీసర్ హోదాతో కెరియర్ ప్రారంభం అవుతుంది.

**దరఖాస్తు రుసుము:** రూ.100. ఎస్సీ, ఎస్టీ, మహిళా అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 4

**ఆన్‌లైన్ పరీక్ష తేదీ:** సెప్టెంబరు 1

**తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** అనంతపురం, హైదరాబాద్, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, వరంగల్.

**వెబ్‌సైట్:** https://upsc.gov.in/



## ఎయిర్ ఫోర్స్ కామన్ అడ్మిషన్ టెస్ట్

ఎయిర్ ఫోర్స్‌లో ఉన్నత ఉద్యోగాలకు ఉద్దేశించిన ఎయిర్ ఫోర్స్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏఎఫ్ క్యాట్-02/2024) నోటిఫికేషన్ విడుదలైంది. కోర్సు 2025 జూలైలో ప్రారంభం కానుంది.

- ఎయిర్ ఫోర్స్ కామన్ అడ్మిషన్ టెస్ట్(ఏఎఫ్ క్యాట్)02/2024, ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ

1. **ఏఎఫ్‌క్యాట్ ఎంట్రీ:** ఫ్లయింగ్/గ్రౌండ్ డ్యూటీ(టెక్నికల్)/గ్రౌండ్ డ్యూటీ(నాన్ టెక్నికల్)
2. **ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ:** ఫ్లయింగ్

**అర్హతలు:** ఇంటర్(ఫిజిక్స్, మేథ్స్), సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ/బీఈ, బీటెక్ ఉత్తీర్ణతతో నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.

**వయోపరిమితి:** ఫ్లయింగ్ బ్యాచ్‌కు 20-24 ఏళ్లు. గ్రౌండ్ డ్యూటీ(టెక్నికల్/నాన్-టెక్నికల్) బ్రాంచ్‌కు 20-26 సంవత్సరాల మధ్య ఉండాలి.

**పే స్కేల్:** ఫ్లయింగ్ ఆఫీసర్‌కు రూ.56,100 - రూ.1,77,500.

**ఎంపిక విధానం:** పోస్టును అనుసరించి ఆన్‌లైన్ పరీక్ష, స్టేజ్-1, స్టేజ్-2 పరీక్షలు, ఇంటర్వ్యూ, కంప్యూటరైజ్డ్ పైలెట్ సెలెక్షన్ సిస్టం పరీక్ష, వైద్య పరీక్షలు, ధ్రువపత్రాల పరిశీలన తదితరాలను నిర్వహించి శిక్షణకు ఎంపిక చేస్తారు.

**దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

**ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** జూన్ 28

**ఆన్‌లైన్ పరీక్ష తేదీలు:** 2024 ఆగస్టు 9, 10, 11

**వెబ్‌సైట్:** https://afcat.cdac.in/AFCAT/




## తెలివైన తీర్పు

ఒక ఊరిలో ఆనంద వర్మ అనే గ్రామాధికారి ఉండేవాడు. అతను చాలా న్యాయమైన తీర్పులు చెబుతాడని చుట్టుపక్కల ఊళ్లల్లో మంచి పేరు ఉండేది. ఆనంద వర్మ నివసించే ఊరిలోనే రాజారావు అనే భూస్వామి ఉండేవాడు. ఆ భూస్వామి దగ్గర సాంబయ్య అనే నౌకరు పనిచేస్తూ ఉండేవాడు. ఒక రోజు సాంబయ్య బియ్యం బస్తా మోస్తూ- పొరపాటున భూస్వామి పెంచుకుంటున్న కోడిపై పడేశాడు. కోడి చచ్చిపోయింది. రాజారావుకు చాలా కోపం వచ్చింది. "ప్రతి రోజు గుడ్డు పెట్టే నా కోడిని చంపేశావు. కోడి బతికి ఉంటే ఒక ఏడాదిలో ఎన్ని గుడ్లు పెట్టేదే గణించి.. వాటికి సరిసమానమైన సొమ్ము నాకు ఇవ్వు" అని సాంబయ్యను బెదిరించాడు. తన తప్పు లేదని సాంబయ్య ఎంత వేడుకున్నా ఒప్పుకోలేదు. దాంతో సాంబయ్య తప్పనిసరి పరిస్థితుల్లో ఆనందవర్మ దగ్గరకు వెళ్లాడు. ఆనందవర్మ తన కార్యాలయానికి రాజారావును కూడా పిలిచాడు. రాజారావు వాదన విన్న తర్వాత- "మీ వాదన సరైనదే అనిపిస్తోంది. సాంబయ్య మీకు వంద రూపాయలు చెల్లించాలి" అన్నాడు. వెంటనే రాజారావు వైపు తిరిగి - "మీరు కోడికి ఎలాంటి దాణా పెడతారు?" అని అడిగాడు. "ప్రతి రోజు బియ్యం.. జీడిపప్పు.. రకరకాల మందులు.. వీటికి ప్రతి ఏడాది 500 రూపాయలు ఖర్చు పెడతా" అంటూ రాజారావు గొప్పగా చెప్పాడు. అప్పుడు ఆనందవర్మ - "గుడ్ల ఖరీదు సాంబయ్య మీకు చెల్లించాల్సి వచ్చినప్పుడు- దాణాకి అయ్యే ఖర్చు మీరు సాంబయ్యకు చెల్లించండి" అని తీర్పు ఇచ్చాడు. దాంతో రాజారావుకు అసలు విషయం అర్థమయింది. సాంబయ్యతో రాజీ చేసుకున్నాడు.

### సరైన నీడ ఏది?



8 తేడాలు గుర్తించండి






### దారి కనుక్కోండి




### డైలీ సుడోకు - 321

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 5 | | | 3 | | | |
| | 2 | | 6 | | | | | |
| | 3 | | | | 8 | 4 | | |
| 4 | 9 | | | 6 | | 5 | 8 | |
| | | | | | | | | |
| | 5 | 7 | | 8 | | | 2 | 3 |
| | | 2 | 4 | | | | 6 | |
| | | | | | 2 | | 3 | |
| | | | 1 | | | 9 | | 2 |

సుడోకు - 320 సమాధానం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 8 | 7 | 5 | 3 | 9 | 6 | 4 |
| 5 | 4 | 7 | 2 | 9 | 6 | 8 | 1 | 3 |
| 3 | 9 | 6 | 8 | 1 | 4 | 2 | 5 | 7 |
| 7 | 1 | 5 | 4 | 6 | 2 | 3 | 9 | 8 |
| 4 | 8 | 9 | 5 | 3 | 7 | 1 | 2 | 6 |
| 6 | 3 | 2 | 1 | 8 | 9 | 4 | 7 | 5 |
| 2 | 6 | 4 | 3 | 7 | 1 | 5 | 8 | 9 |
| 9 | 5 | 3 | 6 | 2 | 8 | 7 | 4 | 1 |
| 8 | 7 | 1 | 9 | 4 | 5 | 6 | 3 | 2 |

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.